ఆర్షవిద్యా తరంగాలు - 10

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# KENOPANISHAD

# కేనోపనిషత్తు

స్వామి పరమార్థానంద

తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే

స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

వారి ఆశీస్సులతో

తెలుగు సేత - మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

First edition - Year 2019 1000 copies

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019

Mobile: 9849092368

Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Title - KENOPANISHAD

Sanskrit Support - Sri Desu Chaitanya Krishna

DTP - Smt. Syamala Devi Sripathi, 9966383661

Printed at
Sai Sri Printers
8-3-945 # 21 Pancom Business Centre,
Ameerpet Hyderabad --500073
e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 100

# కృతజ్ఞతలు

**పరోపకారార్థమ్ ఇదం శరీరమ్**

ఈ సూక్తికి ప్రతీకగా నిలుస్తారు వీరిద్దరూ. వారి జీవితాల్లో చిన్నప్పుడే కష్టసుఖాలను చవి చూచారు కాబట్టి, ఎవరికే కష్టం వచ్చినా మేమున్నాము అంటూ అందరికన్నా ముందు ఉంటారు, చేయూతనివ్వటానికి. అంతేకాదు, జీవితం నేర్పిన పాఠాల వల్ల తమకంటూ ఒక ప్రత్యేకత ఏర్పరుచుకుని రత్నాల్లా మెరుస్తున్నారు.

**శ్రీమతి కస్తూరి హరిప్రియ,** తన మెట్టింట కస్తూరి పరిమళాలను వెదజల్లుతూ, అందరి మన్ననలు పొందుతూ, భూదేవి కున్నంత ఓర్పు ఉంది అనే బిరుదు పొందారు. ఏదైనా పని చేపట్టితే, దాని విజయం సాధించేదాకా నిద్రపోని పట్టుదల ఉంది తనకు. అలాగని విజయం సాధించాక విజయ గర్వం చూపించరు.

**శ్రీ కావలిపురపు శేషుబాబు** తన స్వయంశక్తితో పైకి వచ్చారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీలేదని నిరూపించారు.ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదు, ఎవరిమీదా ఆధారపడకూడదు అనే మంచి సూత్రానికి కట్టుబడి ఉంటారు.

ఈ అక్కాతమ్ముళ్ళు ఇద్దరూ **శ్రీమతి కావలిపురపు సూర్యకుమారి గారికి** రెండు కళ్ళు! **శ్రీమతి సూర్యకుమారిగారి** అండదండలతో వారి ఇంట్లో, ఆర్ష ఆనందకుటీర్ పేరిట జరుగుతున్న మా అద్వైతవిద్యా బోధ నిరాటంకంగా సాగటానికి వారు తోడ్పడమే కాక ఇప్పుడు **కేనోపనిషత్తు** పుస్తకప్రచురణ అనే **బ్రహ్మయజ్ఞానికి** ఆర్థికసహాయాన్ని అందించారు.

ఈపుణ్యమూర్తులైన కస్తూరి హరిప్రియగారికి, వారి కుటుంబ సభ్యులకు; కావలివరపు శేషుబాబుగారికి, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు, ఆధ్యాత్మిక చింతన మెండుగా కలగాలని మా దంపతులం ఆ భగవంతుని వేడుకుంటున్నాము.

**రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | కృతజ్ఞతలు | 3 |
| 2. | మున్నుడి | 5 |
| 3. | పూజ్యస్వామీజీకి నీరాజనాలు | 8 |
| 4. | స్పందన | 13 |
| 5. | కేనోపనిషత్తు ఉపోద్ఘాతము | 15 |
| 6. | శాన్తిపాఠము | 32 |
| 7. | అధ్యాయము -1 | 39 |
| 8. | అధ్యాయము -2 | 75 |
| 9. | అధ్యాయము -3 | 100 |
| 10. | అధ్యాయము -4 | 120 |
| 11. | కేనోపనిషత్తు సారాంశము | 139 |
| 12. | కుండ మట్టి - జీవన్ముక్తి | 143 |

# మున్నుడి



పూజ్యశ్రీ పరిపూర్ణానందస్వాములవారు
శ్రీవ్యాసాశ్రమ వ్యాసపీఠాధిపతులు,
శ్రీ వ్యాసాశ్రమం, ఏర్పేడు, చిత్తూరు జిల్లా.

ఆధ్యాత్మిక జగతిలో ఉపనిషత్తుల యొక్క మహత్వం వర్ణనాతీతం. మోక్ష సాధకహేతుభూతములు ఉపనిషత్తులు. వేదాల యొక్క అంతిమ భాగమే ఉపనిషత్తులుగా చెప్పబడుతున్నాయి. ఉపనిషత్ ప్రతిపాద్య విషయం జీవేశ్వర ఐక్యత్వం. అత్యంత భయంకర మృత్యురూప సంసారం నుండి బయటపడదలచిన ప్రతి ముముక్షువు ఉపనిషత్ వేద్య పరమాత్మను తెలుసుకోవాలి. ఉపనిషత్ వేద్యపరమాత్మ నిత్య– శుద్ధ–బుద్ధ–ముక్త స్వభావుడు, ఆనంద స్వరూపుడు, ఓంకార శబ్దవాచ్యుడు, గుణాతీతుడు ఇత్యాది లక్షణాలు కలిగి ఉంటాడు. ఉపనిషత్ జ్ఞానం వల్ల అనిర్వచనీయమైన అనాది అవిద్య నశిస్తుంది.

**ఉపనిషత్ శబ్ధార్థం– ''సదేర్థాతోః విశరణగత్యవసాదనార్థస్యోపనిపూర్వస్య క్విప్ ప్రత్యయాన్తస్యరూపముపనిషత్''** ఉపనిషత్ అను పదములో ఉప, ని, షత్ అను మూడు మాటలు గలవు. 'షదల్' అనునది ధాతువు. ఈ ధాతువునకు విడిపోవుట, ప్రాప్తి, నాశము అను మూడర్థములు గలవు. ఉప, ని, అనునవి రెండును ఉపసర్గలు. ఈ మూడు మాటలకు 'క్విప్' అను ప్రత్యయమును చేర్చగా 'ఉపనిషత్' అను పదము నిష్పన్నమగును.

**"ఉపనిషదితి విద్యోచ్యతే తచ్ఛీలినాం గర్భజన్మజరాది నిశాతనాత్ తదేవసాదనాద్వా బ్రహ్మణో వా ఉపనిగమయితృత్వాత్ ఉపనిషణ్ణం వాఽస్యాం పరంశ్రేయ ఇతి"**

ఉపనిషత్తనగా విద్య. అట్టి విద్యను పొందినవారికి జరామరణాద్యనర్థజాతము నశించుట వలనను, బ్రహ్మమును పొందించుట వలనను, ఈ విద్యయందు పరమశ్రేయస్సు నిహితమై ఉన్నది కనుక ఉపనిషత్తనగా బ్రహ్మవిద్య.

**కేనోపనిషత్‌–** ఈ ఉపనిషత్తు సామవేద తవల్‌కార శాఖకు సంబంధించినది. 'కేనేతి' అనే ప్రశ్నతో ఆరంభం అవ్వడం వల్ల ఈ ఉపనిషత్తుకు 'కేనోపనిషత్తు' అని పేరు. బ్రహ్మ యొక్క రహస్యాత్మక రూపనిరూపణము, ఉమాదేవి పరమాత్మ విషయక జ్ఞానము ఉపదేశించడము, పరబ్రహ్మ యొక్క సర్వశక్తిమత్వ ప్రతిపాదనము మొదలైన విషయాలు ఈ ఉపనిషత్తులో చర్చింపబడ్డాయి.

**కేనేషితం పతతి ప్రేషితం మనః**
**కేనప్రాణః ప్రథమః ప్రైతియుక్తః॥**
**కేనేషితాం వాచమిమాం వదన్తి**
**చక్షుః శ్రోత్రం క ఉ దేవోయునక్తి ॥**

మనస్సుని విషయాలపైకి పోయేటట్టుగా ఏది ప్రేరేపిస్తుంది? దేని ప్రేరణచే ప్రాణము తన వ్యాపారమును నిర్వర్తిస్తుంది? దేని సంకల్పముచే మానవులు మాట్లాడగలుగుతున్నారు? ఎవని ఆజ్ఞచే చక్షువు, శ్రోత్రము పనిచేస్తున్నాయి? అనే ప్రశ్నతో ఈ ఉపనిషత్తు మొదలైంది.

కర్మజ్ఞానాలు రెండూ "తమః ప్రకాశం" లాంటివి. తమ: ప్రకాశాలు రెండూ ఒకేచోట ఉండటం కుదరదు కాబట్టి కర్మల నుండి విరక్తుడైన వానికి, తన స్వరూపాన్ని తెలియాలనే కోరిక పుట్టును. ఈ విషయమును "కేనేషితమ్‌" అనే మంత్రం నిరూపిస్తోంది.

ఆత్మజ్ఞానము కలిగినవాడు కర్మలను చేయుట యుక్తియుక్తము (లోకహితం కోసం చేయాలి) కాదు. కాబట్టి బాహ్యజగత్తు నుండి నివృత్తమైన మనస్సు గలవానికి ఆత్మజ్ఞానము కలుగుట కొరకు ఈ ఉపనిషత్‌ యొక్క ఆవశ్యకత ఎంతగానో ఉంది.

కేనేషితం.... అనే శిష్యుని ప్రశ్నకు ఆచార్యుడు సమాధానం ఇలా చెబుతున్నాడు. ఏదైతే చెవికి చెవియో, మనస్సుకు మనసో, వాక్కునకు వాక్కో అదియే ప్రాణమునకు ప్రాణము, కన్నుకు కన్ను ఇలా గ్రహించిన ధీరులు విముక్తులై ఈ లోకమునుండి వెళ్ళి అమరులగుదురు అని ఆచార్యుడు ఉపదేశించాడు.

ఆత్మను ఆశ్రయించుకొని సమస్త ఇంద్రియాలు వాటి వాటి వ్యాపారాల యందు ప్రవర్తిస్తున్నాయి. ఇక్కడ మనస్సుకు మనస్సు అని చెప్పడంలో గల తాత్పర్యమేమనగా? చైతన్యజ్యోతి యొక్క ప్రకాశము లేకుండా అంత:కరణము తనకు విషయములైన సంకల్పము, నిశ్చయము, శ్రద్ధ, అశ్రద్ధ, అధృతి మొదలగు వాటి యందు సమర్థము అవ్వదు. కావున ఆత్మ మనస్సునకు కూడ మనస్సు అని చెప్పబడినది.

ఈ ఉపనిషత్తులో మరొక ప్రధాన విషయం- దేవాసుర సంగ్రామంలో అసురులపై దేవతలు విజయాన్ని పొందారు. విజయగర్వంతో దేవతలు ఆనందిస్తున్న వేళ వారి గర్వాన్ని అణచడానికి బ్రహ్మ ఒక యక్షరూపాన్ని దాల్చి వారి ముందు ప్రత్యక్షమయ్యాడు. ఆ యక్షుడు ఎవరో కనుక్కోమని మొదటగా 'అగ్నిదేవత'ను పంపిస్తాడు ఇంద్రుడు. ఆ యక్షుడు నువ్వు ఎవరివి? అని ప్రశ్నించగా నేను 'అగ్ని'దేవతను. ఈ సమస్తాన్ని క్షణకాలంలో దహించగలనని సమాధానం చెప్పాడు. యక్షుడు ఒక గడ్డిపోచను అతడి ముందు ఉంచి దీనిని దహించమని ఆజ్ఞాపించాడు. అగ్నిదేవత సర్వశక్తితో గడ్డిపోచను కాల్చలేకపోయాడు. అవమానంచే వెనుదిరిగాడు. తరువాత **మాతరిశ్వుడు** వచ్చి గడ్డిపోచను కదలించలేక వెళ్ళిపోయాడు. చివరకు దేవేంద్రుడు గర్వంతోవచ్చేసరికి యక్షుడు కనిపించకపోగా, అతడు అక్కడే ఉండి తపస్సు చేయగా, ఉమాదేవి ప్రత్యక్షమయి ఆ యక్షుడు ఎవరో కాదు సాక్షాత్ బ్రహ్మయేనని తెలిపింది.

ఇక్కడ గ్రహించవలసిన విషయమేమనగా! అహంకారాది అసుర సంపత్తి గల మనుజుడు ఆ భగవంతుని యొక్క వాస్తవతత్త్వాన్ని తెలుసుకోలేడు. కనుక అహంకారాది అసుర సంపత్తిని వదలినవారికే అతడి దర్శనం కలుగుతుందని గ్రహించాలి.

***

# పూజ్యస్వామీజీకి నీరాజనాలు

మద్దూరి రాజ్యశ్రీ

**యతీనాం వరిష్ఠం గురూణాం గరిష్ఠమ్**
**దయానన్దరూపం మదాచార్యమీడే** – **దయా పంచకమ్**

పూజ్యస్వామీజీగా కీర్తి పొందిన **దయానంద సరస్వతి స్వామీజీ,** స్వాములలో శ్రేష్ఠులు. ఆయన **సర్వసఙ్కల్ప సన్యాసి.** బ్రహ్మవిద్యను ఒక క్రమపద్ధతిలో నేర్చుకునేందుకు వీలుగా ఒక కోర్సును తీర్చిదిద్దారు స్వామీజీ. అందుకే గురువులలో శ్రేష్ఠులు.

దయానంద సరస్వతి స్వామీజీ అంత గొప్ప గురువైనా, తనను గురువుగా తీర్చిదిద్దిన చిన్మయానంద స్వామీజీ మీద ఎంతో ఆరాధనాభావం ఆయనకు.

హిందూ ధర్మ సంస్థాపన కోసం దేశ విదేశాల్లో అనేక పర్యటనలు చేస్తూ, తీవ్రంగా కృషి చేస్తుండేవారు చిన్మయానంద స్వామి 1950 నుంచి. ఆ రోజుల్లోనే ఆయన ప్రసంగాలు విని ప్రభావితమైన దయానంద సరస్వతి స్వామీజీ ఆయన దగ్గరే, ఆయనకు సేవ చేస్తూ ఉండిపోయారు. అప్పుడే ఆయన భక్తబృందం **చిన్మయా మిషన్**ను స్థాపించారు. దయానంద స్వామీజీ దాని ఉన్నతి కోసం తన శక్తినంతా ధారపోశారు.

1960లలో చిన్మయానంద స్వామీజీ దగ్గర సన్యాస దీక్ష స్వీకరించిన దయానంద స్వామీజీ హృషీకేశ్ వెళ్ళారు. అక్కడ గంగ ఒడ్డున చిన్న గుడిసెలో ఉండి, కైలాసాశ్రమానికి చెందిన తారానందగిరి స్వామీజీ దగ్గర సంస్కృతం, వేదాంతం నేర్చుకున్నారు. కొన్నాళ్ళయ్యాక తిరిగి చిన్మయానంద స్వామీజీ దగ్గరకు వచ్చారు. 1960 చివర్లో **సాందీపనీ సాధనాలయాన్ని** ప్రారంభించారు చిన్మయానంద స్వామీజీ. హిందూ ధర్మం పదికాలాలు నిలవాలంటే ఔత్సాహికులైన బ్రహ్మచారులు వేదాధ్యయనం చేసి, వాళ్ళ జీవితాలను వేదాంత బోధకు అంకితం చేయాలన్న సదుద్దేశ్యంతో స్థాపించారు.

వేదాంతబోధను ఒక కోర్సుగా తీర్చిదిద్దారు దయానంద స్వామీజీ. రెండున్నర నుంచి మూడేళ్ళలోపు ఒక క్రమపద్ధతిలో సంస్కృతం, భగవద్గీత,

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు నేర్చుకునేలా ఏర్పాటు చేశారు. అలా ఆరు కోర్సులు నడిపారు– రెండు సాందీపనీ సాధనాలయంలోనూ, రెండు నైలేస్‌బర్గ్‌లోనూ, రెండు ఆనైకట్టలోనూ. పరమార్థానంద స్వామీజీ సాందీపనీలో రెండవ కోర్సులో (1976–79) అధ్యయనం చేశారు.

ఈ కోర్సు ప్రాథమిక ఉద్దేశ్యం ఈ విద్యార్థులు విద్య నేర్చుకుని, వాళ్ళు మళ్ళీ బోధించటానికే అయినా, దయానంద స్వామీజీ అంతటితో తృప్తి చెందలేదు. విద్యార్థులు విద్య నేర్చుకుంటున్న ఆ మూడేళ్ళు ఆ ఆధ్యాత్మిక సాధనలోనే మమేకం చెందాలని, వాళ్ళ కోసం ఒక తపనగా నేర్చుకుని, వాళ్ళు ఎదగాలనీ మనసారా తను నమ్మటమే కాక, ఆ భావననే వాళ్ళలో నాటుకునేలాగా వాళ్ళకి వారం రోజులు, కోర్సు ప్రారంభించే ముందు, ప్రేరణనిచ్చే ఎన్నో ఉత్సాహకరమైన విషయాలు చెప్పేవారు. దాని సారాంశం ఇది–

'ఒక విషయం ఎన్నడూ మర్చిపోకండి. వేదాంత బోధ అంటే ఆధ్యాత్మిక సాధనలను నేర్పుతుంది. తర్వాత వాటిని సాధన చేయాలని పొరపాటు పడకండి. ఇది బాగా జీర్ణించుకోవాలి. **వేదాంత బోధ సాధనల మయం కాదు.** వేదాంత బోధే ఒక ఆధ్యాత్మిక సాధన. ఆ ఆధ్యాత్మిక సాధనలో ప్రాథమిక సాధన ఒక క్రమపద్ధతిలో శాస్త్రాన్ని అధ్యయనం చేయటం.'

స్వామీజీ నొక్కి చెప్పిన ఇంకో విషయం ఇది– 'మనిషికున్న సమస్య ఆత్మ అజ్ఞానం; దానికి పరిష్కారం **ఆత్మజ్ఞానం.** కాని మనకున్న ప్రమాణాలన్నీ బాహ్యంగా చూడటానికి తోడ్పడతాయే తప్ప, మన స్వరూపం గురించి చెప్పవు. అందువల్ల వేదాంత అధ్యయనం ఆత్మజ్ఞానాన్ని కలుగచేస్తుంది. అద్దంలో మీ మొహం ఎలా చూసుకుంటారో, వేదాంతంలో అలా మీ గురించి తెలుసుకుంటారు. అద్దంలో చూస్తే, అద్దాన్ని గమనించరు, అందులో కనబడే మీ మొహాన్ని చూస్తారు. అలాగే శాస్త్రమనే అద్దంలో శాస్త్రాన్ని చూడరు; మీ **ఆత్మ స్వరూపాన్ని చూస్తారు.'**

అందువల్ల వేరే ఏ సాధన కూడా శాస్త్ర అధ్యయనానికి ప్రత్యామ్నాయం కాలేదు. అలాగని జపం, పూజ, ధ్యానం లాంటివి చేయకూడదని ఎన్నడూ చెప్పేవారు కాదు. శాస్త్రాధ్యయనం సాక్షాత్ సాధన అయితే, తక్కిన సాధనలు అపరోక్ష సాధనలు అనే మాట తరచూ చెప్పేవారు.

అందువల్ల వాళ్ళకోర్సు కూడా దీన్ని దృష్టిలో పెట్టుకుని తీర్చిదిద్దబడింది. రోజుకి మూడు వేదాంత క్లాసులు ఉండేవి. అది కాక సంస్కృతం ఒక గంట.

పొద్దున్న 4.30కి లేస్తే రాత్రి 9.30 దాకా ఊపిరాడేది కాదు. కాని అందరూ బ్రహ్మచారులు కావటంతో ఉత్సాహంతో ఉరకలు వేస్తూ, ఆడుతూ పాడుతూ నేర్చుకునేవారు. పొద్దున్నా, సాయంకాలం శివాలయంలో పూజలు ఉండేవి. తర్వాత పూజ్య స్వామీజీయే స్వయంగా ధ్యానం నేర్పేవారు. తర్వాత యోగా తరగతులు, పాణినీ వ్యాకరణ తరగతులు. రాత్రి సత్సంగం. ప్రశ్నలు, జవాబుల పద్ధతిలో ఉండేది. శరీరం దృఢంగా ఉండటానికి ఆశ్రమాన్ని శుభ్రపరచటం లాంటి శారీరక పనులు చేసేవారు.

అంతేకాదు, నోట్సులు రాసి స్వామీజీకి చూపించాలి. క్యాసెట్లలో రికార్డు చేసుకోవటం చెల్లదు. ఇది కాక, సంస్కృతం హోమ్‌వర్క్ ఉండేది. స్వామీజీ వాళ్లకు మంత్రదీక్షనిచ్చేవారు. ఆ మంత్రజపం చేసుకోవాలి. వాళ్ళ బట్టలు ఉతుక్కోవటం లాంటి వ్యక్తిగతమైన వేరే పనులు చెప్పనవసరం లేదు. ఇంత ఊపిరాడని పని ఉన్నా, వాళ్ళు సంతోషంగా ఉండేవారు. అది **వాళ్ళ జీవితాన్ని మార్చివేసిన కాలం** అంటారు పరమార్థానంద స్వామి.

వాళ్ళు అంత ఆనందంగా ఉండటానికి కారణం దయానంద సరస్వతి స్వామీజీయే. ఆయన వాళ్ళను తల్లిలా 24 గంటలూ సంరక్షించుకునేవారు. ఎప్పుడెవరికే అవసరం వచ్చినా అందుబాటులో ఉండేవారు. వాళ్ళకి అవసరం వస్తేనే కాదు, ఆయనే స్వయంగా అప్పుడప్పుడూ వాళ్ళను ఒక్కొక్కరినీ పిలిచి వాళ్ళ మంచి చెడ్డలు స్వయంగా విచారించేవారు. అంతేకాదు వారిలోని కళను ప్రోత్సహించేవారు. పరమార్థానంద స్వామి మృదంగం వాయిస్తారని తెలిసి, ఆయనకోసం చెన్నై నుంచి ముంబై ఆశ్రమానికి మృదంగం తెప్పించారు. ఆయనను మృదంగం వాయించమన్నారు.

పూజ్యస్వామీజీ ఎన్నడూ నియంతగా ప్రవర్తించలేదు. 'ఎదుటివారి మనస్సును క్రమశిక్షణ పేరుతో నియంత్రించకూడదు; అలా చేస్తే వాళ్ళు నిశ్చింతగా ఉండలేరు. ఒత్తిడికి లోనవుతారు. స్వేచ్ఛ లేనిచోట జ్ఞానం–ముఖ్యంగా ఆధ్యాత్మిక జ్ఞానం కలుగదు,' అనేవారు. ఆయన విలువలకు విలువనిచ్చేవారు. విలువ గురించి పూజ్య స్వామీజీ తరచు చెప్పేమాట– 'ఒక **విలువ** యొక్క **విలువ**కు మీరు విలువ నిచ్చినప్పుడే, ఒక విలువ **విలువ** అవుతుంది.' అందువల్ల బాహ్యంగా నియమాలు పెట్టకుండా, వాళ్ళు అంతర్గతంగా మారేటట్టుగా వాళ్ళ ప్రవర్తనను మలచేవారు. అందువల్ల తర్వాత కోర్సును ఏర్పరచేటప్పుడు ఏమైనా నిబంధనలను పెడతారా అంటే ఇష్టపడేవారు కాదు.

కోర్సు అయ్యాక కూడా వాళ్ళ భవిష్యత్తు గురించిన నిర్ణయాలు వాళ్ళకే వదిలేసేవారు. కోర్సులో జేరినప్పుడు, 'మీ భవిష్యత్తులో ఏమవుదామనుకున్నా, ప్రస్తుతం దాని గురించి ఆలోచించకండి. మీరు గురువు అవుదామనుకుంటే, నేను ఏర్పాటు చేస్తాను. మీరు పెళ్ళి చేసుకుందామనుకుంటే, నేను అమ్మాయిని చూస్తాను. ఇప్పుడు మాత్రం నూరుశాతం మీ మనస్సు నాకే అంకితం చేయండి. అప్పుడు నేను మీకు **వేదాంతం** చెప్పే సందేశాన్ని పూర్తిగా అందజేయగలను,' అని చెప్పారు.

అన్నమాట ప్రకారం ఎవరే దారిలో వెళతామంటే వాళ్ళను దీవించటమే కాక వాళ్ళకు అవసరమైన ధన సహాయం, మాట సహాయం చేసేవారు. ఇప్పుడు 200 పైచిలుకు బ్రహ్మచారులు సన్యాసం స్వీకరించి, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, వేదాంత బోధ చేస్తున్నారు.

అంతేకాదు **'ఎయిమ్ ఫర్ సేవ'** అనే ఒక స్వచ్ఛంద సేవాసంస్థను ఏర్పరచారు. **'హిందూ ధర్మ ఆచార్య సభ', 'ధర్మ రక్షణ సమితి'** లాంటి వాటికి కూడా శ్రీకారం చుట్టారు. వీటి కోసం చాలా ప్రయాణాలు చేసేవారు. క్షణం కూడా తీరిక లేకుండా తిరగటం, శిష్యులు వస్తే వాళ్ళతో మాట్లాడటం చేసేవారు. పూజ్య స్వామీజీ ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. 2015 ఆగస్ట్‌లో అమెరికా వెళ్ళినప్పుడు వారి దగ్గర సెలవు తీసుకున్నారు. 'నేను వచ్చే సంవత్సరం రాలేక పోవచ్చు,' అన్నారు. తన చివరి రోజులు గంగ ఒడ్డున హృషీకేశ్ ఆశ్రమంలో గడపటానికి తీర్మానించుకున్నారు. సెప్టెంబరు 23న మహా సమాధి పొందారు.

పూజ్యస్వామీజీని భూసమాధి చేశారు. ఎంతో మంది శిష్యులు ఉండి, ఆయనను చిరకాలం గుర్తుంచుకోవాలనుకునేవారికి అలా చేస్తారు. అటువంటి జ్ఞానులను కూర్చున్న భంగిమలో ఉంచుతారు. ఎందుకంటే వారిని **సాక్షాత్తూ దక్షిణామూర్తి**గా కొలుస్తారు. అప్పుడు షోడశ ఉపచార పూజ చేస్తారు, ఏకాదశ రుద్రాభిషేకంతో కలిపి. స్వామీజీ మహాసమాధి సమయంలో గౌరవమర్యాదలు, కృతజ్ఞతా భావాలు వెల్లివిరుస్తాయి. ఉపనిషత్తు మంత్రాలు, గీతాశ్లోకాలు పఠిస్తారు.

పూజ్యస్వామీజీ మహాసమాధి చెందిన చోట శివలింగంతో ఉన్న ఆలయ నిర్మాణం జరిగింది. గురువు శివైక్యం చెందారన్నమాట. ఈశ్వరుని రూపంలో ఆయన అక్కడే ఉంటారు. భూసమాధికి చేసే అంతిమ కార్యక్రమాలే రాబోయే ఆలయానికి పునాదిరాయి వేసేటప్పుడు చదివే ప్రాథమిక కార్యక్రమం అవుతుంది. భూ సమాధి 25 సెప్టెంబరున జరిగింది. సమాధి జరిగిన 16వ రోజును షోడశి

అంటారు. ఆ రోజు మహాత్ములను, మండలేశ్వరులను, మఠాధిపతులను పిలిచి వారిని సత్కరించారు. హృషీకేశ్‌లో ఉన్న సన్యాసులందరికీ అంటే 3000 మందికి భిక్ష ఏర్పాటు చేశారు. దీన్ని భండార అంటారు.

పూజ్య స్వామీజీ లేని లోటు స్వామీజీలకు కూడా తీరని లోటే. కాకపోతే ఆయన నేర్పించిన శాస్త్రాన్ని, ఆయన రంగరించి పోసిన జీవన సూత్రాలను నలుగురికి పంచి పెట్టటంలో ఆ లోటును భర్తీ చేసుకుంటారు.

**(పూజ్య స్వామీజీ షోడశి రోజున ఆయనకు నివాళులర్పిస్తూ పరమార్థానంద స్వామి ఇచ్చిన ప్రసంగం ఆధారంగా)**

# స్పందన

**సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।**
**తేజస్వి నావధీతమస్తు మావిద్విషావహై ॥ ఓం శాన్తిశ్శాన్తిశ్శాన్తిః॥**

బాల్యంలో చెంగులేస్తున్నా, యవ్వనంలో ఉరకలేస్తున్నా, ఉద్యోగ విజయాలలో, విందు వినోదాలతో తేలియాడుతున్నా ఏదో తెలియని సన్నని వేదన వెంటాడుతూ ఉండేది. సూర్యచంద్రులు, నక్షత్రరాశులు, ఋతువులు, కొండలు, జలపాతాలు, జీవరాశుల చలనాలు అబ్బురపరుస్తూ ఉండేవి. ఈ అనుభూతి విశ్వకర్మ మనకందించిన విభూతి అని పెద్దలు చెపుతూ ఉండగా వింటూ ఉండేవాడిని. పెద్దల మాటల్లో తరచు వినిపించే ఉపనిషత్తుల గురించి తెలుసుకోవాలనే కోరిక పొడసూపింది. రాను రాను బలీయమైంది. సంకల్ప బలమో ఏమో ఆడబోయిన తీర్థంలా మా కాలనీ సమీప ఆలయంలో ఉపనిషత్తుల మీద ప్రవచనాలు చెపుతున్న స్త్రీ మూర్తిని కలిసి నా కోరిక విన్నవించుకున్నాను. ప్రసన్న వదనంతో ఉపనిషత్తుల మీద ప్రవచనాలు మా కాలనీలో చెప్పడానికి అంగీకారం తెలుపుతూ వారి స్వగృహంలో వారి శ్రీవారిని కలవవలసినదిగా కోరారు.

సమీపంలో ఉన్న వారి స్వగృహంలో ఆ మహనీయుని దర్శించుకొన్నాను. వారి వర్చస్సు నన్ను చకితుణ్ణిచేసి, సంభాషించాను. వారి వచస్సు నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నా జ్ఞానతృష్ణ తీర్చే అమృతభాండం లభించినట్లనిపించింది. గురుకుల పద్ధతిలో (తరగతి గది బోధనారీతి) వేదాంత బోధనకు వారి అనుమతి లభించింది. ఆనందాంతరంగుణ్ణై మిత్రులతో చర్చించి కాలనీలో వేదికను ఏర్పాటు చేసుకొన్నాము.

ఒక శుభముహూర్తాన బోధన ఆరంభమైంది. అద్వైత సిద్ధాంత బోధన మీదుగా కఠ, ముండక, కేన, తైత్తిరీయాదులతో కొనసాగుతోంది. లౌకిక జీవనానికి మించిన మరో మధుర లోకపు సౌఖ్యం తనవైపు ఆకర్షిస్తోంది. నిధిలో లేని ఆనందం జ్ఞాననిధిలో లభించనారంభించింది.

వేదాల్లో జ్ఞానకాండకు సంబంధించిన మంత్రాలను ఉపనిషత్తులంటారని, అవి 108 అని అందులో ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తరీయ, ఐతరేయ, చాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులు మిక్కిలి ముఖ్యమైనవని తెలుసుకొన్నాము. ఉపనిషత్తు అనగా శిథిలమగుట, పొందుట, నాశనమగుట అని, వీటిని ఆధారంగా చేసుకొని జన్మ, మరణాన్ని, అవిద్యను శిథిలం చేసేది,

పొందేది, నాశనం చేసేది అని తెలుసుకొన్నాము.

మరోమాట కేనోపనిషత్తు గురించి మేము తెలుసుకొన్నది – కేనోపనిషత్తు సామవేదంలోని తలవకార బ్రాహ్మణంలోని 9వ అధ్యాయం అని, దీన్నే జైమిని బ్రాహ్మణం అని కూడా అంటారని తెలిసింది. 'కేన' అన్న పదంతో ప్రారంభం కావడంతో కేనోపనిషత్తుగా పిలువబడుతుంది. ఈ ఉపనిషత్తులో మానసిక విశ్లేషణ, ఇంద్రియాల కార్యకలాపాల వివరణ, వీటిని వేరు చేయడం ద్వారా ఏ విధంగా ఆత్మసాక్షాత్కారం పొందేది వివరించబడింది.

ఈ జ్ఞానయజ్ఞం ఆరంభమై సంవత్సరంన్నర గడిచిపోయింది. ఇంతకీ ఆ జ్ఞానబోధకుల గురించి చెప్పనే లేదు కదూ? వారే శ్రీ కె.వి. రాఘవరావు, శ్రీమతి రాజ్యశ్రీ పుణ్యదంపతులు. వీరు పెక్కుకాలం స్వామి పరమార్థానంద, మరియు స్వామి దయానంద సరస్వతి గార్ల సాన్నిధ్యంలో వేదాంతోపనిషత్తులలో శిక్షణ పొందియున్నారు.

అతి చిన్న సంఖ్యతో ప్రారంభమైన ఈ జ్ఞానయజ్ఞం ఇప్పటికి పాతికమంది వరకు చేరింది. ఇంకా ఎంతోమంది ఈ జ్ఞానామృతాన్ని పొందే ఉత్సుకతతో ఉన్నారు. దీన్ని విస్తృతం చేయాలని, కాలనీవాసుల సహకారం, ప్రోత్సాహం ఉంటే ఈ కేంద్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తున్నాం. ఈ పవిత్ర గురుదంపతుల కరుణాకటాక్షాలతో మరెందరో జ్ఞానాన్ని పొంది తరిస్తారని ఆశిస్తున్నాం.

గురుచరణారవిందాలకు ప్రణమిల్లుతూ...

**భవదీయుడు**
**ఎస్.ప్రభాకర్,**
**ఎసిసి సీనియర్ సిటిజన్స్ వేదాంత గ్రూప్**

**సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।**
**తేజస్వి నావధీతమస్తు మావిద్విషావహై ॥ ఓం శాన్తిశ్శాన్తిశ్శాన్తిః॥**

# కేనోపనిషత్తు

## ఉపోద్ఘాతము

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై ।**
**తం హ దేవం ఆత్మబుద్ధిప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥**

**శ్వేతాశ్వతర ఉపనిషత్తు 6-18**

పరమాత్మ అందరికన్నా ముందు బ్రహ్మను సృష్టించాడు. బ్రహ్మను సృష్టించాక, పరమాత్మ బ్రహ్మకు సృష్టికార్యం అప్పజెప్పినప్పుడు, వేదాలు కూడా ఇచ్చాడు. అంటే దీన్ని బట్టి, సృష్టింపబడిన మనిషి నుంచి వేదాలు రాలేదు; సాక్షాత్తూ ఆ పరమాత్మ నుంచే వచ్చాయని తెలుస్తున్నది.

**తస్మాదృచః సామయజూంషి దీక్షా - ముణ్డక 2-1-6**

ఆయన్నుంచే, అంటే ఆ పరమాత్మ నుంచి ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణ వేదం వచ్చాయి అంటే అవి అపౌరుషేయం. మనిషి సృష్టించలేదు వేదాలను. మనిషితోపాటు పరమాత్మచేత సృష్టించబడ్డాయి.

పరమాత్మ వేదాలను మనిషితో పాటు ఎందుకు సృష్టించాడు? ఎందుకంటే, వేదాలు మానవ మనుగడకు ఒక మార్గదర్శకంగా నిలవాలని. ఇప్పుడు మనం ఏవైనా వస్తువులను కొంటే, వాటిని ఎలా వాడాలో సూచించే ఒక మాన్యువల్ ఇచ్చినట్టుగా, పరమాత్మ మానవాళికి ఒక మాన్యుయల్‌ని ఇచ్చాడు. ఇప్పుడు జిపియస్ ఎలా దోవ చూపిస్తుందో, అలా వేదాలు మన జీవన విధానానికి దోవ చూపిస్తాయి.

వేదాలను తన జీవితానికి మార్గదర్శిగా అంగీకరించిన వ్యక్తిని వైదికుడు అంటారు. తన లక్ష్యాలను, వాటిని పొందే మార్గాలను వేదం నిర్దేశించిన తీరులో తీర్చిదిద్దుకునే వ్యక్తిని వైదికుడు అంటారు. ఈ వైదికుడినే, ఆధునిక రీతిలో చెప్పాలంటే హిందువు అంటారు. అతను భారతదేశంలోనే పుట్టాలని లేదు. ఎక్కడ పుట్టినా, వేదాన్ని పాటిస్తే వైదికుడు అవుతాడు.

వేదాలను శాస్త్రం అంటారు. **శాసనాత్ త్రాయతే ఇతి శాస్త్రమ్** శాస్+త్రమ్= శాస్త్రం. శాసనం అంటే జీవితం గురించీ, దాని లక్ష్యాల గురించీ, ఆ లక్ష్యాలను పొందే మార్గాలను గురించి చేసే బోధ లేదా సూచన. వేదాలు ఇలా సూచనలివ్వటం ద్వారా మనిషి కష్టాల పాలవకుండా కాపాడబడతాడు. పట్నంలో ఏదైనా ఇల్లు

ఎక్కడుందో సరిగ్గా తెలుసుకోకుండా వెళితే, ఎంత తిరిగినా ఒక పట్టాన ఆ ఇల్లు దొరకదు. అదే ఎవరైనా మీకు దగ్గరుండి మార్గం చూపిస్తే, చిటికెలో కనుక్కుంటారు. అందుకే వేదాలను శాస్త్రం అంటారు. అది మనిషికి మార్గం చూపుతుంది.

**సత్యం సత్యం పునః సత్యం ఉధృత్యాభుజ ఉచ్యతే।**
**వేదః శాస్త్రం పాఠం నాస్తి న దైవం కేశవాత్ పరః॥**

**ఉధృత్యాభుజం –** చెయ్యెత్తి పెట్టి, మానవాళికి గట్టిగా చెప్తున్నాము. ఏమని? సత్యం సత్యం పునః సత్యం– ఇదే సత్యం, పూర్తి సత్యం. సత్యం వినా మరొకటి లేదు. ఏమిటా సత్యం?

వేదః శాస్త్రం పరం నాస్తి– మానవాళికి వేదాలను మించిన గొప్ప మార్గదర్శి లేదు.

ఈ విధంగా హిందువులైన మనం, వేదాలను మన మార్గదర్శిగా అంగీకరించాలి.

ఈ వేదాలు నాలుగు– ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం. వేదం ఒకటే అయినా, అది రెండు శాస్త్రాలుగా విభజించబడింది. వేద పూర్వశాస్త్రం, వేద అంత శాస్త్రం. అందువల్ల ఇద్దరు గొప్ప ఋషులు వీటిని విశ్లేషించారు. జైమిని మహర్షి వేద పూర్వమీమాంస సూత్రాలను రచిస్తే, వ్యాసాచార్యులు ఉత్తరమీమాంస సూత్రాలను రచించారు. పూర్వ మీమాంస పూర్వభాగం మీద, ఉత్తరమీమాంస ఉత్తర భాగం మీద ఆధారపడి చేయబడ్డాయి. ఒకే శాస్త్రాన్ని రెండు భాగాలుగా ఎందుకు విభజించారు? ఏమిటి దీనికి ఆధారం? వేదాన్ని ఒక్క శాస్త్రంగా చూడాలా, రెండుగా చూడాలా?' శంకరాచార్యులు తన భాష్యంలో ఈ ప్రశ్న వేశారు. ఐక్యశాస్త్ర వాదం, శాస్త్రద్వయ వాదం లోతుగా సాగింది. చివరికి శంకరాచార్యులు, అనేక ఆచార్యులు మీమాంస చేసి, అవి రెండు శాస్త్రాలని తేల్చారు. ఏమిటాకారణం?

**అనుబన్ధ చతుష్టయభేదాత్, శాస్త్రభేదః॥**

వేద పూర్వభాగానికీ, వేద అంతభాగానికీ అనుబంధ చతుష్టయంలో భేదం ఉంది.

అనుబన్ధ చతుష్టయం అంటే ఏమిటి? సంబంధాన్ని నిర్ణయించే అంశాలు అనవచ్చు. విజ్ఞానశాస్త్రానికి చెందిన ఏ శాస్త్రం గురించి విన్నా, మనకు వచ్చే

ప్రశ్న ఏమిటి?' ఈ శాస్త్రానికీ, మనిషికీ ఏమిటి సంబంధం?' అలాగే వేదం గురించి వినగానే వేదం 21వ శతాబ్దానికి పనికి వస్తుందా? అందువల్ల మనిషి మనసు ఎప్పుడూ 'సంబంధం' గురించే ఆలోచిస్తూ ఉంటుంది. ముందు, ఈ రోజుల్లో పనికి వస్తుందా అన్న ప్రశ్న వచ్చాక, నాకు పనికి వస్తుందా అన్న ప్రశ్నకు దారితీస్తుంది.

శాస్త్రం యొక్క అనుబంధం నిర్ణయించటానికి సాంప్రదాయం నాలుగు అంశాలను నిర్దేశించింది. మనిషికి శాస్త్రం యొక్క సంబంధాన్ని నాలుగు అంశాలు నిర్ణయిస్తాయి కాబట్టి దాన్ని అనుబంధ చతుష్టయం అంటారు. చతుష్టయం అంటే నాలుగు. ఈ నాలుగు అంశాల్లో వేద పూర్వభాగానికీ, వేద అంతభాగానికీ భేదాలున్నాయి. అందుకే వేదం రెండుగా విభజించబడింది.

ఏమిటా నాలుగు అంశాలు?

**1. విషయం - శాస్త్రం దేని గురించి చెపుతున్నది?**

**2. ప్రయోజనం - శాస్త్రం చెప్పే విషయాన్ని నేర్చుకుంటే కలిగే ప్రయోజనం ఏమిటి?**

**3. సంబంధం - విషయానికీ, ప్రయోజనానికీ మధ్య ఉన్న సంబంధం ఏమిటి?**

**4. అధికారి - శాస్త్రం నేర్చుకోవటానికి కావాల్సిన అర్హత ఏమిటి?**

ఇప్పుడు ఈ నాలుగు అంశాలనూ వేద పూర్వభాగానికి అన్వయించి చూద్దాము.

**1. విషయం-** వేద పూర్వభాగం అనేక రకాల కర్మలను గురించి వివరిస్తుంది. అందుకే వేద పూర్వభాగాన్ని కర్మకాండ అని కూడా అంటారు. కర్మలు మూడు రకాలు- త్రివిధం కర్మ-

ఎ. కాయిక కర్మ - శరీరంతో చేసేవి

బి. వాచిక కర్మ - వాక్కుతో చేసేవి

సి. మానస కర్మ - మనసుతో చేసేవి

**కరచరణకృతం వాక్కాయజం కర్మజం వా**
**శ్రవణ నయనజం వా మానసం వాపరాధమ్ (శివమానస పూజ)**

జమ్ అంటే వీటి నుంచి పుట్టినవి. ఏమిటవి? కాయిక, వాచిక, మానస కర్మలు. కాయిక, వాచిక చర్యలను కర్మ అంటే, మానస చర్యలను ఉపాసన లేదా ధ్యానం అంటారు.

**2. ప్రయోజనం–** మూడు ప్రయోజనాలున్నాయి. త్రివిధం కర్మఫలం – అర్థం, కామం, ధర్మం.

**ఎ. అర్థం–** ధనం సంపాదించటానికి అనేక వైదిక కర్మలు చెప్పబడ్డాయి. తైత్తిరీయోపనిషత్తులో **'ఆవహన్తీ హోమం'** అని ఒక హోమం చెప్పబడింది. ఆ హోమం చేస్తే అంతులేని ఐశ్వర్యాన్ని, ఆహారాన్నీ పొందుతారు.

**ఆవహన్తీ వితన్వానా కుర్వాణా౽ చీరమాత్మనః వాసాగ్ంసి మమ గావశ్చ।**
**అన్నపానేచ సర్వదా తతో మే శ్రియమావహ॥ – తైత్తిరీయం**

సిరి అంటే ఐశ్వర్యం. ఇవన్నీ అర్థం అంటే ఐశ్వర్యంలోకి వస్తాయి. ఐశ్వర్యం ఉంటే భద్రత వస్తుంది అనుకుంటారు. కాటికి చేరే వరకే కాసుకు విలువ అని ఒక ఆటోమీద రాసి ఉంటుంది. కాని కాటికి చేరాలన్నా కాసు కావాలి అంటారు కొందరు.

**బి. కామం–** సరదాలు, వేడుకలు. మన ప్రాథమిక అవసరాలు తీరాక, సరదాల కోసం వెంపర్లాడతాము. అది కామం కిందకి వస్తుంది.

**సి. ధర్మం–** ధర్మం అంటే పుణ్యం. మనం అమెరికాలోకి అడుగుపెట్టాలంటే ఏం చేస్తాం? మన రూపాయలను మార్చి, వాళ్ళ డాలర్లని తీసుకుంటాం. అలాగే వచ్చే జన్మలో అర్థకామాలు పొందటానికి ఈ జన్మలో మనం మార్చే నోట్లు మన పుణ్యఫలం. ఎందుకంటే వచ్చే జన్మలో కూడా మనం వెంపర్లాడేది అర్థకామాల గురించే. దానికి తగ్గ డబ్బు మనం చేసిన పుణ్యం. ఆ పుణ్యం పొందటానికి అనేక కర్మలు సూచించబడ్డాయి. ఆ పుణ్యం ఇంకా మంచి ఉపాధిని, మంచి వాతావరణాన్ని, మంచి కుటుంబాన్ని పొందటానికి తోడ్పడుతుంది.

అర్థ,కామ,ధర్మాలు మూడింటినీ కలిపి ప్రేయస్సు అంటారు. ఇవి కర్మఫలాలు.

**శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః తౌ సమ్పరీత్య వివనక్తి ధీరః॥ కఠ 1-2-2**

**3. సంబంధం–** వేద పూర్వ భాగ అధ్యయనానికీ, ప్రయోజనానికీ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? చదివినంత మాత్రాన ప్రత్యక్షంగా ఫలితం కలుగదు. ఉదాహరణకు యోగాభ్యాసం తీసుకోండి. యోగాలో వారం రోజుల కోర్సుకి వెళ్ళి అనేక ఆసనాలు నేర్చుకుని వస్తే సరిపోతుందా? లావు తగ్గిపోతారా? కోర్సుకు వెళితే చాలదు. వెళ్ళటం వల్ల కలిగిన జ్ఞానాన్ని అనుష్ఠానంలో వాడాలి. కర్మజ్ఞానం ఫలాన్ని ఇవ్వదు. కర్మ అనుష్ఠానం లేదా అభ్యాసం మాత్రమే ఫలాన్నిస్తుంది. అందువల్ల అధ్యయనం ప్రత్యక్షంగా ఫలితానివ్వదు, అనుష్ఠానం ద్వారా ఇస్తుంది. దీన్ని పరంపర సంబంధం అంటారు. అంటే పరోక్ష సంబంధం అంటారు.

మధ్యలో ఉన్న అంశం ఏమిటి? అనుష్ఠానం. అన్ని వైదిక కర్మల్లోకీ సంధ్యావందనం శ్రేష్ఠమైనది. కాని దీని ఫలం ఎప్పుడు కలుగుతుంది? సంధ్యావందనం చేస్తేనే! లేకపోతే లేదు! దీన్ని పరంపర సంబంధం అంటారు.

**4. అధికారి–** అధికారి ఎవరు? అధికారికి ఈ క్రింది లక్షణాలు ఉండాలి.

**ఎ. కోరిక:–** యద్యదపి కురుతే కర్మ తత్తత్ కామస్య చేష్టితమ్. కోరిక ఉండాలి. దేనిమీద కోరిక? ధర్మ, అర్థ, కామ పురుషార్థాల మీద. నాకు డబ్బు కావాలి. నాకు ఈ వస్తువులు కావాలి వగైరా. అంటే ధర్మ ఇచ్ఛ, అర్థ ఇచ్ఛ, కామ ఇచ్ఛ. 'ప్రేయోర్థి' అంటుంది కఠోపనిషత్తు.

ప్రేయః అర్థ్యతే ఇతి ప్రేయోర్థి.

విష్ణుసహస్రనామంలో ధర్మార్థి, అర్థార్థి అని వస్తుంది.

**ధర్మార్థీ ప్రాప్నుయాత్ ధర్మమ్, అర్థార్థీ చ అర్థమ్ ఆప్నుయాత్।**
**కామార్థీ ఆప్నుయాత్ కామీ, ప్రజార్థీ చాప్నుయాత్ ప్రజామ్॥**

**బి. శ్రద్ధ:–** వైదిక కర్మల మీద శ్రద్ధ ఉండాలి. వేదం మీద శ్రద్ధ; వేద పూర్వభాగం మీద శ్రద్ధ; వైదిక కర్మల మీద శ్రద్ధ ఉండాలి. 'శ్రాద్ధం' అన్న పదం శ్రద్ధ నుంచి వచ్చిందే. శ్రాద్ధ కర్మల మీద శ్రద్ధ ఉంటేనే, ఎవరైనా శ్రాద్ధం పెడతారు. 'నాకు పితృదేవతలు ఉన్నారన్న నమ్మకం లేదు. పునర్జన్మ మీద నమ్మకం లేదు,' అంటేనో 'ఇక్కడ అగ్నిలో వేసింది ఎక్కడో ఉన్న వాళ్ళకి ఎలా వెళుతుంది?' అంటేనో శ్రాద్ధ కర్మలు చేయరు. శ్రద్ధ లేకపోతే, వేదాన్ని పట్టించుకోరు. అందుకని వనరులలో మొదటి అంశం శ్రద్ధ.

**'శ్రద్ధాం మేధాం యశ ప్రజ్ఞాం విద్యాం బుద్ధిం శ్రియం బలం**

**ఆయుష్యం తేజ ఆరోగ్యం దేహి మే హవ్యవాహన।**

బ్రహ్మచారి ప్రార్థన ఇది. ఓ దేవా నాకు మేధస్సుని ఇయ్యి. నాకు శ్రద్ధని ఇయ్యి.

**సి. దక్షత్వం:-** వనరులలో ఇంకో ముఖ్యమైన అంశం దక్షత్వం. కర్మ ఎంత పెద్దదైతే, అంత ఐశ్వర్యం కావాల్సి ఉంటుంది. అది కాక దానికి సంబంధించిన జ్ఞానం, ప్రజ్ఞ కూడా కావాలి. ఐశ్వర్యం, జ్ఞానం, ప్రజ్ఞ- ఈ మూడింటినీ కలిపి దక్షత అంటారు.

**డి. అపర్యుదస్తత్వం:-** వేదం లైసెన్సు ఇవ్వాలి. మనం ఒక ఇల్లు కట్టుకోవాలంటేనే, కార్పొరేషన్ నుంచి లైసెన్సు తెచ్చుకోవాలి. అలాగే వైదిక కర్మలు చేయటానికి కూడా వేదం మనకి లైసెన్సు ఇవ్వాలి. వైదిక లైసెన్సు అంటే సాంప్రదాయంలో వర్ణాశ్రమ ధర్మం. ఉదాహరణకి, రాజసూయ యాగం క్షత్రియుడే చేయాలి. బ్రాహ్మణుడు చేయకూడదు. ఏ వర్ణానికి చెందిన వ్యక్తి ఆ వర్ణానికి సంబంధించిన యాగాలే చేయాలి. అలాగే ఆశ్రమ ధర్మం కూడా ఉంటుంది. పుత్రకామేష్టి యాగం సన్యాసి చేయకూడదు. గృహస్థే చేయాలి.

ఇక్కడ ఒక ముఖ్యమైన సూత్రం గుర్తుంచుకోవాలి మనం. వైదిక కర్మలు పురుషులకు మాత్రమే నియమించినవి కావు. వేదం పురుష పక్షపాతి అన్న అపోహ ఉంది చాలామందిలో. కాని అది నిజం కాదు. వైదిక కర్మల్లో 95% దంపతులు చేయాల్సినవి ఉంటాయి. దంపతులు అంటే భార్యాభర్తలు. భార్యాభర్తల విధులు భిన్నంగా ఉన్నా, ఇద్దరూ కలిసి చేయాలి. చాలా కర్మలకు ఒకరు లేకుండా ఇంకొకరు చేయటానికి అర్హులు కారు. అందుకని వర్ణాశ్రమ ధర్మం ముఖ్యం. దాన్ని అపర్యుదస్తత్వం అంటారు. కోరిక, శ్రద్ధ, దక్షత్వం, అపర్యుదస్తత్వం అనే ఈ నాలుగు లక్షణాలూ ఉన్న వ్యక్తిని అధికారి అంటారు.

ఇప్పుడు ఈ నాలుగు అంశాలనూ వేద అంతభాగానికి అన్వయించి చూద్దాము.

**1. విషయం-** ఇక్కడ కర్మతో సంబంధం లేదు. వేద అంతభాగంలో విషయం జ్ఞానం. దేని గురించిన జ్ఞానం? **నా స్వస్వరూప జ్ఞానం.** దీన్నే **ఆత్మవిద్య** అని కూడా అంటారు. నా స్వరూప జ్ఞానం గురించిన విద్య ఇది. వేదాంతం ఆత్మజ్ఞానం గురించి ఎందుకు చెపుతున్నది? మన గురించి మనకు తెలియదని శాస్త్రానికి

తెలుసు కాబట్టి. నా గురించి నాకు తెలియకపోవటమేమిటి, నా గురించి నా భార్యకు తెలియకపోవచ్చేమో కాని అనుకోవచ్చు మనం. కాని నా గురించి నాకు తెలుసు అని మనం అనుకుంటున్నాము కాని అది కేవలం మన ఊహ మాత్రమే అంటున్నది వేదం. మనం పట్టించుకోని విషయం అంటూ ఏదైనా ఉంటే, అది మన గురించిన జ్ఞానమే. 'నేనెవరు?' అన్న ప్రశ్నను మనకు మనం ఎన్నడూ వేసుకోము. అందుకని మన గురించి మనకు తెలుసు అనుకుంటున్నది నిజం కాదు.

అందరం అనుకుంటున్నంత మాత్రాన అది నిజమైన జ్ఞానం అవాలన్న నియమమేం లేదు. 'పదుగురాడు మాట పాడియై ధరణిజెల్లు,' అన్నమాట అన్నివేళలా నిజం కాదు. కొన్ని వేల సంవత్సరాలు భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడను కున్నారు అందరూ. 'సూర్యుడు భూమి చుట్టూ తిరగటం లేదు. భూమే సూర్యుని చుట్టూ తిరుగుతోంది,' అన్న నిజాన్ని అర్థం చేసుకోవటానికి మానవాళికి చాలా కష్టమయింది. ఆ విషయం కనుగొన్న శాస్త్రజ్ఞుడిని పరిహసించింది కూడా.

**అవిద్యాయామన్తరే వర్తమానాః స్వయం ధీరాః పణ్డితం మన్యమానాః**

**– ముణ్డక 1.2.8**

మానవాళి అంతా ఆత్మ అజ్ఞానంలోనూ, ఆత్మ అపోహలోనూ కూరుకుపోయి ఉంది. అజ్ఞానం, అపోహ తొలగాలంటే జ్ఞానం కలగాలి. అందువల్ల విషయం ఏమిటి? ఆత్మజ్ఞానం.

**2. ప్రయోజనం:–** ఆత్మజ్ఞానం పొందటం వల్ల ప్రయోజనం ఏమిటి? విముక్తి. మోక్షాన్ని శ్రేయస్సు అని కూడా అంటారు. వేదపూర్వభాగంలో ప్రయోజనాన్ని ప్రేయస్సు అన్నాము. ఇక్కడ ప్రయోజనం శ్రేయస్సు. దేన్నించి విముక్తి? ధర్మ, అర్థ, కామాల మీద ఏర్పరచుకున్న వ్యామోహమనే బంధం నుంచి విముక్తి.

వేద పూర్వభాగంలో ధర్మ, అర్థ, కామాల వెంట పరుగులు తీస్తాము. ఎందుకు? అవి లేకపోతే నా జీవితం వృథా అనుకుంటాము. అవి ఉంటే నా విలువ పెరుగుతుంది. ఒక మంచి ఇల్లు, ఒక ఖరీదైన కారు, అందమైన భార్య ఇవన్నీ ఉంటేనే మనను అందరూ గౌరవిస్తారన్న ఆశ. అందువల్ల ధర్మార్థకామాల మీద వెంపర్లాట భద్రత కోసం. నా అహంకార, మమకారాలు వాటికి మూలం.

కాని ఆత్మజ్ఞానం దగ్గరకి వచ్చేసరికి, నా విలువ పెంచుకోవటానికి నేనేం

పొందనవసరం లేదంటుంది. నా అసలు స్వరూపంలో నేనే సృష్టి మొత్తానికి ఆధారం అంటుంది. సృష్టికే నేను అధిష్ఠానం. నా నుంచే మూడు అంశాలు జగత్తుకు ఆధారమవుతున్నాయి.

**1 సత్** - నేను జగత్తుకు ఉనికినిస్తున్నాను

**2 చిత్** - నేను దేహేంద్రియ మనోబుద్ధులకు చైతన్యాన్నిస్తున్నాను

**3 ఆనందం** - నేను ప్రతిబింబ చైతన్యం ద్వారా ఆనందాన్ని పొందటానికి కారణాన్నవుతున్నాను

**సచ్చిదానన్దస్వరూపః అహమస్మి**

అందువల్ల నేను ధర్మ అర్థ కామాల మీద ఆధారపడటం లేదు. ఈ ఆధారపడకపోవటాన్ని అనపేక్ష అంటారు. ఆపేక్ష అంటే ఆధారపడటం. నాకు ఎవరూ ఫోన్లు చేయటం లేదు అని వాపోతూ ఉంటాము. ఎదుటివారు నన్ను ప్రేమించాలి, నా మీద అక్కర చూపాలి. ముగ్గురు పిల్లలు ప్రేమ చూపించినా, నాలుగోవాడు ప్రేమ చూపించకపోతే బాధ! ఏదో తక్కువైన బాధ. అలా ఏదో తక్కువైందన్న బాధ నుంచి ముక్తి పొందటమే మోక్షం.

**అనపేక్షః శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః।**
**సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్త స మే ప్రియః॥ గీత 12-16**
**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే॥ గీత 2-55**
**యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మాతృప్తశ్చ మానవః।**
**ఆత్మాన్యేవ చ సన్తుష్టః తస్య కార్యం న విద్యతే॥ గీత 3-17**

అందువల్ల ప్రయోజనం ఏమిటి? మోక్షం. శారీరకంగా ఆధారపడటం తప్పదు. కాని మానసికంగా ఆధారపడటం నుంచి విముక్తి పొందుతాము.

**3. సంబంధం:-** విషయం ఆత్మజ్ఞానం; ప్రయోజనం మోక్షం. ఈ రెండింటికీ మధ్య సంబంధం ఏమిటి? కర్మకాండ విషయంలో జ్ఞానం పొందినంత మాత్రాన ప్రయోజనం కలుగదు. మనం సాధన చేయాలి. కాని జ్ఞానకాండ విషయంలో అలా కాదు. కేవల జ్ఞానమే ప్రయోజనాన్ని ఇస్తుంది. ఎందుకంటే, 'నేను పూర్ణుడను, నేను జగత్కారణం బ్రహ్మను,' అన్న జ్ఞానం కలుగుతుంది. 'మీరు పేరు ప్రతిష్ఠలు,

ఆస్తిపాస్తుల వెంట ఎందుకు పరుగులు తీస్తారు? మీకేమీ అవసరం లేదు. మీరు పరిపూర్ణులు,' అంటుంది వేదం. అందుకని సంబంధం ఏమిటి?

**జ్ఞానమాత్రేన మోక్షః**

సంబంధం పరంపర సంబంధం కాదు. సాక్షాత్తు సంబంధం అంటే మధ్యలో కర్మ అవసరం లేదు. కర్మకాండలో జ్ఞానం–కర్మ–ప్రయోజనం. అదే జ్ఞానకాండకొస్తే జ్ఞానం–ప్రయోజనం. ఇదీ సంబంధం. సాక్షాత్ సంబంధం.

**4. అధికారి:–** జ్ఞానాన్ని పొందటానికి అర్హులెవరు?

**ఎ. కోరిక ఉండటం–** ఇక్కడ కూడా మొదటి అర్హత కోరిక. వేద పూర్వభాగానికీ, వేద అంత భాగానికీ కూడా మొదటి అర్హత కోరికే. కాని ఆ కోరికలో తేడా ఉంది. వేద పూర్వభాగంలో కోరిక దేనిమీద? ధర్మ–అర్థ–కామాల మీద. వేద అంతభాగంలో కోరిక దేనిమీద? మోక్షం మీద.

**బి. కోరిక లేకపోవటం–** ధర్మ–అర్థ–కామాల పరిమితులను తెలుసుకోగలగాలి. వాటి పరిమితులు తెలియకపోతే, వాటి మీద నాకు కోరిక ఉంటుంది. అందుకని ధర్మ–అర్థ–కామాల పరిమితులను తెలుసుకుని, కోరిక లేకుండా ఉండాలి.

ఒక పక్క కోరిక ఉండాలంటున్నారు, ఇంకోపక్క కోరిక లేకుండా ఉండాలంటున్నారు. ఏమిటీ వైపరీత్యం? ఇదేమీ వైపరీత్యం కాదు. మోక్షం మీద కోరిక ఉండాలి. ధర్మ–అర్థ–కామాల మీద కోరిక లేకుండా ఉండాలి. అదీ తేడా. ధర్మార్థకామాల మీద కూడా కోరిక ఉంటే జోడు గుర్రాల మీద స్వారీ చేస్తున్నట్టుంటుంది. అలా చేస్తే కిందపడతాము. అందుకని శ్రేయస్సు మీద ఇచ్ఛ, ప్రేయస్సు మీద వైరాగ్యం ఉండాలి. కోరికని కలిగి ఉండటం వివేకం; కోరిక లేకపోవటం వైరాగ్యం. మోక్షం మీద ఇచ్ఛను వివేకం అనీ, ధర్మార్థకామాల మీద వైరాగ్యాన్ని విముక్తి అనీ అంటారు.

వైరాగ్యాన్ని పెంచుకోవటమెలా? పరిమితులు తెలుసుకోవటం ద్వారా! ఏమిటా పరిమితులు? కర్మఫలాలన్నీ అశాశ్వతం. కర్మఫలాలకు మూడు దోషాలున్నాయి.

| | | |
|---|---|---|
| **దుఃఖ మిశ్రితత్వం** | - | దుఃఖంతో కలిసి ఉన్నాయి. |
| **అతృప్తికరత్వం** | - | పూర్తి తృప్తిని ఎన్నడూ ఇవ్వలేవు. ఎంత పొందినా ఇంకా కావాలనిపిస్తుంది. |
| **బన్ధకత్వం** | - | వాటి మీద ఆధారపడేలా చేస్తాయి. |

అందుకని ఈ పరిమితులను తెలుసుకుని, వాటి మీద కోరికను పోగొట్టుకోవాలి. మోక్షం మీద కోరికను పెంచుకోవాలి.

**సి. శమాది షట్కసమ్పత్తి–** వేద అంతభాగం జ్ఞానానికి చెందినదని, ఇది కర్మకి చెందినదని చూశాము. జ్ఞానం పొందటానికి ఒక క్రమపద్ధతిలో జ్ఞానసాధన చేయాలి. శాస్త్ర అధ్యయనం చేయాలి. అధ్యయనం చేసినదాన్ని విశ్లేషణ చేయాలి. విశ్లేషణ చేసిన దాన్ని జీర్ణించుకోవాలి. అందువల్ల ఒక క్రమపద్ధతిలో శ్రవణ, మనన, నిధిధ్యాసనలు చేయాలి. దానికి ఏకాగ్రత కావాలి, శ్రద్ధ కావాలి. మనో నిగ్రహం కావాలి. వీటన్నింటినీ కలిపి శమాది షట్కసంపత్తి అంటారు.

**డి. ముముక్షుత్వం–** మోక్షం మీద తీవ్రమైన ఇచ్ఛ ఉండాలి. వీటిని మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

| | |
|---|---|
| వివేకం | – ధర్మ అర్థ కామాలకూ, మోక్షానికీ మధ్య ఉన్న భేదాన్ని గ్రహించటం. |
| వైరాగ్యం | – ధర్మ అర్థ కామాల మీద వైరాగ్యం పెంచుకోవటం. |
| శమాది షట్కసమ్పత్తి | – శాస్త్రం మీద శ్రద్ధ, ఏకాగ్రత కలిగి ఉండటం. |
| ముముక్షుత్వం | – మోక్షం పొందాలన్న తీవ్రమైన ఇచ్ఛ కలిగి ఉండటం. |

ఈ నాలుగు లక్షణాలనూ కలిపి సాధన చతుష్టయ సంపత్తి అంటారు. వీటిని కలిగిన వ్యక్తిని సాధన చతుష్టయ సంపన్నుడంటారు.

ప్రతి ఒక్క హైందవుడి దృష్టినీ వేద పూర్వభాగం నుంచి, వేద అంతభాగానికి మరల్చటమే హైందవధర్మం. వేద పూర్వభాగం మీద మనకు సహజంగానే శ్రద్ధ ఉంది. ఎందుకు? ధర్మ–అర్థ–కామాల మీద కోరిక మనకు ఉండనే ఉంది. వేదపూర్వ అధికారి స్థాయి నుంచి వేద అంతభాగ అధికారి స్థాయికి ఎదగాలి. వేదపూర్వభాగంలో అనేక కర్మలు ఉంటాయి. అంటే అవి మనని బహిర్ముఖులను చేస్తాయి. కాని వేద అంతభాగం మనని అంతర్ముఖులని చేస్తుంది.

**అన్తర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా – లలితా సహస్రనామమ్**

వేద పూర్వభాగానికి అంకితమైన వాళ్ళను మతపరమైన ప్రాపంచిక చింతన ఉన్నవాళ్ళు అనవచ్చు. వాళ్ళకు మతం మీద శ్రద్ధ ఉంది.కాని వాళ్ళు మతానికి చెందిన ప్రార్థన, పూజ, జపం, తీర్థయాత్రలు అన్నీ ధర్మ అర్థ కామాలకు వినియోగిస్తారు. వేద అంతభాగానికి అంకితమైన వాళ్ళు కూడా మతాన్ని వాడుతారు కాని వాళ్ళ ప్రయోజనం వేరు. వాళ్ళు తాము ఆధ్యాత్మికంగా ఎదగటానికి వినియోగిస్తారు మతాన్ని. వాళ్ళను మతపరమైన ఆధ్యాత్మిక చింతన ఉన్నవాళ్ళు అనవచ్చు. ఇప్పుడు మతఃపరమైన ప్రాపంచిక చింతన ఉన్నవాళ్ళకు మతఃపరమైన ఆధ్యాత్మిక చింత కలిగేటట్టు చేయాలి.

అసలు మతఃపరమైన చింతనే లేనివాళ్ళ మాటేమిటి? వాళ్ళకి మార్పు రెండు దశల్లో జరగాలి. ముందు వాళ్ళలో మతఃపరమైన ప్రాపంచిక చింతన ఏర్పరచి, అక్కడితో ఆగిపోకుండా, దాన్నించి మతఃపరమైన ఆధ్యాత్మిక చింతన చేసేలా ఎదగటానికి తోడ్పడాలి. ఈ  మార్పు కలగటానికి కొంతమందికి కొన్ని రోజులు పడితే, కొంతమందికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు.

మతఃపరమైన ఆధ్యాత్మిక చింతన కలిగేలా చేయటమెలా? దానికి ఎన్నో మార్గాలున్నాయి కాని, శాస్త్రం నాలుగు మార్గాలను నిర్దేశించింది. అవి–

**1. భజగోవిన్దమ్ –** శంకరాచార్య రచించిన భజగోవిందాన్ని పదే పదే క్రమం తప్పకుండా చదవండి. పారాయణం చేయటం కాదు. దాని అర్థం లేదా భాష్యంతో పాటు చదవండి. ఎందుకంటే మనలో అంతర్గత మార్పు రావటం కోసం రాసారు శంకరాచార్యులు.

**2. గీత 16వ అధ్యాయం–** పదే పదే, క్రమం తప్పకుండా గీత 16వ అధ్యాయాన్ని చదవండి. దైవాసుర సంపద్విభాగ యోగం అని దీనికి పేరు.ఈ అధ్యాయాన్ని మనలో అంతర్గత మార్పు తీసుకురావటానికి సమకూర్చాడు కృష్ణభగవానుడు.

**3. గీత 17వ అధ్యాయం–** పదే పదే, క్రమం తప్పకుండా, గీత 17వ అధ్యాయాన్ని చదవండి. శ్రద్ధాత్రయ విభాగయోగం అని దీనికి పేరు.మనకున్న శ్రద్ధని మార్చాలి. ప్రస్తుతం మనకు దేనిమీద శ్రద్ధ ఉంది?ధనమే దైవం. అంటే మనలో శ్రద్ధకు లోటు లేదు. కాని దేని మీద శ్రద్ధ ఉండాలి? అంతర్గత మార్పు రావాలంటే శ్రద్ధ ఉండాలి. ఈ మార్పు గురించి కృష్ణభగవానుడు 17వ అధ్యాయంలో ప్రస్తావించాడు. అందుకని 17వ అధ్యాయం పదే పదే, క్రమం తప్పకుండా చదవాలి. చదవాలి అంటే గుడ్డిగా పారాయణం చేసేసి, అల్పాహారం గురించి ఆలోచించటం కాదు.

అది కాదు ఇక్కడ చెప్పేది.ఆ అధ్యాయం గురించిన వివరణ చదవండి.

**4. అనుష్ఠానం–** పైన ఉదహరించిన మూడూ మీరు పాటించటానికి లేదా సాధన చేయటానికి కొన్ని సూచనలు ఇస్తాయి. వాటిని కేవలం చదివితేనో, అర్థం చేసుకుంటేనో చాలదు. వాటిని సాధన చేసి, అమలులో పెట్టగలగాలి.మనం నేర్చుకున్నదానికీ, మనం ఉన్న తీరుకీ సమన్వయం చూసుకోవాలి. అధ్యయనం, ఆచరణం– ఈ రెండింటికీ మన దైనందిన జీవితంలో, మన రోజువారీ దృక్పథంలో పొత్తు కుదరాలి. వాటిమధ్య ఉన్న అగాధం తగ్గుతూ రావాలి. ఎంత త్వరగా మారుతున్నామన్నది ముఖ్యం కాదు. ఎందుకంటే ఆ మార్పు స్థాయి మనిషి మనిషికీ మారుతుంది. అందుకే తోటివారిలో మార్పు ఎంత ఉంది చూడకండి; వాళ్ళకన్నా మీరే స్థాయిలో ఉన్నారో అసలే చూడకండి; కేవలం మారటానికి మనస్ఫూర్తిగా ప్రయత్నించండి. అంతేచాలు. దీనిని అనుష్ఠానం అంటారు. అందువల్ల ఈ మూడు అధ్యాయాల స్వాధ్యయనం, అనుష్ఠానం మీలో క్రమేపీ మార్పు తెచ్చి మిమ్మల్ని మతఃపరమైన ప్రాపంచిక వ్యక్తిస్థాయి నుంచి మతఃపరమైన ఆధ్యాత్మిక వ్యక్తి స్థాయికి తీసుకువెళ్తుంది.

ఈ మార్పు వస్తే ఏమవుతుంది? శరీరంలో మెరుపు వస్తుందా? దాన్ని బ్రహ్మతేజస్సు అంటారు. నిజమే, బ్రహ్మతేజస్సు కూడా వస్తుంది. కాని దాని కోసం ఎదురుచూడకండి. మన లక్ష్యం అది కాదు. మరి అంతర్గత మార్పు జరిగినట్లు ఎలా తెలుస్తుంది?

**1. కోరిక–** **తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి**
**యజ్ఞేన దానేన తపసా అనాసకేన – బృహదారణ్యకమ్**

అంతర్గత మార్పు కలిగిన కొద్దీ, మీలో ఆత్మజ్ఞానం మీద శ్రద్ధ అంతకంతకూ పెరుగుతుంది. శాస్త్రాల మీద శ్రద్ధ ఎక్కువవుతుంది. కృష్ణభగవానుడు దీనిని జిజ్ఞాసు భక్తి అన్నాడు. బృహదారణ్యకం దీన్ని వివిధిషా అంది. రెండింటి అర్థం ఒకటే. శాస్త్రాధ్యయనం మీద శ్రద్ధ. ఎటువంటి అధ్యయనం? క్రమం తప్పకుండా, ఒక క్రమపద్ధతిలో, కొన్నేళ్ళపాటు ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేయటం.

ఆధ్యాత్మిక గ్రంథాలు ఏవి? వీటిలో మూడు ముఖ్యమైనవి. వీటిని ప్రస్థాన త్రయం అంటారు. త్రయం అంటే మూడు.

**ఎ. భగవద్గీత–** 16,17వ అధ్యాయాలు ఆత్మజ్ఞానం గురించి మాట్లాడవు.

జాగ్రత్తగా చూడండి. 16,17 అధ్యాయాలు దేనికి సంబంధించినవి? అంతర్గత మార్పుకు చెందినవి మాత్రమే. మనం తక్కిన అధ్యాయాలు చదవాలి. ఉదాహరణకు– 13,14,15,2,7,9. వాటిలో 'నీవెవరు? సత్యపరంగా'; 'దేవుడంటే ఎవరు? 'సత్యపరంగా'; జగత్తంటే ఏమిటి? సత్యపరంగా' అన్న విషయాల విశ్లేషణ ఉంటుంది. జీవ జగత్ ఈశ్వర స్వరూప జ్ఞానమే ఆధ్యాత్మిక జ్ఞానం. భగవద్గీత ఈ అంశాన్ని బోధిస్తుంది. ఇది ఇంటర్మీడియట్ స్థాయి లాంటిది.

**బి. ఉపనిషత్తులు–** ఉపనిషత్తుల అధ్యయనం డిగ్రీ స్థాయి లాంటిది.

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనన్దనః**

గీతను అన్ని ఉపనిషత్తుల సారంగా అభివర్ణిస్తారు. ఉపనిషత్తు నుంచి గీత ఆత్మజ్ఞానం బోధిస్తుంది కాబట్టి గీతాధ్యయనం చేసాక ఉపనిషత్తులను అధ్యయనం చేయాలి.

**సి. బ్రహ్మసూత్రాలు–** బ్రహ్మసూత్రాల అధ్యయనం పీజీ స్థాయి లాంటిది. డిగ్రీ స్థాయిలోనే ఆపినా ఆపవచ్చు.

ఈ మూడింటినీ కలిపి ప్రస్థానత్రయం అంటారు. వీటిని డిగ్రీలు తెచ్చుకోవటానికి చేసే తక్కిన కోర్సులలా అధ్యయనం చేయకూడదు. వీటిని ఆత్మజ్ఞానం పొంది, ఆత్మజ్ఞానం నిలుపుకుని, ఆత్మజ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి లోతుగా అధ్యయనం చేయాలి. అప్పుడే మోక్షం కలుగుతుంది.

ఈ ప్రస్థాన త్రయ అధ్యయనం మీద శ్రద్ధ ఎప్పుడు ఏర్పడుతుంది? అంతర్గత మార్పు కలిగితేనే. అంటే శ్రద్ధ ఏర్పడిందంటే, మీలో మార్పు వచ్చినట్టే. అది ఒక సూచన. మీరు ఉపనిషత్తుల బోధలకు వెళుతున్నారంటేనే, మీలో కొంత మేరకన్నా మార్పు వచ్చినట్లు లెక్క. మార్పు రాకపోతే ఈ బోధలకు వెళ్ళినా, ఎక్కువ రోజులు కొనసాగలేరు. ఒక్కోసారి మీ స్నేహితులను మీతోపాటు తీసుకువెళ్తారు. వాళ్ళకు వెంటనే వైరాగ్యం కలుగుతుంది. దేనిమీద? ఈ ఉపనిషత్తు బోధల మీద! ఏముంది ఇందులో అనేస్తారు. అందుకే అంతర్గత మార్పు రానిదే మీరు బోధలకు వెళ్ళలేరు. వెళ్ళినా క్రమం తప్పకుండా వెళ్ళలేరు. అందుకని కోరిక ఒక సూచన. అధ్యయనం మీద కోరిక.

**2. అవకాశం–** మీలో అంతర్గత మార్పు కలిగిందనటానికి రెండో సూచన అవకాశం. అదీ ఈశ్వరానుగ్రహం వల్ల కలుగుతుంది.

**దుర్లభం త్రయమేవైతత్ దేవానుగ్రహహేతుకమ్ ।**

**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః ॥**

**వివేక చూడామణి**

కొంత మేరకు అంతర్గత మార్పు గనుక కలిగితే శాస్త్ర అధ్యయనం మీద కోరిక, దానికి తగ్గ అవకాశం– రెండూ వస్తాయి. మార్పు పూర్తిగా కలుగనక్కరలేదు. కొంతమేరకు కలిగితే చాలు. అవకాశం లేకుండా కోరిక ఉంటే ప్రయోజనం లేదు. అవకాశం ఉండి కోరిక లేకపోయినా లాభం లేదు. రెండూ ఉండాలి.

**ఈశ్వరానుగ్రహాత్ ఏవ పుంసాం అద్వైతవాసనా॥**

కోరిక, అవకాశం రెండూ ఉన్నాయి. ఇప్పుడేం చేయాలి?

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**

**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినస్తత్వదర్శినః॥ గీత 4-34**

సమర్థవంతమైన గురువు దగ్గరకి వెళ్ళి శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. గురువు చెప్పింది కాదు. గురువు తన స్వంత సిద్ధాంతం బోధిస్తే, ఎన్నడూ వెళ్ళవద్దు! శాస్త్రం చెప్పిన దాన్ని గురువు బోధించాలి. అందుకే గురువును శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అన్నారు. శ్రోత్రియ అంటే శాస్త్రంలో ఉన్న జ్ఞానాన్ని జీర్ణించుకున్న వ్యక్తి అని అర్థం. ఎలా? తన గురువు నుంచి నేర్చుకున్న వ్యక్తి మళ్ళీ తన శిష్యులకు బోధించాలి.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన।**

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**

**ముణ్డక 1-2-12**

సమర్థవంతమైన గురువు, శ్రద్ధ ఉన్న శిష్యుడు కలిస్తే, జ్ఞానప్రవాహానికి దారి ఏర్పడినట్లే. ఈ జ్ఞానాన్ని ఆత్మజ్ఞానం అంటారు. అలా ప్రతి ఉపనిషత్తులోనూ ఒక శిష్యుడిని చూస్తాము. ఎటువంటి శిష్యుడు? అంతర్గత మార్పు చెందిన శిష్యుడు. అతను సమర్థవంతమైన గురువు దగ్గరకి వెళితే, గురుశిష్య సంవాద రూపంలో ఆత్మజ్ఞాన బోధ జరుగుతుంది. ఉదాహరణకు ముండకోపనిషత్తులో శౌనకుడు శిష్యుడు, అంగిరసుడు ఆచార్యుడు.

కేనోపనిషత్తు కూడా గురుశిష్యుల సంవాద రూపంలో ఉంది కాని ఇందులో వాళ్ళ పేర్ల ప్రస్తావన లేదు. కేనోపనిషత్తు సామవేదానికి చెందినది. నాలుగు వేదాల

సారంగా ముఖ్యంగా 10 లేదా కనీసం 6 ఉపనిషత్తులను అధ్యయనం చేయాలి. ఏ వేదానికి చెందిన ఏ ఉపనిషత్తుని తీసుకున్నా, అన్నిటిలోనూ, బోధించే జ్ఞానమొక్కటే. అందులో భేదం లేదు. 'ఉపనిషత్తులు ఒకదాన్నొకటి వ్యతిరేకించవు. వాటి సారం ఒకటే,' అన్న అంశాన్ని నిరూపిస్తూ బ్రహ్మసూత్రాల్లో ఒక అధికరణం ఉంది. ఛాందోగ్యోపనిషత్తు కూడా సామవేదానికి చెందినదే.

దీనిని కేనోపనిషత్తు అని ఎందుకు అన్నారు? 'కేన' అన్న పదంతో మొదలవుతుంది కాబట్టి. కాని అన్ని ఉపనిషత్తులకూ అదే సూత్రం పాటించటానికి వీలులేదు. ముండక ఉపనిషత్తు 'ముండక' పదంతో మొదలవలేదు. ముండక అంటే ప్రాథమికమైనది అని ఒక అర్థం. ముండక అంటే తల అని కూడా అర్థం. ఉపనిషత్తుల బోధ సాధారణంగా ముండకోపనిషత్తుతో మొదలుపెడతారు ఆచార్యులు. స్వామీ దయానందసరస్వతి కూడా అలాగే చెప్పేవారు.

కొంత మంది ఈశావాస్యోపనిషత్తుతో మొదలుపెడతారు కాని అది మంచి పద్ధతి కాదు. అది ముందు వింటే తక్కిన ఉపనిషత్తుల మీద వైరాగ్యం కలుగుతుంది. ఎందుకంటే ఈశావాస్యోపనిషత్తులో ప్రతి పదమూ ప్రత్యేకమైనది, విశిష్టమైనది. నిఘంటువు అర్థానికి సరిపోలనిది. కేనోపనిషత్తు, కఠోపనిషత్తుతో కూడా మొదలు పెట్టవచ్చు కాని, ముండకోపనిషత్తు ముందు నేర్చుకుంటే మంచిది.

ముండకోపనిషత్తు కన్నా కేనోపనిషత్తు చిన్నది. ముండకోపనిషత్తులో 65 మంత్రాలుంటే, కేనోపనిషత్తులో 35 మంత్రాలే ఉన్నాయి. ఈ 35 మంత్రాలూ నాలుగు అధ్యాయాల్లో చొప్పించబడ్డాయి. చిన్న ఉపనిషత్తే కదా అని తేలిగ్గా తీసుకోకండి. ఇది చాలా ముఖ్యమైన, లోతైన ఉపనిషత్తు. దీన్ని చుర్రుమనిపించే చిన్న సీమమిరపకాయతో పోలుస్తారు.

## గురుశిష్య సంవాదం

సాధారణంగా ఉపనిషత్తులు గురుశిష్య సంవాదం రూపంలో ఉంటాయి. ప్రశ్నోపనిషత్తులో ఆరుగురు శిష్యులు ఒకరి తర్వాత ఒకరు పిప్పలాద ఋషిని ప్రశ్నలు అడుగుతారు. ఆయన వారికి జవాబులు చెపుతారు. వాదం అంటే కోపంగా వాదించుకోవటం. సంవాదం అంటే గౌరవపూర్వకమైన చర్చ. అందువల్ల సంవాదంలో వేడి పుట్టదు, జ్ఞానం పుడుతుంది. ఇలా సంవాద రూపంలోనే ఎందుకు ఉంటుంది? దానికి అనేక కారణాలు చెప్పవచ్చు.

**1. సంప్రదాయ పద్ధతి–** బ్రహ్మ విద్య గురువు నుంచే నేర్చుకోవాలి. స్వతంత్రంగా నేర్చుకోకూడదు. అర్థం కాకపోయినా ఫర్వాలేదు. కొంత సమయం, శ్రమ వృథా అవుతుంది. అంతే. దాన్ని తప్పుగా అర్థం చేసుకుంటేనే ప్రమాదం. అది కాక, దాని తర్వాత గురువు దగ్గరకు వెళితే, గురువు బాధ్యత రెట్టింపు అవుతుంది. శిష్యుని మనసులో ఉన్న అపోహలు, తప్పు జ్ఞానం తొలగించి, ఆత్మ గురించిన నిశ్చయజ్ఞానం నిలబెట్టాలి. నారదుల వారికి తెలియని విద్య అంటూ లేదు. అయినా ఆత్మ విద్య నేర్చుకోవటానికి ఆయన సనత్కుమారుని దగ్గరకు వెళ్ళారు.

**2. సుఖార్థ ప్రతిబోధనార్థం–** సంభాషణ రూపంలో ఉంటే విషయం తేలిగ్గా అర్థమవుతుంది. విజ్ఞానశాస్త్రంలో మనకు వచ్చే సందేహాలు నివృత్తి అవవు. కాని వేదాంత శాస్త్రంలో అనంతం బ్రహ్మ గురించి శాస్త్రం చాలా స్పష్టంగా చెపుతుంది. శాస్త్రమే అనేక ప్రశ్నలు వేసి, జవాబులు ఇస్తుంది. అందువల్ల మనకు వచ్చే సందేహాలు, రాని సందేహాలు కూడా శాస్త్రం గురుశిష్యుల సంవాదం ద్వారా తీరుస్తుంది.

**3. గురుశిష్య పరంపర–** వేదాలను శృతి అంటారు. ఋషులు విని తమ తర్వాత తరంలోని శిష్యులకు అందజేశారు. అలా వేదాంత బోధ గురుశిష్యుల పరంపరగా వస్తున్నది. సాంప్రదాయ తాళం చెవితో తెరుస్తారు వేదాంతాన్ని. అందువల్లనే ఏ గురువు బోధ చేసినా, మా గురువు ఇలా చెప్పారు అని తమ గురువు గురించి చెపుతారు. పరమార్థానంద స్వామీజీ కూడా తమ గురువైన స్వామి దయానంద సరస్వతీజీ (పూజ్యస్వామీజీ అంటారు) గురించి చెప్పకుండా ఉండరు. కేనోపనిషత్తులో కూడా గురువు ఈ విద్య చెప్పటం చాలా కష్టం కాని, మా గురువులు మాకు చెప్పిన పద్ధతిలో చెపుతాను అంటారు.

**ఇతి శుశ్రుమ పూర్వేషాం యే నస్తద్వ్యాచచక్షిరే కేన 1-4**

అంతేకాదు, ఉపనిషత్తుల్లో కొన్ని పదాలకు వాచ్యార్థం ఉంటే, కొన్ని పదాలకు లక్ష్యార్థం ఉంటుంది. ఏ సందర్భంలో ఏది తీసుకోవాలో గురువే చెప్పాలి. ఈశావాస్యోపనిషత్తు స్వంతంగా అర్థం చేసుకోవటం కష్టం. సందర్భాన్ని బట్టి శంకరుల వారి భాష్యం పుణ్యమాని, మన గురువులు స్వామి పరమార్థానంద వారి పుణ్యమాని, వాటిని నేడు మనం అధ్యయనం చేయగలుగుతున్నాము.

కేనోపనిషత్తులో పదాల గారడి చూస్తారు

| | |
|---|---|
| శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః | 1-2 |
| అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి | 1-4 |
| నాహం మన్యే సువేదేతి నోన వేదేతి వేద చ | 2-1 |

ఇవన్నీ గురువే విడమర్చి చెప్పాలి.

# కేనోపనిషత్తు

## శాన్తిపాఠము

ఒక్కొక్క వేదానికీ ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. ఉదాహరణకు ముండకోపనిషత్తు అధర్వణ వేదానికి చెందినది. దాని శాంతిపాఠం 'భద్రం కర్ణేభి.' కేనోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు సామవేదానికి చెందినవని చూశాము. వీటి శాంతి పాఠం 'ఆప్యాయంతు మమాంగాని.' యజుర్వేదానికి రెండు శాఖలున్నాయి. కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం. అలా చూస్తే ఐదు వేదాలకూ ఐదు శాంతిపాఠాలున్నాయి. ఈ శాంతి పాఠాలు ఎంతో అర్థంతో నిండి నిభిడీకృతమై ఉంటాయి. వీటిని మన నిత్యపూజలతో కలుపుకోవచ్చు.

**ఓం ఆప్యాయన్తు మమాఙ్గాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథోబలమిన్ద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మౌపనిషదం మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు ॥**

**ఓం శాన్తిశ్శాన్తిశ్శాన్తిః**

నా అంగాలు ఎదగాలి అని అసలు అర్థం. అది యువతను దృష్టిలో పెట్టుకుని ఏర్పరచిన ప్రార్థన. ఇప్పుడు మనం దాన్ని కొంచెం మార్చుకుని నా అంగాలు కుదురుగా ఉండు గాక అని తీసుకోవాలి. ఏమిటా అంగాలు?

**వాక్–** కొన్ని అంగాలు పేర్కొనబడ్డాయి. అందులో వాక్కు ఒకటి. వాక్కు ఎందుకు? శ్రవణం చేసే సమయంలో గురువుకు వాక్ శక్తి బాగుండాలి; మననం చేసే సమయంలో శిష్యునికి వాక్ శక్తి బాగుండాలి. మననంలో శిష్యుడు ఆలోచించి, తనకు మనసులో చెలరేగే సందేహాలను అడగాలి. కాని, ముందు కొన్నేళ్ళపాటు శ్రవణం చేయాలి. మొట్టమొదటి క్లాసులోనే ప్రశ్నలు అడగకూడదు! మొదట్లో అంటే కొన్ని సంవత్సరాల పాటు లేదా కొన్ని ఉపనిషత్తులు నేర్చుకునేవరకూ ప్రశ్నలు అడగకూడదు! ఒక పుస్తకం పెట్టుకుని, మీకు వచ్చే సందేహాలను అందులో రాసుకుంటూ ఉండాలి. మీ అధ్యయనంలో కొంత ముందుకు సాగుతున్నకొద్దీ, సాధారణంగా మీ సందేహాలు వాటంతట అవే విడివడతాయి. ఒకవేళ తీరకపోతే, కొన్ని సంవత్సరాల తర్వాత గురువును కలిసి సందేహాలు తీర్చుకోవచ్చు. తన

సందేహాల్ని స్పష్టంగా వెలిబుచ్చగలగాలి శిష్యుడు. గురువు 15 నిముషాల పాటు అంతా వివరించాక, ఇది కాదు నా ప్రశ్న అని శిష్యుడు అనేటట్లు ఉండకూడదు. అందుకని గురువుచేసే బోధ ఎంత స్పష్టంగా ఉండాలో, శిష్యుడు కూడా అంత స్పష్టంగా అడగగలగాలి. అందుకని ఇద్దరికీ వాక్ శక్తి ఉండాలి.

**ప్రాణః–** ప్రాణం బాగుంటేనే మనం ఏదైనా చేయగలం.

**చక్షుశ్రోత్రమ్–** ఉపనిషత్తును చదవటానికి కళ్ళు బాగుండాలి. గురువు చెప్పింది వినటానికి చెవులు బాగుండాలి.

**ఇన్ద్రియాణి–**తక్కిన అన్ని ఇంద్రియాలు బాగుండాలి.

**బలం–** శక్తి. ఈ అంగాలన్నీ శక్తివంతంగా ఉండాలి.

**సర్వం బ్రహ్మ–** వేదాంత సారమంతా శాంతి పాఠంలోనే వచ్చేసింది. రెండే పదాలున్న చిన్న వాక్యంలో. అనంతశాస్త్రమైన ప్రస్థానత్రయంలో ఉన్న సారం రెండే రెండు పదాల్లో వచ్చింది. ఏమిటవి? 'సర్వం బ్రహ్మ'

**సర్వం బ్రహ్మమయం రే రే – సదాశివ బ్రహ్మేన్ద్ర**

ఉన్నదంతా బ్రహ్మమే; బ్రహ్మకానిది, రెండోది లేదు.

**బ్రహ్మైవేదమమృతమ్**

ఉన్నదొకటే అద్వైతం బ్రహ్మ! మరి మనకు కనిపించే నానాత్వం ఏమిటి? నానాత్వం అంటే అనేక నామరూపాలు తప్ప వేరే ఏమీ కాదు! వాటికి ప్రత్యేక ఉనికి లేదు. అవి భిన్ననామరూపాలు మాత్రమే. వస్తువు ఒక్కటే. అదే బ్రహ్మ. ఈ సారాంశం అంతా 'సర్వం బ్రహ్మ' అన్న మాటల్లో వచ్చేసింది.

మరి 'ఆ బ్రహ్మను తెలుసుకోవటమెలా?' మన ఇంద్రియాలు భిన్నత్వం చూడటానికే ఏర్పడ్డాయి. ఇంద్రియాలే కాదు, తర్కం, సైన్సు కూడా భిన్నత్వమే చూపిస్తాయి. సైన్సు ఏం చేస్తుంది?నామరూపం గురించి విషయ సేకరణ చేస్తుంది. అందువల్ల సైన్సు కనుక్కునేది ఇంకో నామరూపమే. నామరూపాలనే మిథ్యను చూసే ఇంద్రియాలు ఇచ్చే సమాచారం నుంచి సైన్సు నిర్ణయించిన అంశం కూడా మిథ్యే అవుతుంది. అందుకే సైన్సు అందజేసే సత్యం మారుతూనే ఉంటుంది. కొన్నాళ్ళు అణువే అత్యంత చిన్నదన్నారు. దాని తర్వాత అణువుకన్నా పరమాణువు లున్నాయన్నారు.

అందువల్ల నామరూపాలకతీతమైన బ్రహ్మను తెలుసుకోవాలంటే

ఉపనిషత్తులకే రావాలి. ఉపనిషత్తుల ద్వారా లేదా ఉపనిషత్తు మీద ఆధారపడ్డ శాస్త్రం బ్రహ్మను తెలుసుకోవచ్చు. గీత ఉపనిషత్తు కాదు; ఉపనిషత్తు మీద ఆధారపడ్డ శాస్త్రం. అలాగే బ్రహ్మసూత్రం కూడా ఉపనిషత్తు కాదు. ఉపనిషత్తు మీద ఆధారపడ్డ శాస్త్రం. అందుకని బ్రహ్మ అంటే ఏమిటి. ఆ బ్రహ్మను తెలుసుకోవటమెలా అన్న అంశాన్ని ఉపనిషత్తు మాత్రమే చెప్పగలదు.

**ఔపనిషదమ్ –** ఉపనిషత్తు ద్వారానే బ్రహ్మను తెలుసుకోగలం కాబట్టి, బ్రహ్మకొక పేరుంది. చాలా ముఖ్యమైన పేరు; శంకరాచార్య తరచు ఉపయోగించే పేరు. బృహదారణ్యకోపనిషత్తు, 3వ అధ్యాయం, 9వ బ్రాహ్మణం అయిన శాకల్య బ్రాహ్మణంలో ఈ పేరు వస్తుంది. అదే ఇక్కడ శాంతి పాఠంలో కూడా వచ్చింది. ఏమిటది? ఔపనిషదం బ్రహ్మ. ఔపనిషదం అంటే ఏమిటి? ఉపనిషత్తు ద్వారానే తెలుసుకోగలిగినది. బృహదారణ్యకంలో 'ఔపనిషద పురుషః' అంటే ఇక్కడ 'ఔపనిషదం బ్రహ్మ' అందువల్ల ఈ ప్రార్థన అర్థం, ఉపనిషత్తును అధ్యయనం చేయటం ద్వారా, నామము కాని, రూపము కాని లేని, నామరూపాలకతీతమైన అద్వైత ఆత్మను నేను గ్రహించు గాక. మాండూక్యోపనిషత్తులో దీన్ని అనామకం అరూపకం బ్రహ్మ అంటారు. ఉపనిషత్తు ద్వారా తెలుసుకోగలిగిన సర్వం బ్రహ్మను నేను తెలుసుకోగోరుతున్నాను అని ప్రార్థిస్తాడు శిష్యుడు.

'సర్వం బ్రహ్మ' అన్న జ్ఞానాన్ని పొందటమెలా? మనకున్న ప్రమాణాల వల్ల ఈ జ్ఞానాన్ని పొందలేము. కన్ను చూడలేదు. దానికి ఇంకో ప్రమాణం కావాలి; దాన్నే శాస్త్ర ప్రమాణం అంటారు. అందువల్ల బ్రహ్మను 'ఔపనిషదం బ్రహ్మ' అన్నారు. టెలీస్కోప్, మైక్రోస్కోప్‌ల్లాగా ఉపనిషదో– స్కోప్ ద్వారా చూస్తే ఉన్నదంతా బ్రహ్మమే.

బ్రహ్మ తక్కిన ప్రమాణాలకు అందదు కాబట్టి, అసలు బ్రహ్మ అనేది లేనేలేదంటారు చాలామంది. ఎందుకు? బ్రహ్మను ఇంద్రియాల వల్ల తెలుసుకోలేము. సైన్సు వల్ల తెలుసుకోలేము. ఆధునిక తరానికి సైన్సే ముఖ్య ప్రమాణం.ఎప్పుడైతే సైన్సు మీద ఆధారపడ్డారో, సైన్సు నిరూపించినదాన్నే అంగీకరించగలరు. సైన్సు కందని దాన్ని స్వీకరించరు. బ్రహ్మ లేదా పరమాత్మను ఆధునిక విజ్ఞానశాస్త్రం ఎన్నటికీ నిరూపించలేదు. హేతువాదం మీద ఆధారపడే హేతువాదులకు హేతువాదానికున్న పరిమితులు తెలియవు. అందువల్ల హేతువాదులకు దేవుడొక మూఢ నమ్మకం! ఆలయాలు, మతం, మతఃపరమైన కార్యకలాపాలు మూఢనమ్మకం!

బ్రహ్మ ఒక మూఢనమ్మకం! విచారకరమైన విషయం ఏమిటంటే ఉపనిషత్తు ఒక మూఢ నమ్మకం! స్వామీజీలు ఆ మూఢనమ్మకాలను పెంచేవాళ్ళు, వాళ్ళ భక్తులు వాళ్ళ మోసాలకు గురి అయ్యే వాళ్ళు. ఇదీ హేతువాదం ఫలితం.

వేదాంతాన్ని లోతుగా అధ్యయనం చేస్తే హేతువాదం పరిమితులు తెలుస్తాయి. మీకు ఒక్కటే వాదన కావాలంటే, ఒక్కటే ఉంది. 'మనకున్న ప్రమాణాలన్నీ బాహ్య ప్రపంచాన్ని అధ్యయనం చేయటానికే ఏర్పడ్డాయి కాని పరిశోధించే నేను పరిశోధించబడే వస్తువుగా ఎన్నడూ దొరకను. అందుకని, బాహ్య వస్తువులను విశ్లేషించే సైన్సు, 'విశ్లేషకుడిని' ఎలా విశ్లేషించగలదు?' అందుకని బృహదారణ్యకం ఒక శక్తివంతమైన మాట అంటుంది, 'విశ్లేషించే విశ్లేషకుడిని ఎన్నడూ విశ్లేషించలేము.'

బాహ్య ప్రపంచాన్నంతా చూడగలిగే కన్నులు తమను తాము చూసుకోలేవు. తమను తాము చూసుకోవాలంటే అద్దం కావాలి. తమను తాము చూసుకోలేని కళ్ళు, వాటి వెనకున్న చైతన్యమైన 'నన్ను' ఎలా చూడగలవు? చూసే కళ్ళు, వాటి వెనుకనుంచి 'చూస్తున్న' నన్ను చూడలేవు. చూసే వ్యక్తిని బాహ్యమైన ప్రమాణాలతో చూడలేము.

**విజ్ఞాతారమ్ అరే కేన విజానీయాతి – బృహదారణ్యకం**

తెలుసుకునే వ్యక్తిని ఏ ప్రమాణంతో తెలుసుకోగలవు? అందువల్ల చైతన్యం అంతుచిక్కని విషయంగా మిగిలిపోయింది ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి. కాని ఉపనిషత్తుకి వస్తే, సత్యం అగోచరం కాదు. బ్రహ్మ గురించి తెలుసుకోవచ్చు అని తెలుస్తుంది.

**మాఽహం బ్రహ్మ నిరాకుర్యామ్–** శిష్యుడు చేసే ప్రార్థన ఏమిటి? ఓ దేవా, నేను బ్రహ్మను నిరాకరించకుండు గాక. నేను నాస్తికునిగా మారకుండు గాక. పూర్వజన్మలో పెద్ద పాపం చేస్తే నాస్తికుడిగా పుడతాడంటారు. పాపాలన్నింటిలోకి దాన్ని పెద్దపాపంగా పరిగణిస్తారు.

**తవ తత్త్వం న జానామి కీదృశోఽసి మహేశ్వర ।**
**యాదృశోఽసి మహాదేవ తదృశాయ నమో నమః ॥**

ఎంత అద్భుతమైన శ్లోకం। 'ఓ దేవా నువ్వు ఎవరో నాకు తెలియదు. నువ్వు స్త్రీవో, పురుషుడివో నాకు తెలియదు. ఎక్కడుంటావో తెలియదు.

నీ తత్త్వమేమిటో తెలియదు. నీ తత్వం నాకు తెలియకపోయినా ఫర్వాలేదు. నాకు నిన్ను నిరాకరించటం ఇష్టం లేదు. నీకు నా నమస్కారాలు. అనువైన సమయం ఆసన్నమైనప్పుడు నీ తత్వం తెలుసుకునేలా చేయి.' ఇదీ దీని సారాంశం.

అదే అర్థం ఇక్కడ కూడా. నేను బ్రహ్మను నిరాకరించకుండు గాక. ప్రపంచంలో ఏం ఉంది అని అడిగితే, నాకు తెలిసినదే ఉంది అనటం తెలివితో కూడిన అహంకారం అంటుంది శాస్త్రం. స్వర్గం, నరకం నాకు కనపడవు కాబట్టి, అవి లేవని కొట్టిపారేయకూడదు. 'వాటి ఉనికిని నాకు తెలియజేసే సరియైన ప్రమాణం నా దగ్గర లేదు,' అనుకోవాలి. నాకు తెలిసినది తక్కువ అన్న అణకువ లేకపోతే వేదాంతం నేర్చుకోలేము. అందుకని నా చిన్ని బుర్రకు అందనంత మాత్రాన బ్రహ్మలేదని నేను అనకూడదు.

**మా మా బ్రహ్మ నిరాకరోత్–** నేను బ్రహ్మను నిరాకరించకుండా ఉంటే చాలదు. బ్రహ్మ కూడా నన్ను నిరాకరించకుండు గాక. మొదటి 'మా' నిరాకరించకుండు గాక లోని గాకని సూచిస్తే, రెండో 'మా' నన్ను అన్న సర్వనామాన్ని సూచిస్తుంది. అందువల్ల అవి రెండు భిన్న పదాలు. అంతేకాని మనకు తెలిసిన 'మామ' పదం కాదు. 'నాకు అణకువ ఉంది. నేను భగవంతుని భక్తుడను. కాబట్టి, నేను భగవంతుడిని గుర్తించేవరకూ, నాకు భగవంతుని కృప ఉండు గాక.'

దైవభక్తి విషయానికి వస్తే హిందూ మతంలో రెండు స్థాయిబేధాలున్నాయి. వేద పూర్వభాగంలో పరమాత్మను కొలుస్తాము. అక్కడ పరమాత్మ గురించిన జ్ఞానంతో కాదు; పరమాత్మ ఉన్నాడన్న భక్తిశ్రద్ధలతో కొలుస్తాము. అది మొదటిస్థాయి. పరమాత్మ మీద శ్రద్ధతో పరమాత్మను కొలిస్తే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పడి బుద్ధి పదునుగా అవుతుంది. అప్పుడు ఆ దైవకృప వల్ల రెండవ స్థాయికి వెళతాము. రెండవ స్థాయిలో వేద అంతభాగాన్ని (ఉపనిషత్తుని) అధ్యయనం చేయటం వల్ల, ఆ పరమాత్మ కృపవల్ల పరమాత్మ మీద శ్రద్ధ పరమాత్మ గురించిన జ్ఞానంగా మారుతుంది. అందువల్ల మనం ముందే జ్ఞానంతో మొదలుపెట్టము. శ్రద్ధతో మొదలుపెడతాము. అందుకని శిష్యుడు, 'ఓ దేవా, నాకు నీ మీద శ్రద్ధ ఉంది. నా శ్రద్ధ, జ్ఞానంగా మారేలా నీ అనుగ్రహం ప్రసాదించు,'అంటున్నాడు.

ఎప్పుడైతే ఈశ్వరజ్ఞానం కలుగుతుందో, అప్పుడే ఈశ్వరుడు ఉన్నాడో లేదో అన్న సందేహం మాయమవుతుంది. ఎందుకు? పరిపూర్ణ ఈశ్వరజ్ఞానం ఏమిటి? ఆ ఈశ్వర 'అహం అస్మి.' ఆ ఈశ్వరుడిని నేనే. కాకపోతే ఆ 'నేను'

అన్నది ఎవరో సరిగా అర్థం చేసుకోవాలి. మోకాలి నొప్పితో బాధపడే శరీరం కాదు! అందుకని 'నేను' అంటే ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి. అది ముందు ముందు చూస్తాము. ఇప్పటికి ఈశ్వరజ్ఞానం అంటే ఆ ఈశ్వర 'అహం అస్మి'. నేనే ఈశ్వరుడిని అన్నప్పుడు నేను ఈశ్వరుడి ఉనికిని ఎలా సందేహించగలను? ఎందుకు? ఎందుకంటే నేను ఉన్నానా లేదా అన్న సందేహం నాకెప్పుడూ లేదు కాబట్టి. ఉన్నానా లేదా అన్న సందేహం ఎందుకు లేదు? మనకు అలా ప్రశ్నలు ఊరుతూనే ఉంటాయి. నేను ఉన్నానా లేదా అన్న సందేహం ఎందుకు లేదంటే, ఆ సందేహం కలగటానికి, నేను ఉండాలి! అందుకని, ఈశ్వర జ్ఞానం కలిగితే, ఈశ్వరుని మీద శ్రద్ధ 'అహం బ్రహ్మ అస్మి' అన్న జ్ఞానంగా మారుతుంది. శ్రద్ధ, భక్తి చాలా ముఖ్యం.

**శ్రద్ధాభక్తిధ్యానయోగాత్ అవైహి - కైవల్యోపనిషత్తు -2**

**అనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు–** శ్రద్ధ, భక్తి చాలా ముఖ్యం కాబట్టి, అదే భావాన్ని మళ్ళీ చెప్తున్నాడు శిష్యుడు.నేను పరమాత్మను నిరాకరించకుండు గాక, పరమాత్మ నన్ను నిరాకరించకుండు గాక.

**తదాత్మని నిరతేఽయ ఉపనిషత్సుఽధర్మః –** శిష్యుని తర్వాతి ప్రార్థన తన అధికారత్వం గురించి. 'ఉపనిషత్తును నేర్చుకోవటానికి నేను సిద్ధంగా ఉండవచ్చు. గురువు బోధించటానికి సిద్ధంగా ఉండవచ్చు. కాని ఆ బోధను అర్థం చేసుకునే సూక్ష్మమైన బుద్ధి నాకు ఉందా?' భగీరథ ప్రయత్నం లాంటిది ఇది. గంగాదేవి దివి నుంచి భువికి దిగి రావటానికి సిద్ధంగా ఉంది కాని ఆమె ప్రవాహాన్ని భరించగలిగే శక్తి ఎవరికి ఉంది? అప్పుడు శివుడిని అర్థించాడు భగీరథుడు. అలాగే గురువు, శాస్త్రం రెండూ అందుబాటులో ఉన్నాయి. కాని నా చిన్ని బుర్ర **'నేను జగదధిష్ఠానం బ్రహ్మ!'** అన్న సత్యాన్ని స్వీకరించే స్థాయిలో ఉందా? ఒక్కసారిగా, మనకున్న పరిమిత జ్ఞానాన్ని కలచివేసే జ్ఞానం అది! నిజం చెప్పాలంటే, దాన్ని అంత తేలిగ్గా స్వీకరించే అధికారి లక్షణాలు లేవు మనకు.

శిష్యునికి తనకున్న పరిమితులు తెలుసు. అందుకని ఆ భారం కూడా భగవానుని మీదే వేశాడు. ఏమిటది? 'నాకు అవసరమైన అధికారత్వం కూడా నువ్వే ఇయ్యి.' ఎంత అందమైన ప్రార్థన!

**విద్యాం శుద్ధాఞ్చ బుద్ధిమ్ కమలజాదయితే సత్వరమ్ దేహి**

**ఉపనిషత్సు ధర్మః –** ఉపనిషత్తు పేర్కొన్న లక్షణాలు, భగవద్గీత 13వ అధ్యాయంలో కృష్ణభగవానుడు పేర్కొన్న 20 లక్షణాలే!

**అమానిత్వమ్ అదమ్భిత్వమ్ అహింసా క్షాన్తిః ఆర్జవమ్। గీత 13-7**

మళ్ళీ వీటిని 16వ అధ్యాయంలో పేర్కొన్నాడు, దైవీ సంపత్తిగా. 26 విలువలు అవి. ఈ విలువలు ఉండాల్సింది కేవలం పుస్తకంలో కాదు, మస్తకంలో! మస్తకం అంటే బుద్ధిలో. వాటిని గుర్తుంచుకుంటే చాలదు, వాటిని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి.

**తే మయి సన్తు తే మయి సన్తు–** ఉపనిషత్తు వివరించిన ఈ విలువలు నాలో ఉండు గాక. ఎటువంటి నాలో?

**తదాత్మని నిరతే నిరతః** అంటే శ్రద్ధ ఉన్న నాలో దీని సారాంశం– ఆత్మజ్ఞానం గురించి నేను శ్రద్ధగా కృషి చేస్తున్నాను. దానికి నాలో ఈ విలువలున్నీ ఉండాలి. ఓ దేవా, నాకీ విలువలను ప్రసాదించు.

**ఓం శాన్తిశ్శాన్తిశ్శాన్తిః –** మూడు ప్రతిబంధకాల నుంచి నన్ను రక్షించు.

**శాన్తి –** ఆధ్యాత్మిక ప్రతిబంధకం– నా నుంచి వచ్చే ఆటంకాలు

**శాన్తి –** ఆది భౌతిక ప్రతిబంధకం– నా చుట్టుప్రక్కల వాళ్ళనుంచి వచ్చే ఆటంకాలు

**శాన్తి –** ఆది దైవిక ప్రతిబంధకం– దేవతల నుంచి వచ్చే ఆటంకాలు

ఈ మూడు ప్రతిబంధకాలూ లేకుండా ఉండుగాక.

# కేనోపనిషత్తు

# అధ్యాయము - 1

కేనోపనిషత్తులో మొత్తం నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. ఒక్కొక్క అధ్యాయాన్ని ఖండం అంటారు. మనం మొదటి ఖండం, మొదటి మంత్రంలోకి అడుగుపెడుతున్నాము. ఈ ఉపనిషత్తు కూడా గురుశిష్యుల సంవాదం రూపంలో సాగుతుంది. కాకపోతే ఇక్కడ మనకు గురుశిష్యుల పేర్లు రావు. శిష్యుడు ప్రశ్న సూటిగా,స్పష్టంగా అడగాలి.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి**

**ముణ్డక 1-1-3**

ఏ ఒక్క విద్య గురించి తెలిస్తే మొత్తం అంతా తెలిసినట్టు అవుతుంది అని శౌనకుడు గురువు  అంగిరసుని అడిగాడు.

### మన్త్రము - 1

**ఓమ్, కేనేషితం పతతి ప్రేషితం మనః। కేన ప్రాణః ప్రథమః**
**ప్రైతి యుక్తః । కేనేషితాం వాచమిమాం వదన్తి చక్షుశ్శ్రోత్రం**
**క ఉ దేవో యునక్తి ॥**

ఇక్కడ కూడా శిష్యుడు సూటిగా, స్పష్టంగా అడిగాడు. కేన శబ్దంతో అతని ప్రశ్న మొదలవుతుంది. కాబట్టి, ఈ ఉపనిషత్తుకు కేనోపనిషత్తు పేరు వచ్చింది.

అతని ప్రశ్న ఒక్కముక్కలో చెప్పాలంటే దేనివల్ల కోరబడి, ప్రేరేపించబడి, మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవులు పనిచేస్తున్నాయి?

అతని ప్రశ్నను బట్టే అతని తెలివితేటలను అంచనా వేయవచ్చు. అతనికి గురువు దగ్గరకు రాకముందే కొంత ప్రాథమిక జ్ఞానం ఉంది. అతను ఏమీ తెలియని అజ్ఞాని కాదు. కొంత లోతైన అవగాహన ఉంది. అతనికి తెలిసిన అంశాలు ఏమిటి?

1.స్థూలశరీరం పంచభూతాలతో చేయబడిందని తెలుసు. శరీరాన్ని పాంచభౌతిక శరీరం అంటారు.

పృథివీ - శరీరంలో ఉన్న ఘనపదార్థం

నీరు - శరీరంలో ఉన్న ద్రవపదార్థం మనకు ఆకారాన్నిచ్చేది

అగ్ని - శరీరంలో ఉన్న ఉష్ణోగ్రత $98.4^0$ ఫారిన్‌హీట్.

వాయువు - శ్వాసక్రియ

ఆకాశం - శరీరంలో ఉన్న ఖాళీ ప్రదేశం; మనం బాహ్యంగా ఆక్రమించే స్థలం.

పంచభూతాలు జడం కాబట్టి, స్థూల శరీరం కూడా పంచభూతాలతో చేయబడింది కాబట్టి స్థూల శరీరం జడం లేదా అచేతనం.

2. సూక్ష్మ శరీరం కూడా సూక్ష్మ పంచభూతాలతో చేయబడింది కాబట్టి అది కూడా జడమే.

**సూక్ష్మశరీరంలో ఉన్న అంగాలు**

పఞ్చజ్ఞానేంద్రియాలు

పఞ్చకర్మేంద్రియాలు

పఞ్చప్రాణాలు

నాలుగు అంతఃకరణాలు

వెరసి 19 అంగాలు. ప్రాణం వల్లే శరీరం పనిచేస్తోందనుకుంటాము. కాని ప్రాణం కూడా జడమే. మనస్సు మనను ఒక ఆటాడిస్తుంది. కాని మనస్సు కూడా పాంచభౌతికం కాబట్టి అది కూడా జడమే. కాబట్టి సూక్ష్మశరీరం జడం లేదా అచేతనం.

3. తార్కికంగా చూస్తే శరీరం, ఇంద్రియాలు, మనస్సు జడమవాలి. కాని అనుభవం వేరే చెబుతున్నది. శరీరం, సూక్ష్మశరీరాలు, చేతనంగా ఉన్నాయి. వాటిలో స్వతహాగా చైతన్యం లేకపోతే, ఎక్కడ్నుంచో చైతన్యం అరువు తెచ్చుకుంటున్నదన్నమాట. ఉదాహరణకు నీటికి రుచి ఉండదని తెలుసు కదా! అది తాగినప్పుడు తీయగా అనిపిస్తే, అందులో పంచదార కలిపినట్టు తెలుస్తుంది. అంటే కంటికి కనపడని అంశమేదో రుచి లేని నీటికి తీయదనాన్ని అందజేస్తున్నది.

అలాగే జడమైన శరీరానికి చైతన్యం ఉన్న వస్తువేదో చైతన్యాన్ని అరువు ఇవ్వాలి. ఏమిటా వస్తువు అనటం లేదు శిష్యుడు. ఎవరా దేవుడు అంటున్నాడు.

ఈ నేపథ్యంతో మంత్రం చూద్దాము.

**కేనేషితం పతతి ప్రేషితం మనః** – పతతి అంటే అసలు అర్థం పడటం. ఇక్కడ చూడటం. కేనేషితం– ఏ ఆధ్యాత్మిక సూత్రం వల్ల కోరబడి; పతతి– ప్రేరేపించబడి; మనఃపతతి– మనస్సు బాహ్య ప్రపంచాన్ని వస్తువులా చూడగలుగుతున్నది? ఆధ్యాత్మికం అంటే లౌకికం కానిది. విజ్ఞానశాస్త్రం వ్యావహారిక ప్రపంచంలోనే పనిచేస్తుంది. వేదాంతం ఆధ్యాత్మిక రంగంలో పనిచేస్తుంది.

**కేన ప్రాణః ప్రథమః ప్రైతి యుక్తః** – ప్రాణాన్ని నియమించేదెవరు? ఎటువంటి ప్రాణాన్ని? ప్రథమ ప్రాణాన్ని. అంటే ముఖ్య ప్రాణాన్ని. పంచప్రాణాలు కలిసి ప్రాణం అంటున్నది. ప్రాణం వల్లనే పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, నాలుగు అంతఃకరణలు పనిచేస్తున్నాయి.

ఛాందోగ్యోపనిషత్తులోనూ, బృహదారణ్యకోపనిషత్తులోను ప్రాణం ఎలా శ్రేష్ఠమో కథలుగా వస్తుంది. ఉదాహరణకు ప్రాణానికి రెండు గుణాలు ఉన్నాయట– శ్రేష్ఠం, జ్యేష్ఠం. ప్రాణానికి రెండు ఉండటమేమిటి, మాకు ఒకటే ఉండటమేమిటి అని తక్కిన ఇంద్రియాలకు కోపం వచ్చి బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళి తీర్పు చెప్పమని కోరాయట. బ్రహ్మదేవుడు తాను చెప్పేదేం లేదనీ, వాటినే ఒక్కొక్కటిగా ఒక సంవత్సరం పాటు బయటకు వెళ్ళి చూడమనీ చెప్పాడు. అలాగే కన్ను, చెవి, నోరు, మనస్సు వగైరా– ఒక్కొక్కటీ బయటకు వెళ్ళినా,వ్యక్తి జీవనయానం ఏమీ ఆగలేదు.

ఇంక ప్రాణం వంతు వచ్చింది. ప్రాణం వెళ్ళటానికి లేవబోతుంటేనే, తక్కిన ఇంద్రియాలు నిర్వీర్యం అయిపోతున్నాయట. అప్పుడు అవి ప్రాణాన్ని శరణు వేడి, వెళ్ళొద్దని ఆపాయట. అంతేకాదు వాటికున్న గుణాలను ప్రాణానికి ధారపోయటమే కాక, ఇంద్రియాలు అనే వాటి పేరు కూడా ప్రాణానికే ధారపోసాయట. అందువల్ల ఇంద్రియాలను కూడా ప్రాణం అంటారు.

**సప్త ప్రాణాః ప్రభవన్తి – ముణ్డక 2-1-8**

అందువల్ల ప్రాణం అంటే ఇంద్రియాలు అనే అర్థం వస్తుంది. ప్రాణం అనీ అర్థం వస్తుంది. అందువల్ల ఉపనిషత్తు ప్రథమ ప్రాణం అనే పదాన్ని వేసింది. ఇంద్రియాలను ఎలాగూ తర్వాత పదాల్లో పేర్కొంటుంది. అంతేకాదు సుషుప్తిలో శరీరం, ఇంద్రియాలు మనస్సు లయమయినా కూడా ప్రాణం ఒక్కటే పనిచేస్తుంది.

ముందుకు వెళ్ళేముందు ఒక విషయం గమనించాలి. సాధారణంగా, ఒక వ్యక్తి జీవించి ఉన్నాడంటే, ప్రాణం వల్ల అంటాము. ఒక వ్యక్తి మరణించాడు అని చెప్పటానికి, అతని ప్రాణం పోయింది అంటాము. మనకు ఎవరైనా చాలా ఇష్టమైతే, 'నువ్వు నా ఆరో ప్రాణానివి,' అంటాము; ఎవరైనా అతిగా విసిగిస్తుంటే, 'నా ప్రాణాలు తోడకు,' అంటాము. అందువల్ల కర్మకాండ భాగంలో శరీరానికి శక్తినిచ్చేది ప్రాణం అంటాము.

కాని జ్ఞానకాండలో ఒక అడుగు ముందుకు వెళతాము.

శరీరానికి శక్తినిచ్చేది ప్రాణం అనేమాట నిజమే కాని, ప్రాణానికి విడిగా ఉనికి లేదు. ఎందుకంటే ప్రాణం కూడా జడమే. ప్రాణం అంటే ఏమిటి? వాయు తత్త్వం. పంచభూతాల్లో ఒకటి. పంచభూతాలు జడం. అందువల్ల, ఆ విషయం గ్రహించిన విద్యార్థి ప్రాణానికి ప్రాణాన్నిచ్చేది ఏమిటి అని అడుగుతున్నాడు.

**న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన**
**ఇతరేణ తు జీవన్తి యస్మిన్నేతావుపాశ్రితౌ - కఠ 2-2-5**

శరీరం ప్రాణం వల్ల జీవించి ఉందనుకోకు. ప్రాణమే ఆత్మ తత్త్వం వల్ల జీవించి ఉంది.

ఆ ఆత్మ తత్త్వం గురించి తెలుసుకోవాలనుకుంటున్నాడు శిష్యుడు. ఆ విధంగా ఇది చాలా తెలివైన ప్రశ్న.

**కేనేషితాం వాచమిమాం వదన్తి-** దేనివల్ల వాగింద్రియం మాట్లాడగలుగుతున్నది. వాక్కు తనంతట తాను చేతనం కాదు. ఒకవేళ చేతన తత్త్వం గనుక వాక్కుకు ఉంటే, శరీరం కూడా మాట్లాడాలి.

**చక్షుశ్శ్రోత్రం క ఉ దేవో యునక్తి-** దేనివల్ల కళ్ళు, చెవులు పనిచేస్తున్నాయి.

**దేవః-** శిష్యుడు దేనివల్ల అనలేదు. ఏ చైతన్యం వల్ల పనిచేస్తున్నాయని అడుగుతున్నాడు. ఇక్కడ మూడు విషయాలు గమనించాలి.

1. జడ వస్తువు ఇంకో జడవస్తువుకు చైతన్యాన్ని ఇవ్వలేదు. అది స్వయంప్రకాశకమై ఉండాలి. అందువల్ల ఏ చేతన తత్త్వం అంటున్నాడు? అది జడం అయితే ఇంకో జడం నుంచి చైతన్యాన్ని తెచ్చుకోవాలి. దాని అనవస్థాదోషం అంటారు. అప్పు తెచ్చుకోకుండా, అప్పు ఇవ్వగలిగిన చైతన్యం ఏది?

2. జడమైన శరీరం అప్పు తీసుకుంటున్నదంటే ఇచ్చే వస్తువు ఒకటి ఉండాలి.

3. ఐదు అంగాలను పేర్కొన్నాడు శిష్యుడు. మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవి. వీటిని ఉపలక్షణంగా తీసుకోవాలి. ఉపలక్షణం అంటే ఒక సముదాయంలో కొన్నింటిని చెప్పి తక్కిన వాటిని చెప్పకపోతే వాటిని కూడా కలుపుకోవాలి.

| | | |
|---|---|---|
| మనస్సు | – | 4 అంతఃకరణాలు |
| ప్రథమప్రాణం | – | 5 ప్రాణాలు |
| వాక్కు | – | 5 కర్మేంద్రియాలు |
| కన్ను, చెవి | – | 5 జ్ఞానేంద్రియాలు |

వెరసి 19 అంగాలు. సూక్ష్మశరీరంలో ఉన్న ఈ 19 అంగాలు ఏ శక్తి వల్ల పనిచేస్తున్నాయి? అంటే కార్యకారణ సంఘాతం అయిన శరీరం, మనస్సు,ఇంద్రియాలు జడమైతే, ఏ శక్తి వల్ల అవి చేతనం ఉన్నట్టుగా పనిచేస్తున్నాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే, ఆత్మ స్వరూపం ఏమిటి?

## మన్త్రము – 2

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్వాచో హ వాచం స ఉ**
**ప్రాణస్య ప్రాణశ్చక్షుషశ్చక్షురతిముచ్య ధీరాః।**
**ప్రేత్యాస్మాల్లోకాదమృతా భవన్తి ॥**

శిష్యుడు అడిగిన ప్రశ్నకు ఒక్కమంత్రంలో జవాబు చెప్పాడు గురువు. తర్వాత వచ్చే మంత్రాలన్నీ ఈ మంత్రానికి వివరణ మాత్రమే. దీన్ని సంక్షేప ఉత్తరం అనీ సూత్రభూత మంత్రం అనీ అంటారు. టూకీగా జవాబు ఇచ్చాడు కాబట్టి సంక్షేప ఉత్తరం; ఒక సూత్రంలో పొందుపరిచాడు కాబట్టి సూత్రభూత మంత్రం.

ఈ ఒక్క మంత్రంలోనే మూడు అంశాలు పొందుపరచబడ్డాయి. 1. ఆత్మ స్వరూపం 2. ఆత్మజ్ఞానం 4. ఆత్మజ్ఞానఫలం. నిజానికి ఈ మంత్రంతోనే కేనోపనిషత్తు ముగిసింది – స్వరూపం, జ్ఞానం, ఫలం– మూడూ వచ్చేశాయి. జ్ఞానం ప్రత్యక్షంగా చెప్పలేదు. కాని మనం కలుపుకోవాలి. ఎందుకంటే జ్ఞానం లేకుండా జ్ఞానఫలం లేదు.

గురువు యిచ్చిన జవాబు సారాంశం ఏమిటి? జవాబులోకి వెళ్ళేముందు కొంత వివరణ చూద్దాము. జడమైన శరీరానికి జడమైన వస్తువు చైతన్యాన్ని

ఇవ్వలేదు. కాబట్టి చైతన్యం ఇచ్చే వస్తువుకు స్వయంగా చైతన్యం ఉండాలి అని చూశాము. అందువల్ల దీని లక్షణాలు జడవస్తువు లక్షణాలకు పూర్తి భిన్నంగా ఉండాలి. అవేమిటో చూద్దాము.

| జడ ప్రపంచము | చేతనతత్త్వము |
|---|---|
| 1. దృశ్యం – అనుభవంలోకి వచ్చే వస్తువు (ఆబ్జెక్ట్) | **అదృశ్యం – అనుభవించబడే వస్తువు కాదు, అనుభవించే కర్త (సబ్జెక్టు)** |
| 2. భౌతికం – పంచభూతాలతో చేయబడింది | **అభౌతికం – వస్తువు కాదు.** |
| 3. సగుణం – శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలు ఉన్నాయి. | **నిర్గుణం – అశబ్దం, అస్పర్శం, అరూపం, అరసం, అగంధం.** |
| 4. సవికారం– మార్పుకు లోనవుతుంది. అస్తి, జాయతే, వర్థతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి | **నిర్వికారం – పుట్టుక లేదు,చావు లేదు. అందువల్ల మార్పులు కూడా లేవు.** |
| 5. ఆగమాపాయి – వచ్చి, పోతుంది శాశ్వతం కాదు. | **అనాగమాపాయి – అవస్థాత్రయసాక్షి, రాకపోకలు లేవు, శాశ్వతం.** |

జడ ప్రపంచం, జడ వ్యష్టి లక్షణాలు ఏమిటి? దృశ్యత్వం, భౌతికత్వం, సగుణత్వం, సవికారత్వం, ఆగమాపాయిత్వం. ఆత్మ ఐదు లక్షణాలు ఏమిటి? అదృశ్యత్వం, అభౌతికత్వం, నిర్గుణత్వం, నిర్వికారత్వం, అనాగమాపాయిత్వం.

**ఆత్మలక్షణం ఏమిటి?** – ప్రశ్న

**చేతనతత్త్వమ్** – **జవాబు**

కాని ఇంత సూటిగా ప్రశ్నా లేదు, జవాబూ లేదు.

ఈ నేపథ్యంతో మంత్రంలోకి వెళదాము. ఈ రెండవ మంత్రం మొత్తం కేనోపనిషత్తు సారాంశం అని చూశాము.

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాః–** **గీత 2–11**

ఇది గీతాసారాంశం. శోకింపదగని వాటి గురించి శోకిస్తున్నావు

అంటున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

**శ్రోత్రస్య శ్రోతం–** చెవి యొక్క చెవి; **మనసో మనోయత్ –** అది మనస్సు యొక్క మనస్సు; **వాచో హ వాచం–** వాక్కు యొక్క వాక్కు; **స ఉ ప్రాణస్య ప్రాణః –** అది ప్రాణం యొక్క ప్రాణం; **చక్షుషశ్చక్షు –** కన్ను యొక్క కన్ను. ఇవయ్యాక ఆత్మ అని కలుపుకోవాలి.

ఇక్కడిదాకా ఆత్మ నిర్వచనం. ఇలాంటివి వినే ఫిలాసఫీ అంటే ఒక గుడ్డివాడు, చీకటి గదిలో, అక్కడలేని ఒక నల్లపిల్లిని వెతికినట్టు ఉంటుంది అంటారు.

శిష్యుడు ఐదు కరణాల గురించి అడిగాడు– అవి– మనస్సు, ప్రాణం,వాక్కు, కన్ను, చెవి. గురువు ఆ ఐదు కరణాల గురించీ చెప్పాడు. కాకపోతే అదే వరుసక్రమంలో చెప్పలేదంతే. చెవి యొక్క చెవి, మనస్సు యొక్క మనస్సు, వాక్కు యొక్క వాక్కు, ప్రాణం యొక్క ప్రాణం; కన్ను యొక్క కన్ను అన్నాడు.

చెవి యొక్క చెవి అంటే ఇంకో చెవి కాదు. మొదటి చెవి ఇంద్రియం. రెండవ చెవి ఆత్మ లేదా చైతన్య స్వరూపం. ఎందుకు ఈ భాష? ఎందుకంటే ఆత్మ చెవికి భిన్నంగా ఉంది అని చూపటానికి. ఉదాహరణకు రాముని యొక్క పుస్తకం అంటే పుస్తకం వేరు, రాముడు వేరు, కాని రెండింటికీ మధ్య సంబంధం ఉంది. అలాగే చెవి వేరు, ఆత్మ వేరు అయినా ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది. అంతేకాదు ఆత్మ వల్లే చెవికి చెవిగా పనిచేసే శక్తి వచ్చింది.

కాంతి–చెయ్యి ఉదాహరణ చూద్దాము.

1. కాంతి వేరు, చెయ్యి వేరు.
2. కాంతి చెయ్యి అంతటా వ్యాపించి ఉంది.
3. కాంతి ఉండటం వల్లే చెయ్యిని చెయ్యి అనగలుగుతున్నాము. అంటే చేతిని చూడగలుగుతున్నాము.

ఇప్పుడు ఈ సూత్రాన్ని శ్రోత్రస్య శ్రోత్రం వగైరా పదాలకు అన్వయిద్దాము.

1. ఆత్మ వేరు, చెవి వేరు.
2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.
3. ఆత్మ ఉండటం వల్లే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.

అంటే ఆత్మ భిన్నంగా ఉండి, వ్యాపించి, చైతన్యాన్ని ఇస్తున్నది. ఎందుకంత సూక్ష్మంగా చెప్పటం? అది చైతన్యం అంటే చాలదా? చైతన్యం అని చెప్పగానే దాన్ని ఒక బాహ్యవస్తువుగా (ఆబ్జెక్ట్‌గా) భావించి, దానికోసం వెతకటం మొదలుపెడతాడు శిష్యుడు. ఎందుకు? ఇన్నాళ్ళు మనం నేర్చుకుంటున్న లౌకిక విద్య అలాంటిది. దాన్ని డైకాటమీ సిస్టమ్ అంటారు. అందులో రెండు దశలు ఉంటాయి.

1. ఒక వస్తువు గురించిన జ్ఞానం పొందుతారు
2. తర్వాత దాని అనుభవం పొందుతారు

ఇక్కడ కూడా అదే సూత్రం వర్తింపజేయాలనుకుంటారు. ఆత్మ గురించి అంతా సమాచారం సేకరిస్తాడు. ఆత్మ గురించి చెప్పగానే, ఎక్కడ దొరుకుతుంది అని వెంపర్లాడతాడు. బాహ్యంగా దొరకదనేసరికి, అంతర్గతంగా వెతకటానికి ప్రయత్నిస్తాడు. గట్టిగా కళ్ళు మూసుకుని ధ్యానంలో కూర్చుని, ఎప్పుడు వస్తాడో అని ఎదురుచూస్తుంటాడు. ఆలోచనల తాకిడి వల్ల ఆత్మను చూడలేకపోతున్నాననుకుని, మనస్సును శూన్యం చేయటానికి ప్రయత్నిస్తాడు. మనస్సును శూన్యం చేసినా ఆత్మ దొరకదు.

అందువల్ల బాహ్యంగా వెతికినా, లోపల వెతికినా లాభం లేదు. పూజ్యస్వామీజీ అంటారు, 'క్లాసులో ఉండగా ఎన్నడూ ధ్యానం చేయకండి. అలా చేస్తే క్లాసు మాయమయిపోతుంది. ముందు వినండి.'

ఆత్మ బాహ్యంగా లేదు. అంతర్గతంగానూ లేదు. అది నువ్వే.

నువ్వు పొందే అనుభవం ఆత్మ కాదు. ఎందుకంటే ఆత్మ ఆబ్జెక్టు కాదు. సబ్జెక్ట్ అయిన నువ్వే. ఆత్మ బాహ్య వస్తువు కాదు. నువ్వే అని చెప్పవచ్చుగా? ఇది ఇంకా పెద్ద సమస్య.

శిష్యుడు తనను శరీరంతో, ఇంద్రియాలతో, మనస్సుతో ముడివేసు కుంటాడు ఎప్పుడూ. అంటే తను కార్యకరణ సంఘాతం అనుకుంటాడు. నేనేమిటి, ఆత్మ ఏమిటి అని ఆశ్చర్యపోతాడు.

అందుకని గురువు చుట్టూ తిరిగి చెప్పాల్సి వస్తున్నది. శిష్యుడు ఆత్మను బాహ్యవస్తువుగా చూడకుండా, తనే ఆత్మ అని అర్థం చేసుకోగలిగితే వేదాంతం విజయం సాధించినట్టే.

శ్రోత్రస్య శ్రోత్రం అని చెప్పటం ద్వారా మూడు విషయాలు తెలుస్తున్నాయని చూశాము. అవి మళ్ళీ ఒకసారి చూద్దాము, ఇప్పుడు మనస్సు పరంగా

1. ఆత్మ వేరు, మనస్సు వేరు.

2. ఆత్మ మనస్సు అంతటా వ్యాపించి ఉంది.

3. ఆత్మ ఉండటం వల్లనే మనస్సును మనస్సు అనగలుగుతున్నాము. అంటే మనస్సుతో చూడగలుగుతున్నాము.

ఇదే సూత్రాన్ని తక్కిన నాలుగు అంగాలకూ వర్తింపజేయాలి. ఆత్మ ఉండటం వల్లే కన్నును కన్ను అనగలుగుతున్నాము. ప్రాణాన్ని ప్రాణం అనగలుగుతున్నాము. వాక్కును వాక్కు అనగలుగుతున్నాము.

**క ఉ దేవో యునక్తి? –** వీటిని నడిపించే చైతన్యం ఏది? అనే ప్రశ్నకు జవాబు– చైతన్యం వస్తువు కాదు. అది నేనే. నేను సాక్షి చైతన్యాన్ని. నేను శరీరాన్ని, ఇంద్రియాలను, మనస్సును సాక్షీభూతంగా చూస్తున్నాను. ఎప్పుడైతే ఈ నిర్వచనం అర్థమయిందో, అప్పుడు చైతన్యం యొక్క ఐదు లక్షణాలతో దీనిని కలపవచ్చు.

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు. శరీరాన్నించి ఉత్పత్తి చెందింది కూడా కాదు.

2. చైతన్యం స్వతంత్రమైనది. అది శరీరం అంతటా వ్యాపించి శరీరాన్ని ప్రకాశింపచేస్తుంది.

3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

4. శరీరం నాశనమయితే, చైతన్యం నాశనమవదు. శరీరం పతనం చెందాక కూడా చైతన్యం ఉంటుంది.

5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది. కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింపచేసే శరీరం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఆ చైతన్యం నేను. 'నేను ఆత్మను,' అని తెలుసుకోవాలి. నేను అన్నప్పుడల్లా ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. నేను శరీరాన్ని కాదు, మనస్సును కాదు. ఇంద్రియాలు కాదు. నేను శుద్ధ చైతన్యాన్ని. ఇక్కడితో ఆత్మ నిర్వచనం ముగిసింది. ఇప్పుడు జ్ఞానఫలం.

**ధీరాః–** ధీరాః పదం ప్రతి ఉపనిషత్తులోనూ తరచు వస్తుంది. ధీరాః అంటే ధైర్యవంతుడు

కాదు. సాధనచతుష్టయసంపన్నుడు. వేదాంతం నేర్చుకోవటానికి కావాల్సిన అర్హత ఉన్నవాడు. సాధనచతుష్టయసంపన్నుడు ఎలా అవుతాడో ఉపనిషత్తు ప్రత్యేకించి చెప్పదు. కర్మయోగం వల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుంది; ఉపాసనాయోగం వల్ల చిత్త ఏకాగ్రత ఏర్పడుతుంది. దీనివల్ల జ్ఞానం పొందటానికి అర్హుడవుతాడు. జ్ఞానం పొందాక, నేను సాక్షి చైతన్యాన్ని అని చెప్పగలుగుతాడు.

**అతిముచ్య-** ఇది ఫలాన్ని సూచిస్తుంది. మూడుస్థాయిల్లో ఫలం గురించి చెప్పబడింది.

**1. అహంకార మమకారాలను వదులుకోవటం-** అతిముచ్య అంటే అహంకార మమకారాలను త్యజించటం. మనం పంచ అనాత్మల మీద అహంకార మమకారాలు పెంచుకుంటాము. అవి-

| | |
|---|---|
| నా ఆస్తులు, నా వృత్తి, నా కుటుంబం | – వీటిమీద మమకారం |
| నా శరీరం, నా మనస్సు | – వీటి వల్ల అహంకారం |

ఈ శక్తివంతమైన అహంకార మమకారాలను విశ్వరూప ఈశ్వరునికి (గీత 11వ అధ్యాయం) అప్పజెప్పేయాలి. అంతర్గత సన్యాసం అంటే అహంకార మమకారాలను వదులుకోవటం. మనకు వస్తువులు ఉన్నకొద్దీ, అవి మన అదుపులో ఉండాలనుకుంటాము. కాని దురదృష్టవశాత్తూ మనం కేవలం వాటిని వాడగలము. లేదా వాటిని ఇవ్వగలము అంతే. మన స్వంతం చేసుకోలేము. అందువల్ల భవిష్యత్తులో ఏమీ ఆశించకుండా, మన పనిని మనం చేసుకుంటూ పోవాలి. మనం అనుకున్నది జరుగవచ్చు, జరగకపోవచ్చు. అందువల్ల ఫలితాన్ని ఆశించ కుండా. అహంకార మమకారాలను తగ్గించుకోవాలి. దానికి మార్గం ఆత్మజ్ఞాన మొక్కటే.

మీరు, 'నేను ఆనందంగా ఉన్నాను,' అంటే ఆ మాట ఏదంటోంది? మీ నోరా, మీ మనస్సా? రెండూ. నోరు పనిచేయాలంటే మనస్సు కావాలి. కాని మీరు ఆ మాట అన్నప్పుడు మీరు నోరును పట్టించుకోరు. విన్నవాళ్ళు కూడా నోరును పట్టించుకోరు. మీ మనస్సు ఆనందంగా ఉంది అని ఇద్దరికీ అర్థమవుతుంది. ఆ మాట అంటున్నది నోరు కాదని, దానికి అతీతంగా మీకు తెలియ కుండానే ఎదిగారు.

అలాగే, మీరు, 'అహం బ్రహ్మ అస్మి' అంటే ఆ మాట ఏదంటోంది? మనోబుద్ధి అహంకారాలను ఉపయోగించే చెపుతారు. కాని అవేవీ కావని

తెలుసుకుంటారు. నేను అంటే సాక్షి చైతన్యం అని తెలుసుకుంటారు. మనోబుద్ధి అహంకారాలను ఉపయోగించినా అవి కావు అని బుద్ధితో తెలుసుకోవటమే అతీతంగా ఎదగటము. ఆలోచనలో మార్పు. అజ్ఞాని నేను అంటే మనోబుద్ధి అహంకారాలు. జ్ఞాని నేను అంటే సాక్షి చైతన్యం.

అందువల్ల ఆత్మజ్ఞానం పొందితే అహంకార మమకారాలు తగ్గుతాయి.

**2 జీవన్ముక్తి –** రాగద్వేషాలు తగ్గుతాయి. ఎప్పుడైతే అహంకార మమకారాలు తగ్గుతాయో, అప్పుడు వాటి మీద ఆధారపడి ఏర్పడిన రాగద్వేషాలు తగ్గుతాయి. రాగద్వేషాలు తొలగిపోతే లేదా తగ్గితే మనస్సు శాంతి భద్రతలను ఆనందాన్ని పొందుతుంది. మనస్సు ఎందుకు కలత చెందుతుంది? కోరుకున్న వస్తువు పొందలేకపోతే లేదా పొందిన వస్తువు జారిపోతే బెంగ. జారి పోకపోయినా, జారిపోతుందేమోననే బెంగ. ఇప్పుడు ఇది కావాలి అనే కోరిక లేదు. పోతుందనే బెంగ లేదు. రాగద్వేషాలను వదులుకోవటాన్ని జీవన్ముక్తి అంటారు.

రాగద్వేషాలు జీవితం మీదే కాదు, మరణం మీద కూడా ఉండవు. 'నేను ఎన్నాళ్ళు బ్రతకాలి, నాకు విదేహ ముక్తి ఎప్పుడు?' అనుకోడు. అతను ఎన్నాళ్ళు బ్రతుకుతాడు? ప్రారబ్దం ఉన్నంతవరకు. ప్రారబ్దం ఆత్మకుకాదు; ఆత్మకు ఏ కర్మలూ అంటవు.

**ప్రేత్యాస్మాల్లోకాదమృతాభవన్తి–** మరణించాక విదేహముక్తి పొందుతాడు.

**3. విదేహముక్తి –** ఇది మూడవ ఫలం. జ్ఞాని మరణించాక అతనికి పునర్జన్మ ఉండదు. అతని మూడు శరీరాలు, సమష్టి ప్రపంచంలో కలిసిపోతాయి. సముద్రంలో ఉన్న మంచుగడ్డ సూర్యకాంతికి కరిగిపోయి, సముద్రంలో కలిసిపోయినట్టుగా జీవుడనే ఐస్‌బెర్గ్, జ్ఞానమనే సూర్యకాంతిలో కరిగిపోయి, పరమాత్మ అనే సాగరంలో కలిసిపోతాడు. ఇది విదేహముక్తి.

**గమనిక –** ఒక వ్యక్తికి మూడు కర్మఫలాలు ఉంటాయి.

**ఎ. సఞ్చితకర్మ –** జన్మజన్మల నుంచి కొన్ని కర్మఫలాలను ప్రోగుచేసుకువస్తారు.

**బి. ప్రారబ్ధకర్మ –** సంచిత కర్మలోంచి కొన్ని కర్మలు ఫలించి, ప్రారబ్ధకర్మగా మారుతుంది. ప్రారబ్దకర్మ వల్ల ఈ శరీరం పొందుతాడు. ప్రారబ్దకర్మ అయిపోగానే శరీరం రాలిపోతుంది అంటే మరణం సంభవిస్తుంది.

**సి. ఆగామికర్మ –** ఈ జన్మలోచేసే కర్మల వల్ల ఏర్పడే పుణ్యపాపాలు. వాటిలో కొన్నిటిని ఇక్కడే అనుభవించినా, మళ్ళీ కొన్ని సంచిత కర్మలో చేరుతాయి. వీటివల్ల వ్యక్తికి పునర్జన్మ ఉంటుంది.

జ్ఞానికి ఎందుకు పునర్జన్మ ఉండదు?

**ప్రారబ్ధకర్మ –** ముందు ప్రారబ్దకర్మ విషయం చూస్తే, జ్ఞాని అయినా, అజ్ఞాని అయినా ప్రారబ్దకర్మను అనుభవించక తప్పదు. అంతవరకూ జీవించక తప్పదు. కాకపోతే జ్ఞాని ప్రారబ్దకర్మకు బాధపడదు. అతని మరణంతో ప్రారబ్ధకర్మ ముగిసిపోతుంది.

**సఞ్చితకర్మ –** అతని జ్ఞానాగ్నిలో సంచితకర్మ దగ్ధమవుతుంది.

**ఆగామికర్మ –** అతను అకర్తా, అభోక్తా అనుకుని కర్మలు చేస్తాడు కాబట్టి ఆ కర్మల వల్ల వచ్చే పుణ్యపాపాలు అతనికి అంటవు. అందువల్ల కొత్తగా వచ్చి చేరే ఆగామి కర్మలు ఉండవు.

అందువల్ల జ్ఞాని మరణ సమయంలో ప్రారబ్ధకర్మ ముగిసిపోయింది. సంచిత కర్మ దగ్ధమయిపోయింది. ఆగామి కర్మ లేదు కాబట్టి అతని కర్మ బ్యాలెన్స్ సున్నా. ఆదాయం ఉంటేనే పన్ను. కర్మఫలం ఉంటేనే పునర్జన్మ. అందువల్ల జ్ఞానికి పునర్జన్మ లేదు. (ఇదంతా ఇంకా వివరంగా అద్వైత వేదాంత పరిచయంలో వస్తుంది)

**క ఉ దేవో యునక్తి**

ప్రశ్నకు ఒక సంక్షేప ఉత్తరం వచ్చేసింది.

**1. ఆత్మ నిర్వచనం–** ఎ) ఇంద్రియాలకు భిన్నంగా ఉండి, బి) ఇంద్రియాలంతా వ్యాపించి, సి) వాటికి చేతనత్వాన్ని ఇస్తుంది.

**2. ఆత్మజ్ఞానం–** ఆత్మ చూడబడే వస్తువు కాదు. చూసే నేను.

**3. ఆత్మజ్ఞానఫలం–** ఎ) అహంకార మమకారాలను తగ్గించుకోవటం.
బి) జీవన్ముక్తి
సి) విదేహముక్తి

**మన్త్రము - 3**

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి।**
**నో మనో న విద్మో న విజానీమో యథైతదనుశిష్యాత్॥**

రెండవ మంత్రంలో మొత్తం కేనోపనిషత్తు సారాంశం అని చూశాము. మిగతావన్నీ సూత్రభూత మంత్రం మీద వ్యాఖ్యానాలే.

**బ్రహ్మవిదా ఆప్నోతి పరమ్ - తైత్తిరీయ**

ఇది ఒక సూత్రభూత మంత్రం తైత్తిరీయంలో, మిగతాదంతా దీని వివరణ.

ముందు మంత్రంలో ఆత్మ లక్షణం చూశాము. ఇప్పుడు దాని ప్రమాణం తెలుసుకోవాలి.

**లక్షణప్రమాణాభ్యాం వస్తుసిద్ధిః** ఒక వస్తువు గురించి తెలుసు కోవాలంటే, దాని లక్షణమూ, ప్రమాణమూ రెండూ తెలియాలి. ఉదాహరణకు, 'ఆ గదిలోంచి కుర్చీ తెండి,' అంటే తెచ్చే వ్యక్తికి కుర్చీ అంటే ఏమిటో తెలియాలి. కుర్చీని చూసే కన్ను పనిచేయాలి. కుర్చీ లక్షణం; కన్ను ప్రమాణం.

ఇప్పుడు ఆత్మను ఎలా తెలుసుకోవాలి? దానికి ఏదైనా ప్రమాణం ఉందా? టెలిస్కోప్, మైక్రోస్కోప్ ఉన్నట్లుగా ఆత్మనోస్కోప్ ఏమైనా ఉందా? అంతకు ముందు చూసినట్లుగా ఆత్మ అనగానే ముందు బాహ్యంగా వెతకటానికి ప్రయత్నిస్తాము. బాహ్యవస్తువులను చూసే ప్రత్యక్ష ప్రమాణాలను వాడటానికి ప్రయత్నిస్తాము. కాని ఆత్మ ఇంద్రియ అగోచరం.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్**
**తథాఽరసం నిత్యమగన్ధవచ్చ యత్ - కఠ 1-3-15**

పోనీ తర్కానికి అందుతుందా? అనుమాన ప్రమాణం, అర్థాపత్తి లాంటి ప్రమాణాలు ఉన్నాయి. ప్రత్యక్షప్రమాణం ఆధారంగా ఒక విషయాన్ని తీసుకుని, తర్కం ఉపయోగించి అర్థం చేసుకుంటాము.

**నైషా తర్కేన మతిరాపనేయా - కఠ -** తర్కానికి కూడా అందదు. పోనీ ధ్యానంలో కూర్చుని ఆత్మను అనుభవం పొందుదామా? విషయం తెలుసుకోకుండా నేనెవరు, నేనెవరు అనుకుంటూ ధ్యానం చేస్తే లాభం లేదు.

మనం లౌకిక జ్ఞానం పొందటానికి వాడే ప్రమాణాలేమీ పనిచేయవు.

ప్రమాణం ద్వారా బ్రహ్మ అనుభవం పొందలేము. ఎందుకు? బ్రహ్మ బాహ్యవస్తువు కాదు. అందువల్ల ఈ మంత్రంలో గురువు అతన్ని హెచ్చరిస్తున్నాడు. లౌకిక ప్రమాణాలను వాడకు అంటున్నాడు.

ఇప్పుడు మంత్రం చూద్దాము.

**న తత్ర చక్షుర్గచ్ఛతి –** ఆత్మను కంటితో చూడలేము.

**యత్ తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్**

**ముణ్డక 1-1-6**

**అద్రేశ్యమ్ –** ఆత్మను కంటితో చూడలేము. ఎవరైనా నేను ఆత్మను చూశాను అంటే కేనోపనిషత్తు, 'నువ్వు చూసింది వేరే దాన్ని, ఆత్మను కాదు,' అంటుంది. కన్ను అంటే కన్నే కాదు, తక్కిన ఇంద్రియాలన్నీ కూడా ఆత్మను తెలుసుకోలేవు.

**న వాగ్గచ్ఛతి–** మాటలు కూడా ఆత్మను వర్ణించలేవు. పదాలు బాహ్యవస్తువులను వివరిస్తాయి. ఆత్మ బాహ్యవస్తువు కాదు. లౌకిక వస్తువులను వివరించటానికి వాడే మాటలు అలౌకిక ఆత్మను వివరించలేవు. ఆత్మ ఒక వస్తువు అనలేము. వాక్కు అంటే అన్ని కర్మేంద్రియాలు వస్తాయి. అందువల్ల ఆత్మ కర్మేంద్రియాలకు అందదు.

**నో మనః–** మనస్సు కూడా ఆత్మను తెలుసుకోలేదు. ధ్యానంలో కూర్చుని కూడా తెలుసుకోలేము. మనస్సు అంటే నాలుగు అంతఃకరణాలు వస్తాయి. అందువల్ల ఆత్మ అంతఃకరణాలకు కూడా అందదు.

**న విద్మః–** గురువు నాకు కూడా తెలియదు అంటున్నాడు. ఆత్మమీద ఏ ప్రమాణమూ పనిచేయదు కాబట్టి, నాకు కూడా తెలియదు. అందుకే ఆత్మను అప్రమేయం అంటారు. నాకు తెలియదు, కాబట్టి తెలియనిది ఎలా చెప్పను?

**అప్రమేయో స్వప్రకాశా మనోవాచామగోచరా – లలితా సహస్రనామమ్**

మనోవాక్కులకు అగోచరం. అంటే ప్రమాణానికి అందదు.

**న విజానీమో యథైతదనుశిష్యాత్–** ఇంకా పెద్ద మాటే వాడుతున్నాడు గురువు. నాకే కాదు ఎవరికీ తెలియదు. ఎవరైనా ఎలా చెప్పగలరు? నాకు తెలియదు అంటే నాకు మాత్రమే తెలియదు, ఇంకొక గురువుకు తెలుసు అనే అర్థం రావచ్చు. అందువల్ల వేరే ఎవరికీ కూడా తెలియదు అంటున్నాడు. వేరే ఎవరికీ ఆత్మ గురించి తెలియదు అంటే ఆత్మ గురించి చెప్పే ప్రమాణం గురించి తెలియదు అని అర్థం.

ఎందుకంటే ఆత్మ అప్రమేయం.

శిష్యునికి నిరాశ వచ్చి వెళ్లబోయే ముందు, ఇది నిజం కాని అప్రమేయమైన ఆత్మను ఎలాగో నా గురువులు నాకు చెప్పారు, నేను ఆ పద్ధతి పనిచేస్తుందేమో చూస్తాను అని తర్వాత వచ్చే మంత్రంలో చెపుతాడు. అలా తన గురువుకు గొప్పదనాన్ని ఆపాదిస్తున్నాడు. గురుశిష్యపరంపరగా ఈ విద్య కొనసాగుతున్నది.

**నారాయణం పద్మభువం వశిష్ఠం శక్తిఞ్చ తత్పుత్ర పరాశరఞ్చ।**
**వ్యాసం సుఖం గౌడపాదం మహాన్తం గోవిన్ద యోగీన్ద్ర మథాస్య శిష్యమ్॥**
**శ్రీ శఙ్కరాచార్యమథాస్య పద్మపాదఞ్చ హస్తామలకఞ్చ శిష్యమ్।**
**తం తోటకం వార్తికకారమన్యాన్ అస్మత్ గురూన్ సన్తత మానతోస్మి॥**
**– గురుధ్యానమ్**

ఇది తక్కిన ప్రమాణాల లాంటిది కాదు కాబట్టి దీన్ని అపౌరుషేయ శబ్ద ప్రమాణం అంటారు. దీన్నే శాస్త్ర ప్రమాణం అని కూడా అంటారు. ఈ ప్రమాణం కూడా ప్రత్యక్షంగా బ్రహ్మ గురించి చెప్పదు కాని, బ్రహ్మను గుర్తించటంలో తోడ్పడుతుంది. ఏమిటా పరోక్ష పద్ధతి? నేను నా గురువు నుంచి ఆ అపౌరుషేయ శబ్ద ప్రమాణం నేర్చుకున్నాను. అది నా గొప్ప కాదు. నా గురువు నుంచి వచ్చింది అంటాడు. ఆ గురువు తన గురువును స్తుతిస్తాడు. అలా వెనక్కి వెళితే నారాయణుడు ఆది గురువు. శివపరంగా చూస్తే సదాశివుడు.

**సదాశివసమారమ్భాం శఙ్కరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యన్తాం వన్దే గురుపరమ్పరామ్॥**

అదే చెపుతున్నాడు తర్వాత వచ్చే మంత్రంలో.

### మన్త్రము – 4

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి ।**
**ఇతి శుశ్రుమ పూర్వేషాం యే నస్తద్వ్యాచచక్షిరే ॥**

**ఇతి శుశ్రుమ పూర్వేషాం–** నా పూర్వీకులు అంటే మా ఆచార్యులు. ఏం చేశారు?
**యే నస్తద్వ్యాచచక్షిరే–** వారు మాకు నేర్పించారు.

ముందు మంత్రంలో **న వాక్ గచ్ఛతి** అని చెప్పి, మళ్ళీ ఎలాగో చెప్పవచ్చు

అని చెపుతున్నాడు. దీన్ని బట్టి ఆత్మజ్ఞానం సంప్రదాయ బద్ధంగా వస్తుంది అని అర్థమవుతుంది.

**సమ్ప్రదీయతే అనేన ఇతి సమ్ప్రదాయః –** ఇది విజయవంతమైనదని ఎలా తెలుసు? ఒకప్పుడు గురువు దగ్గర నేర్చుకున్న శిష్యుడు, ఇప్పుడు గురుస్థానంలో ఉండి శిష్యునికి బోధ చేయబోతున్నాడు. ఏం బోధ చేస్తాడు?

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి–** అక్షరలక్షలు విలువ చేసే వాక్యం ఇది. ఇది ముఖ్యమైన వాక్యం. తక్కిన మంత్రాల్లో దీని వివరణ వస్తుంది. **అన్యదేవ తద్విదితాత్ –** ఆత్మ మనకు తెలిసిన వస్తువులు అంటే ఆబ్జెక్ట్‌కు భిన్నంగా ఉంది. విదితం అంటే తెలిసినది. మనకు బాహ్యప్రపంచం తెలుసు. మన శరీరం దగ్గరగా తెలుసు, మన మనస్సు కూడా ఇంకా దగ్గరగా తెలుసు. కాని తెలిసిన ఆబ్జెక్టులేవీ ఆత్మ కాదు అంటున్నాడు గురువు. ఈ మాట వినగానే ఏం చేస్తాం? వెంటనే దానికి భిన్నంగా ఆలోచిస్తాము. అంటే తెలియని వస్తువేమో అనుకుంటాము.

**అథో అవిదితాదధి –** ఆగు, తొందరపడకు అంటున్నాడు గురువు. అధ అంటే పైపెచ్చు; **అవిదితాత్ అధి** తెలియని వస్తువుకు కూడా అన్యంగా (భిన్నంగా) ఉంది. అంటే ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువూ కాదు. తెలియని వస్తువు ఇవాళ తెలియకపోవచ్చు కాని, తర్వాత తెలియవచ్చు కదా! అందువల్ల తెలియని వస్తువు అంటే తెలుసుకోగలిగిన వస్తువుగా అర్థం చేసుకోవాలి.

ఉదాహరణకు నువ్వు ఏ పండ్లు తినలేదు అని ఎవరైనా అడిగితే, మనం తినని పండ్ల పేర్లు చెపుతాం కాని శాస్త్రీయ సంగీతం వినలేదు అంటామా? అలాగే ఏం చదవలేదు అంటే చదవని పుస్తకాల పేర్లు చెపుతాం కదా! ఆ విధంగా తెలియని ఆబ్జెక్టు అంటే ఇప్పుడు తెలియకపోయినా, ముందు, ముందు తెలియవచ్చు కదా! అందువల్ల ఆత్మ తెలియని ఆబ్జెక్టు కాదు, అంటే ముందు కూడా తెలుసుకునే ఆబ్జెక్టు కాదు అని అర్థం.

ఆత్మ తెలిసిన ఆబ్జెక్టు కాదు, తెలియని (ముందు తెలుసుకోగలిగిన) ఆబ్జెక్టు కాదు; ఇప్పుడు తెలియదు, ముందు కూడా తెలుసుకోలేము అంటే ఆత్మ అసలు లేనట్టా! కాని ఆత్మ ఉందని గురువు చెప్పాడు కాబట్టి, ఆత్మ లేదని కొట్టి పారేయలేము. అయితే ఆత్మ ఏమిటి? ఇప్పుడు ఆ వాక్యాలను మళ్ళీ చూస్తే తెలుస్తుంది.

ఆత్మ తెలిసిన ఆబ్జెక్టు కాదు

ఆత్మ తెలియని ఆబ్జెక్టు కాదు

అంటే దీని అర్థం ఏమిటి?

రెండింటిలోనూ సమానంగా ఉన్న పదం ఏమిటి? ఆబ్జెక్టు. ఆత్మ ఆబ్జెక్టు కాదు. ఆబ్జెక్టు రెండు రకాలు. తెలిసినది, తెలియనిది. ఆత్మ ఈ రెండు రకాలలోనికి రాదు. అంటే ఆబ్జెక్టు కాదు అని నొక్కి చెపుతున్నాడన్నమాట గురువు.

ఆత్మ ఆబ్జెక్టు కాదు అంటే మరి ఆత్మ ఏమిటి? సబ్జెక్టు అయిన నేను.

ఆత్మ తెలుసుకునే నేను, తెలుసుకున్న లేదా తెలియని వస్తువు కాదు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియెన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**

తెలిసిన వస్తువు కాదు. తెలియని వస్తువూ కాదు. అంటే మిగిలిందేమిటి? ఏమీ మిగలలేదు అనకూడదు. తెలుసుకునే నేను మిగిలాను. నేను తెలుసుకోబడే వస్తువును కాను. అనుభవించే నేను ఎన్నటికీ వస్తువుగా అనుభవించబడలేను. తత్త్వబోధలో ఈ సందర్భంలో కొన్ని ఉదాహరణలు చూశాము.

1. మీ వేలి కొనతో మీరు అన్నింటినీ స్పృశించగలరు కాని, అదే వేలికొనను ఆ వేలుతోనే మీరు స్ప ృశించలేరు.

2. మీ కుడిచేత్తో మీరు శరీరం అంతటికీ సబ్బు రాసుకోగలరు కాని, ఆ చేతికి ఆ చేత్తో సబ్బు రాసుకోలేరు.

అంటే దీని అర్థం ఏమిటి?

చూసే నేను చూడబడే వస్తువు కాను.

అనుభవించే నేను ఎన్నటికీ అనుభవించబడలేను.

అన్నిటినీ చూసే కన్ను నన్ను ఎన్నటికీ చూడలేదు.

అందువల్ల ఆత్మను సరిగ్గా అర్థం చేసుకోవాలి. లేకపోతే, ఆధ్యాత్మిక ప్రయాణం చాలా సుదీర్ఘంగా సాగుతుంది. ధ్యానంలో కూర్చుని ఆత్మ అనుభవం కోసం ఎదురుచూసే ప్రమాదం ఉంది. ఆత్మజ్ఞానం పొందే విషయంలో రెండు ముఖ్య అంశాలు గుర్తుంచుకోవాలి.

**1. ఆత్మ అనుభవం పొందలేము–** ఆత్మజ్ఞానం పొందటం అంటే, నేను ఆత్మను అని బుద్ధిపరంగా తెలుసుకోవటం. ఆత్మ అనుభవం పొందలేము అని తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం. ఆత్మవల్లే తక్కిన అనుభవాలు పొందుతాము కాని

ఆత్మ అనుభవం ప్రత్యేకంగా పొందలేము. ఈ సత్యం రాబోయే మంత్రంలో ఇంకా స్పష్టంగా వస్తుంది. అందువల్ల వృత్తిలో మార్పురావాలి. ఇన్నాళ్ళూ డైకాటమీ పద్ధతికి అలవాటు పడ్డాము. డైకాటమీ అంటే ఒక వస్తువు గురించి ముందు తెలుసుకుంటాము. తర్వాత దానిని అనుభవిస్తాము. ఉదాహరణకు కాశీ గురించి ముందు తెలుసుకుంటాము. తర్వాత అక్కడికి వెళ్ళి ప్రత్యక్షంగా అనుభవిస్తాము. ఆత్మ విషయంలో అలా కాదు. తెలుసుకోవటం వేరు, అనుభవం వేరు కాదు. అనుభవం లేదని తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం.

**2. ఆత్మ శ్రోత్రస్య శ్రోత్రమ్–** నేను ఆత్మను అంటే ఆ నేను ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి. నేను శరీరం కాను. ఇంద్రియాలు కాను. మనస్సు కాను, ప్రాణం కాను. నేను వీటి వెనుకనున్న చేతనతత్త్వాన్ని. జడమైన వీటిని నడిపించే అధిష్ఠాన దైవాన్ని.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః – కేన 1-2**

దీని అర్థం ఏమిటి? ఆత్మ చెవికన్నా భిన్నంగా ఉండి, చెవి అంతా వ్యాపించి, చెవి, చెవిలా పనిచేయటానికి తోడ్పడుతుంది. ఈ ఉపనిషత్తును ఆధారంగా తీసుకునే చైతన్యం గురించిన, ఐదు లక్షణాలనూ కూర్చటం జరిగింది. వాటిని ఇంతకు ముందే చూశాము.

అందువల్ల చైతన్యాన్ని ఎలా తెలుసుకుంటాము? ఆబ్జెక్టుగా కాదు. అది చూసే వస్తువు కాదు, అనుభవించే వస్తువు అసలే కాదు. ఎందుకు? నేను ఆత్మను అనుభవించాను అంటే చాలు ఆత్మ ఆబ్జెక్టు అయి కూర్చుంటుంది. అందువల్ల ఆత్మ అనుభవించే వస్తువు కాదు. అనుభవించే నేనే ఆత్మను అనే వృత్తిజ్ఞానం.

పూజ్యస్వామీజీ ఈ విషయాన్ని చక్కగా వివరిస్తారు. మిమ్మల్ని ఎవరైనా వ్యక్తి వచ్చారా అని అడిగితే, ఒకసారి హాలంతా కలియజూస్తారు, వాళ్ళు వచ్చారో లేదో తెలుసుకోవటానికి. అలాగే హాలులో కరెంటు ఉందా లేదా అంటే అది గమనించి చూడాలి. కాని 'నువ్వు హాలులో ఉన్నావా,' అని మిమ్మల్ని అడిగితే, 'ఉండండి, ప్రమాణం ద్వారా తెలుసుకుని చెపుతాను,' అంటారా? లేదే! ప్రమాణం వాడకముందే నేను ఉన్నాను, ప్రమాణం వాడటానికి నేను ఉన్నాను. దీనికి తర్కం కూడా అవసరం లేదు.

పూజ్యస్వామీజీ తర్కం జోడిస్తే ఎలా ఉంటుందో హాస్యంగా చెపుతారు.

'నేను ఉండే ఉంటాను; ఎందుకంటే నాకు పెళ్ళి అయింది కాబట్టి, స్త్రీలు చురుకైన వారు. వారు ఉనికి లేనిదాన్ని పెళ్ళి చేసుకోరు కదా! నా భార్య నన్ను పెళ్ళి చేసుకుంది కాబట్టి, నేను ఉన్నాను.'

ఒక పాశ్చాత్యవేదాంతి 'నువ్వు ఉన్నావా,' అంటే 'నేను ఆలోచిస్తున్నాను, కాబట్టి నేను ఉన్నాను' అంటాడు. కాని అది నిజం కాదు. 'నిజానికి నేను ఉన్నాను, కాబట్టి నేను ఆలోచిస్తున్నాను. ఆత్మ స్వయం ప్రకాశకం. దాన్ని నిరూపించటానికి వేరే ప్రమాణం అవసరం లేదు. స్వయం ప్రకాశక 'నేను' మొదటి మంత్రంలో అడిగిన దేవుడిని. ఇది మహావాక్య మంత్రం యొక్క మొదటి అర్థం.

రెండవ అర్థం ఆత్మను తెలుసుకోలేము; ఆత్మను నేను అని స్వీకరించాలి. బ్రహ్మ అప్రమేయం. అంటే ప్రమాణాలకు అందదు.

గురువు దాన్ని రెండు దశల్లో చెప్పాడు– ఆత్మ లక్షణం, ప్రమాణం.

**1. లక్షణం– శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః**

దీని ద్వారా మూడు భావాలను చెప్పాడు.

ఎ) ఆత్మవేరు, చెవి వేరు

బి) ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.

సి) ఆత్మ ఉండటం వల్లనే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగు తున్నాము.

ఇదే సూత్రాన్ని తక్కిన నాలుగు అంగాలకూ వర్తింపజేయాలి. ఆత్మ లక్షణం చైతన్య తత్త్వం.

**2. ప్రమాణం – న తత్ర చక్షుర్గచ్ఛతి నా వాగ్గచ్ఛతి నో మనః**

ఆత్మ ప్రమాణానికందదు. ప్రమాణానికందితే ఆత్మ 'ఆబ్జెక్టు' (వస్తువు) అయిపోతుంది. ప్రమాణం చూపించేది ప్రమేయం అవుతుంది. ప్రమేయం అయితే అచేతన వస్తువు అవుతుంది. కాని ఆత్మ చేతన తత్త్వం. అందువల్ల అప్రమేయం. అప్రమేయం అంటే సర్వప్రమాణ అగోచరం.

కాని ఆత్మను తెలుసుకునే ప్రత్యేక ప్రమాణం ఉంది. అది శాస్త్ర ప్రమాణం. ఆత్మను ప్రమేయం చేయకుండా చూపిస్తుంది. అందువల్ల వేదాంతం ప్రమాణం కాని ప్రమాణం. వేదాంతం ఆత్మను ఒక మహావాక్యం ద్వారా నిర్వచించింది. ఇది ఇందులో మొదటి మహావాక్యం.

### 1. అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి

ఆత్మను తెలుసుకోలేము; ఆత్మను నేనే అని స్వీకరించాలి. నేను అన్నది ఏదో మర్చిపోకూడదు. నేను శరీరం కాను, ఇంద్రియాలు కాను, మనస్సు కాను, వీటన్నిటినీ సాక్షిగా చూసే సాక్షి చైతన్యాన్ని.

ఇంతకు ముందు చైతన్యం ఐదు లక్షణాలు చూశాము. ఇప్పుడు వేదాంతంలో ఐదు రత్నాలు చూద్దాము. (ఐదు చైతన్య లక్షణాలను, ఐదు వేదాంత రత్నాలను పరమార్థానంద స్వామీజీ వీటినుంచే ఏరానని చెప్పారు)

**ఐదు వేదాంతరత్నాలు–**

1. నేను శరీరం, ఇంద్రియాలు, మనస్సు కాను. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
2. శాంతి, ఆనందం, భద్రతలు నా నుంచే వస్తున్నాయి.
3. కేవలం నా ఉనికి వల్లే నా భౌతిక శరీరానికి ఉనికి ఏర్పడి, అది ఈ జగత్తులో వ్యవహారం నడపగలుగుతున్నది.
4. ఈ జగత్తులో ఏం జరిగినా అది నన్ను చలింపచేయలేదు.
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి, నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. నా స్వరూపనిష్ఠలో ఉండి, జీవితాన్ని ఒక ఆటగా మలచు కుంటాను.

దేహేంద్రియ మనోబుద్ధులు నేను కాదు; అవి నేను వేసుకునే దుస్తులు. పంచకోశాలు, ఐదు భాగాలు ఉన్న దుస్తులు. మనం దుస్తులు ధరించాలి కాని, నేను దుస్తులు అనుకోకూడదు. దేహేంద్రియ మనోబుద్ధులనే దుస్తులు ధరించటం వల్లనే నేను వ్యవహారం నడుపగలుగుతున్నాను. నేను సుషుప్తిలోకి వెళ్లినప్పుడు,

శరీరం అనే దుస్తులు లేవు, కాని, 'నేను' ఉన్నాను.

ఇంద్రియాలు అనే దుస్తులు లేవు, కాని 'నేను' ఉన్నాను.

మనస్సు అనే దుస్తులు లేవు, కాని 'నేను' ఉన్నాను.

శుద్ధ చైతన్యం అనే నేను మాత్రమే ఉన్నాను.

అందువల్ల దుస్తులు తొడుగుకోండి, వ్యవహారం నడపండి, కాని ఆ దుస్తులతో మమేకం చెందకుండా, మీరు ఆ దుస్తుల వెనుక ఉన్న అవ్యవహారి చైతన్యం అని మర్చిపోకూడదు. ఒక సినిమా హీరో తను బీదవాడిగా నటించినా,

ఆ పాత్రలో ఆ కాసేపు లీనమైనా కూడా, తను బీదవాడు కానని, ఎలా మర్చిపోడో అలా మనం కూడా శ్రోతగా, ద్రష్టగా, అనేక వేషాలు వేస్తున్నామని మర్చిపోకూడదు.

నేను శ్రోతను కాను, చెవి వెనుక ఉన్న అధిష్ఠాన దేవతను అని అర్థం చేసుకున్న కొద్దీ, మన అహంకార, మమకారాలు తగ్గుతాయి. అహంకార, మమకారాలు తగ్గితే, రాగద్వేషాలు తగ్గుతాయి. రాగద్వేషాలు తగ్గితే, సంసార బంధం తగ్గుతుంది. సంసార బంధం తగ్గితే, మోక్షమార్గం (తగ్గుతుంది అనకూడదు) బలపడుతుంది. తగ్గుతుంది అని ఎందుకంటున్నామంటే, అది రాత్రికి రాత్రి మాయమయిపోదు. వేదాంతం ఆధ్యాత్మిక ఎదుగుదలను క్రమంగా తీసుకువస్తుంది. విప్లవంలా రాదు.

ఈ విధంగా ఆత్మజ్ఞానాన్ని బలపరచుకోవాలి. ఆత్మజ్ఞానాన్ని బలపరచుకుంటే దాన్ని, ఆత్మనిష్ఠ అంటారు. శ్రవణ, మననాలు ఆత్మజ్ఞానాన్ని ఇస్తే, నిధి ధ్యాసనం ఆత్మనిష్ఠను ఇస్తుంది.

ఆత్మభావప్రబలీకరణం, జీవభావదుర్బలీకరణం.

## మన్త్రము - 5

**యద్వాచాఽనభ్యుదితం యేన వాగభ్యుద్యతే ।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥**

ఇది మొదటి మెట్టు. బాగానే ఉంది. కాని నేనేమిటి బ్రహ్మ ఏమిటి అనేది పెద్ద ప్రశ్న. ఆత్మ అన్నా బ్రహ్మ అన్నా చైతన్యం అన్నా ఒకటే అని అర్థం చేసుకోవాలి ముందు. బ్రహ్మ శుద్ధం, నిత్యం, సర్వవ్యాపకం. పరిపూర్ణం. మరి నేను? అశుద్ధం. అనిత్యం. పరిచ్ఛిన్నం. నేను ఏ పనీ చేయలేను; నా పిల్లలను కూడా అదుపులో పెట్టలేను. నన్ను కాపాడటానికి ఒక శక్తి కావాలి. వేదపూర్వభాగం ఆశక్తిని పరమాత్మ అంది.

మనం ఇప్పటివరకూ త్రిపుటిలో ఉన్నాము. త్రిపుటి అంటే మూడు– జీవి, జగత్తు, ఈశ్వరుడు. జీవి అనే నన్ను జగుత్తు బాధిస్తున్నది.కాబట్టి నేను ఈశ్వరునితో మొరపెట్టుకుంటాను. ఆయన రాజు. నేను సేవకుడిని. నేను ఆయనకు దాసోహం అంటాను. ఇదీ మన ప్రస్తుత పరిస్థితి.

వేదాంతం పూర్వభాగం నుంచి వేద అంతభాగానికి రమ్మంటున్నది.

భగవానునికి నేను దాసోహం అనటంలో రెండు దోషాలు ఎన్నుతున్నది.

1. భగవంతుడు ఆబ్జెక్టు కాదు.

2. నేను పరిచ్ఛిన్నుడిని కాదు.

దాసోహంలో 'దా' తీసేసి సోహం అనమంటున్నది. నేను పూజించే ఏ దేవుడైనా – విష్ణువు, శివుడు, దేవి, లక్ష్మి. ఆబ్జెక్టు కాదు ఆ దేవుడికీ, నాకూ భిన్నత్వం లేదు. ఇద్దరం చైతన్యతత్త్వమే.

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః**

**అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవ చ॥ గీత 10–20**

ఓ అర్జునా! నేను కృష్ణుడనే ఒక పరిచ్ఛిన్న జీవిని కాను. నేను ఆత్మను అంటాడు శ్రీకృష్ణపరమాత్మ. అందువల్ల వేదాంతం అంటే జగత్తు మీద ఆధారపడేస్థాయి నుంచి, పరమాత్మ మీద ఆధారపడే స్థాయికి వచ్చి, చివరకు ఆత్మ మీద ఆధారపడే స్థాయికి రావాలి. ఆత్మ అంటే ఏమిటో ఇప్పుడే చూశాము. దేహేంద్రియ మనోబుద్ధులు కాదు వాటికి అధిష్ఠాన దేవత.

కేనోపనిషత్తు చిన్న ఉపనిషత్తు అయినా మహాశక్తి వంతమైనది. ఇందులో ప్రతి ఒక్క మంత్రమూ ఒక మహావాక్యం.

**యద్వాచాఽనభ్యుదితం:–** వాక్కుతో ఆత్మను ఎన్నటికీ వర్ణించలేము. ఎందుకు? వాక్కు వ్యావహారిక జగత్తునే వర్ణించగలదు. కాని ఆత్మను వర్ణించలేదు. ఆత్మ అన్నప్పుడల్లా ఆత్మ గురించి ఇంతకు ముందు చెప్పిన ఐదు సూత్రాలను గుర్తు తెచ్చుకోవాలి. అందులో మొదటిది– నేను శరీరం, ఇంద్రియాలు, మనస్సు కాదు, నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.

**యేన వాగభ్యుద్యతే–** కాని ఆత్మ వల్లనే, వాగింద్రియం పనిచేయగలుగుతున్నది.

**తదేవ త్వం–** ఆ చైతన్యం నువ్వే! నువ్వు జడ శరీరం కాదు. దానికి చైతన్యాన్నిచ్చే చైతన్యానివి.

**బ్రహ్మ –** ఉన్నట్టుండి గురువు 'బ్రహ్మ' పదాన్ని ప్రవేశపెడుతున్నాడు. శిష్యుడు కూడా బ్రహ్మ గురించి అడుగుతాడు.ఆత్మ గురించి చెప్పేటప్పుడు ఏమన్నాము?

1. అది శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు. శరీరాన్నుంచి ఉత్పత్తి చెందింది కూడా కాదు.

2. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని ప్రకాశింపచేస్తుంది. ఆత్మ శరీరాన్నే ప్రకాశింపచేస్తుంది అంటే, ఇక్కడ శిష్యుడు పొరపాటు పడే అవకాశం ఉంది. ఎన్ని శరీరాలు ఉంటే, అన్ని ఆత్మలు ఉన్నాయి అనుకోవచ్చు. సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక దార్శనికుల మాట అది. ఎన్ని శరీరాలు ఉంటే, అన్ని ఆత్మలు ఉన్నాయి అంటారు వాళ్ళు.

అందువల్ల గురువు ఒకటే చైతన్యం ఉందని చెపుతున్నాడు. శరీరాలు అనేకం; కాని చైతన్యం ఒకటే. రెండు శరీరాల మధ్య ఖాళీ ప్రదేశంలో చైతన్యం ఉందా, లేదా? ఉంది! కాని దాన్ని ప్రతిబింబించే మాధ్యమం లేదు కాబట్టి ప్రకటితమవదు.

5. చైతన్యం శరీరం లేకపోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింప చేసే శరీరం లేదు కాబట్టి అది కనబడదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

జీవం ఉన్న వాటిల్లో 'చిత్' గానూ, జీవం లేని వాటిల్లో సత్‌గానూ ప్రకటితమవుతుంది. ఈ సత్‌చిత్ ఆత్మ అనంతం. బ్రహ్మ అంటే అనంతం.

**బృహత్తమత్వాత్ బ్రహ్మ**

బ్రహ్మ అంటే ఏమిటి? సత్ చిత్ ఆనందం. ఆత్మ అంటే ఏమిటి? సత్‌చిత్ ఆనందం. సత్ చిత్ ఆనంద బ్రహ్మ ఆత్మ ఎక్కడ ఉంది? దిక్కులు చూడకండి.

**తదేవ బ్రహ్మత్వం విద్ధి**

నువ్వే ఆ బ్రహ్మవని తెలుసుకో! ఈ ప్రార్థనతో రోజును ప్రారంభించండి.

**ప్రాతఃస్మరామి హృది సంస్ఫురదాత్మతత్త్వమ్।**
**సచ్చిత్సుఖం పరమహంసగతిం తురీయమ్।**
**యత్స్వప్నజాగర సుషుప్తియవైతి నిత్యం।**
**తద్బ్రహ్మ నిష్కలమహం న చ భూత సఙ్ఘః ప్రాతఃస్మరణమ్॥**

**నేదం యదిద ముపాసతే–** నిర్గుణ బ్రహ్మను అర్థం చేసుకోవటం కష్టం కాబట్టి, వేదం ముందు సగుణ బ్రహ్మను చూపిస్తుంది. అందువల్ల విష్ణు మూర్తిని, వైకుంఠ లోకాన్ని వర్ణిస్తుంది. విష్ణుమూర్తికి సహస్రనామ అర్చన, అష్టోత్తర అర్చన, ధ్యానం చేయండి. అలా పూజ చేయటం వల్ల సాధనచతుష్టయ సంపత్తి కలుగుతుంది. దాని ద్వారా అహం విష్ణు అస్మి అనే జ్ఞానం పొందాలి. దైవ సాక్షాత్కారం అయిందని కొంతమంది చెపుతారు. దాన్ని నమ్మాలా, వద్దా అనే చర్చలు అనవసరం. వేదాంతం

దాన్ని పట్టించుకోదు. చిత్తశుద్ధి పెంపొందించుకోవటానికి సాకార భగవంతుడిని కొలవండి కాని ఎప్పుడో అప్పుడు సగుణ ఈశ్వరుని నుంచి నిర్గుణ బ్రహ్మకు రండి అంటున్నది.

నిర్గుణ బ్రహ్మ ఉన్నాడా లేదా అనే సందేహం అవసరం లేదు. మీరు ఉన్నారా?లేదా అంటే మీరు ఏమో తెలియదు నా భార్యను అడిగి చెపుతాను అంటారా? మీరే ఆ నిర్గుణ బ్రహ్మ చైతన్యం కాబట్టి ఆ అనుమానానికి ఆస్కారం లేదు.

**అసన్నేవ స భవతి- అసద్ బ్రహ్మేతి వేద చేత్ - తైత్తిరీయం**

దేవుడు లేడు అంటే తను లేడని చెప్పినట్టే అవుతుంది. కాకపోతే ఆ 'నువ్వు' ఎవరన్నది మర్చిపోకూడదు. నువ్వు సాక్షి చైతన్యానివి. అందువల్ల సగుణ ఈశ్వరుడిని కర్మకాండలో, ఉపాసన కాండలో వర్ణించింది శాస్త్రం. ఎందుకు? జ్ఞానం పొందటానికి కాదు, సాధన చతుష్టయ సంపత్తి పొందటానికి. గీత

గీతలో కృష్ణపరమాత్మ మూడు స్థాయిల్లో ద్వైత భక్తిని వర్ణించాడు.

**1. ఆర్త భక్తి** - ఏదైనా కష్టం వస్తే అప్పుడు దేవుడికి పూజ చేస్తాడు.

**2. అర్థార్థి** - బిజినెస్ డీల్ లాంటిది. నాకు ఈ విజయం కలిగితే నీకు ఈ పూజ చేస్తాను అంటాడు.

**3. జిజ్ఞాసు భక్తి** - సాధన చతుష్టయసంపత్తి కోసం చేసే ప్రార్థన.

కాని ఎప్పుడో అప్పుడు ఈ దాసోహం భక్తి నుంచి, ద్వైత భక్తి నుంచి, అద్వైతభక్తికి రావాలి. అద్వైత భక్తి అంటే అద్వైత జ్ఞానం పొందటమే. గుర్తుంచుకోండి-

**ద్వైతభక్తి లేనిదే అద్వైతభక్తి అసాధ్యము**

**అద్వైతభక్తికి రానిదే ద్వైతభక్తి అసంపూర్ణము**

పూజ మొదలుపెట్టేముందు

అస్మిన్ బింబే మహాగణపతిం ధ్యాయామి, మహాగణపతిమ్ ఆవాహయామి

పూజ అయ్యాక -

యథాస్థానం మహాగణపతిం ప్రతిష్ఠాపయామి అంటాము.

వచ్చిపోయే దేవుడు సగుణ బ్రహ్మ. నిర్వికార బ్రహ్మ చైతన్యానికి, నా చైతన్యానికీ భేదం లేదు అని నేర్చుకోవాలి. అంటే దాసోహం నుంచి సోహంకు

రావాలి. ఎవరైనా ఇది కష్టం, నేను సోహం అనలేను అంటే వేదాంతం బలవంతపెట్టదు. సరే నువ్వు ద్వైతభక్తితోనే ఉండు అంటుంది కాని ఒక్కటి మాత్రం ఖచ్చితంగా చెపుతుంది. ద్వైతభక్తి మోక్షాన్ని ఇవ్వలేదు.

**ద్వితీయాద్వై భయం భవతి**

నేను ద్వైతభావనలో ఉంటే, నేను త్రిపుటిలో ఉంటాను. నేను దాసోహం అంటే నాకు సంచితకర్మలు ఉంటాయి. అవి కూడా అనాదిగా ఉంటాయి. అప్పుడు నన్ను, నేను కొలిచే భగవానుడు కూడా రక్షించలేదు. ఎందుకు? భగవానుడు కర్మఫలదాత కాబట్టి, నేను చేసుకున్న పుణ్యపాపాలకనుగుణంగా ఆయన నాకు సుఖదుఃఖాలను ఇస్తాడు. దానికి తగ్గట్టుగా జనన మరణాలను కూడా ఇస్తాడు. మరి అయితే నేనేం చేయాలి అని భగవానుని అడిగితే, 'దాసోహం పరిస్థితిలో ఉండకు. కేనోపనిషత్తు చదువు. సోహం స్థితికి రా. అదొక్కటే మోక్ష మార్గం' అంటాడు.

**నేదం యదిదముపాసతే**

ఇది చాలా శక్తివంతమైన వాక్యం. నువ్వు ఏ దేవుడిని అయితే ఆబ్జెక్టుగా కొలుస్తున్నావో ఆ దేవుడు అద్వైత బ్రహ్మ కాదు. జగత్‌మిథ్య అనే వాక్యంలో, ఆబ్జెక్టుగా కొలవబడే ఏ దేవుడైనా వస్తాడు. ఆబ్జెక్టుగా కొలవబడే దేవుడు ఆత్మ కాదు అని ఎందుకు అంటున్నాము అంటే ఆత్మ అసలు ఆబ్జెక్ట్ కాదు. సబ్జెక్ట్. అంతకుముందు మంత్రంలో ఏమని వచ్చింది?

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి** **కేన 1-4**

ఆత్మ తెలిసిన వస్తువు కాదు. తెలియని వస్తువు కాదు అంటే దాని అంతిమ అర్థం ఏమిటి? ఆత్మ అసలు వస్తువే కాదు అంటే ఆబ్జెక్టు కాదు. ఆత్మ ఆబ్జెక్టే కాదు అని నిరూపించాక, మనం కొలిచే దేవుళ్ళు ఆబ్జెక్ట్ అయినప్పుడు ఆత్మ కాదు అనే కదా అర్థం.

**గమనిక -** ఇక్కడ విషయం కొంచెం సూక్ష్మంగా ఉంటుంది. ఇక్కడ మనం దేవుడు లేడు అనటం లేదు; దేవుడిని పూజించవద్దనీ అనటం లేదు; దేవుడిని కాని, ఆయన శక్తిని కాని, ఆయన పూజను కాని శంకించటం లేదు. అదంతా ద్వైత భక్తిలోకి వస్తుందనీ, అద్వైతం అంటే నిరాకారబ్రహ్మ స్థాయికి ఎదగాలనీ వస్తుంది అంతే!

కర్మకాండలోనూ, ఉపాసనకాండలోనూ శాస్త్రం సగుణబ్రహ్మను వివరిస్తుందని చూశాము. అక్కడ భక్తి ముఖ్యం. ఆ వివరాలను ప్రశ్నించకూడదు. నిజంగా పాలసముద్రం ఉందా, దేవుడికి నాలుగు చేతులూ ఉన్నాయా, దేవుడు ఫలానా రాక్షసునితో నిజంగా యుద్ధంగానీ చేశాడా లాంటి ప్రశ్నలు వేయకూడదు. పురాణగాథలను విమర్శిస్తే, దేవుని మీద భక్తి పోతుంది. దేవుని ఉనికిని ప్రశ్నించకూడదు. కర్మ, ఉపాసనలను ఐహికసుఖాల కోసం వినియోగించుకోవచ్చు. సకామకర్మలు ఫలానివ్వవచ్చు, ఇవ్వకపోవచ్చు కూడా. శాస్త్రం అవి ఫలించి తీరతాయని ఎన్నడూ గ్యారంటీ ఇవ్వదు. కర్మ ఉపాసనలను చిత్తశుద్ధి కోసం, చిత్త ఏకాగ్రత కోసం ఉపయోగించండి.

నిజంగా దేవుడు ఉన్నాడా లేక అది శాస్త్రం యొక్క ఊహాగానమా? జగత్‌కర్త ఈశ్వరుడు ఉంటే, ఆయన స్వరూపం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు మీకు సమాధానం తెలుసుకోవాలని ఉంటే కర్మకాండ, ఉపాసనకాండల వద్దే ఆగిపోవద్దు. జ్ఞానకాండకు రండి. జ్ఞానకాండలో ప్రస్థానత్రయం గ్రంథాలు ఉంటాయి.

**భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు –**

జ్ఞానకాండకు రాగానే, శాస్త్రం చెపుతుంది. 'ఇంతవరకూ నువ్వు పూజ చేసుకోవటానికి వీలుగా ఈశ్వరుడిని ఇచ్చాను. అలాగే ధ్యానం చేసుకోవటానికి వీలుగా ఈశ్వరుడిని ఇచ్చాను. ఈశ్వరుడిని ఒక ఆబ్జెక్టుగా ఇచ్చాను. కాని నిజం చెప్పాలంటే, అసలు ఈశ్వరుడు పూజా వస్తువు కాదు. ధ్యాన వస్తువు కాదు,' నువ్వు పూజించే ఈశ్వరుడు, నువ్వు ధ్యానించే ఈశ్వరుడు అసలు ఈశ్వరుడు కాదంటే అసలు ఈశ్వరుడు ఎవరు? అది నువ్వే. అంటే నువ్వుగా స్వీకరించే ఈశ్వరుడు.

ఇప్పుడు మూడు విశేషణాలను చూశాము– 'నువ్వు పూజించే, నువ్వు ధ్యానించే, నువ్వుగా స్వీకరించే. నువ్వు పూజించే, నువ్వు ధ్యానించే పదాలు అధ్యారోపం. అంటే నామరూపాలు మాత్రమే.

**ప్రాతర్భజామి మనసో వచసామగమ్యమ్।**
**వా చో విభాన్తి నిఖిలా యదనుగ్రహేణ।**
**యం నేతి నేతి వచనైర్నిగమా అవోచుః।**

**తం దేవదేవమజమచ్యుతమాహురగ్ర్యమ్॥ - ప్రాతఃస్మరణమ్**

ఇది కాదు, ఇది కాదు. అయితే ఎవరు అసలు ఈశ్వరుడు?

నేను పూజించే దేవుడు బ్రహ్మ కాదు. దేవుడిని పూజించే నేను బ్రహ్మను.

నేను ధ్యానించే దేవుడు బ్రహ్మ కాదు. దేవుడిని ధ్యానించే నేను బ్రహ్మను. కాకపోతే ఆ పూజించే నేను, ధ్యానించే నేనులో, ఆ నేను అన్నది ఎవరో సరిగ్గా అర్థం చేసుకోవాలి.

**మనోబుద్ధ్యహఙ్కారచిత్తాని నాహం**

నేను భారీకాయమైన శరీరం కాదు; నేను రాగద్వేషాలతో నిండిన మనస్సు కాదు; నేను విషయవాంఛలకు లొంగే ఇంద్రియాలను కాను.

అవస్థాత్రయ సాక్షిచైతన్యాన్ని.

పంచకోశాతీత ఆత్మను.

మనోబుద్ధి అహంకారాల నుంచి సాక్షి చైతన్యానికి నా దృష్టి మరల్చగలిగి, నేను సాక్షి చైతన్యాన్ని అని అర్థం చేసుకోగలిగితే, గట్టిగా చెప్పగలను.

**చిదానన్ద రూపః శివోహం శివోహం**

శివుడు కైలాసంలోనే లేడు; అమరనాథ్‌లోనే లేడు. అంతటా ఉన్నాడు. అలాగని అమరనాథ్ యాత్రలు మాననవసరం లేదు. నిత్యపూజలు మాననవసరం లేదు. విషయం అర్థం చేసుకోవాలి.ఏమని? ఈశ్వరుని నామరూపాలతోనూ, ప్రదేశంతోనూ పరిచ్ఛిన్నం చేయకూడదు.

అందువల్ల జ్ఞానకాండకు వచ్చిన భక్తుడు ఈ విధంగా క్షమాపణ కోరుతాడు. 'ఓ దేవా, నిన్ను పూజిస్తున్నాను, ధ్యానిస్తున్నాను అనుకుంటూ నీకు నామరూపాలను ఇచ్చాను. ఇప్పుడు నాకు తెలిసింది, నువ్వు నామరూపాలకతీతుడవని; ఎందుకంటే నామరూపాలు పరిచ్ఛిన్నం చేస్తాయి.' ఎంత అద్భుతమైన ప్రార్థనో చూడండి. నామరూపాలు పరిచ్ఛిన్నం చేస్తాయట. అంతేకాదు, 'నీకు నామరూపాలు ఇచ్చి పరిచ్ఛిన్నం చేయటమే కాదు, నీమీద అష్టోత్తరాలు, సహస్రనామాలు చెప్పి నిన్ను కీర్తిస్తున్నాననుకున్నాను కాని మాటలకందని నిన్ను మాటలకు పరిమితుడిని చేస్తున్నానని తెలియలేదు,' అంటాడు.

'ఓ భగవాన్, నువ్వు సర్వసగుణాభిరాముడివి,' అంటే చెడు లేదు అని అర్థం వస్తుంది. భగవంతునికి ఒకటి లేదు అంటే, ఆయనకు పరిమితి విధించినట్టే.

ఒకటి చెప్తే ఇంకోటి లేనట్టే. ఏ పదంతో వర్ణించినా పరిమితి విధించినట్టే.

**యతో వాచో నివర్తన్తే॥**

మాటలకందని చైతన్యం ఆయన. అలాగే 'ద్వాదశ జ్యోతిర్లింగాలు, 108 దివ్యక్షేత్రాలలో చూశాను నిన్ను గొప్పగా కొలుస్తున్నాననుకుంటూ.' కాని నిన్ను చూడటానికి ఒక ప్రాంతానికి వెళ్ళానంటే, నువ్వు ఇంకో ప్రాంతంలో లేనట్టు భావించినట్టు తెలియదు. నిన్ను ప్రాంతానికి పరిమితం చేశానని తెలియలేదు. నన్ను క్షమించు' అని ప్రార్థిస్తాను.

**రూపం రూపవివర్జితాయ భవతే ధ్యానాయ యత్కల్పితమ్।**
**స్తుత్యా నిర్వచనీయతాఖిలగురో దూరీకృతా యన్మయా।**
**వ్యాపిత్వం చ నిరాకృతం భగవతో యత్ తీర్థయాత్రాదినా।**
**క్షన్తవ్యం జగదీశ తద్వికలతా దోషత్రయం మత్కృతమ్॥**

**రూపం రూప వివర్జితాయ భవతే–** నువ్వు సర్వవ్యాపకుడివి. అందువల్ల నిరాకారుడివి. కాని నేను ధ్యానం చేయటం కోసం ఏం చేశాను?

**ధ్యానాయ యత్కల్పితమ్ –** నిన్ను కల్పన చేశాను.

**స్తుత్యానిర్వచనీయతా–** అనిర్వచనీయమైన నిన్ను, సహస్రనామాలతో స్తుతించాను.

**అఖిలగురో దూరీకృతా యన్మయా –** అనిర్వచనీయమైన నీ అసలు స్వరూపాన్ని తెలుసుకోలేకపోయాను.

**వ్యాపిత్వం చ నిరాకృతం భగవతో యత్ తీర్థయాత్రాదినా–** తీర్థయాత్రలు చేయటం ద్వారా, సర్వవ్యాపకమైన నిన్ను ఇక్కడ లేవు అన్నాను.

అక్కడ ఉండే పాండురంగడు ఇక్కడే ఉన్నాడు.

ఈ విషయం తెలియలేదు.

**క్షన్తవ్యం జగదీశ తద్వికలతా దోషత్రయం మత్కృతమ్**

కేనోపనిషత్తు అధ్యయనం చేసి, అర్థం చేసుకున్నాక, నేను మూడు దోషాలు చేశానని తెలిసింది స్వామీ– నన్ను క్షమించు.

ఈ ప్రార్థన విన్నాక, మిమ్మల్ని పూజలు మానమని, తీర్థయాత్రలు మానమని చెప్పటం లేదు. ఆ మాటకొస్తే, ఈ క్షమాపణ కోరాక కూడా, జ్ఞాని దేవుడిని

పూజించటం మానడు! కాకపోతే, అతని దృక్పథం మారుతుంది. ఇప్పుడు కృతజ్ఞతాపూర్వకంగా ఉంటుంది అతని ప్రార్థన.

**ఆ జీవితం త్రయం సేవ్యన్ వేదాన్తో గురురీశ్వరః।**
**ఆదౌ జ్ఞానాప్తయే పశ్చాత్ కృతజ్ఞత్వ నివృత్తయేత్॥**

జీవితాంతం ముగ్గురిని పూజించాలి. వేదాంతం, గురువు, ఈశ్వరుడు. ప్రారంభంలో జ్ఞానప్రాప్తికి, తర్వాత కృతజ్ఞత చూపించటానికి. దేనికి కృతజ్ఞత? ఉన్నదొకటే సత్యం అది బ్రహ్మ. ఆ బ్రహ్మ నేనేనని ఈ ముగ్గురూ నేర్పించినందుకు. జీవ, జగత్తు, ఈశ్వరునిగా భిన్ననామాలతో కనబడేదంతా అద్వితీయ బ్రహ్మ. ఈ విషయం అర్థం చేసుకున్నాక, ఇంక నామరూప ప్రపంచం గురించి ఎక్కువగా పట్టించుకోనవసరం లేదు. మిథ్య గురించి కాలం వృథా చేయకండి. సత్యంలో నిలవండి.

**నేదం యదిదముపాసతే - న ఇదం యత్ ఇదం ఉపాసతే-** నువ్వు పూజించే, నువ్వు ధ్యానించే ఈశ్వరుడు అసలు బ్రహ్మ కాదు. మరి అసలు బ్రహ్మ ఎవరు? **తదేవ బ్రహ్మ త్వం విద్ధి- త్వం ఏవ బ్రహ్మ ఇతి విద్ధి -** పూజించే నువ్వు, ధ్యానించే నువ్వు బ్రహ్మవు. చాలా లోతైన, గంభీరమైన వాక్యం. మీ ఇష్టదేవత మీద మీకు అనురాగం ఉంటే మిమ్మల్ని కలత చెందించే వాక్యం. కాని మీరు సత్యాన్వేషులు అయితే మాత్రం, భావానికి తావివ్వకూడదు.

**అహం బ్రహ్మ అస్మి**

వేదాంతం నువ్వే బ్రహ్మవు అంటుంది. వేదాంతం జ్ఞానప్రధానం. భావ ప్రధానం కాదు. భక్తిభావ ప్రధానంగా ఉంటుంది. ఆర్తభక్తితో కళ్ళు చెమరుస్తాయి. హృదయం కదిలిపోతుంది. అవన్నీ చేయండి, తప్పులేదు. కాని ఆర్తభక్తి నుంచి ఎదగండి. ఆర్తభక్తి, అర్థార్థిభక్తి నుంచి జిజ్ఞాస భక్తికి వచ్చి, అద్వైతభక్తి లేదా జ్ఞానభక్తికి రండి. ఈ శ్లోకం పరిపక్వత చెందిన భక్తులకు లోతైన సందేశం. ఆర్తభక్తులను కలత చెందించే వాక్యం.

## మన్త్రము - 6

**యన్మనసా న మనుతే యేనాహుర్మనో మతమ్ ।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥**

ఇంకో అద్భుతమైన, అతి ముఖ్యమైన మంత్రం. ఆత్మజ్ఞానం గురించి ఉన్న అనేక అపోహలను తొలగిస్తుంది ఇది.

**యన్మనసా న మనుతే –** బ్రహ్మ నీ మనస్సు లేదా ఆలోచన చూసే ఆబ్జెక్టు కాదు. బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోలేము. ఆబ్జెక్టుగా అనుభవించలేము.

మనస్సు తెలుసుకునే ఆబ్జెక్టు కాదు బ్రహ్మ

బ్రహ్మ చూసే ఆబ్జెక్టు మనస్సు

చూడండి విషయం! మనస్సు ద్వారా బ్రహ్మను తెలుసుకోలేము. ఎందుకంటే అన్నింటినీ మనస్సు చూస్తే, మనస్సుని బ్రహ్మ చూస్తుంది.

జగత్తుపరంగా, మనస్సు సబ్జెక్టు, జగత్తు ఆబ్జెక్టు

మనస్సు పరంగా, బ్రహ్మ సబ్జెక్టు, మనస్సు ఆబ్జెక్టు.

అందువల్ల ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూస్తుంది బ్రహ్మ లేదా ఆత్మ.

దీనికొక అద్భుతమైన ఉదాహరణనిస్తారు స్వామీ చిన్మయానందులవారు. టార్చిలైటు చీకటి గదిని ప్రకాశవంతం చేస్తుంది. అవునా? అందులో అంత ప్రకాశవంతం చేస్తున్న బ్యాటరీలు ఏమున్నాయో చూడాలనుకున్నారనుకోండి! ఏమవుతుంది? బ్యాటరీలు తీయగానే కాంతి పోతుంది; బ్యాటరీలను చూడలేరు. అంటే టార్చిలైటు కాంతిలో టార్చిలైటుకి కాంతినిచ్చే బ్యాటరీలను చూడలేరు. అలాగే, జగత్తును టార్చిలైటు కాంతిలా చూడటానికి మనస్సుకు కాంతినిచ్చే ఆత్మను చూడలేరు. ఆత్మను బయటకు తెచ్చి, మనస్సుతో చూద్దామంటే అది సాధ్యం కాదు.

ఆత్మ అంటే మనస్సుకు ఇటువైపు ఉన్న నేను, మనస్సుకు అటువైపు ఉన్న వస్తువు కాదు.

**యన్మనసా న మనుతే –** మనస్సు వల్ల ఎన్నటికీ తెలుసుకోబడనిది.

**యేనాహుర్మనో మతమ్ –** కాని ఆత్మ వల్లనే మనస్సు తెలియబడుతుంది.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి–** ఆ బ్రహ్మ నువ్వే అని తెలుసుకో.

ఈ మంత్రం వల్ల మనకు కలిగే అసాధారణ అనుభవాలు ఆత్మ కాదని అర్థమవుతుంది. ధ్యానంలో అనేక అనుభవాలు కలుగుతాయి. అవి ఆత్మనా,

అనాత్మనా? వచ్చిపోయేదేదైనా అనాత్మనే. అనుభవం రాకముందు, అనుభవం వచ్చాకా, అనుభవం వచ్చిపోయాకా- మూడు దశల్లోనూ ఉన్న 'నేనే' ఆత్మను- అసాధారణ అనుభవాలు కలుగుతాయి. దాన్ని ఖండించటం లేదు. కాని అర్థం చేసుకోవాల్సిన విషయం అవి ఆత్మజ్ఞానాన్ని లేదా ఆత్మ అనుభవాన్ని కలుగజేయవు.

ఈ సందర్భంలో ధ్యానంలో కలిగే కొన్ని అనుభవాలను చూద్దాము. కాని అవి చూసే ముందు శబ్దం గురించి కొంత తెలుసుకోవాలి. శబ్దాలు రెండు రకాలు.

**1. ఆహత శబ్దమ్-** ఎ) రెండు వస్తువులు కలిస్తే చప్పుడు అవుతుంది. ఉదాహరణకు రెండు చేతులు కలిస్తే చప్పట్లు వస్తాయి.

బి) ఒక వస్తువు విడదీస్తే కూడా చప్పుడు అవుతుంది. ఉదాహరణకు ఒక కాగితాన్ని చింపితే టర్ర్ర్ర్ శబ్దం వస్తుంది.

**2.అనాహత శబ్దమ్-**ఇది స్థూల చెవులకు వినబడదు. ఆకాశంలో శబ్దగుణం ఉందని నేర్చుకుంటాము. వినబడని శబ్దం ఆకాశంలో ఉంది.

ఇప్పుడు ధ్యానంలో కలిగే అనుభవాలు చూస్తే-

**1. అనాహత ఓఙ్కార శబ్దం-** కొంతమందికి ధ్యానంలో అనాహత ఓంకార శబ్దం వినిపిస్తుంది. మనలో కూడా ఆకాశం ఉంది కాబట్టి, ధ్యానంలో ఓంకార శబ్దం వినిపిస్తుంది. శాస్త్రం చెపుతుంది ఆ విషయం.

**2. రంగులు, శబ్దాలు-** కొంతమందికి కొన్ని రంగులు కనిపిస్తాయి. మరికొంత మందికి ఏవో శబ్దాలు వినిపిస్తాయి. ఉదాహరణకు గంట మోగుతున్న చప్పుడు. శ్వేతాశ్వతర ఉపనిషత్తులో వస్తుంది ఆ విషయం.

**3.సువాసనలు-** కొంతమందికి అనేక సువాసనలు వస్తాయి. యోగశాస్త్రం విభూతిపాదంలో ఇటువంటి అనేక విభూతులను పేర్కొంటుంది. కాని అదే యోగశాస్త్రం చివర్లో ముక్తాయింపుగా ఒక మాట వేస్తుంది. **'ఈ విభూతులు ఆధ్యాత్మిక మార్గానికి ఆటంకాలు. అవి ఆత్మజ్ఞానాన్ని ఇవ్వవు.** ఆత్మజ్ఞానం ఏమిటి? వచ్చిపోయే విభూతుల వెనుకనున్న నేను ఆత్మను. విభూతుల దగ్గరే ఆగిపోతే అవి ఆటంకాలుగా మారుతాయి.

వేదాంత ధ్యానంలో ఏం చేయాలి నేను? 'శరీరత్రయం సాక్షి, అవస్థాత్రయ విలక్షణం, పంచకోశ అతీతం అయిన నేను బ్రహ్మను. మూడు కాలాల్లోనూ ఉండే నేను, బ్రహ్మను. నేను రాగద్వేషాలకతీతుడను. **'అహం బ్రహ్మ అస్మి ','సత్యం,'**

అని ధ్యానం చేయాలి. జాగ్రదావస్థలో **అహం బ్రహ్మ అస్మి**లో నిలబడగలగాలి.

**నేదం యదిదముపాసతే–** నువ్వు ప్రార్థించే దేవునికి అనాత్మకున్న ఐదు లక్షణాలు ఉన్నాయి. ఏమిటవి? ఆగమాపాయిత్వం, దృశ్యత్వం, భౌతికత్వం, సగుణత్వం, సవికారత్వం. ఆత్మకు ఇవి అంటవు.

### మన్త్రము – 7

**యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూగ్ంషి పశ్యతి ।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥**

**యచ్చక్షుషా న పశ్యతి –** కంటితో చూసేది ఏదీ బ్రహ్మ కాదు. మన పురాణాల్లో దేవుని వర్ణన చాలా ఉంటుంది. చాలా బాగుంటుంది కూడా.

**అధరం మధురం వదనం మధురం**

ఈ వర్ణన కర్మకాండలోనూ, ఉపాసన కాండలోనూ కావాలి. అప్పుడే మనం ఇష్టదేవతను ప్రార్థించగలము. జగత్తునుంచి బంధం తప్పించుకోవటానికి ఇష్టదేవత మీద ఆరాధన పెంచుకోవాలి. కాని అక్కడే ఆగిపోకూడదు. అందుకే ఉపనిషత్తు నువ్వు కంటితో చూసేది అసలు బ్రహ్మ కాదు అంటున్నది.

చూసే నేను ఈశ్వరుడిని అనే జ్ఞానం కలిగేవరకూ ఇష్టదేవత ఉండాలి. మనస్సు పరిపక్వత చెందాక, ఆత్మ విచారణ చేయవచ్చు. శాస్త్రం అందుకే ఆత్మ విచారణను ముందే ప్రవేశపెట్టలేదు. దాన్ని వేద అంతభాగంలో పెట్టింది. అందుకే ఎన్నడూ మతాన్ని కాని, పూజను కాని, దేవాలయానికి వెళ్ళటాన్ని కాని విమర్శించకండి. 'అదే అంతిమలక్ష్యం కాదు,' అని మాత్రం చెప్పండి చాలు. వేదాంత విద్యార్థులు కూడా పూజచేస్తారు. ఒకవేళ మీరు వేదాంతానికి వచ్చి పూజలకు అతీతంగా ఎదిగి, నిధి ధ్యాసనంలో ఉంటే ఉండండి. కాని పూజ కొనసాగించే వాళ్ళను చూసి విమర్శించటమో, ఏడిపించటమో చేయకండి. వేదాంత విద్యార్థికి ఉండాల్సిన మొట్టమొదటి విలువ అమానిత్వం. వినయంగా ఉండండి. ఎవరినీ, దేనినీ విమర్శించకండి. **విద్యావినయ సమ్పన్నే.**

**యేన చక్షూంషి పశ్యతి–** దానివల్లనే కన్నులు పనిచేస్తున్నాయి. రెండవపాదం అన్ని మంత్రాల్లో ఒకటే. అది ఒక మహావాక్యం!

## మన్త్రము - 8

**యచ్ఛ్రోత్రేణ న శృణోతి యేన శ్రోత్రమిదగ్ం శ్రుతమ్ ।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥**

**యచ్ఛ్రోతేణ న శ్రుణోతి** - అదే పద్ధతిలో కొనసాగుతున్నది. బ్రహ్మను చెవుల ద్వారా వినలేము.

**యేన శ్రోత్రమిదగ్ం శ్రుతమ్**- దానివల్లనే వినగలుగుతున్నాము. చెవులు పనిచేస్తున్నాయో లేదో చూడటానికి ఆడియోగ్రామ్ పరీక్ష చేస్తారు ఒక శబ్దం వినిపించి, వినిపిస్తోందా అని అడుగుతాడు. ఈ పరీక్షలో శబ్దం ఏమిటన్నది ముఖ్యం కాదు. మన చెవి ఆ శబ్దాన్ని వినగలుగుతోందో లేదో ముఖ్యం. అంటే శ్రవణేంద్రియాన్ని నాకు భిన్నంగా, ఒక ఆబ్జెక్టుగా చూస్తున్నాను. దీన్ని బట్టి ఏమిటి అర్థమవుతున్నది? మనస్సు విషయంలో చెప్పినట్టుగానే, ఇప్పుడు కూడా చెపుతాము.

జగత్తు పరంగా, చెవి సబ్జెక్టు, జగత్తు ఆబ్జెక్టు.

చెవిపరంగా, బ్రహ్మ సబ్జెక్టు, చెవి ఆబ్జెక్టు.

నేనెవరు? నేను శ్రోత్రం.శ్రోత్రంకీ, శ్రోత్రస్య శ్రోత్రంకీ తేడా చూశారా? యేన శ్రోత్రమిదం శ్రుతమ్ అంటే దానివల్లనే చెవికి చెవిశక్తి వచ్చింది.

రెండవపాదం అన్ని మంత్రాల్లో ఒకటే. అది ఒక మహా వాక్యం.

## మన్త్రము - 9

**యత్ప్రాణేణ న ప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే ।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥**

**యత్ప్రాణేన న ప్రాణితి:**- అదే పద్ధతిలో కొనసాగుతున్నది. బ్రహ్మను ప్రాణం ద్వారా తెలుసుకోలేము. కాకపోతే, ఇక్కడ ప్రాణం అంటే పంచప్రాణాలు కాదు. ఘ్రాణేంద్రియం.

ప్రాణం మాటకు మూడు అర్థాలు ఉన్నాయి. పంచప్రాణాలు, ఇంద్రియాలు, ఘ్రాణేంద్రియం. ఇక్కడ ఘ్రాణేంద్రియం అర్థం తీసుకున్నారు శంకరాచార్యులు. అంటే వాసన చూడటం. ఏదైనా వాసన చూడటానికి ఏం చేస్తాము? ఊపిరి పీలుస్తాము.

**యేన ప్రాణః ప్రణీయతే –** కాని దాని వలన ఘ్రాణేంద్రియం పనిచేయగలుగుతున్నది. రెండవపాదం అన్ని మంత్రాల్లో ఒకటే. అది ఒక మహావాక్యం.

ఆత్మ అనుభవించబడే వస్తువు (ఆబ్జెక్టు)కాదు, అనుభవించే నేను (సబ్జెక్టు)

**ప్రత్యేక విశ్లేషణ–** ఆత్మ తెలుసుకునే వస్తువు కాదు. అందువల్ల తెలుసుకోవాలనే ప్రయత్నం చేసి లాభం లేదు అంటున్నది ఉపనిషత్తు. ఎందుకు? ఆత్మ తెలుసుకునే నేను కాబట్టి.

తెలుసుకునే వస్తువు– ప్రమేయం

వాడే ఇంద్రియం– ప్రమాణం

తెలుసుకునే నేను– ప్రమాతా

పొందే జ్ఞానం– ప్రమా

మామూలుగా ఏం చేస్తాం? ఒక వ్యక్తి ఒక వస్తువును గురించిన జ్ఞానాన్ని ఒక పరికరం ద్వారా పొందుతాడు. అంటే ప్రమాత. ప్రమాణం ద్వారా (ఉదా–కన్ను) ప్రమేయం (ఉదా– గులాబీ) గురించిన ప్రమా పొందుతాడు. కాని ప్రమాత తనను తాను ప్రమాణం ద్వారా తెలుసుకోలేడు. ఎందుకు? ప్రమాత ప్రమాణంకు ఎదురుగా లేడు. ప్రమాణం వెనుక ఉన్నాడు. అంతటినీ చూసే కన్ను తనను తాను చూసుకోలేనట్టుగా ప్రమాత తనను తాను తెలుసుకోలేడు. అయితే కన్ను పనిచేస్తోందని ఎలా తెలుసు? నేను చూసే ప్రతి వస్తువూ నా కన్ను బాగా పనిచేస్తోందని చెపుతుంది. అలాగే ప్రమాత అయిన నేను ఉన్నాను అని తెలుస్తుంది? నేను పొందే ప్రతి అనుభవం ప్రమాత అవటం వల్లే పొందుతున్నాము. ఈ విషయం వివరంగా రెండవ అధ్యాయంలో వస్తుంది.

**ప్రతిబోధవిదితం మతం కేన - 2-4**

శాస్త్రం చెపుతున్నది–

1. ప్రమాతను తెలుసుకోలేము.
2. ప్రమాతను తెలుసుకోనవసరం లేదు, ఒక ప్రత్యేక అనుభవం ద్వారా
3. ప్రమాత వల్లే ప్రతి అనుభవం జరుగుతున్నది.

అందువల్ల ఒక్కముక్కలో చెప్పాలంటే, ఆత్మజ్ఞానం అంటే ఆత్మజ్ఞానం పొందాలనే కోరికను వదులుకోవటమే. ప్రతి ఒక్క అనుభవంలోనూ ఆత్మ ఉన్నది.

ఆత్మసాక్షాత్కారం ఎప్పుడు పొందుతాము అని అడిగితే, విషయం అర్థం కానట్టు లెక్క. ఎందుకంటే నువ్వే ఆ ఆత్మవు. కాని ఇక్కడ ఒక విషయం గమనించాలి.

ఆత్మ ప్రమాత అన్నాము. ప్రమాత ఎప్పుడవుతుంది? ప్రమేయం ఉంటేనే.

నేర్చుకునే ప్రమేయం లేదు; వాడే ప్రమాణం లేదు అంటే ప్రమాత అయిన నేను లేనట్టా? నేను లేదనకూడదు. నా ప్రమాతృత్వం లేదు. నా అసలు స్వరూపం ప్రమాత కాదు, చైతన్యం. ఉదాహరణకు శిష్యులు ఎదురుగా ఉన్నంతసేపు గురువును గురుత్వం ఉంటుంది. వాళ్ళు వెళ్ళిపోగానే, గురువు లేరనకూడదు. గురువు అలాగే ఉంటారు. కాకపోతే గురుత్వం ఉండదు.

ఆత్మను రెండు లక్షణాల ద్వారా నిర్వచిస్తాము.

**1. తటస్థలక్షణం–** తాత్కాలిక లక్షణం. ఉదా– ప్రమాతా.

**2. స్వరూపలక్షణం–** స్వాభావిక లక్షణం. (దీనికి ఉదాహరణలు ఉండవు) ఇది చైతన్యం.

తదేవ అంటే ప్రమాణం ఉంటే ప్రమాతా అయి, ప్రమాణం లేకపోతే ప్రమాతృత్వం లేని చైతన్యం ఏదైతే ఉందో అది బ్రహ్మ. అంటే ఆత్మ మూడు అవస్థల్లోనూ ఉంది. అందువల్ల సమాధి స్థితిలో ఆత్మ సాక్షాత్కారం పొందుతామను కోవటం పొరపాటు. ఆత్మ ఎప్పుడు అనుభవించగలం అని అడిగితే ఎప్పుడు అనుభవించటం లేదు అని అడుగగలగాలి.

## అధ్యాయం - 1 సారాంశం

ఆత్మ నిర్వచనం దశలవారీగా వస్తుంది.

1. ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు.

    ఆత్మ అసలు ఆబ్జెక్టే కాదు.

2. ప్రమాణాల వల్ల ఆత్మను తెలుసుకోలేము.

    ఆత్మ ప్రమాణాలను వాడే ప్రమాతా.

3. ప్రమేయం ఉంటేనే ప్రమాతృత్వం ఉంటుంది.

    ఆత్మ చైతన్యం.

4. ఈ ఆత్మే బ్రహ్మ

    తదేవ బ్రహ్మ త్వం విద్ధి

5. అనుభవించే నేను బ్రహ్మను. అనుభవించబడే వస్తువు కాదు.

అందువల్ల ఆత్మ అనుభవం కోసం వెతకకూడదు. అన్ని అనుభవాలూ ఆత్మ వల్లే అవుతున్నాయి.

నేనే బ్రహ్మను; సాక్షి చైతన్యాన్ని; ఆత్మను.

సాక్షి చైతన్యమైన నన్ను ఇంద్రియాలు, మనస్సు తెలుసుకోలేవు కాని నా వల్లే అవి పనిచేస్తున్నాయి.

శిష్యుడు- మనస్సు, ప్రాణం, వాక్కు, చక్షువు, శ్రోత్రం దేనివల్ల పనిచేస్తున్నాయి?

గురువు- మనస్సుకు మనస్సు, వాక్కుకు వాక్కు, ప్రాణానికి ప్రాణం, చక్షువుకు చక్షువు, శ్రోత్రానికి శ్రోతం అయిన సాక్షిచైతన్యం వల్ల అవి పనిచేస్తున్నాయి. వాటి ద్వారా సాక్షి చైతన్యాన్ని తెలుసుకోలేము. కాని సాక్షి చైతన్యం వల్లే అవి పనిచేస్తున్నాయి.

ఇక్కడితో వేదాంత బోధలోని శ్రవణం ముగిసింది.

# కేనోపనిషత్తు

## అధ్యాయము - 2

వేదాంతబోధ మూడు దశల్లో సాగుతుంది. శ్రవణం, మననం, నిధిధ్యాసనం. మొదటి అధ్యాయంతో శ్రవణం ముగిసింది. ఇందులో మననం భాగం చూస్తాము. శ్రవణం దశలో విద్యార్థి నిశ్శబ్దంగా వింటాడు. విషయాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఏవైనా సందేహాలు కలిగినా అప్పుడు అడగకూడదు. మననం దశలో తీర్చుకోవాలి. నేను ఈ విషయాన్ని అంగీకరించగలనా అని ప్రశ్న వేసుకోవాలి. ఏవైనా సందేహాలు కలిగితే, తనలో తనే విశ్లేషించుకోవచ్చు. తోటి విద్యార్థులతో చర్చించుకోవచ్చు. లేదా గురువును మళ్ళీ అడుగవచ్చు.

మననంలో బ్రహ్మ అనుభవం కోసం చూడకూడదు. ఎందుకంటే బ్రహ్మ అనుభవం చైతన్యరూపంలో ఎప్పుడూ కలుగుతూనే ఉంటుంది. వేదాంతం అంటే అనుభవించేది కాదు, అర్థం చేసుకునేది. బుద్ధిలో కలిగే జ్ఞానం.

మొదటి అధ్యాయంలో ఆత్మను గురువు నిర్వచించాడు. 'శ్రోత్రస్య శ్రోత్రం' అన్నాడు. చెవి కాదు, చెవికి భిన్నంగా ఉండి చెవికి చైతన్యాన్నిచ్చేది అని చూశాము. అంతేకాదు ఆత్మ అన్నా, చైతన్యం అన్నా, బ్రహ్మ అన్నా ఒకటే అని కూడా చూశాము. చైతన్యం శరీరం హద్దులకే పరిమితమవలేదు కాబట్టి బ్రహ్మ అంటారు.

బ్రహ్మ అంటే బృహతమత్వాత్ ఇతి బ్రహ్మ - అన్నిటికన్నా పెద్దది.

ఆత్మ అంటే సర్వం ఆప్నోతి ఇతి ఆత్మ - సర్వవ్యాపకం

ఈ బ్రహ్మ లేదా ఆత్మ ఆబ్జెక్టు కాదు అని చెప్పాడు గురువు.

అన్యదేవ తద్విది తాద థో అవిదితాదధి

ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు అన్నాడు.

తదేవ బ్రహ్మత్వం విద్ధి

ఆ బ్రహ్మావు నువ్వే అని తెలుసుకో అన్నాడు.

ఇప్పుడు ఇంతా చెప్పి, శిష్యుడు ఎంత బాగా అర్థం చేసుకున్నాడో పరీక్షించదలచుకున్నాడు గురువు. అతన్ని ఇరకాటంలో పెట్టాలనుకున్నాడు కాని శిష్యుడు బ్రహ్మాండంగా గెలిచాడు పరీక్షలో. శంకరుల వారు- 'సింహవతు జగర్జ'

అన్నారు శిష్యుడిని. సింహంలా గర్జించాడుట అతని జవాబుతో. ఆ వివరాలు మంత్రంలో చూద్దాము.

**మన్త్రము - 1**

**యది మన్యసే సువేదేతి దభ్రమేవాపి నూనమ్।**
**త్వం వేత్థ బ్రహ్మణో రూపం యదస్య త్వం యదస్య దేవేష్వథ**
**ను మీమాగ్ంస్యమేవ తే మన్యే విదితమ్ ॥**

గురువు ఆత్మ గురించి వివరించాక ఆత్మ గురించి అర్థం అయిందా అని అడిగాడు. శిష్యుడు నాకు తెలుసు అంటే ఆత్మ తెలిసిన వస్తువుల పరిధిలోకి వస్తుంది. శిష్యుడు నాకు తెలియదు అంటే ఆత్మ తెలియని వస్తువుల పరిధిలోకి వస్తుంది. శిష్యుడు మౌనంగా ఉండిపోతే జవాబు చెప్పని పొగరు కనిపిస్తుంది. అలా శిష్యుడిని ఇరకాటంలో పెట్టాడు గురువు. కాని శిష్యుడు గురువును మించిన శిష్యుడు అయ్యాడు.

**మన్యే విదితమ్ -** నాకు తెలుసు బ్రహ్మ అన్నాడు. అది కూడా సింహంలా గర్జించి చెప్పాడు. అతని ఉద్దేశ్యం నాకు మీ బోధ బాగా అర్థమయింది. ఈ విషయాన్ని వివరంగా తర్వాత వచ్చే మంత్రంలో చూస్తాము.

ఇప్పుడు మంత్రం చూద్దాము. యది మన్యసే నుంచి మీమాగ్ంస్యమేవతే వరకూ గురువు మాట. మన్యే విదితమ్- శిష్యుని జవాబు.

**యది మన్యసే సువేదేతి-** సు వేద ఇతి మన్యసే యది-ఒకవేళ నువ్వు ఇలా అనుకుంటే- బ్రహ్మను ఆబ్జెక్టుగా చక్కగా తెలుసుకున్నాను అని అనుకుంటే అంటున్నాడు గురువు. సు అంటే వస్తువు. గురువు ఏమని బోధించాడు?

అన్యదేవ తద్విది తాదథో అవిదితాదధి

ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు అన్నాడు. అంటే ఆత్మ అసలు ఆబ్జెక్టు కాదు. ఒక వ్యక్తిని కంబ రామాయణం ఎవరు రాశారు అని అడిగితే అరగంట సేపు ఆలోచించి వాల్మీకి రాశాడు అన్నాడుట. అలా ఉంటుంది నాకు ఆత్మ గురించి తెలిసింది అని ఈ విద్యార్థి గనుక చెపితే.

ఒక వ్యక్తి తన జీవిత చరిత్రలో తనకు బ్రహ్మ అనుభవం అయిందని వర్ణించాడుట. తెల్లవారుఝామున ధ్యానంలో కూర్చుంటే ఒక తెల్లటి కాంతి

కిటికీలోంచి వచ్చి, అతన్ని తాకి, అతని గురువు ఫోటో చుట్టూ మూడుసార్లు తిరిగి, మాయమయిపోయిందట. ఆ క్షణంలో తనకు ఆత్మ సాక్షాత్కారం అయింది అని రాశాడు. ఇక్కడ ఒక విషయం గమనించాలి మనం. అతని కయిన అనుభవాన్ని శంకించటం లేదు కాని అది ఆత్మసాక్షాత్కారం కాదు అంటున్నాము. ఎందుకు? ఆత్మ వచ్చిపోయేది కాదు. ఆత్మ దేశకాలాలకు అతీతమైనది. అతనికి ఆ అనుభవం అవకముందూ, అయినప్పుడూ, అయ్యాక కూడా ఆత్మ ఉంది. వీటిని సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యం ఆత్మ. కాని మనం ఇలాంటి సిద్ధులను లేదా విభూతులను ఆత్మగా పొరబడకూడదు. దీనినుంచి ఎదగాలి.

మాములుగా గురువు చెప్పాక శిష్యుడు నాకు అర్థమయింది అంటే గురువు సంతోషిస్తాడు. కాని ఇక్కడ వేదాంతంలో పరిస్థితి వేరు. అర్థమయింది అంటే తెలిసిన వస్తువు కిందకి వస్తుంది. అందుకని గురువుకు నీకు తెలిసింది అని చెపితే,

**దభ్రమేవాపి నూనం త్వం వేత్థ –** నీకు తెలిసింది చాలా తక్కువ అంటున్నాడు. అంటే నువ్వు సరిగ్గా వినలేదు అని అర్థం. నీకు తెలిసింది చాలా తక్కువ అంటే అసలేమీ తెలియలేదని అర్థం.

ఉదాహరణకు చెయ్యిని చూపించి ఇక్కడేముంది అంటే చెయ్యి ఉంది అంటాము. కాని చెయ్యిని ప్రకాశింపజేసే కాంతిని చూడము. చెయ్యి పెట్టినా, తీసేసినా కాంతి ఉంటుంది. చెయ్యి వచ్చిపోయేది. కాంతి మూడు కాలాల్లోనూ ఉండేది. మనం వచ్చిపోయే అనుభవాలను చూస్తున్నాము కాని, ఆ అనుభవాలను సాక్షిగా చూసే ఆత్మను చూడటం లేదు.

**బ్రహ్మణో రూపస్య యదస్య త్వమ్ –** (మనుష్యేషు)– మనుష్యుల్లో ఉండే బ్రహ్మ స్వరూపం తెలియదు నీకు. మనుష్యుల్లో అంటే వ్యష్టిపరంగా.

**యదస్య దేవేషు –** దేవతల్లో ఉండే బ్రహ్మ స్వరూపం కూడా తెలియదు నీకు. దేవతల్లో అంటే సమష్టిపరంగా. వ్యష్టిపరంగా తెలియదు. సమష్టిపరంగా కూడా తెలియదు అంటే నీకేమీ తెలియదని అర్థం.

వేదాంతం ఎన్ని సంవత్సరాలు విన్నా, కొంతమందికి కొన్ని అపోహలు పోవు. అటువంటి వారు నాకు బ్రహ్మ గురించిన సమాచారం అంతా పొందాను. ఇంక బ్రహ్మ దర్శనం పొందటం ఒక్కటే మిగిలింది అనుకుంటారు. బ్రహ్మ

ఎప్పుడొస్తాడో, బ్రహ్మ ఎప్పుడొస్తాడో అని ఎదురుచూస్తారు. పైపెచ్చు శాస్త్రం అధ్యయనం చేయటం మానేసి, ధ్యానం చేసే సమయాన్ని ఎక్కువ చేస్తారు. కొంతమంది పడుకోరు కూడా. దానివల్ల ప్రయోజనం ఏమిటి? ఎన్నడూ రాని దాని కోసం ఎదురుచూపులు చూడటం వల్ల తలనొప్పి వస్తుంది కాని ఆత్మ సాక్షాత్కారం అవదు. అందుకని గురువు హెచ్చరిస్తున్నాడు.ఏమని?

**అథ ను మీమాగ్ంస్యమేవ తే –** అథను అంటే అందువల్ల. మీమాగ్ంస అంటే బాగా విచారణ చేయి. నువ్వు నేర్చుకున్న దాన్ని లోతుగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. కావాలంటే ఇంకొంచెం సమయం తీసుకో.

ఇక్కడివరకూ గురువు చెప్పినమాటలు శిష్యునికి బాగా అర్థమయినా కూడా, గురువు బాగా విచారణ చేశాక చెప్పమన్నాడు కాబట్టి, కొంత సమయం తీసుకునే చెప్పాడనుకోవాలి. కాని ఆ చెప్పింది సింహంలా చెప్పాడు. ఏమని?

**విదితం మన్యే –** విదితమ్ అంటే గ్రహించాను.ఏమని గ్రహించాడు? మీ బోధ బాగా అర్థమయింది అన్నాడు. గురువును మెచ్చుకుంటున్నాడు. మీరు బాగా చెప్పారు. బ్రహ్మ వస్తువుగా తెలుసుకునేది కాదని మీ బోధ వల్ల తెలిసింది అని అర్థం. ఈ విషయాన్ని శిష్యుడే తర్వాత వచ్చే మంత్రంలో వివరిస్తున్నాడు. తర్వాతి మంత్రం చూద్దాము.

## మన్త్రము – 2

**నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ ।**
**యో నస్తద్వేద తద్వేద నో న వేదేతి వేద చ ॥**

నాలుగు వాక్యాల్లో తన జవాబు చెప్పాడు శిష్యుడు.

నాకు బ్రహ్మ తెలుసు అనను

నాకు బ్రహ్మ తెలియదు అనను

నాకు తెలుసు

నాకు తెలియదు

నీకు తెలుసు అని చెపితే నీకేమీ తెలియదని అర్థం అని గురువు ముందే చెప్పాడు కదా. శిష్యుడు తను అలాంటి పొరపాటు చేయబోవటం లేదని ముందుగా చూపిస్తున్నాడు.

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి**

బ్రహ్మ తెలిసిన వస్తువు కాదు. తెలియని వస్తువు కాదు.

ఈ విషయం శిష్యుడు మర్చిపోలేదు. అందువల్ల శిష్యుడు 'నాకు బ్రహ్మ తెలుసు' అనే పొరపాటు ఎన్నటికీ చేయనంటున్నాడు. ఎందుకు? నాకు బ్రహ్మ తెలుసు అని చెపితే బ్రహ్మ తెలిసిన వస్తువు కిందకి వస్తుంది. అయితే 'నాకు బ్రహ్మ తెలియదు,' అంటాడా? ఆ పొరపాటు కూడా చేయనంటున్నాడు.'నాకు బ్రహ్మ తెలియదు,' అని కూడా చెప్పనంటున్నాడు. ఎందుకు? నాకు బ్రహ్మ తెలియదు అంటే బ్రహ్మ తెలియని వస్తువు కిందకి వస్తుంది.

మరి అయితే బ్రహ్మ ఏమిటి? నాకు తెలుసు – బ్రహ్మ సబ్జెక్టని నాకు తెలుసు; నాకు తెలియదు– బ్రహ్మ ఆబ్జెక్టుగా నాకు తెలియదు. అంటే బ్రహ్మ తెలియని వస్తువు కాదు. బ్రహ్మ తెలిసిన వస్తువు కాదు అని అర్థం చేసుకున్నాను. బ్రహ్మను ప్రమాతగా తెలుసుకున్నాను. బ్రహ్మ ప్రమేయంగా తెలియదు అని కూడా తెలుసుకున్నాను. ఇదంతా మొదటి పాదం అర్థం.

ఈ నేపథ్యంతో ఇప్పుడు మంత్రం చూద్దాము.

**నాహం మన్యే సువేదేతి–** యది మన్యసే సువేదేతి అన్నాడు గురువు. అందువల్ల గురువు వాడిన పదాలే వాడాడు. మొదటి వాక్యమే నాహ మన్యే సువేదేతి అన్నాడు.

**సువేద ఇతి అహం న మన్యే**

నాకు బాగా అర్థమయిందని నేను అనను. ఎందుకు? ముందే చూసినట్టుగా, అర్థమయిందంటే, బ్రహ్మ తెలిసిన వస్తువు అవుతుంది.

**నో న వేదేతి–** తెలిసిన వస్తువు కాదు అంటే తెలియదు అని అర్థం రావచ్చు కదా! అందుకని నాకు తెలియదు అని కూడా అనను అన్నాడు.

**న వేద ఇతి నో మన్యే**

నాకు అర్థం కాలేదని నేను అనను.

ఈ రెండు వాక్యాల వల్ల బ్రహ్మ తెలిసిన వస్తువు కాదు. తెలియని వస్తువు కాదు. అంటే బ్రహ్మ వస్తువు కాదు అని నాకు అర్థం అయింది అని చెప్పాడు.

**వేద చ (న వేద చ) –** నాకు తెలుసు, నాకు తెలియదు. వేద చ అంటే నాకు తెలుసు; న వేదచ కలుపుకోవాలి. అంటే నాకు తెలియదు. వీటిని పూరిస్తే ఇలా వస్తుంది.

**వేద చ**–నాకు తెలుసు బ్రహ్మ సబ్జెక్టు అని

న వేద చ–నాకు బ్రహ్మ ఆబ్జెక్టుగా తెలియదు.

ఈ విధంగా అతను చెప్పిన నాలుగు వాక్యాలూ వచ్చాయి.

వేద చ కు మూడు అర్థాలు ఉన్నాయి.

1. బ్రహ్మ తెలిసిన, తెలియని వస్తువుకు భిన్నంగా ఉందని నాకు అర్థమయింది.

2. బ్రహ్మ ప్రమేయం కాదు, ప్రమాతా అని నాకు అర్థమయింది.

3. ఆ బ్రహ్మను నేనే అని కూడా అర్థమయింది.

ఇది చాలా ముఖ్యమైన వాక్యం కాబట్టి ఈ మొదటి పాదం అర్థం మళ్ళీ ఒకసారి చూద్దాము.

**నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ (న వేద చ)**

బ్రహ్మ గురించి నాకు తెలుసు అనను. బ్రహ్మ గురించి నాకు తెలియదు అనను. బ్రహ్మ అసలు ప్రమేయం కాదు. బ్రహ్మ ప్రమాతా. ఆ బ్రహ్మ నేనే. అహం బ్రహ్మ అస్మి.

అక్కడితో ఆగలేదు శిష్యుడు. అక్కడ ఉన్న శిష్యులనుద్దేశించి చెప్తున్నాడు. నేను చెప్పింది ఎవరికి అర్థమయితే, వాళ్ళు కూడా ఈ బోధను బాగా గ్రహించారని అర్థం అన్నాడు.

**నో న వేదేతి వేద చ–** నోన వేద ఇతి వేద చ – బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోలేము. ఇది నా జవాబు.

**యో నస్తద్వేద – ఇతి తద్వేద –** ఈ నా జవాబును, ఎవరైతే అర్థం చేసుకుంటారో;

**నః –** అతను; **సః తద్వేద** – విద్యార్థి కూడా బోధను నాలాగా గ్రహించినట్టు అర్థం.

దీనితో గురుశిష్యుల సంవాదం ముగిసింది. కేనోపనిషత్తు అయిపోయినట్టే. ఇప్పుడు ఈ సంభాషణతో ఉపనిషత్తు మురిసిపోయింది. అందువల్ల తర్వాత వచ్చే మంత్రాల్లో గురుశిష్యుల సంవాదం ద్వారా జరిగిన బోధ సారాంశం, ఉపనిషత్తు మళ్ళీ చెపుతున్నది. ఎందుకు?

ఒక వేదాంత విద్యార్థిని నీకు అర్థమయిందా అని అడిగితే, మామూలుగా అతను మీరు బాగా చెప్పారు కాని నాకు సరిగ్గా అర్థం కాలేదు అంటాడు. లేదా

క్లాసులో ఉన్నంతసేపూ అర్థమయినట్టే అనిపిస్తుంది కాని బయటకు వెళ్ళాక ఆలోచిస్తే అయోమయంగా అనిపించింది అంటారు. కాని ఇక్కడ శిష్యుడు మీరు బాగా చెప్పారు, నాకు బాగా అర్థమయింది అన్నాడు. అక్కడితో వారి సంవాదం ముగిసి, వారు వెళ్ళిపోయినట్టుగా ఊహించుకోవాలి. అందువల్ల ఉపనిషత్తు మురిసిపోయి, తను కూడా చెపుతుంది.

## మన్త్రము - 3

**యస్యామతం తస్య మతం మతం యస్య న వేద సః।**

**అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాతమవిజానతామ్॥**

ముందే చెప్పినట్టుగా ఈ మంత్రాలను (3,4,5) ఉపనిషత్తు చెపుతున్నది. బ్రహ్మజ్ఞానం యొక్క ప్రత్యేకతను ఇక్కడ నొక్కి వక్కాణిస్తున్నది. కేనోపనిషత్తు అవటానికి చాలా చిన్న ఉపనిషత్తే అయినా, ఘాటైన సీమమిరపకాయ లాంటిది. ఇందులో ఎన్నో మహావాక్యాలు ఉన్నాయి. వాటిని మించి పదాలతో ఆటలాడిస్తుంది మనను. ముందు మంత్రంలో శిష్యుడు ఎంత ఆటలాడించాడో, ఇప్పుడు ఉపనిషత్తు కూడా అలాగే పదాలతో చమత్కారాలు చేస్తోంది.

అంతకుముందు శిష్యుడు ఏమన్నాడు?

**నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ (న వేద చ)**

నాకు బ్రహ్మ తెలుసు అనను

నాకు బ్రహ్మ తెలియదు అనను

నాకు తెలుసు

నాకు తెలియదు

అతనెలా పద ప్రయోగాలు చేశాడో ఉపనిషత్తు కూడా అలాగే అంటున్నది.

బ్రహ్మ ఎవరికి తెలియదో, వారికి తెలుసు.

బ్రహ్మ ఎవరికి తెలుసో, వారికి తెలియదు.

తెలిసినవారికి తెలియదు.

తెలియని వారికి తెలుసు.

బ్రహ్మజ్ఞానం యొక్క ప్రత్యేకతను చూపుతున్నది ఉపనిషత్తు. బ్రహ్మ గురించి

తెలుసుకోకుండా తెలుసుకునే జ్ఞానం బ్రహ్మజ్ఞానం. మళ్ళీ చెపుతున్నాను చూడండి. బ్రహ్మజ్ఞానం ఒక ప్రత్యేక జ్ఞానం. ఎందుకంటే అందులో బ్రహ్మ గురించి తెలుసుకోకుండా తెలుసుకుంటాడు! అదెలా సాధ్యం? ఎలాగంటే, బ్రహ్మగురించి తెలుసుకున్నాను అంటే బ్రహ్మ ఏమవుతాడు? ఆబ్జెక్టు అవుతాడు. అందువల్ల నేను బ్రహ్మ గురించి, బ్రహ్మను ఆబ్జెక్టు చేయకుండా తెలుసుకోవాలి. బ్రహ్మను ఆబ్జెక్టు చేయకపోతే నేనెలా తెలుసుకుంటాను? అంటే ప్రమేయంగా కాదు, ప్రమాతగా తెలుసుకుంటాను. అహం బ్రహ్మ అస్మి అని తెలుసుకుంటాను.

అందువల్ల, ఉపనిషత్తు బ్రహ్మను ఎవరైతే ఆబ్జెక్టుగా చూస్తారో వాళ్ళు బ్రహ్మను తెలుసుకోలేరు. ఎవరైతే బ్రహ్మను ఆబ్జెక్టుగా చూడరో వాళ్ళు మాత్రమే తెలుసుకోగలరు అంటున్నది. ఇలాంటి పద ప్రయోగాలు మనమూ మన దైనందిన జీవితంలో చేస్తాము.

చెప్పేవాడు చేయడు; చేసేవాడు చెప్పడు.

ఇప్పుడు మంత్రం చూద్దాము.

**యస్య అమతం తస్య మతం–** ఎవరైతే నాకు బ్రహ్మ తెలుసు అంటారో, వారికి బ్రహ్మ అసలు తెలియదు. దీన్నే ఇంకోవిధంగా కూడా చెప్పవచ్చు.

**యస్య అ+మతం తస్య మతం–** ఎవరికి బ్రహ్మ తెలియదో వారికి బ్రహ్మ తెలుసు. రెండింటికీ బ్రహ్మ ఆబ్జెక్టుగా అని కలుపుకోవాలి.

బ్రహ్మ ఆబ్జెక్టుగా తెలుసు అంటే వారికి బ్రహ్మ అర్థం కానట్టు.

బ్రహ్మ ఆబ్జెక్టుగా తెలియదు అంటే వారికి బ్రహ్మ అర్థం అయినట్టు.

**యస్య మతం సః న వేద–**బ్రహ్మ తెలుసు అనుకున్నవారికి (ఆబ్జెక్టుగా తెలుసు అనుకున్నవారికి) బ్రహ్మ తెలియదు.

**అవిజ్ఞాతం విజానతామ్ –** బ్రహ్మ తెలిసిన వ్యక్తికి తెలియదు. అంటే ఆబ్జెక్టుగా తెలియదు.

**విజ్ఞాతమ్ అవిజానతామ్–** బ్రహ్మ సబ్జెక్టుగా తెలియని అజ్ఞాని బ్రహ్మను ఆబ్జెక్టుగా భావిస్తాడు.

పై వాక్యాన్నే ఒక సూత్రంగా చెబుతున్నది ఉపనిషత్తు.

బ్రహ్మ తెలిసినవారికి తెలియదు.

బ్రహ్మ తెలియని వారికి తెలుసు.

ఈ మాటలను మాములుగా తీసుకోకూడదు. ఉదాహరణకు ఇది విన్నాక దారేపోయే దానయ్యను పిలిచి నీకు బ్రహ్మ తెలుసా అని అడిగారనుకోండి. అతను ఏం చెపుతాడు?' 'నాకు బ్రహ్మ తెలియదు,' అనే చెపుతాడు. 'బ్రహ్మ తెలియదు అంటే తెలుసు,' సూత్రం ప్రకారం అతనికి బ్రహ్మ తెలిసినట్టా. కానేకాదు!

దీని సారాంశం ఏమిటి? అంతకుముందు ఎన్నోసార్లు చూసిందే

అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి

బ్రహ్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు.

బ్రహ్మ ప్రమేయం కాదు, బ్రహ్మ ప్రమాతా

బ్రహ్మ సాక్షి చైతన్యం; అది నువ్వే.

ఈ దశలేవీ మర్చిపోకూడదు. కేనోపనిషత్తు అధ్యయనం చేసి ముగించేలోపు

బ్రహ్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అనే విషయం జీర్ణించుకోవాలి.

అంతేకాదు ఇంకో విషయం కూడా గట్టిగా అర్థం చేసుకోవాలి

బ్రహ్మ అనుభవం కోసం ఎన్నడూ ప్రయత్నించవద్దు.

ఆత్మ సబ్జెక్టు కాబట్టి ఆత్మ సాక్షాత్కారం కలుగదు.

బ్రహ్మ అన్నా, ఆత్మ అన్నా, సాక్షి చైతన్యం అన్నా ఒకటే అని మర్చిపోకూడదు. ఇంత స్పష్టంగా చెప్పినా కూడా 90% వేదాంత విద్యార్థులు బ్రహ్మ అనుభవం పొందటం కోసం నిదిధ్యాసనం చేస్తారు.

నిదిధ్యాసనం బ్రహ్మ అనుభవం పొందటానికి కాదు.

నిదిధ్యాసనం బ్రహ్మ నిష్ఠలో నిలవటానికి.

కేనోపనిషత్తు ఈ విషయాన్ని తర్వాత వచ్చే మంత్రంలో ఇంకా స్పష్టంగా చెపుతుంది. ధ్యానంలో విభూతులు కలుగుతాయి. అవి కాదనటం లేదు. కాని ఆ విభూతులు బ్రహ్మ అనుభవం కాదు. ఒక జ్యోతి కనబడ్డా, రంగులు కనబడ్డా, గంటలు మ్రోగినా అవన్నీ ఏమిటి? వచ్చిపోయే అనుభవాలే. అవన్నీ అనాత్మలే! ఆత్మ జ్ఞానం లేదా బ్రహ్మ జ్ఞానంతో వాటికి సంబంధం లేదు.

**నేదం యత్ ఇదం అనుభూయతే**

అంతకుముందు ఉపనిషత్తు నేదం యదిదముపాసతే అంది. దాన్నే మార్చి

నేదం యదిదమనుభూయతే అంటున్నాము.

**నేతి నేతి వచనైః –** ఏ అనుభవం కలిగినా, దాన్ని ఇది కాదు, ఇది కాదు అని ఖండిస్తూ రండి. అలా అన్నీ ఖండిస్తూ వస్తే, శూన్యం మిగులుతున్నది, వేరే ఏమీ లేదు అనవచ్చు. కాని గుర్తుంచుకోండి. ఆ శూన్యం ఉందని ఎలా తెలుస్తున్నది? సాక్షిచైతన్యం వల్ల. ఆ శూన్యాన్ని కూడా ప్రకాశింపచేస్తున్నది అది.

**శూన్యసాక్షి ఏవ అహమస్మి ।**

నేను శూన్యం కాదు, శూన్యసాక్షిని.

ఇది నిదిధ్యాసనం. ఏ విభూతులూ అవసరం లేదు. ఎవరైనా నేను విభూతిని అనుభవించాను అంటే, ఉపనిషత్తు ఒకటేమాట అంటున్నది. **సః న వేద** అతనికి తెలియదు.

## మన్త్రము – 4

**ప్రతిబోధవిదితం మతమమృతత్వం హి విన్దతే**
**ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతేఽమృతమ్ ॥**

ఇది చాలా అద్భుతమైన మంత్రం. కేనోపనిషత్తు మొత్తానికి గొప్ప మంత్రం. నిజానికి మొత్తం అద్వైత జ్ఞానానికి మకుటాయమైన రత్నం లాంటిది. చాలా ముఖ్యమైంది. ఎందుకంటే బ్రహ్మజ్ఞానం ఎలా పొందాలో వివరిస్తుంది ఇది. వేరే ఎక్కడా దొరకదు ఈ అంశం. అంతకుముందు ఏమన్నాం?

బ్రహ్మ అనుభవం కోసం ఎన్నడూ ప్రయత్నించవద్దు. ఎందుకు? దీని అర్థం బ్రహ్మ అనుభవం పొందనవసరం లేదు అని కాదు; బ్రహ్మ అనుభవం సాధ్యం కాదు అని కూడా కాదు. మరి ఎందుకు?

బ్రహ్మ అనుభవం ఎప్పుడూ ఉంటుంది.

**ప్రతిబోధవిదితం మతమ్ –** ఎందుకు? బ్రహ్మ స్వయం ప్రకాశక చైతన్యం. ఈ మంత్రం ఆ విషయాన్ని వివరిస్తున్నది. దాని సారాంశం చూద్దాము ముందు.

మారే ఆలోచనలున్న మనస్సులో మారని చైతన్యం ఉంది. ఆ మారని చైతన్యం వల్లనే అన్ని అనుభవాలు, అన్ని రకాల జ్ఞానమూ పొందగలము. ఆ చైతన్యమే బ్రహ్మ.

అక్కడితో ఆగకూడదు. ఆగితే బ్రహ్మజ్ఞానం అసంపూర్ణమవుతుంది.

ఆ చైతన్యం, బ్రహ్మ నేనే అని అర్థం చేసుకోవాలి.

బ్రహ్మ మారని చైతన్యం.

ఆ మారని చైతన్యం నేనే.

ఇది మంత్రంలో మొదటి భాగం అర్థం. దీనిమీద శంకరుల వారు అద్భుతమైన భాష్యం రాశారు. దీని సారాంశం చూద్దాము.

ఏదైనా జ్ఞానం పొందాలంటే రెండు విషయాలు ఉండాలి.

**జ్ఞానం = వృత్తి + చైతన్యం**

వృత్తి ఒకటే ఉన్నా జ్ఞానం పొందలేము. చైతన్యం ఒకటే ఉన్నా జ్ఞానం పొందలేము. రెండింటి మేలు కలయిక వల్లనే జ్ఞానం సాధ్యం. ఇప్పుడు ఈ వృత్తి గురించీ, చైతన్యం గురించీ వివరంగా చూద్దాము.

**వృత్తి-** అంటే ఆలోచన. మనస్సు, ఇంద్రియాల ద్వారా ఒక వస్తువును చూసినప్పుడు, మనస్సులో దాని గురించిన వృత్తి ఏర్పడుతుంది. చూడటం అంటే మామూలుగా చూడటం కాదు. దాన్ని గమనించాలి. నేను ఒకవైపు చూశాను. అక్కడ గోడ, చెట్టు రెండూ ఉన్నాయి. కాని నేను ఒకదాన్నే గమనించవచ్చు. చెట్టుని గమనిస్తే గోడను చూడకపోవచ్చు. అప్పుడు నా మనస్సులో వృక్షవృత్తి ఏర్పడుతుంది. పదిమంది ఉన్నచోట, మనం అందరినీ సరిగ్గా గమనించకపోవచ్చు. అందువల్ల ఎవరైనా వచ్చి ఫలానా వ్యక్తి వచ్చాడా అంటే, 'ఏమో, నేను గమనించలేదు,' అంటాము. అందువల్ల చూడటం వేరు, గమనించటం వేరు. గమనిస్తే దానికి తగ్గ వృత్తి ఏర్పడుతుంది మనస్సులో. అది వస్తువుకు తగ్గట్టుగా ఉండాలి. అక్కడ ఒక తాడు ఉంటే, తాడుకు సంబంధించిన వృత్తి ఏర్పడాలి. కాని నాకు సర్పవృత్తి ఏర్పడితే, నాకు తాడు కనపడదు; పాము కనపడుతుంది. అందువల్ల ఆలోచన వస్తువుకు తగ్గట్టుగా ఉండాలి.

ఇప్పుడు నాకు కలిగే అనుభవాలు మారుతున్నాయి. దానివల్ల నాకు కలిగే జ్ఞానం కూడా నిరంతరం మారుతోంది. అంటే ఏమిటి? ఆలోచనలు కూడా నిరంతరం మారుతున్నాయి. అందువల్ల జాగ్రదావస్థలో మారుతున్న ఆలోచనలు మారే అనుభవాలను, మారే జ్ఞానాన్ని ఇస్తున్నాయి.

కాని వేదాంతం, ఆలోచన ఒక్కటే సరిపోదు జ్ఞానం పొందటానికి అంటున్నది. ఎందుకు? ఆలోచన, మనస్సులో ఒక భాగం. మనస్సు పంచ

భూతాలతో చేయబడింది. పంచభూతాలు జడం. అందువల్ల మనస్సు, మనస్సులో కలిగే ఆలోచనలు జడం. జడమైన ఆలోచనలు ఏమీ అనుభవాన్ని ఇవ్వలేవు. అందువల్లనే జడమైన గోడ ఏమీ అనుభవాన్ని కాని, జ్ఞానాన్ని కాని ఇవ్వలేదు. దీనివల్ల మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటి? వృత్తి కాకుండా ఇంకేదో ముఖ్యమైన అంశం ఉండి ఉండాలి. దానివల్లనే వృత్తి జ్ఞానం అవుతుంది. వృత్తి అనుభవం అవుతుంది.

ఏమిటా అంశం? శరీరం అంతటా ఉన్న చైతన్యం.

**చైతన్యం–** వృత్తి+చైతన్యం = జ్ఞానం అని చూశాము కదా! ఈ రెండింటి వల్ల జ్ఞానం కలుగుతుందంటే మారుతున్న వృత్తిలాగా, చైతన్యం కూడా మారుతుందా? మారదు. చైతన్యం మార్పులేని, మారని అంశం.

జ్ఞానం = మారే వృత్తి+మారని చైతన్యం.

జ్ఞానం = అనుభవం = బోధ = ప్రతిబోధ

బోధ అంటే వృత్తి, జ్ఞానం, అనుభవం. అది మారే వృత్తి, మారని చైతన్యాల మేలు కలయిక.

వృత్తి, చైతన్యం చాలా సన్నిహితంగా కలిసిపోవటం వల్ల, చైతన్యం మనస్సు లేదా వృత్తిలో ఒక అంతర్గత భాగం అని పొరబడుతారు చాలా మంది. కాని వేదాంతం దాన్ని ఖండిస్తుంది.

చైతన్యం ప్రతి వృత్తిలోనూ ఉంది, కాని అది వృత్తిలో ఒక భాగం కాదు; చైతన్యం వృత్తి నుంచి ఉత్పత్తి చెందింది కాదు. చైతన్యం వృత్తి యొక్క లక్షణం కూడా కాదు. చైతన్యం వృత్తికి భిన్నంగా ఉంది కాని, వృత్తితో కలిసిపోయింది.

ఉదాహరణకు చంద్రకాంతి తీసుకోండి. నిండు పున్నమి రాత్రి పండువెన్నెలను కురిపిస్తున్నాడు చంద్రుడు అంటాము. కాని నిజానికి ఆ కాంతి చంద్రునిది కాదు, సూర్యుడిది అని మనకు తెలుసు. వెన్నెల ఏమిటి? ఇందాక చైతన్యానికి చెప్పిన విషయమే ఇక్కడ వస్తుంది.

వెన్నెల చంద్రునిలో ఒక భాగం కాదు. వెన్నెల చంద్రుని నుంచి ఉత్పత్తి చెందినది కాదు. వెన్నెల చంద్రుని యొక్క లక్షణం కూడా కాదు. అది స్వతంత్రమైనది. చంద్రుడంతటా వ్యాపించి ఉంది. చంద్రుని సరిహద్దులకే పరిమితమవలేదు. చంద్రుడు లేకపోయినా కాంతి ఉంటుంది.

వృత్తి చంద్రుడనుకుంటే, చైతన్యం వెన్నెల కాంతి. రెండూ కలిసి ఉంటాయి. కాని చైతన్యం వృత్తి మీద ఆధారపడి లేదు. వృత్తి మారుతుంది. చైతన్యం మారదు.

బ్రహ్మజ్ఞానం పొందాలంటే మూడు దశల్లో పొందాలి.

1. మారే వృత్తి నుంచి మారని చైతన్యం వైపుకు నా దృష్టిని మరల్చాలి. చెట్టును చూస్తే చెట్టు గురించిన వృత్తి ఏర్పడుతుంది. తర్వాత బల్లను చూస్తే బల్ల గురించిన వృత్తి ఏర్పడుతుంది. చెట్టు వృత్తి ఏర్పడుతున్నదని నాకు తెలుస్తున్నది. బల్ల వృత్తి ఏర్పడుతున్నదని నాకు తెలుస్తున్నది. ఒక వస్తువును చూస్తే ఇంకో వస్తువు వెళ్ళిపోతున్నది. అలాగే మనస్సులో ఒక వృత్తి ఏర్పడితే ఇంకో వృత్తి ఏర్పడుతున్నది. కాని ఈ వృత్తుల గురించిన నా ఎరుక మారటం లేదు. నా ఎరుక అలాగే ఉంది. అందువల్ల వృత్తినుంచి ఎరుక వైపుకు అంటే చైతన్యం వైపుకు నా దృష్టిని మరల్చాలి.

2. చైతన్యం నేను అని అర్థం చేసుకోవాలి.చైతన్యం నుంచి దృష్టిని మరల్చాలి అంటే, చైతన్యాన్ని ఆబ్జెక్టుగా చూడకూడదు. చైతన్యాన్ని, వృత్తిని విడదీశాక, నేను వృత్తిని చూసే చైతన్యాన్ని అని అర్థం చేసుకోవాలి.

ప్రతి ఒక్క వృత్తి ఆబ్జెక్టు.

కాని చైతన్యం దాన్ని చూసే సబ్జెక్టు.

అది నేనే.

నేను పడిలేచే ఆలోచనా తరంగాలతో కలిసి ఉన్న చైతన్యాన్ని. నేను ఆలోచనలను ప్రకాశింపచేయటమే కాదు, ఆలోచనల గురించి నాకు తెలుసు. అందువల్ల ఆలోచన ఆబ్జెక్టు; చైతన్యం సబ్జెక్టు అయిన నేను.

**బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వవస్థాస్వపి**
**వ్యావృత్తాస్వనువర్తమానమహమిత్యన్తస్స్ఫురన్తం సదా॥ –**

**దక్షిణామూర్తి స్తోత్రం – 7**

ప్రతిదీ మారుతుంది. ప్రపంచం మారుతుంది. శరీరం మారుతుంది. మనసు విపరీతంగా మారుతుంది. ఆలోచనలు మారుతాయి. కాని ఈ మారే వాటన్నింటిలోనూ, మారని అంశం ఒకటి ఉంది. అది మారని సాక్షి చైతన్యం.

నేను బాలుడిని; నేను యువకుడిని; నేను వృద్ధుడిని.

అన్ని దశల్లోనూ మారకుండా ఉన్నది ఏమిటి?ఈ దశలను వర్ణిస్తున్న నేను, నేను, నేను.

3. మారే జగత్తుకు, మారని చైతన్యానికి ఉన్న సంబంధం తెలుసుకోవాలి. ఆ సంబంధం కార్యకారణ సంబంధం. ఇది మహావాక్య శ్రవణం ద్వారా తెలుస్తుంది. ఇది పెద్ద గెంతు, కష్టమైన గెంతు. ఎందుకంటే ఇక్కడే రకరకాల దర్శనాలు వస్తాయి. మారే వస్తువులేమిటి? ప్రపంచం, శరీరం, ఇంద్రియాలు, మనస్సు,ఆలోచనలు ఇవన్నీ. వీటిని ప్రకృతి లేదా వస్తువు అనవచ్చు. చైతన్యాన్ని పురుషుడు అంటారు.

**సాఙ్ఖ్యదర్శనం–** సాంఖ్యులు ప్రకృతి, పురుషుల మధ్య ఈ సంబంధాన్ని ద్వైత దర్శనంగా చూస్తారు. వారి ఉద్దేశ్యంలో రెండూ శాశ్వతం. రెండూ స్వతంత్రం. రెండూ సమాంతర రేఖల లాంటివి.

**వైజ్ఞానిక శాస్త్రం–** వైజ్ఞానిక శాస్త్రం వీటిని వస్తువు, చైతన్యం అంటుంది. వీటి మధ్య కార్య,కారణ సంబంధం ఉందంటుంది. మనమూ కార్యకారణ సంబంధం ఉందంటాము కాని దాని వాదన వేరే. వైజ్ఞానిక శాస్త్రం ప్రకారం, వస్తువు ప్రాథమిక సత్యం. చైతన్యం తాత్కాలికంగా ఉత్పత్తి చెందింది. చైతన్యం మన మెదడులో ఉంది. అందువల్ల మనం జీవించి ఉన్నంతకాలమే చైతన్యం ఉంటుంది. వారి ఉద్దేశ్యంలో వస్తువు కారణం; చైతన్యం కార్యం.

**వేదాన్త శాస్త్రం–** పై వాదనలన్నీ ఖండిస్తుంది వేదాంతం. సాంఖ్య, న్యాయ, వైశేషికులు చెప్పినట్టుగా ప్రకృతి, పురుషుడు రెండూ స్వతంత్రమైన, భిన్నమైనవి కావు. రెండూ ఒకటే.

వైజ్ఞానిక శాస్త్రం చెప్పినట్టుగా వాటి మధ్య కార్యకారణ సంబంధం ఉంది. కాని ఆ శాస్త్రం చెప్పిన పద్ధతిలో కాదు. దానికి భిన్నంగా ఉంది. అంటే చైతన్యం కారణం, ప్రకృతి కార్యం. చైతన్యం సత్యం, జ్ఞానం అనంతం బ్రహ్మ. అది సృష్టి కారణం.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సమ్భూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః**
**అగ్నేరాపః అద్భ్యః పృథివీ పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽన్నమ్**
**– తైత్తిరీయం**

చైతన్యం అయిన నేనే బ్రహ్మను. నా నుంచే సృష్టి వచ్చింది.

**మయ్యే వ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్**
**మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్॥ – కైవల్యం**

నా నుంచే స్వప్న ప్రపంచం సృష్టించబడి, నాలోనే స్థితి పొంది, నాలోనే

లయమయినట్టుగా, ఈ జాగ్రద్ ప్రపంచం కూడా నా నుంచే సృష్టింపబడి, నాలోనే స్థితి పొంది, నాలోనే లయమవుతుంది.

**నేను కారణబ్రహ్మను. జగత్తు కార్యం.**

ఎప్పుడైతే జగత్తు కార్యం అన్నామో జగత్తుకు విడిగా ఉనికి లేదు. ఎందుకు? కారణానికి భిన్నంగా కార్యానికి ఉనికి లేదు. ఉదాహరణకు బంగారం లేకుండా ఆభరణాలకు ఉనికి లేదు. నీరు లేకుండా అలకు ఉనికి లేదు.

ఈ విధంగా బ్రహ్మజ్ఞానం ఒక్క విధంగానే పొందగలము. ఏమిటది?

బ్రహ్మ చైతన్యం. ఆ చైతన్యాన్ని నేను.

నేను సత్యం, సృష్టికారణం. జగత్ మిథ్య.

ఈ మారని చైతన్యాన్ని ఎప్పుడు గుర్తించవచ్చు? 'నిర్వికల్ప సమాధి'లో అనకండి. ఆలోచనలు వస్తాయి. పోతాయి. వస్తువులు వస్తాయి, పోతాయి. అవన్నీ ఆగమాపాయి. చైతన్యం మాత్రం నిత్యం. అది అనాగమాపాయి. చైతన్యం వల్లనే ప్రతి అనుభవమూ సాధ్యం.

ఉదాహరణకు, పగలు మీరు రోడ్డు మీద వెళుతున్నారనుకోండి. మీరు రోడ్డు మీద కార్లను, దుకాణాలను, మనుష్యులను చూస్తారు. ఒక కారును చూడాలంటే కారుకేసి చూడాలి. ఒక దుకాణాన్ని చూడాలంటే దుకాణం కేసి చూడాలి. అదే సూర్యకాంతిని చూడాలంటే, ఎటు చూస్తారు? మీరే వస్తువును చూస్తున్నా, సూర్యకాంతిని చూస్తారు. మీరు చూసే ప్రతి వస్తువుతో పాటు కాంతిని కూడా అనుభవిస్తున్నారు.

ఈ వాక్యాన్ని మననం చేసుకోండి. 'మీరు చూసే ప్రతి వస్తువుతో పాటు సూర్యకాంతిని కూడా అనుభవిస్తున్నారు.' దానికి ప్రత్యేకంగా శ్రమపడనవసరం లేదు. ఇదే సూత్రాన్ని చైతన్యానికి వర్తింపజేస్తాము. మీరు చైతన్యం అనుభవించటానికి ప్రత్యేక అవస్థ అవసరం లేదు. జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థలు మూడింటిలోనూ చైతన్యాన్ని అనుభవిస్తారు. దీనికోసం ప్రత్యేకంగా విభూతి పొందనవసరం లేదు.

చైతన్యం అన్ని వేళలా ఉంటే మరి వేదాంతం అధ్యయనం చేయటం ఎందుకు? వేదాంతం బ్రహ్మ అనుభవం పొందటం కోసం అధ్యయనం చేయటం లేదు. బ్రహ్మ జ్ఞానం పొందటానికి చేస్తున్నాము. స్వయంప్రకాశక, సర్వవ్యాపక చైతన్యం నేనే అని తెలుసుకోవటానికి అధ్యయనం చేస్తున్నాము.

లౌకిక విద్య విషయంలో ఒక విషయం గురించి ముందు నేర్చుకుంటాము. తర్వాత దాని అనుభవం పొందుతాము. ఉదాహరణకు మానస సరోవం గురించి ముందు తెలుసుకుంటాము. తర్వాత అక్కడికి వెళ్ళి అనుభవం పొందుతాము. కాని బ్రహ్మ విషయం వచ్చేసరికి, అనుభవం ముందు పొంది, తర్వాత జ్ఞానం పొందుతాము.

ఒకసారి పూజ్య దయానంద సరస్వతి స్వామీజీ విమానంలో ప్రయాణిస్తున్నారు. ఆయన తోటి ప్రయాణీకుడు ఆయనతో కబుర్లు చెపుతూ, మీద మీద పడుతూ, కాలక్షేపం చేశాడు. దిగేముందు, 'ఋషీకేశ్‌లో ఒక స్వామీజీని కలవాలి, ఆయన పేరు దయానంద సరస్వతి. ఆయన మీకు తెలుసా,' అని అడిగాడు. పూజ్యస్వామీజీ, తనే ఆ స్వామినని చెప్పాడు. ఇక్కడ పరిస్థితి ఏమిటి? ఆ తోటి ప్రయాణీకునికి స్వామీజీతో అనుభవం అయింది కాకపోతే ఆయనే పూజ్యస్వామీజీ అనే జ్ఞానం లేదు. ఆత్మ లేదా బ్రహ్మ విషయంలోనూ అంతే. మనం పొందే ప్రతి అనుభవమూ బ్రహ్మ అనుభవమే. కాకపోతే అది బ్రహ్మ అనుభవం అనే జ్ఞానం లేదు మనకు. బ్రహ్మజ్ఞానం ఏమీ కొత్త అనుభవాన్ని చూపదు. బ్రహ్మజ్ఞానం వల్ల ఏ అనుభవం మారదు కూడా. అంటే బ్రహ్మ జ్ఞానం వల్ల కొత్త అనుభవం కలుగదు. ఉన్న అనుభవం మారదు. మరి అయితే బ్రహ్మజ్ఞానం అంటే ఏమిటి?

బ్రహ్మ జ్ఞానం అంటే అర్థం చేసుకోవటంలో కలిగే మార్పు. బ్రహ్మజ్ఞానం అంటే మనం ఎప్పుడూ అనుభవిస్తున్న దాని గురించిన సరియైన అవగాహన. ఎప్పుడూ అనుభవిస్తున్నది ఏమిటి? అదే ఉపనిషత్తు చాలా చక్కగా వివరిస్తున్నది.

**ప్రతిబోధ విదితం –** ఈ పదం బ్రహ్మజ్ఞానం ఇస్తుంది. మారుతున్న ప్రతి అనుభవం వెనుకా ఒక మారనిదేదో ఉంది. ఏమిటది? అదే చైతన్యం. జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థల్లో జరిగే అన్ని అనుభవాలను, చూసే అన్ని వస్తువులను, అన్ని పరిస్థితులను సాక్షీభూతంగా చూస్తున్నది అది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని నా మనస్సును చూస్తున్నది. మనస్సు మేలుకుని ఉన్నా, సుషుప్తిలో లయమయినా కూడా అది చూస్తున్నది.

మూడు అవస్థల్లోనూ చూడటమే కాదు, అవస్థల్లో మనోబుద్ధి అహంకారాల స్థితిగతులు మారుతున్నా అది మారటం లేదు. అనుభవాలు మారుతున్నాయి. దృశ్యాలు మారుతున్నాయి. అది మాత్రం మారటం లేదు. ఆ విధంగా ప్రతి అనుభవంలోనూ మారని చైతన్యాన్ని, మారే ఆలోచనను అనుభవిస్తున్నాము.

ఉపనిషత్తు మనను మారే అనుభవం నుంచి మారని చైతన్యం వైపు దృష్టి పెట్టమంటున్నది. ఆ చైతన్యాన్ని కొత్తగా అనుభవించనవసరం లేదు. అది ప్రతి అనుభవం వెనుకా ఉంది.

ఒకవేళ మనం కూర్చున్న గదిలో కాంతి లేదనుకోండి. అప్పుడేమవుతుంది. గదిలో ఉన్న మనుష్యులను కాని, వస్తువులను కాని చూడలేము. అంటే మనం చూసే ప్రతి దృశ్యం, రెండు అనుభవాల మేలు కలయిక.

**మారే వస్తువు+మారని కాంతి.**

అలాగే మనలో అంతర్గతంగా కలిగే భావాలన్నీ, అంటే రాగద్వేషాలన్నీ రెండు అనుభవాల మేలు కలయిక.

**మారే వృత్తి+ మారని చైతన్యం**

1. దీని వల్ల మనం తెలుసుకోవాల్సింది ఏమిటి? చైతన్యం యొక్క అనుభవం కోసం కొత్తగా ప్రయత్నించకూడదు. అది అన్ని అనుభవాల వెనకా ఉంది.

2. చైతన్యం ఎప్పుడూ ఉందని తెలుసుకున్నాక, మన దృక్పథాన్ని మార్చుకోవాలి. చైతన్యం లక్షణాలు గుర్తు తెచ్చుకోవాలి. అవి–

చైతన్యం శరీరంలో ఒక భాగం కాదు. దాన్నించి ఉత్పత్తి చెందింది కాదు. దానికి శరీర లక్షణాలు లేవు.

ఈ చైతన్యం నాలో, అన్ని జీవుల్లో, జీవుల మధ్య ఉన్న ఖాళీ ప్రాంతంలో కూడా ఉంది.

దీనివల్ల మన అనుభవమేమీ మారదు కాని మన దృక్పథం మారుతుంది. దీనికి గొప్ప ఉదాహరణ చంద్రుని వెన్నెలే! నిండు పున్నమి రాత్రి పండు వెన్నెల పుచ్చపువ్వులా విరగకాస్తుంటే మనస్సుకు ఆహ్లాదకరంగా ఉంటుంది. విజ్ఞాన శాస్త్రపరంగా మనకు అది చంద్రుని కాంతి కాదు, సూర్యుని కాంతే అని తెలుసు. చంద్రుడు ఉన్నా లేకపోయినా ఆ కాంతి ఉంటుందని కూడా తెలుసు. కాని వెన్నెలను ఆస్వాదించకుండా ఉండము. దృక్పథంలో మార్పు వచ్చింది కాని, అనుభవం మారదు. చంద్రకాంతి నిజానికి చంద్రకాంతి కాదు, సూర్యకాంతి అని తెలిసింది.

అలాగే, చైతన్యం ఈ శరీరానికే పరిమితమవలేదు. అది సర్వవ్యాపకం అని తెలుసుకుంటాము. సర్వవ్యాపకమైన చైతన్యాన్ని బ్రహ్మ అంటారని కూడా

తెలుసుకుంటాము. అందువల్ల దీన్ని బ్రహ్మజ్ఞానం అంటారు. బ్రహ్మజ్ఞానంతో అనుభవం మారదు. దృక్పథం మారుతుంది.

మొదటి అధ్యాయంలో ఆ బ్రహ్మ నేనే అని నేర్చుకున్నాను.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి** **1-5**

ఆ బ్రహ్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు అని నేర్చుకున్నాను.

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి** **1-4**

ఆ బ్రహ్మను కళ్ళతో చూడలేము. కాని కళ్ళు దాని వల్లనే పనిచేస్తున్నాయి అని నేర్చుకున్నాను.

**యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూంషి పశ్యతి** **1-7**

ఇప్పుడదే భావాన్ని ఇంకొంచెం ముందుకు వెళ్ళి చెపుతున్నది ఉపనిషత్తు. బ్రహ్మను అనుభవించలేము, కాని ప్రతి అనుభవం వెనకా బ్రహ్మ ఉంది.

**ప్రతిబోధవిదితం మతమ్**

ఈ మంత్రం ఒక సంపూర్ణ మంత్రం. ఇది జ్ఞానం, జ్ఞానఫలం, జ్ఞానసాధనం ఇస్తున్నది. ఇప్పుడు జ్ఞానఫలం చెపుతున్నది. ఏమిటది?

**అమృతత్వం హి విన్దతే–** నేను బ్రహ్మను అని ఎప్పుడైతే తెలుసుకున్నానో, అప్పుడే నా దృక్పథం మారుతుంది.

నేను కీళ్ళనొప్పులతో బాధపడే శరీరాన్ని కాను.

నేను విషయవాంఛలకు లొంగే ఇంద్రియాలను కాను.

నేను రాగద్వేషాలతో భగ్గుమనే మనస్సును కాను.

నేను పరిమితమైన, అశాశ్వతమైన బాధపడే జీవిని కాను.

నేను ప్రారబ్దకర్మతో అవస్థలు పడే జీవిని కాను.

మరి నేనెవరు?

నేను నిత్య, శుద్ధ, ముక్త బ్రహ్మను.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే॥** – గీత

బ్రహ్మ శాశ్వతోయం, నిదిధ్యాసనం చేసేటప్పుడు, శాశ్వతః అయంను శాశ్వతః అహంగా మార్చుకోవాలి. నేను శాశ్వతమైన బ్రహ్మను. శరీరానికేమన్నా అవనీ, ఎంతన్నా ప్రారబ్దకర్మను అనుభవించనీ, కాని నేను శాశ్వతం అని తెలుసుకుంటాడు జ్ఞాని. జ్ఞాని కూడా ప్రారబ్ధకర్మ అనుభవించక తప్పదు కాని దాని గురించి బాధపడడు.

**అమృతం హి విన్దతే** అంటే అమృతత్వాన్ని పొందుతాడు. తను నిత్య, ముక్త బ్రహ్మ అని తెలుసుకుంటాడు. మనను రెండు భయాలు వెంటాడుతుంటాయి. మృత్యువు, పునర్జన్మ. జ్ఞాని తను శాశ్వతమైన బ్రహ్మ అని తెలుసుకోవటం వల్ల మృత్యుభయం ఉండదు. జ్ఞానాగ్నిలో కర్మలు దగ్ధమవటం వల్ల పునర్జన్మ ఉండదు. అందువల్ల జనన మరణ చక్రం నుంచి తప్పించుకుంటాడు జ్ఞాని.

ఇప్పుడు జ్ఞాన సాధనం గురించి చెపుతున్నది

**ఆత్మనా విన్దతే వీర్యం – ఆ**త్మనా అంటే ఇక్కడ సాధన చతుష్టయ సంపన్నమైన అంతఃకరణ ద్వారా; జ్ఞానం పొందుతాడు.

సాధన చతుష్టయ సంపన్నమైన అంతఃకరణం అంటే సూక్ష్మమైన బుద్ధి ఉండాలి. అది వివేకంతో కూడినదై ఉండాలి. దీనికి చెయ్యి–కాంతి ఉదాహరణ చూద్దాము. దీన్ని 3 దశల్లో అర్థం చేసుకోవాలి. మీరు చెయ్యి చూపించి ఇక్కడేముంది అని అడిగితే –

1. చెయ్యి ఉంది.
2. చెయ్యి+కాంతి ఉంది.
3. అన్నిటినీ ప్రకాశింపజేసే కాంతి ఉంది.

అన్ని దశలవారీగా నేర్చుకుంటాము. ముందు చేతిని మాత్రమే చూస్తే, మూడవ దశలో చేతిని ప్రకాశింపజేసే కాంతిని చూస్తాము. ఈ విడదీయటం భౌతికంగా చేయము. చేతిని కోసుకోము. కాని అది బుద్ధిలో కలిగే మార్పు.

**దృశ్య తే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః – కఠ 1-3-12**

అలా సూక్ష్మబుద్ధి ఉంటేనే వేదాంతం వంటబడుతుంది. అది లేని వారికి అది మెట్ట వేదాంతంగా కనిపిస్తుంది. అందువల్ల వేదాంతం అర్థం చేసుకునే ముందు అధికారిత్వం ఉండాలి. అంటే సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలి. అధికారిత్వం ఎలా పొందాలి? కర్మయోగం, ఉపాసనయోగాల ద్వారా పొందాలి.

అందువల్ల వేదాంత విచారణ చేసేటప్పుడు కర్మయోగం, ఉపాసనా యోగాలను కొనసాగించాలి. వేదాంత విచారణ మొదలుపెట్టగానే వాటిని మానేయకూడదు. ఎందుకంటే విచారణ ఫలించాలంటే అధికారిత్వం ఉండాలి. అధికారిత్వం ఉండాలంటే కర్మ, ఉపాసనలు చేయాలి.

జ్ఞానకర్మ సముచ్చయం కుదరదు.

అందువల్ల జ్ఞానం స్పష్టంగా పొందేవరకూ, సాధనలను కొనసాగించాలి.

వీర్యం విందతే– వీర్యం అంటే శక్తి లేదా ప్రజ్ఞ. ప్రజ్ఞ దేనికి? ఆత్మజ్ఞానం పొందటానికి.

**విద్యయా విన్దతేఽ మృతమ్–** విద్య అంటే జ్ఞానం. జ్ఞానం పొందితే, శాశ్వతత్వం పొందుతారు. పొందుతారు అనే పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. అశాశ్వత వ్యక్తి అమరత్వాన్ని పొందలేడు. అశాశ్వతాన్ని, అమరత్వాన్ని కలిపే దారి లేదు. ఇది అద్వైతంలో ప్రాథమిక సూత్రాల్లో ఒకటి. దీన్ని సరిగ్గా అర్థం చేసుకుని జీర్ణించుకోవాలి.

అశాశ్వత వ్యక్తి ఎన్నటికీ అమరుడు కాలేడు.

అమరుడు ఎన్నటికీ సాధన చేయనవసరం లేదు.

పరిమితమైనది ఎప్పటికీ పరిమితమైనదే. ఎంత ప్రయత్నించినా శాశ్వతం కాలేదు. జ్ఞాని ముక్తపురుషుడు. అంటే మోక్షం సిద్ధవస్తువు. సాధ్యవస్తువు కాదు. మోక్షం పొందేసిన వ్యక్తి మళ్ళీ మోక్షం కోసం ఎందుకు ప్రయత్నం చేయాలి? అలాగైతే వేదాంత బోధ ఎందుకు?

వేదాంత బోధ నన్ను అమరుడిని చేయటానికి కాదు.

వేదాంత బోధ నేను ముక్త పురుషుడిని అని తెలియజెప్పటానికి, నా దృక్పథంలో మార్పు తేవటానికి. నేను పరిచ్ఛిన్న జీవిని అనే ఆలోచనను తొలగించి నేను నిత్యముక్తుడిని అని అర్థం చేయించటానికి.

మోక్షం పొందటం = నేను పరిచ్ఛిన్నుడిని అనే భావనను వదలివేయటం.

మోక్షం అంటే దృక్పథంలో మార్పు, సత్యాన్ని అర్థం చేసుకోవటం.

**మన్త్రము - 5**

**ఇహ చేదవేదీదథ సత్యమస్తి న చేదిహావేదన్మహతీ వినష్టిః।**
**భూతేషు భూతేషు విచిత్య ధీరాః ప్రేత్యాస్మాల్లోకాదమృతా భవన్తి ॥**

ఈ జ్ఞానాన్ని పొందే అవకాశం చాలా అరుదుగా కలుగుతుంది అంటున్నది ఉపనిషత్తు.

**దుర్లభం త్రయమేవైతద్ దేవానుగ్రహ హేతుకమ్।**
**మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయమ్॥**
**- వివేక చూడామణి**

1. మనుష్యజన్మ అరుదు - మనుష్య జన్మ ఎత్తటమే దుర్లభం. శాస్త్రం ప్రకారం 84 లక్షల జీవరాశులు ఉన్నాయి. అందులో మనుష్యజన్మ ఒకటి. అంటే అవకాశం ఎంత ఉంది? 84 లక్షల్లో ఒక వంతు. మధ్యలో మనం మనుష్య జన్మ ఎత్తి ఉండవచ్చు కాని ఫలితం లేదు. ఎందుకు? అప్పుడే జ్ఞానం పొంది ఉంటే, ఇవాళ వేదాంతం నేర్చుకోవాల్సిన అవసరం ఉండి ఉండేది కాదు. అప్పుడే జ్ఞానం పొంది ఉంటే, మోక్షం పొంది ఉండేవాళ్ళం. అలా మనుష్యజన్మ దుర్లభం.

2. ముముక్షుత్వం ఇంకా అరుదు- మనుష్య జన్మ ఎత్తినంత మాత్రాన ముముక్షుత్వం ఉండాలని లేదు. మనకున్న నాలుగు పురుషార్థాల్లో మోక్షం ఒకటి. కాని చాలా మంది ధర్మార్థకామాల వెంటే పరుగులు తీస్తారు కాని మోక్షం కోరరు. కొంతమంది మోక్షం కోరుకుంటారు కాని మోక్షం అంటే ఏమిటో తెలియదు. మోక్షం అంటే ఆత్మజ్ఞానం పొందటం అని తెలియదు.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ముణ్డక 1-2-12**

మోక్షం పొందాలంటే గురుశాస్త్ర ఉపదేశం పొందాలని తెలియదు.

3. వేదాంత విచార కోరిక, అవకాశం మరీ అరుదు- మనిషిగా పుట్టి, మోక్ష ఇచ్ఛ కలిగి కూడా వేదాంతం జోలికి పోరు కొంతమంది. వాళ్ళకి మోక్షం కావాలి కాని వేదాంతం నేర్చుకుంటేనే, అది కూడా గురువు ద్వారా నేర్చుకుంటేనే మోక్షము కలుగుతుందని తెలియదు వారికి.

**జ్ఞానాత్ ఏవ కైవల్యమ్**

జ్ఞానమొక్కటే మార్గం! వేరే లేదు. కాని దీనికి వచ్చేవారు మరీ అరుదుగా ఉంటారు. మనుష్యజన్మ అరుదు. మోక్ష ఇచ్ఛ ఇంకా అరుదు. మోక్షం కోసం వేదాంత విచారణ చేయాలన్న కోరిక ఉండటం. దానికి తగ్గ అవకాశం దొరకటం మరీ మరీ అరుదు. అందువల్ల ఉపనిషత్తు వేదాంత విద్యార్థులను అభినందిస్తున్నది. 'మీరు మరీ అరుదైన తెగ కిందకి వస్తారు. ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. ఎందుకంటే ఇప్పుడు వదులుకుంటే, మళ్ళీ దొరుకుతుందో లేదో చెప్పలేము.' ఇప్పుడు మంత్రం చూద్దాము

**ఇహ చేదవేదీత్–** ఈ మనుష్య జన్మలో మీరు ఈ జ్ఞానాన్ని పొందితే;

**అథ సత్యమస్తి–** మనుష్యజన్మ సార్థకమయింది. మనుష్య జన్మను భగవంతుడు ఎందుకు ఇచ్చాడు? జ్ఞానం పొందటానికి. ఎందుకంటే, వేరే ఏ జాతికీ జ్ఞానం పొందటం సాధ్యం కాదు. కుటుంబాన్ని పెంచి పోషించటం ఏ జంతువన్నా చేస్తుంది. బహుశా మనకన్నా ఎక్కువగా చేస్తుందేమో కూడా. అందువల్ల మనుష్యజన్మ, సత్యమవుతుంది, ఆత్మ జ్ఞానం పొందితే!

**న చేదిహా వేదీ –** ఎవరైనా ఒకవేళ ఈ మనష్యజన్మను వినియోగించుకోకపోతే,

**మహతీ వినష్టిః–** అతని నష్టం అనంతం. ఎందుకు? అతను అనంతమైన బ్రహ్మను తెలుసుకోలేకపోతున్నాడు కాబట్టి, అతని నష్టం కూడా అనంతమే. అందువల్ల వేదాంత విచారణ చేయాలి. వేదాంత విచారణ ఏమిటి? ఉపనిషత్తు చెపుతున్నది.

**భూతేషు భూతేషు విచిత్య –** అన్ని జీవుల్లోనూ ఉన్న చైతన్యం ఒకటే అని తెలుసుకోవాలి. విచిత్య అంటే వివేకం చూపించు. చైతన్యాన్ని గుర్తించు అని ఎందుకు చెపుతున్నది? చైతన్యం అందుబాటులో లేకపోవటం కాదు మన సమస్య! చైతన్యాన్ని గుర్తించలేకపోవటం మన సమస్య. అది జడ శరీరం. మనస్సుతో కలిసిపోవటం వల్ల మనం చైతన్యాన్ని విడదీసి చూడలేకపోతున్నాము.

ఉదాహరణకు సినిమాలో తెర ఎప్పుడు ఉంది అంటే విశ్రాంతి సమయంలో అనకూడదు. సినిమా అడుతున్నంతసేపూ తెర ఉంది. మారుతున్న సన్నివేశాలు, కదులుతున్న పాత్రల వెనుక కదలని తెర ఉంది. కాని మనం ఆ తెరను గమనించము. సినిమాలో లీనమైపోతాము. అలాగే మనలో కూడా మారే ఆలోచనల వెనుక మారని చైతన్యం ఉంది. దాన్ని పట్టించుకోవటం లేదు. అది ఒక్క మనలోనే కాదు. భూతేషు, భూతేషు– అన్ని జీవుల్లోను ఉంది. మారే ఆలోచనల వెనుక నున్న

మారని చైతన్యాన్ని గ్రహించటానికి సూక్ష్మ బుద్ధి కావాలి.

**ధీరాః–** అందువల్ల అటువంటి సూక్ష్మబుద్ధి ఉన్న వ్యక్తిని **ధీరాః** అంటున్నది ఉపనిషత్తు. ధీరాః అంటే ధైర్యమున్నవాడు కాదు. వివేకి అని అర్థం. ఈ గదిలో ఏముంది అని ఎవరినైనా అడిగితే, అనేక వస్తువులను పేర్కొంటారు కాని కాంతి ఉంది అని చెప్పరు. వారు దాన్ని పట్టించుకోరు.

ఈ సందర్భంలో, ఈ ఉపనిషత్తులో చెప్పకపోయినా, ఒక విషయం గుర్తించాలి మనం. బ్రహ్మను సచ్చిదానంద బ్రహ్మ అంటారు. బ్రహ్మ మారని చైతన్యంగా అన్ని జీవుల్లో ఉంది సరే, కాని జడ వస్తువుల మాటేమిటి? అందులో బ్రహ్మ ఉన్నట్టా, లేనట్టా! బ్రహ్మ సర్వవ్యాపకం. అన్నిటా, అంతటా ఉంది. జీవమున్న వాటిలో సత్,చిత్‌గా ప్రకటితమైతే, జడపదార్థాల్లో కేవలం సత్‌గా ప్రకటితమవుతుంది.

ఇంగ్లీషులో ది బుక్ ఈజ్, ది టేబుల్ ఈజ్, ది వాల్ ఈజ్ అని చెప్పేటప్పుడు అన్నింటిలో ఉన్న ఆ ఈజ్‌నెస్ ఉనికి లేదా సత్. ఆనందస్వరూపం జ్ఞానిలో తెలుస్తుంది. తక్కినవాటిలో తెలియకపోయినా, సచ్చిదానంద బ్రహ్మను తెలుసుకున్నాక, ఏమవుతుంది?

**ప్రేత్యాస్మాల్లోకాత్–** ఇది చాలా ముఖ్యం. జీవభావం నుంచి బయటకు రావాలి. అస్మాత్ లోకాత్ అంటే ఇక్కడ జీవభావం. మామూలుగా లోకా అంటే లోకాలు కాని ఇక్కడ జీవ భావం.

**లోక్యతే అనుభూయతే ఇతి లోకాః**

జీవ భావంలో ఏముంటుంది? అహంకార, మమకారాలు. అహంకారం అంటే నేను, మమకారం అంటే నాది అనే భావనలు. నేను శరీరాన్ని,నేను మనస్సును అని మురిసిపోతాము. మమకారం నా వస్తువులు, నా వృత్తి, నా కుటుంబం మీద ఉంటుంది. వ్యావహారిక దృష్ట్యా అహంకార, మమకారాలు ఉండవచ్చు. కాని ఆధ్యాత్మికంగా వాటిని వదులుకోవాలి.

ఈ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. గృహస్థును అహంకార, మమకారాలు పూర్తిగా వదులుకోమని చెప్పటం లేదు. మనవడు వచ్చి ఆప్యాయంగా ఒళ్ళో కూర్చుంటే శాస్త్రం నన్ను మమకారాలు వదులుకోమంటున్నది లే అని మనవడిని తోసివేయనవసరం లేదు. అతనితో మనసారా ఆడుకోవచ్చు. కాని మనవడు కొన్ని రోజులయ్యాక మిమ్మల్ని విడిచి వెళ్ళిపోతే అతని మీద బెంగపడి,

అనారోగ్యం కొని తెచ్చుకోవద్దని మాత్రమే చెపుతున్నది శాస్త్రం.

కుటుంబ అభిమాన త్యాగం, వృత్తి అభిమాన త్యాగం, విత్త అభిమాన త్యాగం, దేహ అభిమాన త్యాగం చేయమంటున్నది శాస్త్రం. అభిమానం అంటే తపన. దాని సంస్కృత పదం అనుచింత. చింత అంటే ఆలోచన. అనుచింత ఉంటే పదే పదే ఒకదాని గురించే ఆలోచించటం. మా అమ్మాయి, మా అమ్మాయి, మా అమ్మాయి అని పదే పదే తలచుకోవటం. అమ్మాయి గురించి ఆలోచించండి. తపన పడవద్దు! ఈ రెండింటి మధ్య తేడా ఉంది.

అహంకార, మమకారాలు బలంగా ఉంటే వేదాంత అధ్యయనం మనస్సు పొందిన జ్ఞానంగా మిగులుతుంది తప్ప, అది మోక్షం పొందటానికి తోడ్పడదు. అలాంటప్పుడు జ్ఞానం పొంది లాభమేమిటి అనకూడదు. పొందిన జ్ఞానం పని చేయాలంటే అహంకార, మమకారాలను తగ్గించుకోవాలి. వాటిని తగ్గించుకోవాలంటున్నాము, పూర్తిగా వదులుకోవాలనటం లేదు.

**అమృతా భవన్తి–** అస్మాత్ లోకాత్ అమృతాభవంతి. అంటే జీవన్ముక్తి ఇస్తుంది. జీవన్ముక్తి అంటే జీవితంలో వచ్చే ఒడిదుడుకులకు చలించకుండా, జీవితమన్నాక అవి రాకుండా ఉండవు అని తేలిగ్గా తీసుకోవటం.అమృతాభవన్తి– ప్రారబ్ధం ముగిశాక, జ్ఞాని శరీరం పడిపోతుంది. జ్ఞానిని అతను మరణించాడు అనము. జ్ఞాని నేను బ్రహ్మను అని బ్రహ్మనిష్టలో ఉంటాడు కాబట్టి అతనికి మరణం ఉండదు. జ్ఞాని విషయంలో అతని శరీరం రాలిపోయాక

అతని స్థూల శరీరం, సమష్టి స్థూల ప్రపంచం అయిన విరాట్‌లో

అతని సూక్ష్మ శరీరం, సమష్టి సూక్ష్మ ప్రపంచం అయిన హిరణ్యగర్భలో

అతని కారణ శరీరం, సమష్టి కారణ ప్రపంచం అయిన అంతర్యామిలో కలిసిపోతాయి. ఈ మూడూ కలిసి ఈశ్వరుడు అంటాము. జ్ఞాని ఉపాధి పరంగా ఈశ్వరునిలో ఐక్యమవుతాయి. ఆత్మపరంగా ఎప్పుడూ ఉంటాడు. కుండ పగిలిపోతే, కుండలో ఉన్న ఆకాశం, బాహ్యంగా ఉన్న ఆకాశంలో కలిసిపోయింది అనము. ఆ ఆకాశానికీ, ఈ ఆకాశానికీ తేడా లేదు. అదే విధంగా మరణం తర్వాత జ్ఞాని జీవాత్మ పరమాత్మ అవుతుంది. అందువల్ల అమృతాభవంతి అంది ఉపనిషత్తు. దీన్నే విదేహముక్తి అంటారు. అతనికి ఇంక పునర్జన్మ ఉండదు.

ఇక్కడితో బోధ అయిపోయింది. ఇది సూక్ష్మ బుద్ధి ఉన్నవారికి.

## అధ్యాయము–2 సారాంశము

బ్రహ్మ తెలిసిన వస్తువు కాదు. తెలియని వస్తువు కాదు.
బ్రహ్మ సాక్షి చైతన్యం; అది నేనే.
మారే వృత్తులను సాక్షిగా చూసే మారని చైతన్యం.
బ్రహ్మ ఎవరికి తెలియదో వారికి తెలుసు.
బ్రహ్మ ఎవరికి తెలుసో వారికి తెలియదు
అంటే బ్రహ్మను ఆబ్జెక్టుగా చూడకపోతే తెలుసు.
బ్రహ్మను ఆబ్జెక్టుగా చూస్తే తెలియదు
బ్రహ్మ అనుభవం పొందనవసరం లేదు.
ప్రతి అనుభవమూ బ్రహ్మ వల్లనే పొందుతాము.
బ్రహ్మజ్ఞాన ఫలం– జీవన్ముక్తి, తర్వాత విదేహముక్తి.

# కేనోపనిషత్తు

## అధ్యాయము - 3

మొదటి రెండు అధ్యాయాల్లో బుద్ధి సూక్ష్మంగా ఉన్నవారికి అర్థమవుతుంది. బుద్ధి స్థూలంగా ఉన్నవారిని కూడా వదలదు ఉపనిషత్తు. వారి కోసం అధ్యాయం 3,4 చెప్పబడ్డాయి. సూక్ష్మబుద్ధి అంటే ఏమిటి? స్థూలబుద్ధి అంటే ఏమిటి? మొదటి రెండు అధ్యాయాలు అర్థమయితే చాలు, సూక్ష్మబుద్ధి ఉన్నట్టే. వాటిని జీర్ణించుకోవటం, జ్ఞాననిష్ఠలో ఉండటం తర్వాతి మాట. లేదు, ఆ బోధ నాకు అర్థం కాలేదు. తలమీంచి వెళ్ళిపోయింది అనుకుంటే ఈ అధ్యాయాలు తోడ్పడుతాయి. వీటిలో కర్మ, ఉపాసన, విలువల ద్వారా అంటే అనేక సాధనల ద్వారా మనస్సును సిద్ధం చేస్తుంది. వేదాంత బోధలో నైతిక విలువలు కూడా కలిగి ఉండాలని వస్తుంది.

మూడవ అధ్యాయంలో 12 మంత్రాలు ఉన్నాయి. వాటిలో ఉపనిషత్తు ఒక కథను చెపుతున్నది. ఉపనిషత్తుల్లో ఇది చాలా ప్రాచుర్యం పొందిన కథ. ఈ కథ చెప్పటంలోని ఉద్దేశ్యం, దీని ద్వారా సందేశం ఇవ్వటం. ఉపనిషత్తు కాలక్షేపం కబుర్లు, కథలు చెప్పదు. అది చెప్పిందంటే దాని ద్వారా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని అర్థం. ఛాందోగ్యోపనిషత్తులో ఎన్నో కథలు వస్తాయి. అవి కూడా సందేశాలు అందజేస్తాయి. కాకపోతే, ఉపనిషత్తు ఆ కథలు ఎందుకు చెప్పిందో చెప్పదు. శంకరుల వారి భాష్యాలు లేకపోతే మానవాళికి అర్థం చేసుకోవటం కష్టం అవుతుంది.

ఇక్కడ కూడా ఉపనిషత్తు కథ మాత్రం చెప్పి ఊరుకుంటుంది. దాని నుంచి శంకరులవారు ఆరు సందేశాలను వెలికి తీశారు. ముందు ఆ కథ ఏమిటో చూద్దాము.

ఇది దేవతల గర్వభంగం గురించిన కథ. మన పురాణాల్లో ఇలాంటి గర్వభంగాల కథలు అనేకం వస్తూ ఉంటాయి. నారద గర్వభంగం; అర్జున గర్వభంగం, సత్యభామ గర్వభంగం- అలా ఎన్నో! వీటి సారాంశం గర్వం ఉండకూడదని. ఇక్కడ దేవతల గర్వభంగం. దేవతలకు, అసురులకు మధ్య తరచు యుద్ధాలు జరుగుతుంటాయి. ఎక్కువగా దేవతలే గెలుస్తుంటారు. వాళ్ళకు సత్త్వగుణం ఎక్కువగా ఉండటం వల్ల వాళ్ళకు ఈశ్వరకృప మెండుగా ఉంటుంది. అందువల్ల వాళ్ళే

గెలుస్తుంటారు. అలాంటి ఒక సందర్భం ఇది. ఇప్పుడు కూడా వాళ్ళే గెలిచారు. కాని ఈసారి వాళ్ళకు గర్వం వచ్చింది. నా వల్లే విజయం సాధించాము. నేను ఇంతమంది రాక్షసులను చంపాను అని గొప్పలు చెప్పటం మొదలుపెట్టారు.

మామూలుగా దేవతలకు దైవీ సంపత్తి ఉంటుంది. కాని ఎందుకో, తాత్కాలికంగా అజ్ఞానం వల్లో, మోహం వల్లో, గర్వం చోటు చేసుకుంది. వారికి గర్వభంగం చేయాలనుకున్నాడు ఈశ్వరుడు. భంగం అంటే నాశనం చేయటం. వాళ్ళ గర్వాన్ని నాశనం చేయాలనుకున్నాడు.

ఈశ్వరుడు వారి ముందు ఒక ప్రకాశవంతమైన రూపంలో వెలిశాడు. ఉపనిషత్తు యక్షుడు అంది. మామూలుగా మనం వాడే యక్ష, కిన్నెర, కింపురుషులలోని యక్షుడు కాదు ఇక్కడ. యక్షుడు అంటే ఈశ్వర అవతారం.

నిజానికి దయానంద సరస్వతి స్వామీజీ అంటారు,'వేదంలో ఈశ్వర అవతారం గురించిన మొట్టమొదటి ప్రస్థావన ఇక్కడే వచ్చింది! ఈ యక్షుని అవతారాన్ని ఆధారంగా చేసుకునే, మన పురాణాల్లో అనేక అవతారాల గురించిన వర్ణన వచ్చింది. వాటికి మూలం ఇదే!'

భగవంతుడు వాళ్ళకు మరీ దగ్గరగా కాకుండా, మరీ దూరంగా కాకుండా కనబడ్డాడు. వాళ్ళు గర్వంలో మునిగి తేలుతుండగా, వారి దృష్టిని ఆకర్షించాడు. ఆ ఆకారం దేదీప్యమానంగా ఉంది, ఏదో దైవ సంబంధమైనట్టుగా ఉంది, కాని అది ఏమిటో మాత్రం తెలియలేదు. అదేమిటో తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. మానవ నైజం కూడా అంతే! మనకు తెలియని విషయం తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది. అందులో దేవతలకు జ్ఞానం బాగానే ఉంటుంది. అలాంటి వారికి తెలియని విషయం ఏమిటయి ఉంటుంది?

దేవతల రాజు ఇంద్రుడు కూడా ఉన్నాడు వారితో. అతను దూతను పంపిద్దామనుకున్నాడు ఆ దివ్యయక్షుని గురించి తెలుసుకోవటానికి. దానికి అగ్నిని ఎంచుకున్నాడు. అగ్ని దేవతల దూత. అందువల్లనే మనం యజ్ఞం చేసి, అగ్నిలో ఆహుతులు వేస్తే, ఏ దేవత గురించి యజ్ఞం చేస్తున్నామో ఆ దేవతకు అందజేస్తాడు అగ్ని.

అగ్ని కూడా గర్వంగా వెళతాడు యక్షుని దగ్గరకు. 'ఎవరు నువ్వు?' అని అడుగుదా మనుకున్నాడు. కాని అగ్ని నోరు విప్పేలోపే, యక్షుడే, 'ఎవరు నువ్వు?'

అన్నాడు. పైపెచ్చు 'నీలో ఏ శక్తి ఉంది,' అన్నాడు. నువ్వు ఎవరు అన్న ప్రశ్నకే అగ్నికి అవమానంగా అనిపించినా దిగమింగుకున్నాడు. 'నేను ప్రపంచాన్ని దహించగలను' అన్నాడు. ఈశ్వరుడు, 'అదంతా చేయనవసరం లేదు. నేనొక ఎండుగడ్డిపోచను నీ ముందు పెడతాను, దానిని దహించు' అన్నాడు. అగ్ని ఎంత ఎగిసిపడినా, ఎంత ప్రయత్నించినా, దానిని దహించటం మాట దేవుడెరుగు, దాని మూలను కూడా కొంచెం కూడా కాల్చలేకపోయాడు. అవమానంతో వెనక్కి వచ్చి, నీరసంగా, 'నాకు ఆ యక్షుడెవరో తెలియదు,' అన్నాడు.

ఇప్పుడు వాయువు వంతు వచ్చింది. వాయువు కూడా అగ్ని చేయలేని పని నేనే చేయబోతున్నాననే గర్వంతో వెళ్ళాడు. మళ్ళీ అవే సంభాషణలు. 'నేను ప్రపంచంలో ఉన్న దేనినైనా ఎత్తివేయగలను,' అన్నాడు. ఈశ్వరుడు 'అగ్ని ముందు పెట్టిన గడ్డిపోచ అలాగే ఉంది. దాన్ని కదిలించు,' అన్నాడు. పెనుతుఫాను గాలులు వీచేలా చేసినా కూడా అణువంత కూడా గడ్డిపోచను కదపలేకపోయాడు. అవమానభారంతో గోడకు కొట్టిన బంతిలా వెనుదిరిగి వచ్చాడు. అగ్ని, వాయువులు ఒకరి మొహాలు ఒకరు చూసుకుని, 'నీకూ ఆ గడ్డిపోచేనా,' అని సంజ్ఞలు చేసుకున్నట్లుగా ఊహించుకోవచ్చు.

ఇప్పుడు ఇంద్రుని వంతు వచ్చింది. ఇంద్రుడు దేవతలకు రాజు కదా! వారిద్దరూ చేయలేని పని తాను చేయగలనని భావించి, వారికన్నా ఎక్కువ గర్వంతో వెళ్ళాడు. అగ్ని, వాయువులిద్దరూ కనీసం యక్షుడిని చూసి, సంభాషణ జరుపగలిగారు. ఇంద్రుడికి గర్వం ఇంకా ఎక్కువ ఉన్నా, సత్త్వగుణం కూడా ఎక్కువగా ఉండటం వల్ల పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. తన గర్వాన్ని అణచటానికే యక్షుడు మాయమయిపోయాడని గ్రహించి వెంటనే వినయంగా ప్రార్థించాడు ఈశ్వరుడిని. అతని వినయానికి మెచ్చిన ఈశ్వరుడు, ఈసారి ఉమాదేవిగా ప్రత్యక్షమయ్యాడు.

బ్రహ్మజ్ఞానాన్ని ప్రత్యక్ష ప్రమాణం ద్వారాగాని, అనుమాన ప్రమాణం ద్వారా గానీ పొందలేము. దానికి శబ్ద ప్రమాణం ఒక్కటే మార్గం. గురు శాస్త్ర ఉపదేశం. గురువుగా శాస్త్రాన్ని బోధించటానికి ఉమాదేవి ప్రత్యక్షమయింది. శిష్యుడు ప్రశ్న వేయందే గురువు బోధించడు. శిష్యుడు వినయంగా నాకు బ్రహ్మవిద్య నేర్పు అని అడగాలి.

**శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్॥ గీత 2-7**

గురువును శరణు కోరందే, బ్రహ్మవిద్యను పొందలేము. సగుణ బ్రహ్మ గురించి అయినా నిర్గుణ బ్రహ్మ గురించి అయినా గురుశాస్త్ర ఉపదేశం లేనిదే పొందలేము. ఉమాదేవి గురు, శాస్త్రంగా ప్రత్యక్షమయింది. ఇంద్రుడు జ్ఞానం కోసం అడిగాడు. ఇక్కడిదాకా మూడవ అధ్యాయం.

నాలుగవ అధ్యాయంలో కూడా కథ కొనసాగుతుంది. యక్షుడు సగుణ ఈశ్వరుడని ఇంద్రుడు తెలుసుకున్నాడు.

**మాయాసహిత బ్రహ్మ = ఈశ్వరుడు**

**మాయారహిత ఈశ్వరుడు = బ్రహ్మ**

ఈ జ్ఞానం పొందిన ఇంద్రుడు వెనక్కి వచ్చి తక్కిన దేవతలకు కూడా నేర్పాడు. ఈ బ్రహ్మ విద్య పొందటం వల్ల ఇంద్రుడు పేరు ప్రఖ్యాతులు పొందాడు. ఇదీ కథ.

ఇప్పుడు ఈ కథ వల్ల పొందే సందేశాలు చూద్దాము.

**1. బ్రహ్మ అస్తిత్వము –** బ్రహ్మ ఉన్నాడని తెలుస్తున్నది. మొదటి రెండు అధ్యాయాల్లో బ్రహ్మను నిర్గుణ చైతన్యంగా వర్ణించటం జరిగింది. నేను బ్రహ్మను అన్నప్పుడు కూడా రూపం లేని బ్రహ్మను. శరీరం, ఇంద్రియాలు, మనస్సు లేని బ్రహ్మను. రూపం లేని, ఆబ్జెక్టు కాని బ్రహ్మను. అసలు అలాంటి బ్రహ్మ ఉంటుందా అని అనేకమందికి శంక. మామూలు మనుష్యులే కాదు! వేదాంత విద్యార్థులు కూడా శంకిస్తారు. వేదాంతాన్ని ఆధారం చేసుకుని మూడు దర్శనాలు ఉన్నాయి. అద్వైత వేదాంతం, ద్వైత వేదాంతం, విశిష్టాద్వైతం. ఒక్క అద్వైతవేదాంతమే నిర్గుణ ఈశ్వరుడు సత్యం అంటుంది. తక్కిన రెండూ ఒప్పుకోవు. అందువల్ల అటువంటి నిర్గుణబ్రహ్మ ఉందా అనే అనుమానం కలుగుతుంది. ఉపనిషత్తే అలాంటి సందేహం వస్తుందని చెపుతుంది.

**అసన్నేవ స భవతి అసద్బ్రహ్మేతి వేద చేత్।**
**అస్తి బ్రహ్మేతి చేద్వేద సన్తమేనం తతో విదురితి॥**

**బ్రహ్మానన్దవల్లీ 6-1**

**అస్తీతి బ్రువతోఽన్యత్ర కథం తదుపలభ్యతే ॥ కఠ 2-3-12**
**అస్తీత్యేవ ఉపలబ్ధవ్యః తత్త్వభావేన చోభయోః।**
**అస్తీత్యేవ ఉపలబ్ధస్య తత్త్వభావః ప్రసీదతి॥ కఠ 2-3-13**

నిర్గుణ బ్రహ్మను అర్థం చేసుకోవటం కష్టమని ఉపనిషత్తే అర్థం చేసుకుంది.

అందువల్ల మనం సంసిద్ధులమయ్యేంతవరకూ – మనమీద జాలికొద్దీ సగుణ ఈశ్వరుడిని ప్రవేశపెడుతుంది. అందువల్లనే మొదటి రెండు అధ్యాయాలలో నిర్గుణ బ్రహ్మను వివరించినా, మూడు, నాలుగు అధ్యాయాల్లో సగుణ బ్రహ్మను ప్రవేశపెట్టింది. కోటిసూర్య ప్రకాశః. అందువల్ల బ్రహ్మ అస్తి. అంతేకాదు, బ్రహ్మతో మాట్లాడారు కూడా అగ్ని, వాయువులు. అలా నిర్గుణ బ్రహ్మను సగుణ ఈశ్వరునిగా వర్ణించింది.

ఆ ఈశ్వరుడు ఎవరు? అగ్నిలో మండే శక్తి ఈశ్వరుడు. వాయువులో వీచే శక్తి ఈశ్వరుడు. ఈశ్వరుని కృపలేనిదే అగ్ని మండలేదు, వాయువు వీచలేదు. అది కూడా చూశాము కదా. అందువల్ల ఈశ్వరుడిని తత్త్వం అంటారు. తత్ అంటే అది; త్వమ్ అంటే శక్తి. దానియొక్క శక్తి. అది ఈశ్వరుడు. అందువల్ల ఈశ్వర అస్తి. ఈశ్వరుని శక్తి వల్లనే అగ్ని మండుతుంది. వాయువు వీస్తుంది. నేను మాట్లాడుతాను. అందువల్ల బ్రహ్మ అస్తి, యక్షరూపేణ.

**2. బ్రహ్మణః దుర్విఘ్నేయత్వం–** బ్రహ్మ అస్తిత్వం ఒప్పుకున్నా, బ్రహ్మను తెలుసుకోవటం కష్టం. ఈశ్వర అనుగ్రహం లేనిదే బ్రహ్మ గురించి తెలుసుకోలేము. అగ్ని, వాయువు వెళ్లినా యక్షుడి గురించి తెలుసుకోలేకపోయారు. ఇంద్రుడు కూడా ముందు తెలుసుకోలేకపోయారు. ఉమాదేవి ప్రత్యక్షమయ్యాకే తెలుసు కున్నాడు. అందువల్ల ఈశ్వర అనుగ్రహం, శాస్త్రప్రమాణం లేనిదే బ్రహ్మజ్ఞానం సాధ్యం కాదు.

**3. గురు అపేక్ష–** రెండవ దశతో ముడిపడి ఉంది ఇది. దీన్ని కార్యకారణ సంబంధం అనవచ్చు. బ్రహ్మజ్ఞానం మనంతట మనం పొందలేము. దానికి గురువు కావాలి. ఇంద్రుడు ప్రార్థిస్తే ఉమాదేవిని పంపాడు ఈశ్వరుడు. బ్రహ్మజ్ఞానం పొందే సమయం ఆసన్నమయితే, ఈశ్వరుడు గురువును మీ దగ్గరకు పంపటమో, మిమ్మల్ని గురువు దగ్గరకు పంపటమో చేస్తాడు.

కళ్ళు మూసుకుని, 'నేనెవరు, నేనెవరు?' అని ధ్యానిస్తూ కూర్చోకూడదు. చాలా మంది ఆత్మవిచారణ అంటే స్వంతంగా చేసే విచారణ అనుకుంటారు. అది పొరపాటు. ఆత్మ విచారణ గురువు ద్వారానే చేయాలి.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ ముణ్డక 1-2-12**

**4. యోగ్యతా అపేక్ష–** గురువు చెప్పటానికి సిద్ధంగా ఉన్నా మనం అందుకునే అధికారిత్వం లేదా యోగ్యత ఉండాలి. గంగావతరణలో గంగను తీసుకునే అధికారి శివుడు మాత్రమే అని చూశాము. నేను అందుకునే పాత్ర భావన ఉండాలి. దానికి కావాల్సిన అర్హతలు ఏమిటి?

**ఎ) అమానిత్వం–** అమానిత్వం మొట్టమొదటి విలువగా ఉండాలి. గురువుకు వచ్చా రాదా అని గురువును పరీక్షించకూడదు. తక్కిన విలువలు ఏమిటి? గీతలో వస్తాయి. ఉపనిషత్తులు నేర్చుకునే విద్యార్థులు గీత కూడా వాటితోపాటు నేర్చుకోవాలి. ఒకవేళ ముందే నేర్చుకున్నా, మళ్ళీ మళ్ళీ నేర్చుకుంటూ ఉండాలి. 13వ అధ్యాయంలో శ్రీకృష్ణపరమాత్ముడు 20 విలువలు చెప్పాడు.

అమానిత్వం అదంభిత్వం అహింసా క్షాంతి ఆర్జవం

**బి) ఆచార్య ఉపాసనం–** ఆచార్యుని కొలవాలి. ఆచార్యునికి పాదపూజ చేయాలి. భిక్ష ఇవ్వాలి.

**సి) అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం–** ఆచార్య సేవ చేస్తే చాలదు. శ్రవణం కూడా చేయాలి. అంటే శాస్త్రం నిరంతరం వింటూ ఉండాలి.

**డి) అవ్యభిచారిణి భక్తి–** దృఢమైన భక్తి కూడా ఉండాలి. అప్పుడే ఉపనిషత్తు విద్య ఫలిస్తుంది.

యోగ్యతా అపేక్ష అంటే అధికారిత్వ అపేక్ష, సాధన చతుష్టయ సంపత్తి ఆపేక్ష.

**5. బ్రహ్మవిద్యా స్తుతి –** 5,6 సందేశాలు నాలుగవ అధ్యాయంలో వస్తాయి. ఇంద్రుడు, వాయువు, అగ్ని బ్రహ్మవిద్య వల్ల పేరు ప్రఖ్యాతులు పొందారు. అందువల్ల బ్రహ్మవిద్య పేరు ప్రఖ్యాతలనిస్తుంది అని తెలుస్తున్నది. జ్ఞానికి పేరు ప్రఖ్యాతుల మీద మోజు ఉండదు కాని బ్రహ్మవిద్య వల్ల అది వచ్చి తీరుతుంది. నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తాడు. లౌకిక సుఖాలు కూడా కలుగుతాయి.

**6. ఉపాసనా విధి అంగత్వం–** కొన్ని ఉపాసనలు చెప్పబడుతాయి. అందులో విద్యుత్ ఉపాసన ఒకటి. మెరుపు ఉపాసన అంటే ఉపాసనను మెరుపులా చేసి మాయమవటం కాదు. మెరుపు మీద ఉపాసన చేయటం. ఇంకొక ఉపాసన ఆలోచన మీద.

ఆలోచన, విద్యుత్తుల గొప్పతనం ఏమిటి? రెండూ ప్రకాశవంత

మైనవి.రెండూ తక్కినవాటిని ప్రకాశింపజేస్తాయి; రెండూ క్షణమాత్రం ఉంటాయి. క్షణంలో మెరిసి, మాయమవుతాయి, యక్షునిలాగా. ఈ లక్షణాలన్నీ యక్షునిలో చూశాము. అందువల్లనే ఈ కథ నుంచి ఈ ఉపాసనలను ఎన్నుకుంది - విద్యుత్ ఉపాసన, మనోవృత్తి ఉపాసనలు. ఇవి కథలోంచి వచ్చాయి కాబట్టి ఉపాసనావిధి అంగత్వం ఇంకో సందేశం.

ఈ నేపథ్యంతో మంత్రాలు చూద్దాము.

## మన్త్రము - 1

**బ్రహ్మ హ దేవేభ్యో విజిగ్యే తస్య హ బ్రహ్మణో విజయే దేవా అమహీయన్త ।**
**త ఐక్షన్తాస్మాకమేవాయం విజయోఽస్మాకమేవాయం మహిమేతి॥**

**బ్రహ్మ హ దేవేభ్యో విజిగ్యే-** దేవదానవుల మధ్య తరచు జరిగే యుద్ధాలలో, ఒక యుద్ధంలో పరమాత్మ దేవతల కొరకు, రాక్షసుల మీద విజయం సాధించాడు. ఇక్కడ భాషను గమనిస్తే, దేవతలు విజయం పొందారు అనటం లేదు ఉపనిషత్తు. దేవతల తరఫున బ్రహ్మ విజయం సాధించాడు అంటున్నది.

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ గీత 11-33**

బ్రహ్మకృప వల్ల గెలిచారు. దేవతలు కేవలం నిమిత్త మాత్రులు విజయం విషయంలో. కాని జరిగిందేమిటి?

**తస్య హ బ్రహ్మణో -** దేవతలు బ్రహ్మకృపను గ్రహించలేదు.

**విజయే దేవా అమహీయన్త-** వాళ్ళ గొప్పే అనుకున్నారు. దానివల్ల గర్వం వచ్చింది.

అలా గర్వం వచ్చినప్పుడు, దేవుడు వాళ్ళ గర్వభంగం చేయాలి.

**త ఐక్షన్తా -** దేవతలు ఈ విధంగా అనుకున్నారు.

**అస్మాకమేవాయం విజయోఽస్మాకమేవాయం మహిమేతి -** మా వల్లనే విజయం వచ్చింది అని గొప్పలుపోయారు.

అలా దేవతలకు గర్వం వచ్చింది. అమానిత్వం అలవరచుకోవాలంటే, రోజూ నమస్కారాలు చేయాలి. అందుకే మన సంస్కృతిలో పెద్దలకు, దేవతలకు, తల్లిదండ్రులకు వంగి నమస్కారం చేయమంటారు. నమస్కారం చేసే అలవాటు ఉన్నవారు, శాస్త్రంలో చెప్పిన విలువలను పెంపొందించుకుంటారు అని మనుస్మృతి చెపుతుంది.

సర్వసాక్షి అయిన భగవంతుడు ఈ మానిత్వాన్ని గమనించాడు. అప్పుడు ఏం చేశాడు?

**మన్త్రము - 2**

**తద్ధైషాం విజజ్ఞౌ తేభ్యో హ ప్రాదుర్బభూవ తన్న వ్యజానత కిమిదం యక్షమితి ॥**

**తద్ధైషాం విజజ్ఞౌ -** దేవతల ఈ గర్వాన్ని భగవంతుడు గమనించాడు. వారికి బుద్ధి చెప్పాలనుకున్నాడు. రాక్షసులకు బుద్ధి చెప్పినా లాభం లేదు. వారు మారరు. దేవతలు సత్వగుణ ప్రధానులు కాని ఎందుకో ఆసారి గర్వం వచ్చింది. వెంటనే ఆ గర్వాన్ని అణచాలి అనుకున్నాడు భగవంతుడు. అందువల్ల వారి ముందు యక్షస్వరూపంలో ప్రత్యక్షమయ్యాడు.

**యక్ష స్వరూపాయ జటాధరాయ పినాకహస్తాయ సనాతనాయ।**
**దివ్యాయ దేవాయ దిగమ్బరాయ తస్మై యకారాయ నమశ్శివాయ॥**
**- శివపఞ్చాక్షరీ స్తోత్రమ్**

కొన్నింటిలో యజ్ఞస్వరూపాయ అని ఉంటుంది. యక్షస్వరూపాయ పదం కేనోపనిషత్తులోని ఈ మూడవ అధ్యాయం నుంచి వచ్చింది.

**యజనయోగ్యః పూజనీయరూపమ్॥**

**తేభ్యో హ ప్రాదుర్బభూవ-** దేవతలను మార్చటం కోసం, భగవంతుడు తేజోరూపంలో అవతారం ఎత్తాడు. వాళ్ళకు మరీ దగ్గరగా కాకుండా, మరీ దూరంగా కాకుండా కనబడ్డాడు. మరీ దగ్గరగా ఉంటే వాళ్ళకు స్పష్టంగా తెలుస్తాడు. మరీ దూరంగా అయితే, వాళ్ళు గమనించకపోవచ్చు.

**తన్న వ్యజానత-** సహజంగానే వాళ్ళు యక్షుడిని చూశారు కాని ఆ యక్షుడు ఎవరో తెలుసుకోలేకపోయారు. సాధారణంగా దేవతలకు అన్నీ తెలుసు; మనలాగా కాలేజీలకు వెళ్ళి నేర్చుకోనవసరం లేదు. కాని ఇదెవరో తెలియలేదు.

**కిమిదం యక్షమితి-** ఈ యక్షుడు ఎవరు అని వారిలో వారు అనుకున్నారు.

**మంత్రం-3**

**తేఽ గ్నిమబ్రువన్ జాతవేద ఏతద్విజానీహి కిమిదం యక్షమితి తథేతి ॥**

దేవతలందరూ సమావేశమై, ఆ యక్షుడెవరో తెలుసుకోవటానికి ఎవరిని

పంపించాలని చర్చించుకున్నారు. అగ్ని అందుకు సమర్థుడని నిర్ణయించు కున్నారు.

**అగ్రగామీ ఇతి అగ్నిః - అగ్రే గచ్ఛతి**

దేవతల దూతగా అందరికన్నా ముందు వెళతాడు. అంతేకాదు ఎవరికి యజ్ఞం చేస్తే ఆ దేవతకు తీసుకువెళ్ళి ఆహుతులు అందజేస్తాడని కూడా చూశాము. ఆ విధంగా అగ్ని దేవత కొరియర్ సర్వీస్ చేస్తాడు.

**తేఽగ్నిమబ్రువన్ -** ఆ దేవతలు అగ్నితో ఇలా చెప్పారు.

**జాతవేద ఏతద్విజానీహి -** అతని అహం తృప్తిపరచటానికి, అగ్నిని జాతవేదః అని సంబోధించారు.

**జాతం జాతం వేత్తి ఇతి జాతవేదః**

సృష్టింపబడిన ప్రతిదీ తెలిసినవాడు అగ్ని అని అర్థం. అందువల్ల **జాతవేదః** అంటే సర్వజ్ఞుడు. అంతా తెలిసినవాడు అని అర్థం. ఒక విధంగా అతన్ని రెచ్చగొడుతున్నారు కూడా. నువ్వు జాతవేదుడివి. నీకు అన్నీ తెలుసు.

**కిమిదం యక్షమితి-** ఆ బిరుదును నిలబెట్టుకోవాలంటే నువ్వు ఈ యక్షుడెవరో తెలుసుకోవాలి.

**తథేతి-** తథాస్తు అన్నాడు అగ్నిదేవత. అసలే విజయగర్వంలో ఉన్నాడు. తనకు అన్నీ తెలుసనే అహంభావం ఉంది. అందువల్ల తేలిగ్గా ఒప్పేసుకున్నాడు.

## మన్త్రము - 4

**తదభ్యద్రవత్తమభ్యవదత్కోఽసీత్యగ్నిర్వా**
**అహమస్మీత్యబ్రవీజ్జాతవేదా వా అహమస్మీతి ॥**

**తదభ్యద్రవత్-** అగ్ని యక్షుని దగ్గరకు వెళ్ళాడు. యక్షుడిని ఎలా ప్రశ్నలు వేయాలో ప్రణాళిక వేసుకుని వెళ్ళాడు అగ్ని దేవత. అక్కడికి వెళ్లాక ఒక్క నిముషం ఆగాడు.

**తమభ్యవదత్-** యక్షుడు అగ్నిని మొదటి ప్రశ్న వేశాడు. అప్పుడే మొదటి దెబ్బ పడినట్టయింది. ఏమని అడిగాడు?

**కోఽసీతి-** ఎవరు నువ్వు? అన్నాడు. అదే పెద్ద దెబ్బ. తను తెలియని వారుండరు. తననే ఎవరా అని అడుగుతున్నాడేమిటి అనుకున్నాడు. చింత చచ్చినా పులుపు చావలేదు అంటారు. ఈ ప్రశ్నతో కొంత అహంకారం తగ్గినా పూర్తిగా తగ్గలేదు.

**అగ్నిర్వా అహమస్మీతి–** అగ్నిని అన్నాడు. అది నేనెవరనుకున్నావు అగ్నిని అన్నట్టుగా ఉంది.

అన్నిటికన్నా పురాతనమైన ఋగ్వేదం ఈ మంత్రంతో మొదలవుతుంది.

**అగ్నిమీళే పురోహితమ్ యజ్ఞస్యదేవమృత్విజమ్।**

**హోతారం రత్నధాతమమ్॥**

వేదాలు అగ్నిని కీర్తిస్తాయి. అగ్ని సూక్తం కూడా ఉంది. 'నేను చాలా ప్రఖ్యాతి చెందినవాడిని. ఆ ప్రఖ్యాతి చెందిన అగ్నిని నేను,' అన్నాడు. వా అంటే నొక్కి పలకటం. అంతేకాదు నాకెన్నో బిరుదులున్నాయి.

**అబ్రవీజ్జాతవేదా వా అహమస్మీతి –** నాకు చాలా గొప్ప బిరుదు ఉంది. నన్ను జాతవేదుడు అంటారు అన్నాడు. జాతవేదుడు అంటే సర్వజ్ఞుడు. కాని అతని అహంకారాన్ని ఇంకా రెచ్చగొట్టాడు యక్షుడు తర్వాత వచ్చే మంత్రంలో.

## మన్త్రము – 5

**తస్మిగ్గంస్త్వయి కిం వీర్యమిత్యపీదగ్ం సర్వం దహేయం యదిదం పృథివ్యామితి॥**

**తస్మిగ్ంస్త్వయి కిం వీర్యమిత్యపి –** ఇంత గొప్పవాడివని చెపుతున్నావు. నీకు ఏం శక్తి ఉంది అని అడిగాడు యక్షుడు. అగ్ని అంత దగ్గరగా ఉన్నా యక్షుడిని ఆ వేడి ఏమీ చేయలేకపోతున్నది. అందువల్ల ఏ లోకంలో ఏదున్నా దహించివేయగలను అన్నాడు.

**జాయన్తేయ గీతలో** ప్రళయం గురించి వర్ణన వస్తుంది. అందులో పంచభూతాలు ప్రళయం అప్పుడు ఎలా శక్తివంతమవుతాయో వర్ణన వస్తుంది. అగ్ని గురించి చెప్పినప్పుడు ఇలా వస్తుంది. అగ్ని పాతాళలోకంలో మొదలవుతుందిట. ఆ మంటలు, వేడి భూలోక, భువర్లోక, సువర్లోకాల ద్వారా వెళతాయట. అంతశక్తి ఉంది అగ్నికి.

**ఇదగ్ం సర్వం దహేయం యదిదం పృథివ్యామితి –** అందువల్లనే నేను భూమిమీద ఉన్నదేదైనా కాల్చి బూడిద చేయగలను అని ధీమాగా పలికాడు అగ్నిదేవుడు. యక్షుడేమన్నాడు? అది తర్వాత వచ్చే మంత్రంలో వస్తుంది.

## మన్త్రము -6

**తస్మై తృణం నిదధావేతద్దహేతి తదుపప్రేయాయ సర్వజవేన తన్న శశాక దగ్ధుం స తత ఏవ నివవృతే నైతదశకం విజ్ఞాతుం యదేతద్యక్షమితి ॥**

యక్షుడేమన్నాడో చూసేముందు, పంచభూతాల గురించి ఇంకొక్క విషయం చూద్దాము. **జాయన్తేయ గీత** భాగవతం ఏకాదశ స్కంధంలో వస్తుంది. అందులో ప్రళయ సమయంలో పంచభూతాలు ఎలా శక్తివంతమవుతాయో, ఎలా వాటి శక్తిని ఎవరూ అరికట్టలేరో వర్ణన వస్తుంది. ఆకాశం ఏమీ చేయదనుకోండి. అగ్ని గురించి చూశాము. నీరు గురించి కూడా చాలా గొప్పగా వస్తుంది. ప్రళయంలో వాన గురించిన వర్ణన వస్తుంది. వాన చినుకులు ఎంత పెద్దవిగా ఉంటాయంటే, ఒక్కొక్క చినుకు పరిమాణం ఏనుగు తొండమంత ఉంటుందిట. అటువంటి వాన మూడు రోజులో, ఐదు రోజులో కాదు, కొన్ని శతాబ్దాలు కురుస్తూనే ఉంటుంది, పృథివీ మొత్తం వానలో లయమయ్యేదాకా. ప్రళయంలో సృష్టిజరిగిన వరుసక్రమానికి భిన్నంగా జరుగుతుంది. అందువల్ల పృథివీ జలంలో; జలం అగ్నిలో; అగ్ని వాయువులో; వాయువు ఆకాశంలో; ఆకాశం ఈశ్వరునిలో లయమవుతాయి.

ఇదంతా అగ్నికున్న అఖండమైన శక్తి గురించి చెప్పటానికి చెప్పటం జరిగింది. కాని అటువంటి అగ్నికి గర్వభంగం చేయటానికి, ఈశ్వరుడు ఒక ఎండు గడ్డిపోచని అతని ముందు పెడతాడు. పచ్చగడ్డి కూడా కాదు.

**తస్మై తృణం నిదధావేతద్దహేతి–** నువ్వు ఈ తృణాన్ని అంటే ఒక చిన్న గడ్డిపోచను దహించు అన్నాడు. మహా మహా భవంతులు దహించనవసరం లేదు, నీకొక చిన్న పరీక్ష పెడుతున్నాను అన్నట్టుగా అన్నమాట.

అగ్నికి అది అవమానంగా తోచినా, ఒక పని ఇస్తే చేయాలి కదా!

**తదుపప్రేయాయ–** గడ్డిపోచ దగ్గరకి వెళ్ళాడు. చిన్న నిప్పురవ్వ చాలనుకున్నాడు. కాని అదేమీ చేయలేకపోయింది.

**సర్వజవేన తన్న శశాక దగ్ధుం–** తన శక్తినంతా ఉపయోగించాడు. కాని ప్రయోజనం లేకపోయింది. దాన్ని ఒక మూల కూడా దహించలేకపోయాడు. దహించటం మాట దేవుడెరుగు, ఒక మూల కూడా కాల్చలేకపోయాడు. ఈ సన్నివేశంలో మనకు భీముని గర్వభంగం కథ గుర్తుకురాక తప్పదు. భీముడు అడవిలో ఉండగా, అతని అన్న అయిన ఆంజనేయుడు భీమునికి గర్వభంగం

కలిగించాలనుకున్నాడు. ముందు ముందు మహాభారత యుద్ధం జరగబోతున్నది. దానికి దేవుని అనుగ్రహం కావాలి. అందువల్ల ఆంజనేయస్వామి దారికడ్డంగా పడుకుంటాడు.

భీముడు వచ్చి, కోపంగా అరుస్తాడు. 'ఓ ముసలీ! దారికడ్డంగా ఎందుకు పడుకున్నావు?' ఆంజనేయుడు బలహీనంగా అంటాడు, 'ఓ భీమా, నువ్వు బలవంతుడివి, నేనా వృద్ధుడిని అయిపోయాను. నా తోక పక్కకి జరిపి నువ్వు వెళ్ళు.' 'నా గదతో జరపనా?' అని, 'కాని అలా చే స్తే నీ తోక నాశనమవుతుంది,' అంటాడు. 'నా తోకా, నీ గదా?'అని హేళన చేస్తాడు ఆంజనేయస్వామి. తర్వాత కథ తెలిసిందే. ఆ తోకను ఎంత బలం ఉపయోగించినా అణుమాత్రం కూడా కదల్చలేకపోతాడు భీముడు. ఇప్పుడు అగ్నికీ అదే అయింది.కాకపోతే అక్కడ భీముడు ఆంజనేయుడు ఎవరో తెలుసుకుంటాడు.కాని అగ్ని ఆడగడు.

అప్పుడన్నా అతని గర్వభంగం అయి, నువ్వెవరు అని అడిగి ఉండాల్సింది. కాని అవమానంతో దహించుకుపోయాడు.

**స తత ఏవ నివవృతే –** అక్కడ్నుంచి మౌనంగా వెనక్కి తిరిగి వచ్చేశాడు.

**నైతదశకం విజ్ఞాతుం యదేతద్యక్షమితి–** ఈ గొప్ప యక్షుడు ఎవరో నేను తెలుసుకోలేకపోయాను అన్నాడు వెనక్కి వచ్చి.

అగ్ని ఉదంతం వల్ల మొదటి సందేశం– **యోగ్యతా అపేక్ష–** మానిత్వం ఉండకూడదని తెలుస్తున్నది.

రెండవ సందేశం– **దుర్విఘ్నేయత్వం– నైతదశకం విజ్ఞాతుం యదేతద్ యక్షమ్**

మన పంచ జ్ఞానేంద్రియాలకు, పంచ కర్మేంద్రియాలకు అధిష్ఠాన దేవతలు ఉన్నారని తత్త్వబోధలో నేర్చుకున్నాము.

అగ్నిదేవత వాక్కుకి అధిష్టాన దేవత.

వాయుదేవత – స్పర్శకు అధిష్ఠాన దేవత.

వాక్కు అన్ని కర్మేంద్రియాలను సూచిస్తే, స్పర్శ అన్ని జ్ఞానేంద్రియాలను సూచిస్తుంది. ఇప్పుడు అగ్నిదేవుడు, తర్వాత వాయుదేవుడు యక్షుడిని తెలుసుకోలేకపోయారు. మనం మొదటి అధ్యాయంకి వెళ్ళాలి.

**నతత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః॥ 1–3**

అంటే బ్రహ్మను ప్రత్యక్ష ప్రమాణాల ద్వారా తెలుసుకోలేము.

**బ్రహ్మ దుర్విజ్ఞేయం.** అంతేకాదు

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః 1-2**

దీనికి అక్కడ చెవికి వివరణ ఏమని చూశాము?

1. ఆత్మ వేరు, చెవి వేరు.

2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.

3. ఆత్మ ఉండటం వల్లే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.

చెవికి చెవి యొక్క వినికిడి శక్తి ఎలా వచ్చింది? ఆత్మ వల్లే.

ఇప్పుడదే విషయం మనకు అగ్ని, వాయువుల ఉదాహరణల ద్వారా తెలుస్తున్నది. ప్రళయంలో, పాతాళంలో మొదలైన అగ్ని భూలోక, భువర్లోక, సువర్లోకాలకు పాకి అంతటా దహించి వేసే శక్తి ఉన్న అగ్ని గడ్డిపోచను కూడా ఏమీ చేయలేకపోయిందంటే ఏమిటి అర్థం? అగ్నికి అగ్నిశక్తి బ్రహ్మవల్లే వచ్చింది. వాయువుకు వాయువు శక్తి బ్రహ్మ వల్లే వచ్చింది.

అంతకుముందు చూశాము- తత్ త్వం. దానికి దాని శక్తి బ్రహ్మ వల్లే వచ్చింది. కన్నుకు కన్ను శక్తి; వాక్కుకి వాక్కు శక్తి. మనస్సుకు మనశ్శక్తి బ్రహ్మవల్లే వచ్చాయి. బ్రహ్మ లేకపోతే వాటికి శక్తి లేదు. అలాగే అగ్నికి అగ్నిశక్తి లేదు. ఆ విషయం ఈ అధ్యాయం మొదటి మంత్రంలోనే సూచించింది ఉపనిషత్తు. జరగబోయేది అలా ముందే సూచిస్తుంది. ఏమిటది?

**బ్రహ్మ హ దేవేభ్యో విజిగ్యే**

దేవతలకు విజయం బ్రహ్మ సాధించి పెట్టాడు. అందువల్ల దీని సారాంశం ఏమిటి? బ్రహ్మ - ఏకం, సారం, నిత్యం, సత్యం.

**ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః।**
**సోఽవికమ్పేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః॥**
**అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే।**
**ఇతి మత్వా భజన్తే మాం బుధా భావసమన్వితాః॥ గీత 10-7,8**

గీతలోని మొత్తం విభూతియోగానికి మూలం, కేనోపనిషత్తులోని ఈ అధ్యాయం.

దీని ద్వారా మూడవ సందేశం– **బ్రహ్మ అస్తి** కూడా వచ్చేసింది. బ్రహ్మ అన్నింటికీ సారం అయినప్పుడు ఎలా బ్రహ్మ ఉనికిని సందేహిస్తాము? బ్రహ్మ ఉనికిని సందేహిస్తే, చేతిలో అనేక బంగారు ఆభరణాలను పట్టుకుని, బంగారం ఉనికిని సందేహించినట్టు ఉంటుంది. దీనికొక అద్భుతమైన హిందీ పద్యం చెబుతారు దయానంద సరస్వతీ స్వామీజీ.

**లహర్ దూంఢే పానీకో**

**కపడా దూంఢే దాగాకో**

**జీవా దూంఢే బ్రహ్మకో**

అల నీటికోసం వెతికిందిట, వస్త్రం దారం కోసం వెతికిందట, జీవుడు బ్రహ్మకోసం వెతికాడుట. ముగ్గురూ పిచ్చివాళ్ళు ఎందుకంటే జీవుడికి బ్రహ్మలేనిదే ఉనికే లేదు.

ఇప్పుడు వాయువు వంతు– వాయువు అగ్నికన్నా ఎక్కువ గర్వంతో వెళతాడు. ఎందుకు? వాయువు అగ్నికి కారణం. కారణం కార్యం కన్నా ఎక్కువ.

## మన్త్రము - 7

**అథ వాయుమబ్రువన్ వాయవేతద్విజానీహి కిమేతద్యక్షమితి తథేతి ॥**

**అథ వాయుమబ్రువన్–** వాయువుతో తక్కిన దేవతలు అన్నారు. ఏమని?

**వాయవేతద్విజానీహి–** అగ్ని ఓడిపోయాడు కాబట్టి, నువ్వన్నా విజయం సాధించుకు రావాలి. ఏ విషయంలో?

**కిమేతద్యయక్షమితి–** ఈ యక్షుడు ఎవరో తెలుసుకోవాలి.

వాయువు అగ్నికన్నా ఎక్కువ అని చూశాము కదా! అందువల్ల అతను మరికొంచెం గర్వంగా ఉన్నాడు.

**తథేతి –** తథాస్తు అన్నాడు వాయువు.

## మన్త్రము -8

**తదభ్యద్రవత్తమభ్యవదత్కోఽసీతి వాయుర్వా**

**అహమస్మీత్యబ్రవీన్మాతరిశ్వా వా అహమస్మీతి ॥**

ఈ మంత్రాలన్నీ అగ్ని గురించిన మంత్రాలలాగే ఉంటాయి. ఉపనిషత్తు మళ్ళీ

వివరంగా చెపుతుంది వాయువు, యక్షుల మధ్య జరిగిన సన్నివేశాన్ని.

**తదభ్యద్రవత్–** వాయువు యక్షుడిని సమీపించాడు. ప్రశ్న అడుగుదామని వెళ్ళాడు కాని నోరు మూగబోయింది. ఒక్కొక్కసారి అలా అవుతుంది మనకు కూడా. స్వామీజీ దగ్గరకు వెళ్లినప్పుడు అనేక ప్రశ్నలు అడుగుదామని వెళతాము కాని తీరా అక్కడికి వెళ్ళాక కొన్ని మర్చిపోతాము.

**కోఽసీతి–** అతను ప్రశ్న వేసేలోపే యక్షుడు అడిగాడు, 'నువ్వెవరు?'

**వాయుర్వా అహమస్మీతి–** నేను గొప్ప వాయుదేవుడిని.

**అబ్రవీన్మాతరిశ్వా వా అహమస్మీతి–** నన్ను మాతరిశ్వుడు అని కూడా అంటారు. మాతరిశ్వుడు అంటే ఆకాశంలో యధేచ్ఛగా సంచరించేవాడు అని అర్థం.

## మన్త్రము - 9

**తస్మిగ్గ్ంస్త్వయి కిం వీర్యమిత్యపీదగ్ం సర్వమాదదీయ యదిదం పృథివ్యామితి ॥**

**తస్మిగ్గ్ంస్త్వయి కిం వీర్యమితి–** అంత గొప్ప వాడివైన నీలో ఏం శక్తి ఉంది అని అడిగాడు.

**ఇదగ్ం సర్వమాదదీయ యదిదం పృథివ్యామితి –** భూమ్మీద ఉన్న దేన్నైనా పైకి లేపగలను అన్నాడు. భూమ్మీద అంటే ఏ లోకంలోనైనా అని అర్థం చేసుకోవచ్చు.

అప్పుడు ఈశ్వరుడు ఏం చేశాడు? మళ్ళీ వేరే గడ్డిని తీయనవసరం లేదు. అంతకుముందు పెట్టిన గడ్డిపోచ అలాగే ఉంది కదా! అగ్ని ఏమీ చేయలేకపోయాడు కదా! ఆ ముందు గడ్డిపోచ ఎక్కడ్నుంచి వచ్చిందని అడగకూడదు. ఈశ్వరునికి ఏదైనా సాధ్యమే. పైపెచ్చు, గర్వభంగం చేయటానికి ఒక చిన్న గడ్డిపరక ఉపయోగించాడు. చూడండి! అదీ దేవుని గొప్పతనం.

## మన్త్రము - 10

**తస్మై తృణం నిదధావేతదాదత్స్వేతిఽ తదుపప్రేయాయ**
**సర్వజవేన తన్న శశాకాదాతుం స తత ఏవ నివవృతే।**
**నైతదశకం విజ్ఞాతుం యదేతద్యక్షమితి ॥**

**తస్మై తృణం నిదధావేతదాదత్స్వేతి–** ఈ గడ్డిపోచను లేపు చూద్దాం–అగ్నితో అన్నట్టే కొండలు, వృక్షాలు లేపనవసరం లేదు;దీన్ని కొంచెం పైకి ఎత్తు చాలు అన్నాడు.

**తదుపప్రేయాయ–** ఆ గడ్డిపోచను సమీపించాడు;

**సర్వజవేన–** తన శక్తినంతా ఉపయోగించాడు కాని;

**తన్న శశాకాదాతుం–** కొంచెం కూడా దాన్ని లేపలేకపోయాడు. ఇవే పదాలు అగ్ని విషయంలో కూడా చూశాము.

స తత ఏవ నివవృతే – అవమాన భారంతో కృంగిపోయి, నీరసంగా వెనుదిరిగాడు.

**నైతదశకం విజ్ఞాతుం యదేతద్యక్షమితి–** ఆ యక్షుడి గురించి నేను తెలుసుకోలేక పోయాను అన్నాడు.

## మన్త్రము - 11

**అథేన్ద్రమబ్రువన్మఘవన్నేతద్విజానీహి కిమేతద్యక్షమితి**
**తథేతి తదభ్యద్రవత్తస్మాత్తిరోదధే ॥**

**అథేన్ద్రమ్ అబ్రువన్–** ఇప్పుడు దేవతలకు ఇది మామూలు విషయం కాదని అర్థమయింది. పరావిద్య అపరావిద్య అంత తేలికైనది కాదు. అందుకే పరావిద్యను రాజవిద్య, రాజగుహ్యం అంటారు. దేవతలు సాధించలేనిది, దేవతలకు రాజైన ఇంద్రుడే సాధించగలడు. అందువల్ల వేరే వారిని పంపించి లాభం లేదు అనుకున్నారు. ఇంతకు ముందు ఇంద్రుడు దేవతలను ఆజ్ఞాపించాడు. ఇప్పుడు దేవతలు ఇంద్రుడిని అభ్యర్థించారు. ఏమని?

**మఘవన్నేతద్విజానీహి కిమేతద్యక్షమితి –** ఒక్కొక్కరికి ఒక బిరుదు చూశాము. ఇప్పుడు ఇంద్రుడి బిరుదును గుర్తు చేస్తున్నారు వారు. 'ఓ మఘవన్, నువ్వు వెళ్ళి యక్షుని గురించి తెలుసుకుని రా,' అన్నారు మఘవ అంటే మహా పూజనీయుడు. ఇంద్రుడు దేవతలకు కూడా రాజు కదా! సహజంగానే మహా పూజనీయుడు.

**తథేతి–** తథాస్తు అన్నాడు ఇంద్రుడు.

**తదభ్యద్రవత్–** ఇంద్రుడు యక్షుని వద్దకు వెళ్లాడు.

**తస్మాత్తిరోదధే–** అక్కడ నుండి యక్షుడు మాయమయ్యాడు.

ఇంద్రుడు రాజు అవటంతో అతనికి తక్కిన వారికన్నా ఇంకా ఎక్కువ గర్వం ఉండి ఉంటుంది. నాయకునికి గర్వం ఉండకూడదు. అతను అణకువకు మారుపేరులా ఉండాలి. అందువల్ల ఈశ్వరుడు అతనికి ఇంకా పెద్ద గుణపాఠం నేర్పించాలనుకున్నాడు. అగ్ని, వాయువులకు దగ్గరగా దర్శనమిచ్చి, వారితో

సంభాషణ కూడా నడిపిన ఈశ్వరుడు, ఇంద్రుడు వచ్చేసరికి అక్కడినుంచి మాయమయిపోయాడు.

ఇంద్రునికి తక్కిన దేవతలకన్నా గర్వం ఎక్కువ ఉంటే ఉండి ఉండవచ్చు గాక, కాని వారికన్నా సత్వగుణం ఎక్కువగా ఉంది. అందువల్ల అతనికి వెంటనే గర్వభంగం అయింది. తనకున్న గర్వం వల్లనే యక్షుని దర్శనం కూడా అవలేదని గ్రహించాడు. అంతేకాదు ఈశ్వరుడు ప్రత్యక్ష ప్రమాణంకు అందదని కూడా అర్థమయింది.

భగవంతుడిని తెలుసుకోవటానికి మనకున్న ప్రమాణాలన్నీ ప్రయోగించినా కూడా ఫలించకపోతే, రెండు రకాలుగా భావించవచ్చు.

1. ఉన్న ప్రమాణాలన్నీ ప్రయోగించినా భగవంతుడు తెలియలేదు కాబట్టి భగవంతుడు అసలు లేనే లేడు.

2. ఉన్న ప్రమాణాలన్నీ ప్రయోగించినా భగవంతుడు తెలియలేదు కాబట్టి, మనకు తెలియని ప్రమాణమేదో ఉందన్నమాట భగవంతుని తెలుసుకోవటానికి. మనకు తెలిసిన ప్రమాణాలను పౌరుషేయ ప్రమాణాలనీ, మనకు తెలియని ప్రమాణాన్ని అపౌరుషేయ ప్రమాణమనీ అంటారు.

**ప్రత్యక్షేణానుమిత్యావా యస్తూపాయో న బుధ్యతే**
**ఏనం విదన్తి వేదేన తస్మాత్ వేదస్య వేదతా॥**

శంకరాచార్యుడు వేదాన్ని ఇలా నిర్వచించారు, తన వేద భాష్యంలో. వేరే ఏ ప్రమాణానికీ అందని విషయం గురించిన జ్ఞానం ఇచ్చేది వేదం. మనకున్న కన్ను ప్రమాణం పరిధి అన్నింటికీ సరిపోదు. సూక్ష్మక్రిములను విశ్లేషించాలంటే మైక్రోస్కోప్ వాడాలి. సుదూరంగా ఉన్న నక్షత్రాలను విశ్లేషించాలంటే, టెలిస్కోప్ వాడాలి.

ఆత్మ గురించి తెలుసుకోవాలంటే ఆత్మనోస్కోప్‌లాంటిదేమీ లేదు. వేదానికి రావాలి. ఆత్మజ్ఞానానికి వేద ప్రమాణం ఒక్కటే ఉంది. అది గ్రహించిన ఇంద్రుడు, 'ఓ భగవాన్, నాకు యక్షుని గురించి తెలుసుకోవటానికి ఒక ప్రమాణం కావాలి,' అని ప్రార్థించాడు. అమానిత్వం అంటే భక్తి. భక్తి ఏర్పడితే శ్రద్ధ వస్తుంది. శ్రద్ధ, భక్తి ఉంటే భగవంతుడు వేద ప్రమాణాన్ని ఇస్తాడు. దీనివల్ల యోగ్యతా అపేక్ష తెలుస్తుంది.

యక్షుడు మాయమయ్యాడు అంటే ప్రమేయం మాయమయ్యింది.

ప్రమాణం వచ్చింది. అది రాబోతున్నది. అద్భుతమైన వర్ణన. బ్రహ్మ **వేదప్రమాణం** వల్లనే తెలుస్తుంది అని కూడా గ్రహిస్తాము.

## మన్త్రము - 12

**స తస్మిన్నేవాకాశే స్త్రియమాజగామ బహుశోభమానా**
**ముమాగ్ం హైమవతీం తాగ్ం హోవాచ కిమేతద్యక్షమితి ॥**

**స తస్మిన్నేవాకాశే స్త్రియమాజగామ–** అదే ప్రదేశంలో, అంటే ఎక్కడ ఈశ్వరుడు అంతర్ధానమయ్యాడో, అక్కడ ఈశ్వరి ప్రత్యక్షమయింది. ఈశ్వరి అంటే ఉమాదేవి. ఇక్కడ హైమవతిగా వర్ణించబడింది. ఈశ్వరుడు ప్రమేయం. ఉమాదేవి ప్రమాణం. బ్రహ్మవిద్య సూచించబడింది. అక్కడ చాలా కాంతివంతమైన దేవతను చూశాడు ఇంద్రుడు. ఆ దేవత ఎలా ఉంది?

**బహుశోభమానామ్ ఉమాగ్ం–** ఆ ఉమాదేవి బహుశోభాయమానంగా ఉందిట. అంటే చాలా ప్రకాశవంతంగా ఉంది. ఎందుకంటే ఆమె బ్రహ్మవిద్య లేదా ఓంకారానికి ప్రతీక. ఓంకారంలోని అక్షరాలను తిరగరాస్తే ఉమ వస్తుంది అని ఒక భాష్యకారుడు అన్నాడు.

ఓం = అ+ఉ+మ; ఉమ = ఉ+మ+అ; ఓంకారం వేదానికి ప్రతీక.

**యశ్ఛన్దసా మృషభో విశ్వరూపః।**
**ఛన్దోభ్యో౽ధ్యమృతాత్సమ్బభూవ॥** – **తైత్తిరీయం**

అందువల్ల ఓంకారం వేదానికి ప్రతీక. ఉమ ఓంకారం. ఉమాదేవి వేదానికి ప్రతీక. ఆమె బహుశోభాయమానంగా ఉంది. వాచ్యార్థం తీసుకున్నా మెరిసే నగలతో, ఆమె కూడా మెరిసిపోతున్నది. లక్ష్యార్థం తీసుకుంటే, ఉమాదేవి వేదప్రమాణం కాబట్టి దానివల్ల మెరిసిపోతున్నది.

వేదాన్ని శ్రద్ధాభక్తులతో అధ్యయనం చేయాలి కాని, అపోహలతో చేయకూడదు. విమర్శించే ఉద్దేశ్యంతో అసలు చేయకూడదు. కృష్ణపరమాత్మే అంటాడు ఈ మాట. అనేకసార్లు **అనసూయవే** అనే పదం వాడతాడు. **అనసూయవే** అంటే విమర్శనాత్మక భావం లేకుండా ఉండాలి.

దయానంద సరస్వతి స్వామీజీ దీన్నే ప్రూఫ్ రీడర్స్ మైండ్ అంటారు. ప్రూఫ్‌రీడర్ పని ఏమిటి? అచ్చుతప్పులు పట్టుకోవటం. తప్పులు పట్టుకోవటానికి

జీతం తీసుకుంటున్నాడు అతను. కాని రామాయణం, మహాభారతాలలాంటివి అధ్యయనం చేసేటప్పుడు ఆ భావనతో చేయకూడదు. రామునిలోనో, కృష్ణునిలోనో దోషాలెన్నకూడదు. అలా దోషాలు ఎన్నుతారనే శాస్త్రాన్ని గురువు బోధ లేకుండా, మీ అంతట మీరు చదవకండి అంటారు.

ఇప్పుడందరికీ క్రాష్ ప్రోగ్రాములు కావాలి. కాని క్రాష్ ప్రోగ్రాములు మర్నాడే క్రాష్ అయిపోతాయి. కృష్ణపరమాత్మ గీతను కాని గీత అనువాదాన్ని కాని ఈ క్రింది వ్యక్తులకు ఇవ్వవద్దని చెపుతాడు. వాళ్ళు కష్టాల్లో పడతారని కాదు; గీత కష్టంలో పడుతుందని! నాలుగురకాల వ్యక్తులను పేర్కొన్నాడు.

**ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన।**

**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి॥ గీత 18-67**

**1. న అతపస్కాయ -** వైదిక జీవన విధానాన్ని పాటించనివాడు.

**2. న అభక్తాయ కదాచన-** ముగ్గురిమీద భక్తి లేనివాడు- గురువు, శాస్త్రం, ఈశ్వరుడు.

**3. న చ అశుశ్రూషవే -** శాస్త్రాన్ని నేర్చుకోవటానికి కాకుండా, విమర్శించ టానికి అధ్యయనం చేసేవాడు.

**4. న చ మాం యోఽభ్యసూయతి-** హిందూమతం పనికిరానిది అని, దాన్ని కించపరచటానికి చదివేవాడు.

**న చ వాచ్యం-** అటువంటి వారికి గీతను ఇవ్వవద్దు.

ఎవరు చెప్పారీమాట? సాక్షాత్తూ శ్రీకృష్ణపరమాత్మే.

బహుశోభామానాముమాం అంటే మనకు నిజంగా శాస్త్రం మీద శ్రద్ధ, భక్తి ఉంటే, శాస్త్రం చాలా అద్భుతమైనది. ప్రతి ఒక్క ఉపనిషత్తు కూడా మనని జీవాత్మ నుంచి పరమాత్మగా మారుస్తుంది.

ఇప్పుడు ఇంద్రునికి గురువు దొరికింది. దీనివల్ల ఇంకో సందేశం వస్తుంది. ఏమిటది? గురు అపేక్ష. శాస్త్రాన్ని ఎన్నడూ స్వయంగా అధ్యయనం చేయటానికి ప్రయత్నించరాదు. ఉమాదేవి పేరేంటి? హైమవతి.

**హైమవతీం-** శంకరుల వారు ఈ పదానికి రెండు అర్థాలు ఇస్తున్నారు.

1. హిమవంతుని పుత్రిక హైమవతి.

2. హేమ ఆభరణభూషితురాలు. బంగారు ఆభరణాలు ధరించినది- సరస్వతి.

పార్వతి అన్నా సరస్వతి అన్నా రెండూ ఒకటే. ఆమె బ్రహ్మవిద్య లేదా గురువుకు ప్రతీక.

ఇంకో సందేశం - శ్రద్ధ, భక్తి ఉంటే గురువు వెతుక్కుంటూ వస్తాడు.

మరో సందేశం - శిష్యుడు అడగందే గురువు బోధ చేయడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా** గీత- **4-34**

**తాగ్ం హోవాచ కిమేతద్యక్షమితి-** ఇంద్రుడు ఉమాదేవిని ఈ యక్షుడు ఎవరు అని అడిగాడు. అంటే సగుణ ఈశ్వరుడు ఎవరు? నిర్గుణ బ్రహ్మ ఎవరు?

సగుణ ఈశ్వరుడు కాని, నిర్గుణ బ్రహ్మ గాని- ఎవరినైనా శాస్త్రం వల్లనే తెలుసుకోగలము. నీకు తెలియనంత మాత్రాన బ్రహ్మ అస్తిత్వాన్ని కాదనకు! బ్రహ్మ గురించి తెలుసుకో అనేది ఇంకో సందేశం.

ఉమాదేవి ఇంద్రునికి బోధ చేసేందుకు సన్నివేశం సిద్ధమయింది! ఉమాదేవి ఏం బోధ చేసింది? అది మళ్ళీ విడిగా చెప్పలేదు. ఆ బోధ ఏమిటో మీకు తెలుసు. కేనోపనిషత్తు అధ్యాయాలు 1,2. ఇక్కడితో మూడవ అధ్యాయం అయిపోయింది.

## అధ్యాయం-3 సారాంశం

అధ్యాయం - 1,2ల్లో చెప్పినది అధ్యాయం-3లో కథ ద్వారా వస్తుంది. కథ ద్వారా 6 సందేశాలు వస్తాయి.

1. **బ్రహ్మ అస్తి- యక్షమ్ అస్తి, తస్మాత్ బ్రహ్మ అస్తి.**

2. **బ్రహ్మణః దుర్విఘ్నేయం-** అగ్ని, వాయువు తెలుసుకోలేకపోయారు. **న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః.**

3. **జ్ఞానయోగ్యతా అపేక్షః-** శ్రద్ధా, భక్తి, శరణాగతి కావాలి. ఇంద్రునికి అవి వచ్చాక ఉమాదేవి ప్రత్యక్షమయింది.

4. **గురు అపేక్ష-** శాస్త్రాన్ని స్వంతంగా అధ్యయనం చేయకూడదు. ఇంద్రునికి ఉమాదేవి బ్రహ్మజ్ఞానం బోధించింది. తక్కిన రెండు సందేశాలు అధ్యయనం-4లో వస్తాయి. అవి

5. **బ్రహ్మవిద్యాస్తుతి-** బ్రహ్మవిద్య పొందిన ఇంద్రుడు, దేవతలు ఖ్యాతిని పొందారు.

6. **ఉపాసనవిధి అంగత్వం -** కథకు అనుగుణంగా కొన్ని ఉపాసనలు చెప్పబడ్డాయి.

# కేనోపనిషత్తు

# అధ్యాయము - 4

మొదటి రెండు అధ్యాయాలలోను బ్రహ్మ విద్య గురించి వచ్చింది; మూడవ అధ్యాయంలో నిర్గుణబ్రహ్మను సగుణబ్రహ్మగా చూపించి గురువు ద్వారా బ్రహ్మవిద్యను పొందాలని సూచించింది.

బ్రహ్మవిద్యను గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే పొందగలము. అది పొందటానికి మనకు అధికారత్వం కూడా ఉండాలి. ఉదాహరణకు మన అందమైన మొహం మనం చూసుకోవాలనుకుంటే, దానికి ఏం కావాలి? కన్ను, అద్దం.

అద్దం ఎంత బాగున్నా, మన కన్ను కనపడకపోతే మనం అద్దంలో చూసుకోలేము. అలాగే కన్ను ఎంత అందంగా ఉన్నా, అద్దం లేకపోతే మన మొహం చూసుకోలేము. అలాగే ఆత్మజ్ఞానం పొందాలంటే రెండు కావాలి. సంసిద్ధమైన అంతఃకరణం, గురుశాస్త్ర ఉపదేశం. అంతఃకరణం కన్ను లాంటిది; గురుశాస్త్ర ఉపదేశం అద్దం లాంటిది. మనం సంసిద్ధమైన మనస్సుతో లేకపోతే గురువు శాస్త్రం ఎంత చెప్పినా అర్థం కాదు. అలాగే మనం ఎంత సంసిద్ధంగా ఉన్నా, గురుశాస్త్ర ఉపదేశం లేకపోతే ఆత్మజ్ఞానం పొందలేము. ఉపనిషత్తు గురువునూ, శాస్త్రాన్నీ కలిపి చెపుతుంది. ఎందుకంటే శాస్త్రంలో ఉన్న విద్యే గురుపరంపరగా వస్తుంది. దాన్నే గురువు శిష్యునికి నేర్పిస్తాడు.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయించవచ్చు. శాస్త్రం అర్థంచేసుకోవటం కష్టమా, తేలికా? ఒకచోట తేలిక అంటుంది. ఒకచోట కష్టం అంటుంది.

**సుసుఖం కర్తుమవ్యయమ్ గీత 9-2**

ఈ విద్య నేర్చుకోవటం చాలా తేలిక.

**క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథస్తత్కవయో వదన్తి**
**కఠ 1-3-14**

విద్య నేర్చుకోవటం క్షురకుని పదునైన కత్తి అంచుమీద నడవటంలాంటిది.

ఏది నిజం? రెండూ నిజమే. మనసు సంసిద్ధంగా ఉంటే, బ్రహ్మ విద్యను అర్థం చేసుకోవటం చాలా తేలిక. మనస్సు సంసిద్ధంగా లేకపోతే అర్థం చేసుకోవటం

చాలా కష్టం. మొదటి రెండు అధ్యాయాలు అర్థమయితే మీ మనస్సు సంసిద్ధంగా ఉన్నట్టు; అర్థం కాకపోతే సంసిద్ధంగా లేనట్టు అర్థం. మనసు సంసిద్ధంగా లేకపోతే నేను వెనక్కి భక్తియోగానికి వెళ్ళిపోతాను అనకూడదు. ఒకసారి జ్ఞానమార్గానికి వచ్చాక, దానిలో కొనసాగటానికి ప్రయత్నించాలి. మనస్సు సిద్ధంగా లేకపోతే సిద్ధం చేసుకోవటమే మార్గం.

అదికూడా ఉపనిషత్తే సూచిస్తుంది. ఇంతవరకూ ఉపనిషత్తు జ్ఞానమార్గం చెప్పి ఇందులో రెండు రకాలు సాధనలు కూడా చెపుతున్నది.

1. కర్మయోగం
2. ఉపాసనాయోగం

గుర్తుంచుకోండి, ఇవి మోక్షాన్ని ప్రత్యక్షంగా ఇవ్వవు. మోక్షం పొందటానికి సహకారీ సాధనలవుతాయి. చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పరుస్తాయి. వాటి తర్వాత మళ్ళీ మొదటి రెండు అధ్యాయాలు చదివితే బాగా అర్థమవుతుంది.

కొంతమంది విద్యార్థులు కొన్నేళ్ళు స్వామీజీ బోధలు విన్నాక, స్వామీజీ ఇప్పుడు మీరు ఇంకా బాగా చెపుతున్నారు అంటారు. అంటే వాళ్ళకు బాగా అర్థమవుతున్నదని అర్థం. అందువల్ల స్వామీజీ దాన్ని పట్టించుకోకుండా, వాళ్ళకు విషయం బాగా తెలుస్తున్నదని సంతోషిస్తారు. అందువల్లనే పదే పదే శ్రవణం చేయాలని చెబుతారు. కేనోపనిషత్తు మళ్ళీ మళ్ళీ వినాలంటే ఎవరికైనా బోరు కొడుతుంది కాని, వేరే ఉపనిషత్తు చెపుతారంటే మళ్ళీ శ్రద్ధగా వెళతారు. కొత్త గురువు, కొత్త శిష్యుడు, కొత్త ప్రశ్న, కొత్త మార్గంలో జవాబు, కొత్త పద్ధతిలో వివరణ కాని విషయం మాత్రం అదే. బ్రహ్మవిద్య! జీవ, ఈశ్వర ఐక్యం! జ్ఞానం కలుగుతుంది.

అధ్యాయం-4లో 4 అంగాలను చెపుతున్నది ఉపనిషత్తు.

1. బ్రహ్మవిద్యాస్తుతి
2. కర్మయోగ సాధన
3. ఉపాసన సాధన
4. దైవీ సంపత్తి

ఈ నేపథ్యంతో అధ్యాయంలోకి అడుగుపెడదాము.

## మన్త్రము - 1

**సా బ్రహ్మేతి హోవాచ బ్రహ్మణో వా ఏతద్విజయే**

**మహీయధ్వమితి తతో హైవ విదాఞ్చకార బ్రహ్మేతి ॥**

మొదటి మూడు మంత్రాలను, మూడవ అధ్యాయంతో కలుపుకోవాలి. యక్షుని కథ కొనసాగుతున్నది. బ్రహ్మ విద్యాస్తుతి వస్తుంది. వీటిలో కథ చివర్లో ఇంద్రుడు శిష్యునిగా మారాడు. ఉమాదేవి, ఇంద్రుల సంవాదం జరిగింది. ఉమాదేవి ఉపదేశం చేసింది. ఉపదేశం అంటే చెవిలో రహస్యంగా చెప్పేది కాదు. ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా కొన్నేళ్ళపాటు శాస్త్రాన్ని బోధించటమే గురుశాస్త్ర ఉపదేశం.

**సా బ్రహ్మేతి హోవాచ-** ఆ యక్షుడు ఎవరో కాదు బ్రహ్మ అని పార్వతీదేవి చెప్పింది. నిర్గుణ బ్రహ్మ యక్షుని రూపంలో దేవతలకు ప్రత్యక్షమయ్యాడు.

నిర్గుణ బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు

ఈశ్వరుడు - మాయ = నిర్గుణ బ్రహ్మ

దేవతలు విజయగర్వంతో పొంగిపోతుంటే వారికి గర్వభంగం కలిగించటానికి సగుణ బ్రహ్మగా ప్రత్యక్షమయ్యాడు. అంతేకాదు, వారి విజయానికి కారణం కూడా సగుణ బ్రహ్మే.

**బ్రహ్మణో వా ఏతద్విజయే -** ఉమాదేవి చెపుతుంది, మీ విజయానికి కారణం బ్రహ్మే. అందువల్ల దాన్ని మీ విజయంగా భావించటానికి మీకు అధికారం లేదు. వేదాంతపరంగా చూసినా కూడా, ప్రతి ఇంద్రియం కూడా చైతన్యతత్త్వం వల్లనే పనిచేస్తుంది.

దేవతలు యుద్ధం చేసారంటే, వారి చేతుల శక్తి కూడా చైతన్యం వల్లనే. ఇదే భావాన్ని మూడవ అధ్యాయంలో అగ్ని, వాయువుల గర్వభంగం ద్వారా చూపించింది ఉపనిషత్తు.

**తదుపప్రేయాయ సర్వజవేన తన్న శశాక దగ్ధుం 3-6**

**తదుపప్రేయాయ సర్వజవేన తన్న శశాకాదాతుం 3-10**

అగ్నికి అగ్ని తత్త్వం, వాయువుకు వాయు తత్త్వం బ్రహ్మ లేదా చైతన్యం వల్లనే ఉన్నాయని అర్థమవుతున్నది. కాని అది తెలియక దేవతలు ఏం పొరపాటు చేశారు?

**మహీయధ్వమితి –** అదంతా వారి గొప్పతనమే అనుకున్నారు.

పారమార్థికస్థాయిలో నిర్గుణ బ్రహ్మ అంటే, వ్యావహారిక స్థాయిలో సగుణ బ్రహ్మ అంటాము. ఈ సగుణ బ్రహ్మే మాయాశక్తితో కలిసి జగత్తుకు సృష్టి, స్థితి, లయకారణం అయ్యాడు. ఆయన కారణం అవటం వల్ల, కార్యంకున్న గొప్పతనమంతా బ్రహ్మకే చెందుతుంది. ఆభరణాలు మెరుస్తు న్నాయంటే, దానికి కారణం బంగారమే. ఆభరణాలు ఖరీదైనవి అయ్యాయంటే దానికి కారణం బంగారమే.

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా గీత 10–41**

దేనికి శక్తి ఉన్నా, అది కృష్ణుని యొక్క అంశం నుంచే వచ్చిందని అర్థం.

మనకు ఏదైనా ప్రత్యేక ప్రజ్ఞ ఉండి, దానికి ఏదైనా బహుమతి వచ్చినా దాన్ని తీసుకువెళ్ళి భగవంతుని ముందు సాష్టాంగ నమస్కారం చేసి, ఆయనకు కృతజ్ఞత చెప్పాలి. మన విజయాన్ని పండుగ చేసుకోవచ్చు. తప్పులేదు. కాని దాని ముందూ, తర్వాత కూడా భగవంతుని ప్రార్థించాలి.

**సుఖ దుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ గీత– 2–38**

ఒకవేళ ఓటమి కలిగినా కూడా, స్వీకరించే శక్తి వస్తుంది పూజ వల్ల. జీవితమంతా పూజామయంగా ఉండాలి.

**యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం శమ్భో తవారాధనమ్ శివమానస పూజ**

ఇదంతా కేనోపనిషత్తు కథ నుంచి వచ్చినదే. మీ విజయం వెనుక బ్రహ్మ ఉన్నాడు.

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ – గీత 11–38**

నువ్వు నిమిత్తమాత్రుడవు కమ్ము అని చెపుతున్నాడు శ్రీకృష్ణపరమాత్మ. సవ్యసాచి అయిన అర్జునునితో.

**తతో హైవ –** తతః అంటే ఉమాదేవి చేసిన ఉపదేశం వల్ల.

**సరస్వతీ శాస్త్రమయీ గుహామ్బా గుహ్యరూపిణీ -**
**లలితాసహస్రనామమ్ - 137**

ఉమాదేవి, సరస్వతీ ఒకరే. పార్వతీదేవి నుంచే ఉపదేశం పొందాడు ఇంద్రుడు. దీనివల్ల ఆత్మజ్ఞానం గురువుద్వారానే పొందాలనే విషయం తేటతెల్లమవుతుంది.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా - గీత 4-34**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ - ముణ్డక 1-2-12**

ఇంద్రుడంతటి దేవతలరాజే బ్రహ్మ విద్య గురువు ద్వారానే నేర్చుకోవాలంటే, ఇంక మానవమాత్రులం, మన గురించి చెప్పేదేముంది?

**విదాఞ్చకార** - తెలుసుకున్నాడు. ఏమని?

**బ్రహ్మేతి** - యక్షుని రూపంలో అవతారం దాల్చింది నిర్గుణ బ్రహ్మేనని.

## మన్త్రము - 2

**తస్మాద్వా ఏతే దేవా అతితరామివాన్యాన్దేవాన్**
**యదగ్నిర్వాయురిన్ద్రస్తే హ్యేనన్నేదిష్ఠం పస్పర్శుస్తే**
**హ్యేనత్ప్రథమో విదాఞ్చకార బ్రహ్మేతి ॥**

ఈ మంత్రంలోనూ, తర్వాత వచ్చే మంత్రంలోనూ బ్రహ్మవిద్యాస్తుతి వస్తుంది. ఆ స్తుతి కూడా ప్రత్యక్షంగా రాదు. కథ కూడా పూర్తిగా రాదు. మనం వాటిని అర్థం చేసుకోవాలి.

ఇంద్రుడు ఉమాదేవి దగ్గర జ్ఞానం పొంది తిరిగి వచ్చాక, అగ్ని, వాయువులు యక్షుని గురించి తెలుసుకున్నావా అని కుతూహలంగా అడిగి ఉంటారు. వారు ఓడిపోయిన చోట ఇంద్రుడు విజయం సాధించగలిగాడో లేదో తెలుసుకోవాలిగా మరి? ఇంద్రుడు విషయమంతా వివరించి, తను నేర్చుకున్న బ్రహ్మజ్ఞానాన్ని కూడా వాళ్ళకు బోధించి ఉండాలి. ఈ వివరాలు దాటి, ఈ మంత్రంలో ఈ ముగ్గురే యక్షుడిని చూశారు కాబట్టి, ఈ ముగ్గురే ముందుగా బ్రహ్మజ్ఞానం పొందారు కాబట్టి, వారు దేవతలలో శ్రేష్ఠులు అయ్యారు అని వస్తుంది. అంటే వారు యక్ష సంవాదం చేశారు, యక్షజ్ఞానం పొందారు. బ్రహ్మజ్ఞానం పొందటం వల్ల శ్రేష్ఠులు

అయ్యారంటే దాని అర్థం ఏమిటి? బ్రహ్మ విద్య శ్రేష్ఠమైనది. ఆ విధంగా బ్రహ్మ విద్యాస్తుతి వస్తుంది.

బ్రహ్మవిద్య పరావిద్యలోకి వస్తుంది. తక్కినదంతా అపరావిద్యలోకి వస్తుంది. బ్రహ్మవిద్య పొందితే అతను మోక్షం పొందుతాడు. జీవితంలో అన్నింటిలోనూ రాణిస్తాడు. అపరావిద్యలో బియ్యే చదివినా, ఎమ్మే చదివినా, పిహెచ్‌డీ చేసినా సంసారిగానే మిగిలిపోతాడు. జ్ఞాని ఈ సంసార సుఖదు:ఖాలకు అతీతంగా ఎదుగుతాడు. అందువల్ల కథలో చెప్పుకున్న ఐదవ సందేశం వస్తుంది ఇక్కడ.

**5. బ్రహ్మవిద్యా స్తుతి**

ఇప్పుడు మంత్రం చూద్దాము. మంత్రం మధ్యలో మొదలుపెడుతున్నాము.

**యదగ్నిర్వాయురిన్ద్రః –** అగ్ని, వాయువు, ఇంద్రుడు అని పిలువబడే ఈ ముగ్గురూ.

**తే హ్యేనన్నేదిష్ఠం పస్పర్శుః –** యక్షుడిని మొట్టమొదట దగ్గరగా చూశారు.

**తే హ్యేనత్ప్రథమో విదాఞ్చకార బ్రహ్మేతి –** అంతేకాదు, వారు ముగ్గురూ యక్షజ్ఞానం ప్రప్రథమంగా పొందారు.

**తస్మాద్వా –** అందువల్ల. ఎందువల్ల? యక్ష సంవాదం చేయటం వల్ల, యక్షజ్ఞానం పొందటం వల్ల.

**ఏతే దేవా అతితరామివాన్యాన్దేవాన్ –** ఈ దేవతలు తక్కిన దేవతలందరికన్నా శ్రేష్ఠులు అయ్యారు.

దీనివల్ల, ఆ దేవతలు జ్ఞానం వల్ల దేవతలలో శ్రేష్ఠులు అయ్యారని తెలుస్తున్నది. వారు దేవతలు కాబట్టి దేవతల్లో శ్రేష్ఠులు అయితే, మనుష్యులమయిన మనం బ్రహ్మవిద్య పొందితే మనుష్యుల్లో శ్రేష్ఠులమవుతాము. నిజానికి జ్ఞానం పొందిన జ్ఞాని అలా శ్రేష్టుడవ్వాలని కాని, శ్రేష్టుడయ్యానని కాని గొప్పగా భావించడు. కాని అలా శ్రేష్ఠులవుతారంటే ఈ విద్యకు ఆకర్షించబడుతారని ఉపనిషత్తు ఆశిస్తున్నది.

**మన్త్రము – 3**

**తస్మాద్వా ఇన్ద్రోఽ తితరామివాన్యాన్దేవాన్ స హ్యేనన్నేదిష్ఠం**
**పస్పర్శ స హ్యేనత్ప్రథమో విదాంఞ్చకార బ్రహ్మేతి ॥**

ఇంచుమించు అవే పదాలు. అదే అర్థం. అంతకు ముందు మంత్రంలో

ఈ ముగ్గురు దేవతలూ తక్కిన దేవతల్లో శ్రేష్ఠులు అంది. సహజంగానే మనలో ఒక ప్రశ్న ఉదయించవచ్చు. ఈ ముగ్గురిలో శ్రేష్ఠతమం ఎవరు అని. దానికి జవాబు కూడా మనం ఊహించుకోవచ్చు. ఇంద్రుడే శ్రేష్ఠతమం. ఎందుకు?

యక్షుడిని దగ్గరగా చూడటం వరకూ ముగ్గురూ సమానమే.

కాని యక్షజ్ఞానం ముందు పొందటం వల్ల ఇంద్రుడు వారికన్నా గొప్ప. నిజానికి ఇంద్రుడు వారిద్దరికీ నేర్పించాడు. ఆ విధంగా వారు కూడా శ్రేష్ఠులు అయ్యారు. తర్వాత తక్కిన దేవతలు కూడా నేర్చుకున్నారని ఊహించుకోవాలి. ఎందుకంటే యమధర్మరాజు నచికేతునికి బ్రహ్మ విద్య బోధించాడు. అదే కఠోపనిషత్తు.

ఇప్పుడు మంత్రం చూద్దాము. ఇది కూడా ఇందాకటిలాగా మధ్యనుంచీ.

**స హ్యేనన్నేదిష్ఠం పస్పర్శ–** ఇంద్రుడే యక్షుడిని దగ్గరగా చూశాడు. అగ్ని, వాయువుల్లాగా యక్షునితో సంభాషణ జరుపకపోయినా, యక్షుడిని చూశాడు, వీరిని ముందు పంపాడు.

**స హ్యేనత్ప్రథమో విచాఞ్చకార బ్రహ్మేతి–** ఇంద్రుడే యక్షజ్ఞానం అందరికన్నా ముందుగా  పొందాడు. ఇంద్రుడు నేర్చుకున్నది సాక్షాత్తూ ఉమాదేవి దగ్గర కాబట్టి చటుక్కున నేర్చుకుని ఉండవచ్చు. తను నేర్చుకున్నాక ఇంద్రుడు అగ్ని, వాయువులకు నేర్పాడు కాబట్టి, నిస్సందేహంగా ఇంద్రుడే వీరి ముగ్గురిలో శ్రేష్ఠుడు. అదే విషయం తక్కిన పదాలలో వస్తుంది.

**తస్మాద్వాఇన్ద్రోఽ తితరామివాన్యాన్దేవాన్–** ఇక్కడ అన్యాన్ దేవాన్ అంటే తక్కిన దేవతలతో పాటు అగ్నిని, వాయువును కూడా కలుపుకోవాలి. అందువల్ల అంటే బ్రహ్మవిద్య పొందటం వల్ల ఇంద్రుడు దేవతలందరిలోకి శ్రేష్ఠుడు అయ్యాడు.

ఆ విధంగా బ్రహ్మవిద్యాస్తుతి వచ్చింది. ఇక్కడితో బ్రహ్మ విద్యాస్తుతి అయిపోయింది. ఇంక కథలోని ఆరవ సందేశం తర్వాత వచ్చే మంత్రాల్లో వస్తుంది.

**6.ఉపాసనా విధి అంగత్వం:–**

**మన్త్రము – 4**

**తస్యైష ఆదేశో యదేతద్విద్యుతో వ్యద్యుతదా (3)**
**ఇతీన్న్యమీమిషదా (3) ఇత్యధిదైవతమ్ ॥**

ఇక్కడ నుంచి బ్రహ్మవిద్యా సాధనలు వస్తాయి. ముందే చూసినట్టుగా బ్రహ్మవిద్య అర్థం కాని మంద, మధ్యమ అధికారులకు ఉపనిషత్తు కొన్ని సాధనలను సూచిస్తున్నది. అవి – కర్మయోగం, ఉపాసనాయోగం, విలువలు. వాటిలో ఉపాసన గురించి ముందు చెపుతున్నది.

4,5,6 మంత్రాల్లో 4 ఉపాసనలను సూచిస్తున్నది. ఉపాసన అంటే సగుణ బ్రహ్మ మీద చేసే ధ్యానం. అది ఒక బాహ్యమైన ఆలంబన మీద చేయవచ్చు, మన శరీర అంగాన్ని దేన్నైనా తీసుకుని దానిమీద సగుణ బ్రహ్మ ఉపాసన చేయవచ్చు లేదా ఈశ్వరుని గుణం ఏదైనా ఒకటి తీసుకుని, దాని మీద ఉపాసన చేయవచ్చు. ఇక్కడ వచ్చే 4 ఉపాసనలు ఈ క్రింది విధంగా వస్తాయి.

**అధిదైవ ఉపాసనలు** **2** – బ్రహ్మను బాహ్య ఆలంబనం మీద ఆవాహన చేయటం.

**అధ్యాత్మ ఉపాసన** **1** – బ్రహ్మను మన శరీర అంగం మీద ఆవాహన చేయటం.

**గుణవిశిష్ట ఉపాసన** **1** – ఒక గుణాన్ని తీసుకుని ధ్యానం చేయటం.

ఈ ఉపాసనలన్నీ కూడా యక్షుని కథను మనస్సులో పెట్టుకుని చెప్పబడినవే. యక్షుని కథలో యక్షునికి మూడు గుణాలను చూశాము. క్షణికత్వం, మనోహరత్వం, ప్రకాశరూపత్వం.

**క్షణికత్వమ్** – మెరిసి మాయమయ్యాడు క్షణం సేపు.

**మనోహరత్వమ్** – దేవతల దృష్టిని ఆకర్షించాడు

**ప్రకాశరూపత్వమ్** – చాలా కాంతివంతంగా ఉన్నాడు.

నాలుగవ మంత్రంలో ఈ లక్షణాల వల్ల రెండు విషయాల మీద ఉపాసన వస్తుంది. విద్యుత్ ఉపాసన, నిమేష ఉపాసన.

**విద్యుత్ ఉపాసన** – విద్యుత్ అంటే మెరుపు. మెరుపులా ఒక్క క్షణం ఉపాసన చేసి, వచ్చేయమని కాదు అర్థం. విద్యుత్ మీద ఉపాసన చేయాలని. విద్యుత్తుకు కూడా ఈ మూడు లక్షణాలూ ఉన్నాయి. క్షణికత్వం, మనోహరత్వం, ప్రకాశరూపత్వం.

మన మతం గొప్పతనం చూడండి. చెట్టునీ, పక్షినీ, జంతువునీ, ఆఖరికి మెరుపునీ కూడా దేవునికి ప్రతీకగా చూసి వాటిని కొలుస్తాము.

**నిమేష ఉపాసన –** నిమేష అంటే కళ్ళ రెప్పలు ఆర్పటం. దీనికి కూడా మెరుపుకున్న లక్షణాలు ఉన్నాయి. కనురెప్ప మూస్తే చీకటి, తెరిస్తే మెరుపు. అది కూడా క్షణికం. మనోహరం, ప్రకాశకరం. ఈ నేపథ్యంతో మంత్రం చూద్దాము.

**తస్యైష ఆదేశః –** తస్య అంటే ఆ యక్షుడు; ఆదేశః అంటే ఉపమా ఉపదేశః అంటే యక్షుని పోలిన వస్తువు గురించిన ఉపదేశం. ఎందుకు? దానివల్ల మనం ధ్యానం చేయగలుగుతాము. ఏమిటాధ్యానం?

**యదేతద్విద్యుతో వ్యద్యుతదా3 ఇతి :–** యక్షునికీ విద్యుత్తుకూ పోలిక ఉంది.

ఆ3 – ఇలా 3 సంఖ్య ఉంటే దాన్ని ప్లుతం అంటారు.

అ–హ్రస్వం; ఆ– దీర్ఘం, ఆ3– మూడుసార్లు అనటానికి పట్టే సమయం. ఉదాహరణకు అ పలకటానికి ఒక చిటికె వేసే సమయం పడితే ఆ (3) పలకటానికి 3 సార్లు చిటికె వేసే సమయం తీసుకోవాలి. ఆ (4) ఉంటే 4 సార్లు చిటికె వేసే సమయం– అలా ప్రతి అక్షరానికి ఉంటుంది.

ఇక్కడ ప్లుతం పోలికను చెపుతున్నది. యక్షునికీ, విద్యుత్తుకూ మధ్య ఉన్న పోలిక– మూడు లక్షణాలనూ చూశాము. అవి క్షణికత్వం, మనోహరత్వం, ప్రకాశకత్వం.

**తృప్తి రితి వృష్టౌ బలమితి విద్యుతి జ్యోతిరితి నక్షత్రేషు। – తైత్తిరీయం**

అక్కడ కూడా మెరుపును పొగుడుతున్నది. కాకపోతే అక్కడ మెరుపు యొక్క బలం గురించి చెపుతున్నది. ఒక్క మెరుపులో ఎంతో కాంతి ఉంటుందిట. ఆ శక్తిని కనుక వినియోగించుకోగలిగితే అది మొత్తం ప్రపంచాన్నే ఎన్నాళ్ళో ప్రకాశింపజేయగలదట. అక్కడ బలం గురించి చెపితే, ఇక్కడ ప్రకాశకత్వం గురించి చెప్పింది.

అందువల్ల విద్యుత్తు మీద ఉపాసన చేయాలి. దీనితో మొదటి ఉపాసన ముగిసింది. ఇప్పుడు రెండవ ఉపాసన.

**నిమేష ఉపాసన – న్యమీమిషదా 3 –** రెప్పలు ఆర్పటాన్ని యక్షునితో పోలుస్తున్నది. ఇది కూడా మెరుపులాంటిదే అని చూశాము. చిమ్మచీకటిలో ఒక మెరుపు మెరిస్తే ఆ ప్రదేశం అంతా అత్యంత కాంతివంతంగా మెరుస్తుంది. అలాగే కన్ను మూసుకుంటే ఎదురుగా చిమ్మచీకటి ఉన్నట్టే. గుడ్డివానికి అందుకే పగలుకూ, రాత్రికీ తేడా తెలియదు. మెరుపు మెరిస్తే అంతా ప్రకాశించినట్టుగా, కన్ను తెరిస్తే కళ్ళముందు

బాహ్యప్రపంచం జిగేలుమంటుంది. మెరుపు మాయమవగానే, చీకట్లు అలము కున్నట్టు కనురెప్ప మూయగానే మళ్ళీ చీకటి.

చీకటి– వెలుతురు–చీకటి

కన్ను మన అంగం అయినా దీన్ని అధి దైవ ఉపాసనగా చెప్పింది ఉపనిషత్తు. ఎందుకంటే మెరుపు బాహ్యప్రపంచాన్ని చూపించినట్టుగా, కన్ను కూడా బాహ్యప్రపంచాన్ని చూపిస్తుంది. అందువల్ల కన్ను కూడా మెరుపులాంటి ఒక జ్యోతి. కాని మనం ఆ మెరుపును గమనించటం లేదు.

**ఇత్యధిదైవతమ్ –** ఈ రెండూ అధిదైవ ఉపాసనలు.

## మన్త్రము – 5

**అథాధ్యాత్మం యదేతద్గచ్ఛతీవ చ మనోఽనేన చైతదుపస్మరత్యభీక్ష్ణగ్ం సఙ్కల్పః॥**

ఇప్పుడు ఆధ్యాత్మ ఉపాసన. యక్షుని లక్షణాలను పోలి ఉన్న మన అంగం ఏమిటో చెప్పగలరా? ఉపనిషత్తు చాలా తెలివిగా పట్టుకుంది దానిని. అది మన ఆలోచన.

మామూలుగా ధ్యానం ఒక ఆలోచన. కాని ఇక్కడ ఆలోచన మీద ఉపాసన చేస్తాము. ఆలోచనలు చాలా క్షణికం. ఒక ఆలోచన నుంచి ఇంకో ఆలోచనకు, ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా గెంతులు వేసుకుంటూ పోతాయి. ఈ పుస్తకం చదువుతూ కూడా హఠాత్తుగా అమెరికాలో ఉన్న మీ అమ్మాయి మీదకు పోవచ్చు ఆలోచన. అలా అని ఏ ఆలోచననూ మనం పట్టి ఉంచలేము. అది క్షణకాలంలో వచ్చి, మాయమైపోతుంది.

ప్రతి ఒక్క ఆలోచన కూడా దానికి తగ్గ వస్తువును ప్రకాశింపజేస్తుంది. ఘటజ్ఞానం కలిగితే, ఘట విషయం ప్రకాశిస్తుంది. వృక్షజ్ఞానం కలిగితే, వృక్షవిషయం ప్రకాశిస్తుంది. ప్రతి ఆలోచనా యక్షునిలాగా క్షణికమే కాకుండా, యక్షునిలాగా ప్రకాశవంతమైనది కూడా. ఎందుకు ప్రకాశవంతమైనది? అది వస్తువును ప్రకాశింపజేస్తుంది కాబట్టి. అందువల్ల ఉపనిషత్తు మనస్సును లేదా వృత్తిని తీసుకుంది యక్షునికి ఆలంబనగా. ఇది చాలా సూక్ష్మమైన ఉపాసన.

ప్రతి ఆలోచన బ్రహ్మ దగ్గరకి వెళుతోంది. బ్రహ్మ దగ్గరకి వెళ్ళటమే కాదు, బ్రహ్మను ప్రకటితమయ్యేటట్టు చేస్తున్నది అంటున్నది ఉపనిషత్తు. అదెలా?

మీకు తెలుసు, బ్రహ్మ మీ మనస్సులో చైతన్యరూపంలో ఉంది. ప్రతి ఆలోచనకూ చైతన్యాన్ని ప్రతిబింబింపచేసే శక్తి ఉంది. అద్దం ఎలాగైతే సూర్యకాంతిని ప్రతిబింబింపచేస్తుందో, అలాగే వృత్తి కూడా ప్రతిబింబ మాధ్యమంలా పనిచేస్తుంది. చైతన్యాన్ని ప్రతిబింబింపచేస్తుంది. ఈ ప్రతిబింబాన్ని చిదాభాస లేదా ప్రతిబింబ చైతన్యం అంటారు. వృత్తి ప్రతిబింబాన్ని ఏర్పరస్తున్నది కాబట్టి వృత్తి బ్రహ్మ దగ్గరకి వెళుతున్నది. చిదాభాస ద్వారా పరోక్షంగా ప్రతిబింబింపచేస్తున్నది అని చెప్పవచ్చు. ఆ విధంగా ఆలోచన మనం బ్రహ్మను గుర్తించేందుకు తోడ్పడుతుంది.

ఈ విషయాన్ని ఎప్పుడూ చూసే చెయ్యి, కాంతి ఉదాహరణతో చూద్దాము. ఇక్కడేముంది అని అడిగితే ఏం చెపుతాము? చెయ్యి ఉంది అంటాము. చెయ్యి ఉందని ఎలా తెలుసు? కాంతి వల్ల. కాంతి లేకుండా చీకటిగా ఉంటే చెయ్యి తెలియదు. అలాగే ఈ గదిలో మనుష్యులు ఉండి, తర్వాత అందరూ వెళ్ళిపోతే, ఇక్కడేముంది అంటే ఎవరూ లేరు అంటాము కాని కాంతి ఉంది అనము. ఎందుకు? కాంతి ఉందని తెలిపే మాధ్యమం లేదు.

ఇప్పుడు రెండు వాక్యాలు చూద్దాము.

కాంతి, చెయ్యిని ప్రకాశింపచేస్తుంది – ప్రకాశనం

చెయ్యి, కాంతిని ప్రకటింపచేస్తుంది – అభివ్యక్తిః

(చెయ్యి, కాంతిని ప్రకాశింపచేస్తుంది అనకూడదు)

ఇప్పుడు కాంతి స్థానంలో చైతన్యాన్ని, చెయ్యిస్థానంలో వృత్తిని పెట్టి వాక్యాలను మళ్ళీ చూద్దాము.

చైతన్యం, వృత్తిని ప్రకాశింపచేస్తుంది.

వృత్తి, చైతన్యాన్ని ప్రకటింపచేస్తుంది.

(వృత్తి, చైతన్యాన్ని ప్రకాశింపచేస్తుంది అనకూడదు)

ఆ విధంగా ప్రతి వృత్తి చైతన్యాన్ని చిదాభాస రూపంలో ప్రతిబింబింప చేస్తుంది. ఆలోచన, చైతన్యాన్ని చూపిస్తుంది అంటే అర్థం ప్రకటింపచేస్తుంది. ఒక వ్యక్తి కోమాలో ఉన్నప్పుడు, అతనికి ఆలోచనలు ఉండవు కాబట్టి అతనిలో ఉన్న చైతన్యం ప్రకటితమవదు. కాని మనమేమో అతనిలో చైతన్యం లేదు అంటాము. ఎంత అక్రమమో చూడండి! అతనిలో చైతన్యం ఉంది! కాని ప్రకటితమవదు. ఎందుకంటే దాన్ని ప్రతిబింబింపచేసే మనస్సు పనిచేయటం లేదు కాబట్టి. బల్లని

జడం అంటాము ఎందుకు? దానిలో చైతన్యం లేక కాదు, దానిలో చైతన్యం ప్రకటితమవదు. దానికి మనసు లేదు కాబట్టి. మనమంతా చైతన్య స్వరూపులం, ఎందుకంటే మన ఆలోచన దాన్ని వ్యక్తం చేస్తున్నది. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**అథ అధ్యాత్మమ్ –** ఇప్పుడు అధ్యాత్మ ఉపాసన –

**యదేతద్గచ్ఛతీవ చ మనః –** మనస్సు లేదా వృత్తి బ్రహ్మ దగ్గరకి వెళ్ళినట్టుగా అవుతుంది. ఇంద్రుడు, వాయువు, అగ్ని వెళ్ళినట్టు మనస్సు వెళుతుంది, అంతేకాదు,

**అనేనచైతదుపస్మరతి–** ఒక వ్యక్తి మనస్సు ద్వారా బ్రహ్మను గుర్తుపెట్టుకుంటాడు. ఎందుకంటే మనస్సు బ్రహ్మను తెలుసుకోవటంలో తోడ్పడుతుంది కాబట్టి.

**అభీక్ష్ణగ్ం సఙ్కల్పః –** ఒక వ్యక్తి బ్రహ్మను ప్రతి ఆలోచన ద్వారా దర్శిస్తాడు కాని ఆ విషయం తెలియటం లేదు. ఉదాహరణకు, మీరు ఒక వ్యక్తిని చూసి మాట్లాడుతున్నారంటే అతనితో పాటు కాంతిని కూడా దర్శిస్తున్నట్టే. కాని మీరు ఆ విషయం గ్రహించటం లేదు. అలాగే ప్రతి వ్యక్తీ, ఆలోచన ద్వారా బ్రహ్మను పదే పదే దర్శిస్తున్నాడు.

అందువల్ల వృత్తిని యక్ష ఉపాసనకు ఉపయోగించవచ్చు. ఆలోచనలు యక్షునిలాగా క్షణికం. ఆలోచనలు ఉంటే ప్రపంచం తెలుస్తుంది. నిద్రలో మనస్సు పడుకుంటే, ఆలోచనలు ఉండవు. అప్పుడు ప్రపంచం తెలియదు. అంటే యక్షుడు ప్రత్యక్షమయి, ప్రకాశింపజేసి మాయమయినట్టుగా, ఆలోచనలు కూడా ప్రత్యక్షమయి, ప్రకాశింపజేసి మాయమవుతాయి. ఇది అధ్యాత్మ ఉపాసన.

## మన్త్రము – 6

**తద్ధ తద్వనం నామ తద్వనమిత్యుపాసితవ్యం స య ఏతదేవం**
**వేదాభి హైనగ్ం సర్వాణి భూతాని సంవాఞ్ఛన్తి ॥**

ఇందులో నాలుగవ ఉపాసన వస్తుంది. దీన్ని గుణవిశిష్ట ఉపాసన అంటారు. ఈశ్వరుడిని అనంత కళ్యాణ గుణ సంపన్నుడు అంటారు.

మూడవ అధ్యాయంలో చూశాము. అగ్నికున్న దహనశక్తి అగ్నిది కాదు; వాయువుకున్న వీచే శక్తి వాయువుది కాదు. వాటి శక్తి యక్షునిలో అంటే బ్రహ్మలో ఉంది. దీన్నే అన్నిటికీ వర్తింపజేయవచ్చు.

**రసోఽహమప్సు కౌన్తేయ ప్రభాస్మి శశిసూర్యయోః గీత 7–8**

**తత్సవితుర్వరేణ్యం। భర్గోదేవస్య ధీమహి। ధీయో యో నః ప్రచోదయాత్।**

**- గాయత్రీమన్త్రము**

సూర్యతేజస్సు ద్వారా బ్రహ్మను పూజిస్తాము.

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీ మదూర్జితమేవ వా   గీత 10-41**

ఎందులో విభూతి ఉంటే, అది కృష్ణపరమాత్మకు చెందుతుంది.

వీటికి మూలం తద్వనం. వనం అంటే అడవి అని మామూలుగా వచ్చే అర్థం కాదు. వనం అంటే మహిమ, మహత్మ్యం, విభూతి.

**తద్ధ తద్వనం -** తేషాం దేవతానాం తద్వనం. దేవతకు ఉన్న యోగ్యత వారిది కాదు. భగవంతునిది. దేవతలు అంటే మనుష్యులకు కూడా వర్తింపచేసుకోవాలి.

**నామ-** ప్రసిద్ధి. ఇక్కడ భగవంతునికి కొత్త బిరుదు తద్వనం. తద్వనం పేరుతో ప్రసిద్ధి పొందాడు.

**తద్వనమిత్యుపాసితవ్యమ్ -** బ్రహ్మను అందరిలో ఉన్న విభూతిగా ఉపాసన చేయండి.

ఇది గుణ విశిష్ట ఉపాసన. దీని ఫలం కూడా చెపుతున్నది ఇందులోనే.

యథా యథా ఉపాస్తే తద్దైవ భవతి

దేని మీద ఉపాసన చేస్తే, ఆ ఫలం పొందుతారు. భగవంతుడిని సర్వజ్ఞుడిగా కొలిస్తే, సర్వజ్ఞుడవుతారు; సర్వశక్తివంతునిగా కొలిస్తే, సర్వశక్తివంతు లవుతారు; అలాగే త్రిపుర సుందరి మీద ఉపాసన చేస్తే మీరు అందమైన వారవుతారు. అలాగే ఎవరైతే భగవంతుని మహిమ మీద ఉపాసన చేస్తారో, వారిని అందరూ ఆరాధిస్తారు.

ఎలా తెలుస్తుంది ఆ విషయం? అందరూ వారిని ప్రేమిస్తారు.

**స య ఏతదేవం వేద-** ఎవరైతే ఈ విధంగా భగవంతుని ఆకర్షణీయమైన మూర్తిగా కొలుస్తారో వారిని;

**అభిహైనగ్ం సర్వాణి భూతాని సంవాఞ్ఛన్తి-** అందరు మనుష్యులూ వారిని ప్రేమిస్తారు. మనుష్యుల్లో రెండు రకాలు ఉంటారు. ఇద్దరూ ఆనందాన్ని కలుగచేస్తారు. కాకపోతే ఒక రకం మనుష్యులు వచ్చి ఆనందం కలుగచేస్తే, రెండోరకం మనుష్యులు అక్కడినుంచి వెళ్ళి ఆనందం కలుగచేస్తారు. కాని ఈ ఉపాసన చేసినవారు ఎప్పుడూ ఆనందం కలుగచేస్తారు.

## మంత్రం – 7

**ఉపనిషదం భో బ్రూహీతి ఉక్తా త ఉపనిషద్బ్రాహ్మీం వావ త ఉపనిషదమబ్రూమేతి।**

ముందు మంత్రంతో నాలుగురకాల ఉపాసనలూ పూర్తి అయ్యాయి. ఇవి మధ్యమ అధికారిని ఉద్దేశించి చెప్పబడినవి. మొదటి రెండు అధ్యాయాలు ఉత్తమ అధికారికి చెప్పబడితే, మూడవ అధ్యాయం నుంచి, నాలుగవ అధ్యాయంలోని ఆరవ మంత్రం వరకూ మధ్యమ అధికారికి చెప్పబడ్డాయి.

కొంతమంది ఉపాసనలు కూడా చేయలేరు. ఉపాసన చేయటానికి ఏకాగ్రత కావాలి. నిశ్చలంగా ఉండగలగాలి. కాని కొంతమంది క్షణం ఖాళీగా కూర్చోలేరు. అటువంటి వారికి కర్మయోగం సూచించబడింది. స్వార్థపూరితమైన పనులతో బిజీగా ఉండే బదులు, నిస్వార్థమైన పనులతో బిజీగా ఉండమంటుంది ఉపనిషత్తు.

**ఉపనిషదం భో బ్రూహీతి –** భో అంటే హే గురో, నాకు ఉపనిషత్తు బోధించండి అన్నాడు. అంటే బ్రహ్మ విద్య బోధించమని అడిగాడు. ఇంతసేపూ గురువు చెప్పింది బ్రహ్మవిద్యే. అంతా విని నాకు బ్రహ్మవిద్య చెప్పండి అన్నాడు. ఇదెలా ఉందంటే ఒక పాట కచేరీలో ఒక సంగీత విద్వాంసుడు గంటసేపు తోడిరాగంలో పాట పాడాడు. అంతసేపూ ఒక శ్రోత తలాడిస్తూ ఉన్నాడు. అంతా అయ్యాక, అతను లేచి నిలబడి, తోడిరాగంలో పాడగలరా అన్నాడు. ఆ సంగీత విద్వాంసుని పరిస్థితి ఎలా ఉందో, సరిగ్గా ఆ గురువు పరిస్థితి కూడా అలాగే ఉంది.

**ఉక్తా త ఉపనిషత్ –** గురువు కోపగించుకోకుండా, నిస్పృహ చెందకుండా చెప్పాడు. నేను ఇంతవరకూ నీకు ఉపనిషత్తే చెప్పాను. మొదటి రెండు అధ్యాయాలు చెప్పాను. కథ చెప్పాను. కథ నుంచి నాలుగు ఉపాసనలు కూడా చెప్పాను.

**బ్రాహ్మీం వావత ఉపనిషదమబ్రూమేతి–** ఉపనిషత్తు అంటే రహస్యబోధ. ఆ మాట కొస్తే కొన్ని ఉపాసనలను కూడా రహస్యంగా చెపుతారు. ఉదాహరణకు శ్రీవిద్య ఉపాసన. అందువల్ల గురువు ప్రత్యేకించి చెపుతున్నాడు. రహస్య విద్య బోధించే ఉపనిషత్తులో నేను నీకు చెప్పింది బ్రహ్మ గురించి.

అంతా విని శిష్యుడిలా ఎందుకడిగాడనే సందేహం కలుగవచ్చు. శాస్త్రాన్ని తప్పు పట్టే అధికారం మనకు లేదు. అందువల్ల శిష్యుడు ఇంకా వివరంగా చెప్పండి అని అడిగి ఉండవచ్చు. లేదా అతనికి అర్థమయి ఉండకపోవచ్చు.

అందువల్ల గురువు కూడా అతనిమీద కోపం తెచ్చుకోకుండా, అతనికి

కొన్ని సాధనలు చెపుతున్నాడు. దీని అర్థం ఏమిటి? నీకు అర్థం కాకపోతే, నువ్వు నిరుత్సాహపడకు. నేను నీకు వేరే విధంగా చెపుతాను అని అర్థం. కొంతమందికి చెప్పగానే అర్థమయితే, అతనికి ప్రత్యేకంగా కొమ్ములేమీ మొలవలేదు. అతను ఈ జన్మలోనో, గత జన్మలోనో సాధన చేశాడని అర్థం. అంటే అతను అధికారత్వం పొందాడు. ఈ శిష్యునిలాంటి కొందరు మందబుద్ధితో ఉండి ఉండవచ్చు.వాళ్ళు నాకు అంతా అర్థమయింది ఒక్క బ్రహ్మ గురించి తప్ప అంటారు. బ్రహ్మ గురించి కాకపోతే, ఇంక ఏముంది అక్కడ అర్థం చేసుకోవటానికి? అందువల్ల అటువంటి మందబుద్ధి గలవారి కోసం కొన్ని సాధనలు ఇవ్వబడ్డాయి తర్వాత వచ్చే మంత్రంలో.

## మన్త్రము - 8

**తస్యై తపో దమః కర్మేతి ప్రతిష్ఠా వేదాస్సర్వాఙ్గాని సత్యమాయతనమ్ ॥**

ఉపనిషత్తు అనే భవంతి కట్టాలంటే, దానికి బలమైన పునాది కావాలి. పునాది బలంగా లేకపోతే భవంతి కూలిపోతుంది. అందువల్లనే ఉపనిషత్తు వేద అంతభాగంలో ఉంది. వేద పూర్వభాగం దానికి కావాల్సిన పునాదిరాళ్ళను వేస్తుంది. ఇక్కడ చెప్పినవి.

**తస్యై తపో దమః కర్మేతి ప్రతిష్ఠా -** తపస్సు, దమము, కర్మ.

తపస్సు- నా ఇంద్రియాల మీద నేను విజయం సాధించటానికి నేను ఇష్టపూర్వకంగా దేన్నైనా వద్దనుకోవటం. ఇందులో ప్రతి పదమూ ముఖ్యమైనవే. ఇష్టపూర్వకంగా అనే పదం మరీ ముఖ్యం. ఉదాహరణకు ఉపవాసం ఉండటం. మీరు ఆకలికి ఆగలేని వారైతే అది కష్టమే కాని ఎవరో చెపితే దాన్ని చేయలేరు; మీ అంతట మీకు బుద్ధి పుట్టి ఇవాళ ఉపవాసం ఉండాలి అనుకుంటే విజయం సాధించగలరు. అలాగే నిద్ర అయినా, మౌనవ్రతం అయినా

అసలు ఏదీ అతిగా చేయకూడదు. అతిగా నిద్రపోకూడదు. అతిగా తినకూడదు. అలాగే పూర్తిగా నిద్ర మానేయకూడదు. పూర్తిగా ఆహారం మానేయకూడదు.

**యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు** **గీత - 6-17**

దమము- ఇంద్రియ నిగ్రహం. ఇక్కడ కూడా బలవంతంగా ఇంద్రియాలను అదుపులో పెట్టకూడదు. అలాగని అది ఆడించినట్టల్లా మీరు ఆడకూడదు.

ఉదాహరణకు మీరు కాఫీగత ప్రాణులయితే, కొన్ని రోజులు కాఫీకి దూరంగా ఉండటం సాధన చేయాలి.

కర్మ – స్వధర్మ అనుష్ఠానం – ఉదాహరణకు సంధ్యావందనం చేయటం. మతఃపరమైన కర్మలు మీకు ఆస్తిని లేదా పేరు ప్రఖ్యాతులను తెచ్చి పెట్టకపోవచ్చు. సంధ్యావందనం చేస్తే ఆఫీసులో ఇంక్రిమెంటు రాకపోవచ్చు; కాని మీరు ఆధ్యాత్మికంగా ఎదుగుతారు. అది కనబడదు కాబట్టి పట్టించుకోరు. ఈ రోజు మీకు పని ఒత్తిడి ఎక్కువగా ఉంటే మీరు చేసే మొదటి పని, ఈ రోజు చేసే పూజ మానేస్తారు. అలా చేయకూడదు. అది నిత్యకర్మ. దాన్ని మానకూడదు.

ప్రతిష్ఠా – నెలకొని ఉన్నాయి.

వేదా– వేద పారాయణం లేదా వేదాధ్యయనం.

ఇక్కడ ఉపనిషత్తు ఆత్మజ్ఞానాన్ని ఆవుతో పోలుస్తున్నది. ఆవుకు నాలుగు పాదాలు ఉంటాయి. పైన చెప్పిన మూడింటిని అంటే తపస్సు, దమము, కర్మలను మూడు పాదాలుగా తీసుకోవచ్చు. అలాంటి సాధన ఇంకేదైనా నాలుగవ పాదంగా కలుపుకోవచ్చు. ఉదాహరణకు శమము కలుపుకోవచ్చు. శమము అంటే మనో నిగ్రహం.

**వేదాస్సర్వాఙ్గాని** – అన్ని వేదాలు తక్కిన అంగాలు

**సత్యమాయతనమ్** – సత్యం అంటే నిజం చెప్పటం.

**సత్యమేవ జయతే**

సత్యం చెప్పాలన్నారు కదా అని అప్రియంగా మాట్లాడకూడదు.

**సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్**

**న బ్రూయాత్ సత్యమప్రియం**

**ప్రియఞ్చ నానృతం బ్రూయాత్**

**ఏష ధర్మః సనాతనః॥ – మనుస్మృతి 4-138**

సత్యం పలకాలి. ప్రియంగా పలకాలి; అప్రియమైన సత్యాన్ని చెప్పకూడదు. అలాగని మధురంగా ఉండాలని అసత్యం కూడా చెప్పకూడదు. ఈ ధర్మాన్ని మన పూర్వీకులు పాటించారు.

ఆయతనం అంటే నివాసస్థానం. ఆవుకు ఎలా గొడ్లపాక ఉంటుందో,

అలా ఉపనిషత్తు అనే ఆవుకు నివాస స్థానం సత్యం. సత్యం పలకని వ్యక్తి, బ్రహ్మవిద్య జ్ఞానం పొందలేడు ముందు; ఒకవేళ పొందినా కూడా అది నిలవదు. పాక లేనిదే ఆవు ఎలా నిలవదో, సత్యం లేకపోతే జ్ఞానం అలా నిలవదు.

ఇప్పటివరకూ జరిగిన జ్ఞానబోధను ఒకసారి విశ్లేషిస్తే మూడు రకాల అధికారులకు మూడు మార్గాలు సూచించింది ఉపనిషత్తు.

**మన్ద అధికారికి – కర్మయోగము**

**మధ్యమ అధికారికి – ఉపాసనా యోగము**

**ఉత్తమ అధికారికి – జ్ఞానయగము**

**మన్త్రము - 9**

**యో వా ఏతామేవం వేదాపహత్య పాప్మానమనన్తే స్వర్గే**
**లోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి ॥**

దీనితో ఆత్మబోధ ముగింపుకు వస్తున్నది. ఇప్పుడు మూడు రకాల బోధలు ఉంటే, ఏది పాటించాలి? అందరికీ ఒకటే సూత్రం అంటే ఒకటే మార్గం సరిపోదు. ఎందుకంటే అందరూ ఒకటేస్థాయిలో లేరు. అందువల్ల బోధలో కూడా స్థాయీబేధాలు కనిపిస్తాయి.

కొంతమంది అంటారు, 'ఎందుకు శాస్త్రం ఇంత వైవిధ్యంగా చెపుతున్నది. అందరికీ సమానంగా 10 లేదా 20 నిబంధనలు ఇవ్వవచ్చు కదా!

**ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ – తైత్తిరీయం**

ఒకచోట, గృహస్థుగా మారండి, పిల్లలను కనండి; వారికి పెళ్ళి చేయండి, పిల్లలు పుట్టాలని చెప్పండి అంటుంది.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః॥**

ఇంకోచోట కర్మ లాభం లేదు. పిల్లలు లాభం లేదు.సన్యాసం స్వీకరించు అంటుంది.

ఏది పాటించాలి? ఏది స్వీకరించాలి? అధికారిని బట్టి చెపుతుంది శాస్త్రం అని అర్థం చేసుకోవాలి.

అలాగే, ఇక్కడ కూడా మీకు అధికారత్వం దేనిలో ఉందో మీరే తేల్చుకోండి.

వేదాంత అధ్యయనం మానకండి. మీకు అది తలపైనుంచి వెళ్లిపోయినట్టు ఉంటే, మీ జీవితాన్ని కర్మ ప్రధానంగా మలచుకోండి. ఉపాసన, జ్ఞానం కూడా వాటి వెన్నంటే పాటించండి. అలాగే, కొంచెం అర్థమయింది. ఇంకా సాధన చేయాలి అనిపిస్తే ఉపాసన ప్రధానంగా మీ జీవితాన్ని మలచుకుని, కర్మ,జ్ఞానమార్గాలను కూడా అనుసరించండి. మీరు పూర్వజన్మలోనో, ఈ జన్మలోనో సాధన చేసి ఉంటే మీ జీవితాన్ని జ్ఞానప్రధానంగా చేసుకోండి. అలా మీరు ఉత్తమ అధికారి అయి, జ్ఞానం పొందితే మీకు కలిగే ఫలమేమిటి? అది ఈ మంత్రంలో వస్తుంది.

**యో వా ఏతామేవం వేద-** ఈ విధంగా బ్రహ్మను ఎవరైతే తెలుసుకుంటారో; ఏవం అంటే ఈ విధంగా అంటే ఏ విధంగా? ఇది చాలా ముఖ్యం.

నేను బ్రహ్మను.

నేను ప్రతి అనుభవం వెనకా చైతన్యంగా ప్రకటితమవుతున్నాను.

నేను తెలిసిన వస్తువు కాను; తెలియని వస్తువును కాను.

నేను వస్తువును తెలుసుకునే కర్తను.

ఈ విధంగా తెలుసుకోవాలి. అలాకాకుండా -

అంతా విని బ్రహ్మ ఎక్కడో ఉన్నాడు. నాకు బ్రహ్మ అనుభవం ఎప్పుడు అవుతుందో అనుకోకూడదు. అలా సరిగ్గా అర్థం చేసుకుంటే, ఫలం ఏమిటి?

**అపహత్య పాప్మానమ్-** అతని పాపాలన్నీ నాశనమయిపోతాయి.

**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే గీత 4-33**

పాపాలంటే మనం మామూలుగా పాపాలు అనుకుంటాము. కాని ఉపనిషత్తులో పాపాల కింద మూడు అంశాలు వస్తాయి.

| | | |
|---|---|---|
| 1. పాపాలంటే పాపాలే | - | పాప రూప పాపం. |
| 2. పుణ్యాలు | - | పుణ్యరూప పాపం |
| 3. అజ్ఞానం | - | ఆత్మ అజ్ఞానం |

వేదాంతంలో పుణ్యం కూడా పాపం కిందకే వస్తుంది. ఎందుకు? పాపాలు అనుభవించటానికి పునర్జన్మ ఎత్తినట్టే, పుణ్యకర్మఫలం అనుభవించటానికి కూడా పునర్జన్మ ఎత్తాల్సి ఉంటుంది.

అజ్ఞానం కూడా పాపం కిందకే వస్తుంది. ఎందుకంటే అజ్ఞానం వల్లనే

కర్తృత్వ భావన, కోరికలు, కర్మలు, పుణ్యపాపాలు, సుఖదుఃఖాలు, పునరపి జననం, పునరపి మరణం కలుగుతాయి. సంసారికి మూల కారణం అజ్ఞానం. ఆత్మ అజ్ఞానం. ఆత్మ అజ్ఞానం తొలగితే, పునర్జన్మ ఉండదు. అందువల్ల పాప్మానమ్ అంటే పాపం, పుణ్యం, అజ్ఞానం మూడూ వస్తాయి. ఈ మూడు నాశనమవుతాయి జ్ఞానికి. అప్పుడేమవుతుంది?

**అనన్తే స్వర్గేలోకే ప్రతితిష్ఠతి–** స్వర్గలోకంలో నెలకొని ఉంటాడు. అదెలా సాధ్యం? పరస్పర భిన్నంగా లేదా? ఒకపక్క పుణ్యం కూడా నాశనమవుతుంది అంటున్నది. స్వర్గలోకం పుణ్యఫలం కదా! అలాంటప్పుడు స్వర్గలోకానికి ఎలా వెళతాడు? శంకరుల వారు స్వర్గలోకానికి అర్థాన్ని పరం బ్రహ్మగా తీసుకోవాలి అంటారు. **స్వర్గేలోకే బ్రహ్మణి.** ఎటువంటి బ్రహ్మ?

**జ్యేయే–** అంతిమం, శ్రేష్ఠతమం. దీన్ని బట్టి కూడా స్వర్గలోకే అంటే స్వర్గలోకం కాదని తెలుస్తున్నది. స్వర్గలోకం అంతిమ లోకం కాదు. శ్రేష్ఠతమమూ కాదు. దానిపైన ఇంకా లోకాలు ఉన్నాయి. అందువల్ల జ్ఞాని బ్రహ్మలో ప్రతితిష్ఠతి అనాలి. అంటే ఎప్పుడూ బ్రహ్మనిష్ఠలో ఉంటాడు అని అర్థం.

బ్రహ్మలో ప్రతితిష్ఠతి అంటే బ్రహ్మ ఇక్కడ ఉన్నాడు. జ్ఞాని బ్రహ్మమీద ఉన్నాడు అని కాదు అర్థం. జ్ఞాని బ్రహ్మనిష్ఠలో ఉంటాడు అని అర్థం. తను బ్రహ్మకు భిన్నంగా లేడు అని తెలుసుకుంటాడు.

**ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి–** రెండుసార్లు ఈ పదం చెప్పటంలోని అర్థం, ఈ ఫలం ఖచ్చితం. అందులో సందేహం లేదని హామీ ఇస్తున్నది ఉపనిషత్తు.

పూర్వం ఉపనిషత్తులు వ్రాతపూర్వకంగా ఉండేవికావు. అందుకని అధ్యాయం ముగిసేటప్పుడు, ఉపనిషత్తు ముగిసేటప్పుడు ఆఖరి పదం మళ్ళీ చెప్పటం జరుగుతుంది. అందువల్ల ప్రతితిష్ఠతి రెండుసార్లు చెప్పటంలోని ఇంకో అర్థం ఇక్కడితో నాలుగవ అధ్యాయం ముగిసింది. ఇక్కడితో కేనోపనిషత్తు కూడా ముగిసింది.

**శుభం భూయాత్.**

# కేనోపనిషత్తు

# సారాంశము

ప్రశ్న:- **కేనేషితం పతతి ప్రేషితం మనః**

మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను,చెవుల వెనుక ఉన్న దేవత ఎవరు?

జవాబు:- 1.శ్రోతస్య శ్రోత్రం (చెవితో చూద్దాం)

ఆత్మ వేరు, చెవి వేరు.

ఆత్మ  చెవి అంతటా వ్యాపించి ఉంది.

ఆత్మ ఉండటం వల్లే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.

ఇదే సూత్రం మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవులకు వర్తిస్తుంది.

2. **న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః**

మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవుల ద్వారా ఆత్మను తెలుసుకోలేము.

3. **యద్వాచానభ్యుదితం యేన వాగభ్యుద్యతే**

మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవుల ద్వారా ఆత్మను తెలుసుకోలేము. కాని మనస్సు, ప్రాణం, వాక్కు, కన్ను, చెవులు ఆత్మ వల్లనే పని చేస్తున్నాయి.

4. **అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి**

ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు.

దీని అర్థం- ఎ) ఆత్మ తెలియబడే వస్తువు (ఆబ్జెక్టు) కాదు - ప్రమేయం కాదు.

బి) ఆత్మ తెలుసుకునే నేను - ప్రమాతా అయిన నేను.

సి) ఆత్మ ప్రమాతృత్త్వం లేకపోయినా ఉంటుంది. అది శుద్ధ చైతన్యం.

5. **తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిదముపాసతే -**

ఆత్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి, సగుణ రూపంలో కొలిచే దేవుడు ఆత్మ కాదు.

సాక్షి చైతన్యమైన నేనే ఆత్మను.

**ఆత్మ అనుభవం**

ఆత్మ అనుభవం పొందలేము.

ఆత్మ అనుభవం పొందనవసరం లేదు.

ఎందుకంటే అది నువ్వే.

**ఎవ్వర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవ్వర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్.**

అనుభవించే నువ్వే ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ.

**యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూంషి పశ్యతి**

ఆత్మను కన్నుతో చూడలేము కాని కళ్ళు ఆత్మ వల్లే పనిచేస్తున్నాయి

**ప్రతిబోధ విదితం మతం**

ఆత్మ అనుభవం పొందలేము కాని ప్రతి అనుభవమూ ఆత్మ వల్లే పొందుతున్నాము.

**ఆత్మజ్ఞానం**

ఆత్మ అంటే అనుభవించబడే వస్తువు కాదు.

ఆత్మ అంటే అనుభవించే నేనే. నేను అంటే సాక్షి చైతన్యాన్ని.

ఆత్మజ్ఞానం పొందటం అంటే వృత్తిలో మార్పు.

ఆత్మ అనుభవం కోసం ప్రయత్నించకూడదు. ఆత్మ వల్లే అన్నీ అనుభవిస్తున్నాము. ఆ ఆత్మను నేనే అని పదునైన బుద్ధితో అర్థం చేసుకోవటమే ఆత్మజ్ఞానం.

**ఆత్మజ్ఞానం పొందిన విద్యార్థి స్పందన**

1. నాకు బ్రహ్మ తెలుసు అనను
2. నాకు బ్రహ్మ తెలియదు అనను
3. నాకు తెలుసు
4. నాకు తెలియదు

అంటే– బ్రహ్మను ఆబ్జెక్టుగా చూస్తే తెలియదని నాకు తెలుసు.

బ్రహ్మను సబ్జెక్టుగా తెలుసుకోవాలని నాకు తెలుసు.

దీన్నే ఉపనిషత్తు మళ్ళీ చెపుతుంది.

బ్రహ్మ ఎవరికి తెలియదో, వారికి తెలుసు.

బ్రహ్మ ఎవరికి తెలుసో, వారికి తెలియదు.

తెలిసిన వారికి తెలియదు.

తెలియని వారికి తెలుసు.

అంటే బ్రహ్మను ఆబ్జెక్టుగా చూసేవారికి తెలియదు.

బ్రహ్మను సబ్జెక్టుగా తెలుసుకునేవారికి తెలుసు.

యక్షుని కథ వల్ల వచ్చిన 6 సందేశాలు

1. **బ్రహ్మ అస్తి–** యక్షుడు కనబడ్డాడు.

2. **బ్రహ్మణః దుర్విజ్ఞేయం–** వాయువు, అగ్ని తెలుసుకోలేకపోయారు. అంటే ఇంద్రియాల ద్వారా తెలుసుకోలేము.

3. **జ్ఞానయోగ్యతా అపేక్షః–** గర్వం ఉండకూడదు. శ్రద్ధ, భక్తి,శరణాగతి కావాలి. ఇంద్రుడు శరణు వేడాడు.

4. **గురు అపేక్షః–** గురువు ద్వారానే నేర్చుకోవాలి. ఉమాదేవి గురువుగా వచ్చింది.

5. **బ్రహ్మవిద్యాస్తుతిః–** బ్రహ్మ విద్య పొందిన ఈ ముగ్గురు దేవతలూ ఖ్యాతిని పొందారు.

6. **ఉపాసనవిధి అంగత్వం –** ఈ కథకు అనుగుణంగా కొన్ని ఉపాసనలు చెప్పబడ్డాయి.

ఉపాసనలు

| | | |
|---|---|---|
| 1. విద్యుత్ ఉపాసన | | |
| 2. నిమేష ఉపాసన | – | అధి దైవ ఉపాసనలు |
| 3. వృత్తి ఉపాసన | – | ఆధ్యాత్మ ఉపాసన |
| 4. బ్రహ్మ మహిమ ఉపాసన | – | గుణ విశిష్ట ఉపాసన |

యక్షుని లక్షణాలు – క్షణికత్వం, మనోహరత్వం, ప్రకాశరూపత్వం.

మెరుపుకూ, కనురెప్పలు ఆర్పటానికీ, వృత్తికీ ఈ మూడు లక్షణాలు ఉన్నాయి.

మనస్సు బాహ్యవస్తువును ప్రకాశింపజేస్తుంది. చైతన్యం, వృత్తిని ప్రకాశింపజేస్తుంది. మనస్సు అంతర్గతంగా ఉన్న సాక్షిని ప్రకటింపచేస్తుంది. వృత్తి, చైతన్యాన్ని ప్రకాశింపజేస్తుంది.

**కర్మయోగం**

ఉపనిషత్తు అనే ఆవుకు నాలుగుపాదాలు – తపస్సు, దమము, కర్మ, శమము

అంగాలు - అన్ని వేదాలు

ఆయతనం - సత్యం

**ఫలం**

పాపరూప పాపాలు, పుణ్యరూప పాపాలు, అజ్ఞానరూప పాపాలు నాశనమవుతాయి.

సర్వాత్మ భావన కలుగుతుంది.

జ్ఞాననిష్ఠలో నెలకొంటాడు. అంటే ఈ క్రింది భావనలోనే ఉంటాడు

తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిదముపాసతే

## శాంతి పాఠం

**ఓం ఆప్యాయన్తు మామాఙ్గాని వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథోబలమిన్ద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మౌపనిషదం మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽస్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు ॥**

**ఓం శాన్తిశ్శాన్తిశ్శాన్తిః**

**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః**

కేనోపనిషత్తు అధ్యయనం మొదలుపెట్టే ముందు విఘ్నాలు లేకుండా చేయమని శాంతిపాఠం పఠిస్తాము. ఇప్పుడు అధ్యయనం నిరాటంకంగా సాగినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ మళ్ళీ శాంతి పాఠాన్ని పఠిస్తాము.

## సర్వం శ్రీ పరమేశ్వరార్పణమస్తు

# కుండ మట్టి - జీవన్ముక్తి

మనిషి ఏం చేసినా శాంతి, సుఖం, భద్రత కోసమే చేస్తూంటాడు. అవి వస్తువుల్లోనూ, పరిస్థితుల్లోనూ, మనుషుల్లోనూ, సంఘటనల్లోనూ ఉందనుకుంటాడు. తన స్వరూపమే శాంతి, సుఖం, భద్రత అని తెలుసుకోలేక, బాహ్యంగా పరుగులు తీస్తూంటాడు. కస్తూరిమృగం తనలో సువాసన పెట్టుకుని బయట ఎక్కడో ఉందని, వెతికి, వెతికి అలసి సొలసి చనిపోతుందిట. సరిగ్గా మనిషి కూడా అలానే చేస్తాడు. తనే ఆనంద స్వరూపం అని గ్రహించడు.

కుండకు ఎవరో చెప్పారు. నీ గురించి నువ్వు తెలుసుకో! స్వరూపంగా నువ్వెవరో తెలుసుకో! స్వరూపతః నువ్వు మట్టివి. మట్టిని తెలుసుకుంటే, వెంపర్లాట, ఆరాటం పోయి జీవన్ముక్తి పొందుతావు అని చెప్పారు.

వెంటనే కుండ మూటాముల్లే సర్దుకుని స్వరూపంగా మట్టిని చూద్దామని చార్ధామ్ యాత్రకు బయలు దేరింది. యాత్ర అంతా పూర్తి అయింది కాని స్వరూపంగా మట్టి మాత్రం కనపించలేదు. యజ్ఞ యాగాదులు చేసింది మట్టి జాడే తెలియలేదు.

ధ్యానం చెయ్యాలన్నారెవరో! ధ్యానం లోనూ మట్టి కనపడలేదు.

కుండ మట్టిని వెతకాలి. ఎలా?

మట్టి ఎక్కడ ఉంది?

కుండ లోపల ఉందా?

కుండ బయట ఉందా?

కుండ మధ్యలో ఉందా?

అసలు కుండకు మట్టికి దూరం ఎంత?

కుండ అంతటా మట్టే. మట్టి తప్ప కుండే లేదు. కుండకు మట్టికి దూరం ఏమిటి? అవి రెండు వస్తువులైతే కదా! మట్టినే కుండ అంటున్నాం.

కుండగా పరిమితత్త్వం, అల్పత్వం, అశాశ్వతత్త్వం ఉన్నాయి.

అదే మట్టిగా అపరిమితత్త్వం, అనల్పత్వం, శాశ్వతత్త్వం. అదే జీవన్ముక్తి.

ఇప్పుడు కుండ ఏం చేయాలి?

అంతటా వెతకాలా?

పూజలు చేయాలా?

ధ్యానం చేయాలా?

నేనే మట్టిని అని తెలుసుకుంటే చాలు. కుండ తయారుకాక ముందూ మట్టే, కుండగానూ మట్టే, కుండ పగిలినా మట్టే. మట్టిగా దానిలో ఏ మార్పూ లేదు. దానికి పుట్టుకా లేదు, మరణం లేదు. అదే కుండయితే మరణం, పుట్టుక తప్పవు.

అదే విధంగా జీవుడు తను స్వరూపతః బ్రహ్మను అని తెలుసుకుంటే, తనే ఆనంద స్వరూపమని తెలుసుకుంటాడు. అదే జీవన్ముక్తి. జీవుడు ఎప్పుడూ ముక్తుడే. ఆ విషయం తెలుసుకోవడమే తరువాయి. దీనినే శాస్త్రం ప్రాప్తస్య ప్రాప్తం అంటుంది. **మోక్షం సిద్ధవస్తువు, సాధ్యవస్తువు కాదు.**

**కంఠ చామీకర న్యాయం –** ఒక రాజ్యంలో రాణిగారు చాలా ఖరీదైన నెక్లెస్ విదేశాలనుంచి తెప్పించుకున్నారు. అకస్మాత్తుగా ఆ నెక్లెస్ కనిపించడం లేదు. రాణిగారికి చాలా ప్రీతికరమైన నెక్లెస్ మాయమయింది. దానిమీదమోజు తీరకుండానే పోయింది. దానితో రాణిగారు విపరీతమైన ఆవేదన చెందారు. సేవకులతో రాజప్రాసాదమంతా అడుగడుగునా గాలింపు చేయిస్తున్నారు.

ఎంతవెతికినా ప్రయోజనం కన్పించటం లేదు. మంత్రి ఏమైనా మార్గం చూపుతాడేమోనని పిలిపించారు. మంత్రిగారు అసలు విషయం వాకబు చేస్తే రాణిగారి నెక్లెన్ పోయిందని తెలిసింది. రాణిగారిని చూడగానే మంత్రిగారికి నెక్లెస్ జాడ తెలిసిపోయింది. వెంటనే మంత్రి, "అమ్మా మీ సేవకులను వెతకడం ఆపమనండి," అన్నారు.

మంత్రి తెలివితేటల మీద అచంచలమైన విశ్వాసం ఉన్న రాణిగారు చప్పట్లు కొట్టి నెక్లెస్ గురించి వెతకడం ఆపించింది.

"అమ్మా రాణిగారూ! మీ మెడను ఒకసారి తడుముకోండి," అన్నారు మంత్రి. అప్పుడు రాణిగారికి మెడ తడుముకోకుండానే నెక్లెస్ బరువు తెలిసింది. ఆమె తన మెడలోనే నెక్లెస్‌ను పెట్టుకుని, ఊరంతా వెతుకుతోంది. తనదగ్గరే వున్న నెక్లెస్ బయట ఎలా దొరుకుతుంది? విశ్వమంతా ఎంత వెతికినా దొరకదు. ఈ సమస్యకు పరిష్కారం– నెక్లెస్ పొయింది అనే అజ్ఞానం తొలిగి తన దగ్గరే, తన మెడలోనే ఉందని తెలిస్తే చాలు. దీనినే **కంఠచామీకర న్యాయం** అంటారు. ఇది తెలిస్తే ఇక ఎటువంటి ఆందోళన ఉండదు. కంఠచామీకరం అంటే నెక్లెస్ అని అర్థం.

సరిగ్గా ఇలాగే జీవుడు తనే స్వరూపతః బ్రహ్మనని తెలుసుకోలేక జన్మ జన్మలనుంచి బ్రహ్మను వెతుకుతూనే ఉన్నాడు. మన దగ్గరే కోహినూర్ డైమండ్ ఉంది. దానిని అజ్ఞానంతో పేపరు వెయిట్‌లా వాడుతున్నాము.

**ప్రయోజనం:** నేనే శాంతి, సుఖం, ఆనందాలకు నెలవు అని తన పూర్ణత్వం దర్శించిన జ్ఞానికి ఎటువంటి వెలితి లేదు. అతను ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తి, ఆత్యంతిక ఆనందాన్ని అనుభవిస్తాడు.

**అలవోకగా అద్వైతం** పుస్తకరూపంలో రాబోతున్నది ...